సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 4

గురువారం 27-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'




డికాక్ ధమాకా

8 ఫోర్లు, 6 సిక్స్‌లతో 97 నాటౌట్. రాజస్తాన్‌పై కోల్‌కతా గెలుపు. -14లో



దేశాన్ని విడిచి వెళ్లిపోతాం

22% సంపన్న భారతీయుల అభిమతం.. ఈవై–కోటక్ ప్రైవేటు సర్వే వెల్లడి -15లో



అమానవీయ తీర్పు

బాలికపై లైంగిక వేధింపుల వ్యవహారంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన వివాదాస్పద తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది.

వివరాలు 6లో ▸



బఘేల్ ఇంట్లో సీబీఐ సోదాలు

రూ.6వేల కోట్ల మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో భాగంగా ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం బఘేల్ ఇంట్లో సీబీఐ సోదాలు నిర్వహించింది.

వివరాలు 6లో ▸



ఓటింగ్‌పై 'ట్రంప్'కార్డు

ఇకపై అధీకృత గుర్తింపు పత్రం చూపి, అమెరికా పౌరుడిగా నిరూపించుకున్నాకే ఓటు వేసేందుకు అనుమతిస్తామని ట్రంప్ తెలిపారు.

వివరాలు 6లో ▸



నలుపు అంటే శక్తి

'నలుపు' అనే ముద్రవేసి వెక్కిరించడంపై కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శారదా మురళీధరన్ గొంతువిప్పారు.

వివరాలు 13లో ▸

ఉప ఎన్నికలు రావు

సభ్యులెవరూ ఆందోళన చెందవద్దు.. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్య

2014 నుంచి 2023 వరకు ఉన్నట్టుగానే ఇప్పుడు కూడా ఆచరిస్తున్నాం

- మీరు మంత్రులు చేసినవారు అనర్హులు కాలేదు.. ఉప ఎన్నికలు రాలేదు..
- గతంలో రాని ఉప ఎన్నికలు ఇప్పుడెలా వస్తాయి?.. అంతా ఉత్తదే
- వాళ్లేమో మేం పార్టీ మారనే లేదని అంటున్నారు
- కేసు సుప్రీంకోర్టులో ఉంది.. బయట మాట్లాడితే సబ్‌జ్యుడిస్ అవుతుంది
- శాసనసభలో మాట్లాడితే రక్షణ ఉంటుందని వ్యాఖ్య



శాసనసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ''శాసనసభ 2014 నుంచి 2023 వరకు ఏ సంప్రదాయాలను ఆచరించిందో ఇప్పుడు కూడా వాటినే ఆచరిస్తున్నం. అప్పటి నుంచి చట్టం మారలే.. న్యాయం మారలే.. స్పీకర్ పదవి, విప్ పదవి మారలే.. పాలకపక్షం, ప్రతిపక్షం అట్లనే ఉన్నాయి. రాజ్యాంగం అసలే మారలేదు. ఇంక ఎట్లొస్తయ్ ఉప ఎన్నికలు? సభ్యులెవరూ ఆందోళన చెందవద్దు..'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం పార్లమెంటరీ వ్యవస్థలో పాటించిన పద్ధతులను పరిగణనలోకి తీసుకుని గతంలో అవలంబించిన విధానాలను అనుసరిస్తున్నట్టు చెప్పారు. వాటి ప్రకారం ఏ ఉప ఎన్నికలు రావని వ్యాఖ్యానించారు. బుధవారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చలో సీఎం రేవంత్ మాట్లాడారు. రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తాయంటూ బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై స్పందించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''పార్టీ మారారా, మారలేదా అంటే మేం మారనే లేదు. అభివృద్ధిలో భాగంగా సీఎంని కలసి వచ్చామని కాంగ్రెస్‌లో చేరినవాళ్లు అంటున్నారు. మీరు

మిగతా 3వ పేజీలో ▶

'బెట్టింగ్'పై సిట్

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, రమ్మీపై ఉక్కుపాదం మోపుతాం.. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి

- బెట్టింగ్ యాప్స్ ప్రచారం చేసే వారిని విచారించడం శాశ్వత పరిష్కారం కాదు
- ఈ సంస్కృతిని తెలంగాణలో నిర్మూలించడమే మా లక్ష్యం
- రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా ప్రతిపక్షాల కుట్రలు
- ఐఎంజీ– భారత్ భూములు తీసుకుంటే నష్టమేంటని వ్యాఖ్య

విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిందే: సీఎం

- వివరాలు 2లో▶



కేటీఆర్

30% కమీషన్ తీసుకుంటున్నారని వాళ్ల ఎమ్మెల్యేలే అంటున్నారు. 20% కమీషన్ అంటూ సచివాలయంలో ధర్నాలు జరుగుతున్నాయి

కేటీఆర్‌ను చాలెంజ్ చేస్తున్నా.. మీ ఆరోపణలను రుజువు చేయండి. లేదంటే ప్రజలకు, సభకు క్షమాపణ చెప్పండి. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి.



భట్టి

'కమీషన్ల'పై దద్దరిల్లిన సభ!

- 30% కమీషన్లు తీసుకుంటున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే అంటున్నారన్న కేటీఆర్.. 20% కమీషన్లంటూ సెక్రటేరియెట్‌లో కాంట్రాక్టర్ల ధర్నాలు జరిగాయని వ్యాఖ్య
- దీనిపై తీవ్రంగా స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి.. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరిక
- రుజువైనా చేయాలి.. లేకుంటే క్షమాపణ చెప్పాలంటూ సవాల్
- మీలా అడ్డగోలుగా రాష్ట్రాన్ని దోపిడీ చేసేందుకు రాజకీయాల్లోకి రాలేదంటూ ఫైర్
- భట్టి వ్యాఖ్యలతో బీఆర్‌ఎస్ సభ్యుల నిరసన.. శాసనసభలో ఇరుపక్షాల ఆందోళనలు, నిరసనలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ బుధవారం దద్దరిల్లింది. ప్రభుత్వ పెద్దలు కమీషన్లు తీసుకుంటున్నారంటూ బీఆర్‌ఎస్ సభ్యుడు కె.తారకరామారావు పేర్కొనడం, ఒళ్లు దగ్గర పెట్టుకుని జాగ్రత్తగా మాట్లాడాలంటూ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హెచ్చరించడంతో ఇరుపక్షాల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు, అరుపులు, కేకలతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది.

మంత్రులు అడ్డుపడుతుండటంతో..

బడ్జెట్ పద్దులపై బుధవారం జరిగిన చర్చలో బీఆర్‌ఎస్ సభ్యుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతుండగా మంత్రులు పదేపదే అడ్డుపడటంపై కేటీఆర్ అభ్యంతరం తెలిపారు. ''మంత్రులు పదే పదే అడ్డుపడుతున్నారు. సంయమనం ఉండాలి. మేం కూడా రెచ్చగొట్టగలం. 30శాతం కమీషన్ తీసుకుంటున్నారని వాళ్ల ఎమ్మెల్యేలే అంటున్నారు. 20శాతం కమీషన్ అంటూ సచివాలయంలో (కాంట్రాక్టర్లు)

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్

చెట్ల నరికివేత హత్యకన్నా ఘోరం!



పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. ఒక చెట్టును నరికిన వ్యక్తికి లక్ష రూపాయలు జరిమానా విధించాలని ఆదేశించింది. పెద్ద సంఖ్యలో చెట్లను నరికివేయడం మనుషులను చంపడం కంటే దారుణమైనదని వ్యాఖ్యానించింది.

- వివరాలు 6లో▶

ఇక ఐదేళ్ల పిల్లల వరకు 'కాక్లియర్' చికిత్సలు



కాక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్రచికిత్సలపై రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ చికిత్స చేయించుకొనే చిన్నారుల వయసు పరిమితిని ఐదేళ్ల వరకు పెంచింది.

- వివరాలు 3లో▶


ప్రాణం లేచొచ్చింది!



కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటనతో ప్రాణహిత ప్రాజెక్టుపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్ర బడ్జెట్‌లో రూ.32 కోట్లు కేటాయించారు. అయితే పాత డిజైనా, లేక కొత్తది ప్రతిపాదిస్తారా, వార్ధాపై బరాజ్ నిర్మిస్తారా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

- వివరాలు 3లో▶

చాకలి ఐలమ్మ వర్సిటీకి యూజీసీ గుర్తింపు



వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు ద్వారా విశ్వవిద్యాలయం వివిధ ప్రోత్సాహకాలను పొందేందుకు అర్హత సాధించింది.

- వివరాలు 3లో▶

ఇదండీ సంగతి



ప్రజలంతా సూపర్‌సిక్స్ పథకాలు అడుగుతున్నారు కదా.. సూపర్‌సిక్స్ పథకాలను కూడా ఉపగ్రహాన్నే అడగమని చెబుదామా సార్!!

భద్రాద్రిలో కుప్పకూలిన భవనం

- శిథిలాల కింద చిక్కుకుపోయిన ఇద్దరు కూలీలు.. రంగంలోకి దిగిన జిల్లా యంత్రాంగం, రెస్క్యూ టీమ్‌లు
- ఒకరి గుర్తింపు.. క్షేమంగా బయటకు తెచ్చేందుకు సహాయక చర్యలు ముమ్మరం
- అర్ధరాత్రి వరకు లభ్యం కాని మరో కూలీ ఆచూకీ

5 లో





రామోజీ ఫిల్మ్‌సిటీ ముట్టడి..

- 200 మంది బాధితులతో కలిసి వెళ్లిన సీపీఎం నేతలు.. గేట్లు తోసుకుంటూ దూసుకెళ్లిన నిరసనకారులు
- స్వల్ప లాఠీచార్జ్..పలువురి అరెస్టు

- వివరాలు 12లో▶

మాదిగ..లంబాడా.. రెండు బెర్తులు!



మంత్రివర్గంలో స్థానం కోసం ఆ సామాజిక వర్గాల ఎమ్మెల్యేల యత్నాలు

- కేబినెట్ విస్తరణ సందర్భంగా అవకాశం కల్పించాలంటూ లేఖలు.. అధిష్టానం పెద్దలతో పాటు రాష్ట్ర ముఖ్య నేతలకూ విన్నపాలు
- నేడు ఢిల్లీకి వెళ్లేందుకు మాదిగ ఎమ్మెల్యేల ఏర్పాట్లు

3 లో



పంట దక్కితే అదే పది వేలు

ఈ చిత్రంలోని రైతు పేరు చందర్ నాయక్. కామారెడ్డి జిల్లా కన్నాపూర్ తండా శివారులో గల ఈయన మూడెకరాల పొలంలోని బోరు వట్టిపోయింది. దీంతో కిలోమీటరున్నర దూరంలోని మరో రైతు పొలంలోని బోరు బావి నుంచి నీళ్లు తీసుకోడానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. అందుకోసం ఆ రైతుకు రూ.10 వేలిచ్చాడు. అక్కడి నుంచి తన పొలం వరకు నీళ్లు పారించేందుకు రూ.10వేలు పెట్టి పైప్ కొన్నాడు. ఇంతచేసి పంట రక్షించుకున్నా.. పెట్టుబడి కూడా దక్కేలా లేదని వాపోతున్నాడు.

..: రామారెడ్డి :..

క్లుప్తంగా...

నేటితో బడ్జెట్ సమావేశాలు పూర్తి

ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించనున్న అసెంబ్లీ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నేటితో ముగియనున్నాయి. మండలి, సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగంతో ఈనెల 12న ప్రారంభమైన సమావేశాలు గురువారం ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించడంతో పూర్తి కానున్నాయి. బుధవారంతో వార్షిక బడ్జెట్ పద్దులపై చర్చ ముగిసిన నేపథ్యంలో, గురువారం సభ మొదలయ్యాక ఆర్థిక మంత్రి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సభలో ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. దీనిపై సభ్యులు మాట్లాడాక బడ్జెట్ ప్రతిపాదనలపై ఆయా సభ్యులు లేవనెత్తిన సందేహాలను ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క నివృత్తి చేయనున్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ద్రవ్య వినిమయ బిల్లుపై సమాధానమిస్తారు. అసెంబ్లీ, మండలిలోనూ ద్రవ్య వినిమయ బిల్లును ప్రవేశపెట్టి, చర్చించిన అనంతరం ఆమోదించనున్నారు. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలకు పూర్తి స్థాయి ఆమోదం లభిస్తుంది. ఖజానా నుంచి జరిగిన వ్యయాలకు సంబంధించి కాగ్ ఇచ్చే నివేదికను కూడా ప్రభుత్వం గురువారం సభ ముందు ఉంచనున్నట్టు తెలిసింది.

రెండు బిల్లులకు శాసన మండలి ఆమోదం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మున్సిపాలిటీ చట్ట సవరణ బిల్లు –2025, తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ బిల్లు –2025లకు శాసన మండలి బుధవారం ఆమోదం తెలిపింది. తొలుత మున్సిపాలిటీ చట్ట సవరణ బిల్లును మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు. దీర్ఘకాలిక ప్రయోజనాల కోసమే సవరణలు తెచ్చామని పేర్కొన్నారు. మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో కలిపే విషయంలో అందరితో చర్చిస్తామని, తొందరపాటు నిర్ణయాలు ఉండబోవని శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, గ్రామపంచాయతీలుగా మార్చిన తండాలు, గూడేలలో రేషన్‌దుకాణాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

తులం బంగారం ఎప్పుడిస్తారు?

బంగారు బిస్కెట్ల నమూనాలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసన



నిరసన తెలుపుతున్న మధుసూదనాచారి, కవిత, వాణీదేవి, సత్యవతి రాథోడ్

సాక్షి, హైదరాబాద్: కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద తులం బంగారం హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు బుధవారం శాసనమండలి ఆవరణలో బంగారు బిస్కెట్ల నమూనాలతో వినూత్న నిరసన తెలిపారు. తక్షణమే తులం బంగారం ఇవ్వాలని నినాదాలు చేశారు. ఇప్పటికే పెళ్లయిన వారికి కూడా తులం బంగారం ఇవ్వాల్సిందేనని, ఆడపిల్లల తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, కవిత, వాణీదేవి తదితరులు డిమాండ్ చేశారు.

రెండేళ్లలో 10.15లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు

- ఐదారేళ్లలో మొత్తం 54 లక్షల ఎకరాలకు సాగునీరు
- 73 ప్రాజెక్టులు పూర్తి.. 31 ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి
- నీటిపారుదల శాఖ బడ్జెట్ ఫలితాల నివేదికలో సర్కారు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే రెండేళ్లలో 10.15 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుత 2024–25లో 5.05 లక్షల ఎకరాలు, వచ్చే ఏడాది 2025–26లో మరో 5.1లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపింది. రాష్ట్రంలో మొత్తం 1.27 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 73.57 లక్షల ఎకరాల ఆయకట్టుకు అందించామని పేర్కొంది. వచ్చే ఐదారేళ్లలో భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల కింద మిగిలిన 54 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ప్రకటించింది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 34 భారీ, 39 మధ్యతరహా ప్రాజెక్టులు కలిపి మొత్తం 73 ప్రాజెక్టులు పూర్తికాగా, మిగిలిన 31 ప్రాజెక్టులు (24 భారీ, 7 మధ్యతరహా) ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నట్టు తెలిపింది. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన నీటిపారుదల శాఖ బడ్జెట్ ఫలితాల నివేదికలో ఈ గణాంకాలను వెల్లడించింది. ప్రాజెక్టుల నిర్మాణానికి 2024 డిసెంబర్ 31నాటికి మొత్తం రూ.2.36 లక్షల కోట్ల పెట్టుబడి వ్యయం చేయగా, ఇతర వ్యయాలు కలుపుకొని మొత్తం రూ.2.599 లక్షల కోట్ల వ్యయం చేసినట్టు తెలిపింది. మిగిలిన రూ.90,177 కోట్ల వ్యయం చేస్తే నిర్మాణంలోని భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు పూర్తవుతాయని పేర్కొంది. భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణానికి 4.309 లక్షల ఎకరాలకుగాను ఇంకా 1.147 లక్షల ఎకరాలు సేకరించాల్సి ఉందన్నారు.

కొత్త ఆయకట్టు వివరాలు
సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో..

బెట్టింగ్ యాప్‌లపై సిట్

ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీపై ఉక్కుపాదం మోపుతాం.. శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి

- బెట్టింగ్ యాప్స్ ప్రచారం చేసే వారిని విచారించడం శాశ్వత పరిష్కారం కాదు
- ఈ సంస్కృతిని తెలంగాణలో నిర్మూలించడమే మా లక్ష్యం
- కఠిన శిక్షలు పడేలా ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ చట్టానికి సవరణలు చేస్తాం
- రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా ప్రతిపక్షాల కుట్రలు



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ యాప్స్‌పై ఉక్కుపాదం మోపుతామని.. వాటి అదుపు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అవసరమైతే సీబీసీఐడీని కూడా ఇందులో భాగం చేస్తామని తెలిపారు. బెట్టింగ్ వ్యవహారంతో సంబంధమున్న ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నేరస్తులకు విధించే శిక్షను పెంచేలా చట్ట సవరణలకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. బుధవారం శాసనసభలో బెట్టింగ్, గేమ్స్‌పై పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేయగా.. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ''ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లకు ప్రచారం కల్పించే వారిని విచారించడం శాశ్వత పరిష్కారం కాదు. ఇది రాష్ట్రాలు, దేశాల మధ్య విస్తరించిన అంతర్జాతీయ నేర సమస్య. బెట్టింగ్ యాప్‌ల వల్ల పేద కుటుంబాలు నాశనం అవుతున్నాయి. యువత ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఈ సంస్కృతిని తెలంగాణ నుంచి పూర్తిగా నిర్మూలించడమే మా లక్ష్యం..'' అని తెలిపారు. రెండేళ్ల శిక్ష మాత్రమే ఉన్న ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ చట్టం–2017కు కఠిన శిక్షలతో కూడిన సవరణలను తదుపరి అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెడతామని చెప్పారు.

పెట్టుబడులు రాకుండా ప్రతిపక్షాల కుట్రలు

రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయంటూ విపక్షాలు ప్రచారం చేస్తున్నాయని, రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకునే కుట్ర ఇది అని సీఎం మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధిని మసకబార్చే యాసిడ్ దాడులు సరికాదన్నారు. 15 నెలలుగా రాష్ట్రం ప్రశాంతంగా ఉందని, దీన్ని విపక్షం జీర్ణించుకోలేకపోతోందని ఆరోపించారు. ''బీఆర్ఎస్ వైఖరి తలనొప్పిగా మారింది. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయి. మహిళలపై అత్యాచారం ఘటనల్లో మన రాష్ట్రం 2020లో దేశంలోనే నాలుగో స్థానంలో ఉంది. నడిబజారులో న్యాయవాద దంపతుల హత్య, పశువైద్యురాలిపై అత్యాచారం వంటి ఘటనలు జరిగాయి. నేరస్తులను కాపాడేందుకు ఆనాటి ప్రభుత్వ పెద్దలు తోడ్పడ్డారు. ఆ పార్టీ నేతలే కేసుల్లో ఉన్నారు'' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అయితే బీఆర్ఎస్‌పై తమకు ఎలాంటి ద్వేషం లేదని, ప్రభుత్వానికి తగిన సలహాలు ఇవ్వాలని కోరారు. అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు తాను అందుబాటులో ఉంటానని, రాజకీయ విభేద లేకుండా అభివృద్ధి పనులకు సహకరిస్తానని చెప్పారు. గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ వచ్చినా ఆయన నియోజకవర్గం సమస్యలపై స్పందిస్తానని వ్యాఖ్యానించారు.


ఐఎంజీ-భారత్ భూములు లాక్కుంటే నష్టమేంటి?

నిరర్థకంగా ఉన్న ఐఎంజీ భారత్ భూములను ప్రభుత్వం లాక్కుంటే ప్రతిపక్షాలు ఎందుకు రాద్ధాంతం చేస్తున్నాయని సీఎం రేవంత్ ప్రశ్నించారు. 25ఏళ్ల క్రితం కేటాయించిన భూములు ఇప్పటికీ నిరర్థకంగా ఉన్నాయని, సుప్రీంకోర్టు వరకూ వెళ్లి భూములు తిరిగి తీసుకున్నామని చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టేలా తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన కోసం భూములు ఇస్తుంటే రచ్చ చేయడం ఏం న్యాయమని ప్రశ్నించారు. ఆ భూములను బహిరంగ వేలం ద్వారా అంతర్జాతీయ సంస్థలకు కేటాయిస్తామని తెలిపారు. యూనివర్సిటీ భూములు లాక్కున్నామనడం సత్యదూరమని.. అక్కడ అటవీ ప్రాంతం ఉందని, పులులు, సింహాలు ఉన్నాయనే ప్రచారంలో నిజం లేదని పేర్కొన్నారు. అక్కడ కొన్ని గుంట నక్కలు మాత్రమే ఉన్నాయని, వాటి పనిపడతామని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో భూములు సేకరించలేదా? అని ప్రశ్నించారు. కుట్రలు, కుతంత్రాల కోసం అసెంబ్లీ మైకును వాడుకుంటే సహించేది లేదని పేర్కొన్నారు.

విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయాల్సిందే

లేకపోతే భవిష్యత్ తరాలకు అన్యాయం చేసినవాళ్లం అవుతాం

- అవసరమైతే విద్యాశాఖను నా దగ్గరే పెట్టుకుంటా..
- రాజకీయం వద్దు..రాతపూర్వక సూచనలివ్వండి
- 'తెలంగాణ విద్య'పై మండలిలో సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'మన విద్యా విధానం ఆందోళనకరంగా ఉంది. ఈ వ్యవస్థను ప్రక్షాళన చేయకపోతే భవిష్యత్ తరాలకు అన్యాయం చేసినవాళ్లం అవుతాం. చదువు ఎన్ని అవకాశాలు ఇస్తుందో, పేదలకు విద్య ఎంత అవసరమో ప్రభుత్వ పాఠశాలలో చదివిన నాకు బాగా తెలుసు. అందువల్ల రెగ్యులర్ ఎడ్యుకేషన్‌ను స్ట్రీమ్‌లైన్ చేయాలనే ఆలోచన చేస్తున్నాం. రాజకీయ కోణంలో ఆలోచన చేసి దీన్ని అడ్డుకోవద్దు. విద్యావ్యవస్థపై రాతపూర్వక సూచనలు ఇవ్వండి. మీ అందరి సూచనలతో ఒక పాలసీ డాక్యుమెంట్ రూపొందిస్తాం. దానిపై కూడా చర్చ పెడదాం. అవసరమైతే భవిష్యత్‌లోనూ విద్యాశాఖను నా దగ్గరే పెట్టుకుని పేదలకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తా..'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. 'తెలంగాణలో విద్య'అనే అంశంపై బుధవారం శాసనమండలిలో స్వల్పకాలిక చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు.

75% మందికి ప్రాథమిక సామర్థ్యం కూడా లేదని తేలింది

'నేషనల్ అచీవ్‌మెంట్ సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 3, 5వ తరగతి విద్యార్థులపై సర్వే చేసింది. 75 శాతం మంది విద్యార్థులు ఏ సబ్జెక్ట్‌లోనూ ప్రాథమిక సామర్థ్యం కూడా చూపలేదని వెల్లడైంది. ఈ వైఫల్యాలను గత ప్రభుత్వంపై నెట్టేసి, బాధ్యత నుంచి తప్పించుకోవాలని మేం అనుకోవడం లేదు. గత ప్రభుత్వం 2017లో 8,792 మంది టీచర్లను భర్తీ చేస్తే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 10 వేలకు పైగా టీచర్లను భర్తీ చేశాం. 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 21 వేల మందికి పైగా టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చాం. టీచర్ల బదిలీ ఎంత క్లిష్టమైన ప్రక్రియో తెలిసిందే. కానీ మేం 36 వేల మంది టీచర్లను చిన్న ఆరోపణ కూడా ఎదుర్కోకుండా బదిలీ చేశాం..'అని సీఎం అన్నారు.

తెలంగాణ సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి

'ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిపై రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తున్నాం. రెసిడెన్షియల్ స్కూళ్లలో 6 లక్షల మంది విద్యార్థులు ఉంటే ఒక్కో విద్యార్థిపై సరాసరి రూ.96 వేలు ఖర్చు చేస్తున్నాం. మరి ప్రభుత్వం ఎక్కడ విఫలమైంది? విద్యా ప్రమాణాలు పడిపోవడానికి కారణం ప్రభుత్వాలే కాదు. తెలంగాణ సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి. విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యం పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నాం. ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ, అకాడమీని ప్రారంభిస్తున్నాం. కాలం చెల్లిన కోర్సులకు స్వస్తి చెప్పి 100 నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు (ఏటీసీలు) ఏర్పాటు చేయబోతున్నాం. కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం..' అని రేవంత్ వివరించారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు 12 వాయిదాల్లో చెల్లిస్తాం

'కొందరు ఫీజు బకాయిలు పెండింగ్ పెట్టి రిటైర్డ్ లైఫ్ హ్యాపీగా ఎంజాయ్ చేస్తున్నారు. కానీ బకాయిలు చెల్లించే బాధ్యత మాది. గత ప్రభుత్వం పెండింగ్ పెట్టిన బకాయిలు ఏప్రిల్ 1, 2025 నుంచి మార్చి 31, 2026 లోగా 12 వాయిదాల్లో చెల్లిస్తాం.

పిల్లనిచ్చినోళ్లు అడుగుతున్నారని కదా అని చేయలేం

తెలిసిన వాళ్లు అడుగుతున్నారని జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు చేయలేం. మా ఊరు కొండారెడ్డి పల్లెను జిల్లా కేంద్రం చేయాలని కొందరు అడుగుతున్నారు. జైపాల్‌రెడ్డి సొంత ఊరు మాడ్గులకు మీరు (మండలి చైర్మన్), నేను అల్లుళ్లం. కౌన్సిల్ చైర్మన్ (గుత్తా సుఖేందర్‌రెడ్డి), సీఎం అల్లుళ్లుగా ఉండి కూడా తమ ఊరిని మండలం చేయట్లేదని పిల్లను ఇచ్చిన వాళ్లు అడుగుతున్నారు. కానీ దీనికి నేను పూర్తిగా వ్యతిరేకం. ఏదైనా పరిపాలన సౌలభ్యం కోసం మాత్రమే చేస్తాం.


మెట్రోకు కూడా జైపాల్‌రెడ్డి పేరు పెట్టినా తప్పులేదు

తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన వ్యక్తి జైపాల్‌రెడ్డి. ఉత్తమ పార్లమెంటేరియన్..పీవీ నర్సింహారావు తర్వాత ఆ స్థాయిలో గుర్తింపు పొందిన వ్యక్తి. అందుకే పాలమూరు ఎత్తిపోతలకు ఆయన పేరు పెట్టాం. హైదరాబాద్‌కు మెట్రో రావడానికి కారణం ఆయనే. కాబట్టి వారు (ఎమ్మెల్సీ కవితనుద్దేశించి) కోరుకుంటే మెట్రోకు కూడా జైపాల్‌రెడ్డి పేరు పెట్టినా తప్పులేదు..'అని సీఎం అన్నారు.

ధరణి దుర్మార్గ చట్టం.. బంగాళాఖాతంలో పడేస్తాం

గత బీఆర్ఎస్ హయాంలో లక్షల మంది అనుభవదారుల పేర్లను తొలగించారు

- వారి స్థానంలో 70 ఏళ్ల వెనక ఉన్న జమీందార్ల పేర్లను ఎంట్రీ చేశారు
- రెవెన్యూ శాఖ పద్దులపై చర్చలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధ్వజం



సాక్షి, హైదరాబాద్: 'గతంలో తెచ్చిన అనేక చట్టాలతో లభించిన భూ హక్కులను ఒక్క కలం పోటుతో ధరణి అనే చట్టం తీసుకొచ్చి రద్దు చేశారు. అనుభవదారులందరి పేర్లను తొలగించి వారి స్థానంలో పట్టదారు కాలమ్‌పెట్టి 70 ఏళ్ల క్రితం ఉన్న జమీందార్లు, భూస్వాములు, జాగీర్‌దార్ల పేర్లను చేర్చారు. తమ తాతల పేరిట ఉన్న భూములు ఇచ్చేయాలని వారి వారసులు వస్తున్నారు. లక్షల మంది రైతులకు హక్కులు దక్కకుండా చేసిన దుర్మార్గమైన చట్టం ధరణి. దాన్ని మారుస్తామని ఉద్యమం చేసే అధికారంలోకి వచ్చాం. ధరణిని మారుస్తాం. బంగాళాఖాతంలో వేస్తాం'అని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తేల్చిచెప్పారు. చిన్న తప్పులను ఎత్తిచూపి ధరణి బాలేదని ప్రచారం చేస్తున్నారంటూ బుధవారం బడ్జెట్ పద్దులపై చర్చలో బీఆర్ఎస్ సభ్యుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు భట్టి కౌంటర్ ఇచ్చారు. రాష్ట్ర ప్రజలకు భూములపై సర్వ హక్కులు జాగ్రత్తగా ఉండేలా భూభారతి చట్టం తెస్తుంటే మళ్లీ ధరణి కావాలంటారా? అని నిలదీశారు. 70.6 లక్షల మంది రైతులకు సంబంధించిన 1.55 కోట్ల ఎకరాల భూమి రికార్డులు ధరణిలో నిక్షిప్తమై ఉండటంతో వారంతా నిశ్చింతగా ఉన్నారని.. వారికి అన్యాయం చేయాలని చూస్తే తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో మళ్లీ పోరాడతామని పల్లా వ్యాఖ్యలను సైతం భట్టి తీవ్రంగా తప్పుబట్టారు. సాయుధ రైతాంగ పోరాటం స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం నాటి నుంచి నేటి వరకు భూమిపై ప్రజలకు హక్కులు కల్పిస్తూ వచ్చిందని గుర్తుచేశారు.

నిరుపేదల భూముల్ని అడ్డగోలుగా ఇతరులకు ధారాదత్తం చేశారు

24 లక్షల మంది భూమిలేని నిరుపేదలకు కాంగ్రెస్ హయాంలో భూములు పంపిణీ చేస్తే బీఆర్ఎస్ హయాంలో వాటిని ధరణిలోని పార్ట్–బీ జాబితాలో పెట్టి అధికారుల చుట్టూ తిప్పించుకున్నారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. వాటిని వేరే వారి పేరిట బదిలీ చేసుకున్నారని, అడ్డగోలుగా ధారాదత్తం చేసుకున్నారని భట్టి ఆరోపించారు. ధరణిలో ఎంట్రీ చేశాక వెరిఫికేషన్ లేకుండానే రిజిస్ట్రేషన్ చేస్తుండటంతో భూమి ఎన్నో చేతులు మారుతోందని.. సదరు భూమి నాది అని అప్పీల్ చేసుకొనే వెసులుబాటు అసలు యజమానికి కల్పించలేదని ఆయన తప్పుబట్టారు. నాలుగు గోడల మధ్య ధరణిలో అడ్డగోలుగా ఎంట్రీలు చేసుకోవడం సబబేనా? అని నిలదీశారు.

వచ్చే ఎన్నికల్లో రెఫరెండంగా భూభారతి: మంత్రి పొంగులేటి

భూభారతిని రెఫరెండంగా వచ్చే సార్వత్రిక ఎన్నికలకు వెళ్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ సభ్యులకు దమ్ముంటే ధరణిపై ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. ధరణితో తమ భూములు కూడా గల్లంతయ్యాయని పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు తనను సంప్రదిస్తున్నారన్నారు.

భూహారతి చేయబోతున్నారు: పల్లా



అంతకుముందు బీఆర్ఎస్ సభ్యుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ భూభారతిలో పౌతి, మాన్యువల్ పహాణీ, మ్యుటేషన్‌కు పెట్టిన నిబంధనలతోపాటు జమాబందీ, అనుభవదారుడి కాలమ్‌ను పునరుద్ధరించి మళ్లీ అవినీతికి దుకాణం తెరవబోతున్నారని ఆరోపించారు. భూభారతి ద్వారా భూహారతి చేయబోతున్నారని ఆక్షేపించారు. రైతుల భూములను లాక్కోవడానికి ప్రయత్నిస్తే సాయుధ రైతాంగ, లగచర్ల పోరాటాల స్ఫూర్తితో పోరాడతామన్నారు. అనుభవదారుడి కాలమ్ పెట్టడం కౌలుదారుల పేరుతో వివాదాలు సృష్టించడమేనన్నారు. ఎమ్మార్వో, రిజిస్ట్రేషన్ అధికారి సంతృప్తి చెందితేనే మ్యుటేషన్ చేయాలని భూభారతిలో నిబంధన పెట్టడం సరికాదన్నారు.

పీక్ డిమాండ్ ఎంత పెరిగినా నిరంతరాయ విద్యుత్

శాసనసభలో పద్దులపై చర్చలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో పీక్ డిమాండ్ ఎన్ని మెగావాట్లకు పెరిగినా నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 2021లో 13,668 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ పీక్ డిమాండ్ ఈ నెలలో 17,162 మెగావాట్లకు చేరుకున్నప్పటికీ ఎలాంటి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామన్నారు. 2029–30 నాటికి గరిష్ఠ డిమాండ్ 24,215 మెగావాట్లకు, 2034–35 నాటికి 31,809 మెగావాట్లకు చేరుకుంటుందన్న కేంద్రం అంచనాలను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, డిస్కంల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2030 నాటికి 20 వేల మెగావాట్లు, 2035 నాటికి 40 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. బుధవారం అసెంబ్లీలో పద్దులపై చర్చలో ఆయన సమాధానమిచ్చారు.

ఏప్రిల్‌లో భూభారతి: మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: ధరణి స్థానంలో తాము రూపొందించిన భూభారతి ఏప్రిల్‌లో అమలులోకి వస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. లోపభూయిష్ట ధరణి విధానంతో రకరకాలుగా ఎదురైన ఇబ్బందులకు ఇక శాశ్వత విముక్తి కలుగుతుందని స్పష్టం చేశారు. దేశానికే ఆదర్శంగా ఉండేలా నిపుణుల సూచనలు, సలహాలు, సంప్రదింపులతో ఈ చట్టం, పోర్టల్‌ను రూపొందించామన్నారు. హరీశ్‌రావులాంటి ప్రతిపక్ష సభ్యుల సూచనలను కూడా పరిగణనలోకి తీసుకోవటం ద్వారా పారదర్శకతకు ప్రాధాన్యమిచ్చామన్నారు. పద్దులపై చర్చకు మంత్రి సుదీర్ఘ సమాధానమిచ్చారు. గత ప్రభుత్వంలో జరిగిన భూలావాదేవీలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సర్వేయర్లను నియమించటంతోపాటు ప్రైవేటు సర్వేయర్ల సహాయం తీసుకొని ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. ప్రతి మండలం, పట్టణంలో భూవిస్తరణ, భూ లావాదేవీలను బట్టి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు ఆరువేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను అందుబాటులో ఉంచబోతున్నామని, భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కేవలం 15 నిమిషాల్లో పూర్తయ్యేలా కొత్త పద్ధతులు తీసుకొస్తున్నామన్నారు. ధరణి సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రీకృతమై ఉన్న అధికారాలను వికేంద్రీకరించి, మండల స్థాయిలో తహసీల్దార్‌కు, డివిజన్ స్థాయిలో ఆర్డీఓలకు, జిల్లాస్థాయిలో అదనపు కలెక్టర్లకు సమస్యలను పరిష్కరించే అధికారాన్ని అప్పగించామన్నారు. నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునేందుకు ఆర్థిక సాయం చేయటమే కాకుండా, గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన రెండు పడక గదుల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని చెప్పారు.

రేషన్ షాపుల్లో నిత్యావసరాలు

రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చు

- కార్డు లేకున్నా లబ్ధిదారుల జాబితాలో ఉంటే బియ్యం
- శాసనసభలో మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: చౌక ధరల దుకాణాల్లో నిత్యావసరాలు అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉగాది పండుగ నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం అందిస్తామన్నారు. రేషన్‌కార్డు ఎక్కడున్నా, లబ్ధిదారుడు ఉండే ప్రాంతంలోనే రేషన్ తీసుకునే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. శాసనసభలో బుధవారం పౌరసరఫరాలు, సాగునీటి పద్దులపై జరిగిన చర్చకు మంత్రి బదులిచ్చారు. రేషన్‌కార్డులు లేకున్నా, లబ్ధిదారుల జాబితాలో ఉన్న వారికీ బియ్యం అందుతాయని ఉత్తమ్ చెప్పారు. రేషన్ కార్డులో కొత్త సభ్యులను చేర్చే ప్రక్రియ ఏప్రిల్ నుంచి చేపడుతున్నామన్నారు. రేషన్ డీలర్ల కమీషన్ పెంచుతున్నామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో జ్యుడీషియల్ కమిషన్ నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపై చర్యలు చేపడతామని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.25 లక్షలు ఇస్తామన్నారు.

ఉద్యమ కేసులు ఎత్తివేయాలి: కూనంనేని

తెలంగాణ కోసం పోరాడిన వారిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. అర్బన్ నక్సల్స్ పేరుతో వామపక్ష భావజాలం ఉన్న వారిపైనా కేసులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వరవరరావు, హరగోపాల్ సహా అనేక మంది ప్రశ్నించే గొంతుకలను ఇలాంటి కేసులతో నొక్కే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పోలీసులకు షిఫ్ట్ సిస్టం తేవాలని, ట్రాఫిక్ పోలీసులు గంటల తరబడి నిలబడి విధులు నిర్వర్తించే విధానంలో మార్పులు తేవాలని సూచించారు.

బీఆర్ఎస్ పాలనలో అక్రమాలు: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎన్నో అక్రమాలు చోటు చేసుకున్నాయని కాంగ్రెస్ సభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని అరాచకాలు చేశారని ఆరోపించారు. ఫోన్ల ట్యాపింగ్ చేశారని, ఇసుక దందా చేశారని విమర్శించారు. రైతుల భూములను పోలీసుల ద్వారా బెదిరించి లాక్కున్నారని అన్నారు. రాష్ట్రం 15 నెలలుగా ప్రశాంతం ఉందని, సామాజిక తెలంగాణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు.

ఫిరాయింపులపై రేవంత్ కోర్టు పరిధిని అతిక్రమించారు

సలహాలు కోరుతారు.. ఇస్తామంటే మైక్ కట్ చేస్తారు

- శాంతిభద్రతల పరిరక్షణలో సీఎం పూర్తిగా విఫలం: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో పెండింగులో ఉన్నా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం అసెంబ్లీ వేదికగా తీర్పు ఇచ్చారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. కోర్టు పరిధిని అతిక్రమించి సీఎం మాట్లాడుతూ పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడదని, ఉపఎన్నికలు ఉండవని చెప్పడాన్ని ప్రశ్నించారు. సీఎం చేసిన వ్యాఖ్యలపై మాట్లాడేందుకు తాము అవకాశం కోరినా ఇవ్వకపోవడంపై నిరసన తెలుపుతూ శాసనసభ నుంచి వాకౌట్ చేసినట్టు వెల్లడించారు. అసెంబ్లీ లాబీలో హరీశ్‌రావు బుధవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. 'పార్టీ ఫిరాయింపులపై సీఎం అసెంబ్లీలో మాట్లాడటం పార్లమెంటరీ సాంప్రదాయాలకు విరుద్ధం. కోర్టు పరిధిలో ఉన్న విషయాలను చట్టసభల్లో ప్రస్తావించకూడదని సభా నియమావళికి సంబంధించి కౌల్ అండ్ షక్దర్ పుస్తకంలో స్పష్టంగా ఉంది. సీఎం తన పరిధిని దాటి మాట్లాడటం సభా హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుంది. ఈ విషయంలో పాయింట్ ఆఫ్ ఆర్డర్ కింద వివరించే ప్రయత్నం చేసినా, మైక్‌కట్ చేయడంతో సభ నుంచి వాకౌట్ చేశాం. పార్టీ మారిన ఎమ్మెల్యేలు తిరిగి సొంత పార్టీల్లోకి వెళతారనే అనుమానంతో ఉపఎన్నికలు రావని సీఎం చెబుతున్నారు. 'ఎక్స్'ఏఐ యాప్ గ్రోక్‌లో ఉత్తమ సీఎం ఎవరు అంటే కేసీఆర్ అనే సమాధానం చెప్తోంది'అని హరీశ్ అన్నారు.

సలహాలు ఇస్తామంటే మైక్ ఇవ్వడం లేదు

'సీఎం కోరినట్టుగా సలహాలు ఇచ్చేందుకు సిద్ధమైనా మైక్ ఇవ్వడం లేదు. బెట్టింగ్ యాప్స్‌ను నిషేధిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ తెచ్చినా, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నియంత్రించడంలో విఫలమైంది. శాంతిభద్రతల పరిరక్షణలో సీఎం పూర్తిగా విఫలమయ్యాడు. హైదరాబాద్‌లో 50 శాతం సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. పోలీసు కుటుంబాలను పోలీసులతోనే అరెస్టు చేయించిన ఘనుడు రేవంత్. సీఎం భూముల కోసం ఆమనగల్లులో రూ.5వేల కోట్లతో 10 లేన్ల రోడ్డు వేస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర సొంత ఆదాయంలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపాం. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు అభివృద్ధి నిధులు (ఏసీడీపీ) ఇవ్వాలి. ఆర్థిక మాంద్యంతో రూ.70వేల కోట్ల ఆదాయం కోల్పోయామని చెప్పిన సీఎం.. ఇప్పుడు 95 శాతం రియలిస్టిక్ బడ్జెట్ అంటున్నాడు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భూములమ్మితే బొంద పెట్టడానికి కూడా స్థలం మిగలదు అని చెప్పి ఈ రోజు అసెంబ్లీ సాక్షిగా భూముల అమ్మకాన్ని సీఎం సమర్థిస్తున్నారు. గచ్చిబౌలిలోని 400 ఎకరాలను బీఆర్ఎస్ ప్రభుత్వం పోరాడి కాపాడింది'అని హరీశ్ అన్నారు.

సీతక్కకు ఇంగ్లిష్, హిందీ అర్థం కాదు..

నాకు తెలుగు రాదు

ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ

- నాకు హిందీ, ఇంగ్లిష్ రాదనడం సరికాదు.. తెలుగులోనే మాట్లాడతా: సీతక్క





సాక్షి, హైదరాబాద్: శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ.. మంత్రి సీతక్కపై చేసిన వ్యాఖ్యలు స్వల్ప వాగ్వాదానికి కారణమయ్యాయి. విద్యుత్ కోతలు, శాంతిభద్రతల సమస్య గురించి అక్బరుద్దీన్ మాట్లాడుతూ ప్రభుత్వ తీరును విమర్శించారు. పోలీసులు అవినీతికి అలవాటు పడి శాంతిభద్రతలను గాలికి వదిలేశారని, ట్రాఫిక్ కానిస్టేబుళ్లు వాహనాల ఫొటోలు తీసేందుకే పోటీ పడుతున్నారంటూ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క జోక్యం చేసుకుంటూ 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలన గురించి కాకుండా, 15 నెలల కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేయడం, మహిళలపై అత్యాచారాలు, నేరాలు పెరిగాయని మాట్లాడడం సరికాదన్నారు. దీంతో అక్బరుద్దీన్ స్పందిస్తూ 'సీతక్కకు అటు హిందీ, ఇటు ఇంగ్లిష్ అర్థం కాదు. తెలుగు నాకు అర్థం కాదు. ఏం చేద్దాం'అని వ్యాఖ్యానించారు. సీతక్క స్పందిస్తూ.. 'నా మాతృభాష తెలుగు. నేను మాతృభాషలోనే మాట్లాడుతా. నాకు హిందీ, ఇంగ్లిష్ రాదు అనడం సరికాదు. నేను పేదరికం నుంచి వచ్చాను. తెలుగులోనే చదువుకొని ఈ స్థాయికి వచ్చాను. పోలీస్ వ్యవస్థనే కించపరిచే విధంగా అక్బరుద్దీన్ మాట్లాడితే స్పందించాను'అని వ్యాఖ్యానించారు.

పాయింట్ ఆఫ్ ఆర్డర్‌పై..: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతుండగా మాజీమంత్రి హరీశ్‌రావు జోక్యం చేసుకొని పాయింట్ ఆఫ్ ఆర్డర్‌కు అవకాశం ఇవ్వాలని ప్యానెల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డిని కోరారు. అందుకు ఆయన హరీశ్‌రావుకు మైక్ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలో చేసిన వ్యాఖ్యలపై పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తుతున్నట్టు హరీశ్‌రావు చెప్పారు. సుప్రీంకోర్టులో ఉన్న ఫిరాయింపు శాసనసభ్యుల అనర్హత వేటుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు ప్రసంగాన్ని మంత్రి శ్రీధర్‌బాబు తప్పుపడుతూ 'ముఖ్యమంత్రి మాట్లాడిన వెంటనే పాయింట్ ఆఫ్ ఆర్డర్ అడగాల్సి ఉండగా, ఆయన మాట్లాడి వెళ్లిన తర్వాత అక్బరుద్దీన్ కూడా మాట్లాడాక పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఎలా ఉంటుందన్నారు. అదే సమయంలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్థానంలోకి వచ్చిన స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికే మైక్ ఇచ్చారు. దీంతో హరీశ్‌రావు తనకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను పలుమార్లు కోరినా, ఆయన స్పందించలేదు. దీంతో హరీశ్‌రావు పల్లా రాజేశ్వర్ రెడ్డి, గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి, ప్రభాకర్ తదితరులతో కలిసి పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. అయినా స్పీకర్ స్పందించకపోవడంతో వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించి సభ నుంచి వెళ్లిపోయారు.



ఇవి ప్రాణహిత ప్రాజెక్టు కాలువల కోసం సేకరించిన భూములు. ప్రాజెక్టుపై ఆశలు వదిలేసి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలం రణవెల్లి, బెజ్జూరు మండలం సులుగుపల్లి, మందమర్రి మండలం శంకర్‌పల్లి గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, శ్మశాన వాటికలు నిర్మించారు. చాలాచోట్ల రైతులు సాగులో ఉన్నారు. వానాకాలంలో కాలువల్లో చేపలు పెంచుతున్నారు. మట్టి, బండరాయి, పైపులను తరలించుకుపోగా కొన్ని చోట్ల భూములు కబ్జాకు గురయ్యాయి.



ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహితనదిపై బరాజ్ నిర్మించాల్సిన ప్రాంతం

ప్రాణం లేచొచ్చింది!

ప్రాణహిత బరాజ్ కడతామంటున్న ప్రభుత్వం..

17 ఏళ్లుగా ప్రాజెక్టు నిర్మాణంపై నిర్లక్ష్యం

సేకరించిన భూములు అన్యాక్రాంతం

భూముల ధరలు పెరిగినందున తిరిగి ఇవ్వాలంటున్న రైతులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటనతో ప్రాణహిత ప్రాజెక్టుపై మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్ర బడ్జెట్‌లో రూ.32 కోట్లు కూడా కేటాయించారు. అయితే పాత డిజైనా, లేక కొత్తది ప్రతిపాదిస్తారా, వార్ధాపై బరాజ్ నిర్మిస్తారా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. తలాపునే పుష్కలైన నీళ్లు ఉన్నా.. ఏళ్లుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వర్షాధార పంటలే దిక్కు. రెండో పంటతోపాటు వరి పండించని పల్లెలు ఎన్నో ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణానికి 17ఏళ్లుగా మోక్షం కలగడం లేదు. భూ సేకరణలో ఎకరానికి రూ.1.50 నుంచి రూ.1.75 లక్షల లోపే పరిహారం ఇస్తే, ఇప్పుడా భూముల ధరలు రూ.15 నుంచి రూ.30 లక్షల వరకు పెరిగాయి. దీంతో భూములు తిరిగి ఇవ్వాలనే డిమాండ్లు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

అభ్యంతరాలతో ఆగిపోయి...

తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు వెన్‌గంగా, వార్ధా కలిసే ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత నదిపై ప్రాజెక్టు కట్టాలనేది ప్రణాళిక. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి 2008లో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 152 అడుగుల ఎత్తులో బరాజ్ నిర్మించి కాలువలతో ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల మీదుగా గోదావరి నదిపై ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు వరకు నీటిని తరలించి, అక్కడ నుంచి ఆరు జిల్లాలకు నీరు ఇవ్వాలి. ఏడు జిల్లాలకు నీటి సరఫరాకు భూసేకరణ, కాలువల కోసం రూ.10 వేల కోట్లు వెచ్చించారు. 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మిస్తే.. చంద్రపూర్, గడ్చిరోలి జిల్లాల్లో 30 గ్రామాల ముంపు ఉంటుందని మహారాష్ట్ర దీనికి అభ్యంతరం చెప్పింది. ఉమ్మడి ఏపీలోనూ, తెలంగాణ వచ్చాక కూడా దీనిపై చర్చలు జరిగాయి. చివరగా 2015లో నాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు జరిపిన చర్చల్లో కూడా 148 మీటర్ల వరకు ఒప్పుకున్నారు. అయితే అభ్యంతరాల సాకుతో ప్రాజెక్టును పూర్తిగా పక్కకు పెట్టి, దిగువన గోదావరిలో ప్రాణహిత కలిసే మేడిగడ్డ వద్ద 'కాళేశ్వరం'మొదలు పెట్టి శరవేగంగా పూర్తి చేశారు. తర్వాత వార్ధానదిపై బరాజ్ కట్టి మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలకే రెండు లక్షల ఆయకట్టుకు నీరిస్తామని డిజైన్లు చేసినా ముందుకు సాగలేదు.

ఇదీ ప్రాజెక్టు స్వరూపం..

పేరు:	డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి
బరాజ్:	ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద
నీటి సామర్థ్యం:	160 టీఎంసీలు
మొత్తం ఆయకట్టు:	16.40 లక్షల ఎకరాలు
లబ్ధి పొందే జిల్లాలు:	ఉమ్మడి కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, మెదక్, నల్లగొండ, రంగారెడ్డి
ఆదిలాబాద్ ఆయకట్టు:	1.56 లక్షల ఎకరాలు
లబ్ధిపొందే గ్రామాలు:	1,565.
లిఫ్టులు:	16
కాలువల పొడవు:	512 కి.మీ.
కాలపరిమితి:	4 ఏళ్లు
అంచనా వ్యయం:	రూ.38,500 కోట్లు

మా భూములు మాకియ్యాలి..



నాలుగెకరాలు తీసుకొని, ఎకరానికి రూ.1.75 లక్షలు ఇచ్చారు. ఏళ్ల గడుస్తున్నా నీళ్లు రాలేదు. ప్రాజెక్టు కట్టకపోతే మా భూములు మాకియ్యాలి.
– కోట అశోక్ , శంకర్‌పల్లి

కాలువల ఉపయోగం లేదు



30 గుంటలు తీసుకున్నారు. కాలువలు తవ్వినా, రైతులకు ఉపయోగం లేదు. ప్రాజెక్టు భూమిలోనే పల్లె ప్రకృతివనం నిర్మించారు.
– విశ్వనాథ్, రణవెల్లి.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు

ఆదివాసీల జీవనశైలి ప్రతిబింబించాలి

- ఆ విధంగా గిరిజన మ్యూజియాన్ని తీర్చిదిద్దాలి: సీఎం

భద్రాచలం టౌన్: ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా గిరిజన మ్యూజియాన్ని తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. భద్రాచలంలో నిర్మించిన ట్రైబల్ మ్యూజియాన్ని శ్రీరామనవమికి ప్రారంభించనుండగా, అందుకు సంబంధించిన బ్రోచర్లను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి బుధవారం ఆయన హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఆదివాసీ గూడేల్లో నివసించే వారి కట్టుబాట్లు, వేషభాషలు, నాటి సామగ్రి ప్రదర్శనకు మ్యూజియం ఉపయోగపడుతుందన్నారు. ఈ మేరకు మ్యూజియం ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ చూపిన భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్‌ను సీఎం అభినందించారు.

చాకలి ఐలమ్మ వర్సిటీకి యూజీసీ గుర్తింపు

సుల్తాన్‌బజార్: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) గుర్తింపు లభించింది. తెలంగాణ విశ్వవిద్యాలయాలు (సవరణ) చట్టం–2025 ఆధారంగా వర్సిటీకి ఈ గుర్తింపు ఇచ్చింది. 2002 ఏప్రిల్‌లో అప్పటి ప్రభుత్వం కోఠి మహిళా కళాశాలను తెలంగాణ తొలి మహిళా విశ్వవిద్యాలయంగా గుర్తిస్తూ ప్రకటన జారీ చేయగా దాని పేరును వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా మారుస్తూ తెచ్చిన బిల్లును గతేడాది శీతాకాల సమావేశాల్లో అసెంబ్లీ ఆమోదించింది. ఈ గుర్తింపు ద్వారా విశ్వవిద్యాలయం వివిధ ప్రోత్సాహకాలను పొందేందుకు అర్హత సాధించింది. ఈ గుర్తింపు సాధించడంలో అండగా నిలిచిన అధికారులు, సిబ్బంది, విద్యార్థులకు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పాల బకాయిలు చెల్లించండి: సీఎం

సాక్షి, హైదరాబాద్: పాడి రైతులకు పాల బకాయిలు వెంటనే చెల్లించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో పాడి రైతుల ఖాతాల్లో గురువారం నుంచి సుమారు రూ.60 కోట్ల బిల్లులు జమ చేసేందుకు పాడి సమాఖ్య ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల పాడి రైతులు, పలు సొసైటీల జిల్లా యూనియన్ అధ్యక్షులు కలిసి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. తమ సమస్యలు, రావలసిన బిల్లుల గురించి చర్చించారు. పాడి సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ఎండీ చంద్రశేఖరరెడ్డి సంస్థ స్థితిగతులను సీఎంకు వివరించారు. ఈ నేపథ్యంలో సీఎం సానుకూలంగా స్పందించి.. పాల బకాయిల చెల్లింపునకు ఆదేశించినట్టు సంఘాల నాయకులు తెలిపారు.

త్వరలోనే పాడి పాలసీ

రైతు కమిషన్ ఆధ్వర్యంలో విజయా డెయిరీపై సమీక్షలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: త్వరలోనే నిర్దిష్టమైన పాడి పాలసీని తయారుచేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలని రైతు కమిషన్ నిర్ణయించింది. అంతకంటే ముందు పాడి రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను సేకరించనుంది. బుధవారం రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి అధ్యక్షతన వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయంలో విజయా డెయిరీ సంస్థపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో విజయా డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, రైతు కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, భవానీరెడ్డి, గడుగు గంగాధర్, మాజీ ఎమ్మెల్యే, ముల్కనూరు డెయిరీ సంస్థ చైర్మన్ ప్రవీణ్ రెడ్డి, విజయా డెయిరీ మార్కెటింగ్ జీఎం మధుసూదన్‌రావు, పాడి రైతు నాయకుడు దేవేందర్ రావు పాల్గొన్నారు.

ఇంతచేసినా.. ఓడామెందుకు?

ఎమ్మెల్సీ ఎన్నికలపై డీసీసీల అధ్యక్షులను ఆరా తీసిన మీనాక్షి నటరాజన్



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ.. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారణాలు ఏంటని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ప్రశ్నించారు. ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తూ నిరుద్యోగ యువత కోసం నోటిఫికేషన్లు జారీ చేస్తున్నా ఇంత వ్యతిరేకత ఎందుకొచ్చిందని ఆరా తీశారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే ఇలాంటి పరిస్థితి నెలకొనడానికి కారణాలు ఏంటో తెలుసుకుని, లోపాలను సరిదిద్దుకోవాలని సూచించారు. ఉమ్మడి మెదక్, మహబూబ్‌నగర్, వరంగల్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్ జిల్లాల్లోని 20 మందికి పైగా జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)ల అధ్యక్షులతో బుధవారం ఆమె ముఖాముఖి భేటీ అయ్యారు. ఒక్కో డీసీసీ అధ్యక్షుడితో సుమారు 5 నుంచి 10 నిమిషాల పాటు జిల్లా రాజకీయ అంశాలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమికి కారణాలు, ఇతర అంశాలపై చర్చించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల అధ్యక్షులను ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి, బీజేపీ ఎదుగుదలపై పలు ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. దీనిపై ఉత్తర తెలంగాణ జిల్లాల అధ్యక్షులు స్పందిస్తూ.. 'పార్టీ అభ్యర్థి ఎంపికపై డీసీసీల నుంచి ఎలాంటి సమాచారాన్ని పీసీసీ తీసుకోలేదు. అభ్యర్థి ఎంపిక ఎలా ఉండాలి? ఎవరుండాలి? అన్నదానిలో మా భాగస్వామ్యమే లేదు. బీజేపీ ముందుగానే పార్టీ అభ్యర్థిని ప్రకటించి రంగంలోకి దిగింది. ఎన్నికల ఐదు రోజుల ముందు వరకు పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిని నేరుగా కలిసే అవకాశం మాకు రాలేదు. దీంతో అభ్యర్థికి, స్థానిక నేతలకు మధ్య సమన్వయం కుదరలేదు. పోలింగ్ తేదీ ముందు వరకు ఓటర్ల జాబితా కూడా ఇవ్వలేదు. ఇవన్నీ ఓటమికి కారణమయ్యాయి..'అని చెప్పినట్లు సమాచారం.

ఇకపై అలా ఉండదు.. కష్టపడే వారికి ప్రాధాన్యం ఉంటుంది: మీనాక్షి

ఇకపై అలా ఉండబోదని, బూత్‌స్థాయి నుంచి పార్టీ నిర్మాణం, గ్రామాధ్యక్షుల నుంచి మండల, బ్లాక్, జిల్లా కార్యవర్గ కూర్పు, అభ్యర్థుల ఎంపిక ప్రతిపాదనలన్నీ డీసీసీల ద్వారానే జరిగేలా కార్యాచరణ తీసుకుంటామని మీనాక్షి నటరాజన్ హామీ ఇచ్చినట్లుగా తెలిసింది. కాగా, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌తో పాటు డీసీసీల అధ్యక్షులతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం భేటీ కానున్నారు. తెలంగాణతో పాటు మరో పది రాష్ట్రాల డీసీసీల అధ్యక్షులు కూడా ఈ భేటీలో పాల్గొంటారు. డీసీసీలను బలోపేతం చేయడమే లక్ష్యంగా రోడ్‌మ్యాప్ సిద్ధం చేసేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నారు.

మాదిగ.. లంబాడా.. రెండు బెర్తులు!

మంత్రివర్గంలో స్థానం కోసం ఆ సామాజిక వర్గాల ఎమ్మెల్యేల యత్నాలు

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని రెండు ప్రధాన సామాజిక వర్గాలకు ఇప్పుడు కేబినెట్ బెర్తుల ఫీవర్ పట్టుకుంది. మాదిగ, లంబాడా వర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు వచ్చే నెల మూడో తేదీన జరుగుతుందని భావిస్తున్న మంత్రివర్గం విస్తరణలో స్థానం కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని, ఫలానా ఎమ్మెల్యేలు మంత్రులయ్యే అవకాశాలున్నాయనే వార్తలు రావడం, తమ వర్గాలకు చెందిన పేర్ల ప్రస్తావన లేకపోవడంతో వారు అప్రమత్తమయ్యారు. తామెవరికీ వ్యతిరేకం కాదని, ఎవరికి మంత్రి పదవి ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని, అయితే ఎస్సీ, ఎస్టీల జనాభా ప్రాతిపదికన మాదిగ, లంబాడా వర్గాలకు కచ్చితంగా అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు. ఈ మేరకు ఇప్పటికే పార్టీ అధిష్టానానికి మాదిగ, లంబాడా ఎమ్మెల్యేలు లేఖలు రాయగా, గురువారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత ఢిల్లీ వెళ్లి అధిష్టానం పెద్దలను కలిసేందుకు మాదిగ ఎమ్మెల్యేలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మాదిగ ఎమ్మెల్యేలు ఏమంటున్నారు..?

'రాష్ట్రంలో 32.33 లక్షల మంది మాదిగ కులస్తులున్నారని 2011 జనగణనలో వెల్లడైంది. ఆ తర్వాత మరో 15 లక్షల మంది జత కలిశారు. మేమంతా కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా, అండగా ఉంటున్నాం. అయితే ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఎస్సీలకు రిజర్వు అయిన నాగర్‌కర్నూల్, పెద్దపల్లి, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాల్లో ఒక్కటి కూడా మాదిగ కులస్తులకు ఇవ్వలేదు. ఆయా జిల్లాల్లో మాదిగ జనాభానే ఎక్కువ ఉంటుంది. అందువల్ల త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో మా సామాజిక వర్గానికి అవకాశం ఇస్తే మాకు తగిన గౌరవం, గుర్తింపు ఇచ్చినట్టవుతుంది. మాదిగ సామాజిక వర్గానికి తెలంగాణ కేబినెట్‌లో మరో అవకాశం ఇవ్వండి..'అని రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు రాసిన లేఖలో మాదిగ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు విజ్ఞప్తి చేశారు. ఈ లేఖను బుధవారం అసెంబ్లీ లాబీల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిలకు అందజేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వీరు లేఖ ప్రతిని అందజేశారు.



సీఎంకు లేఖ అందజేస్తున్న ఎమ్మెల్యేలు బాలూనాయక్, రామచంద్రునాయక్, రాందాస్‌నాయక్

మంత్రి పదవితో బంధం మరింత బలోపేతం

మాదిగ ఎమ్మెల్యేల బాటలోనే లంబాడా ఎమ్మెల్యేలు కూడా లేఖాస్త్రం సంధించారు. తమ సామాజిక వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతూ ఎస్. బాలూనాయక్, జె.రామచంద్రునాయక్, ఎం.రాందాస్‌నాయక్, బి.మురళీనాయక్‌లు అటు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, ఇటు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. 'రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ సర్వేలోనే తెలంగాణలో లంబాడాల జనాభా 32.20 లక్షలుగా వెల్లడైంది. రాష్ట్ర వ్యాప్తంగా 72 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 25 శాతానికి పైగా లంబాడా ఓటర్లున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి లంబాడా సామాజిక వర్గం కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర కేబినెట్‌లో లంబాడా సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలి. తద్వారా లంబాడాల ఆకాంక్షను గుర్తించాలి. కేబినెట్‌లో స్థానం కల్పించడం ద్వారా మా వర్గ ప్రాధాన్యతలను అసెంబ్లీలో, ప్రభుత్వంలో వినిపించే అవకాశం ఉంటుంది. లంబాడాలు, కాంగ్రెస్ పార్టీకి మధ్య ఉన్న బంధం మరింత బలోపేతమవుతుంది..'అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు ముఖ్యమంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖను బుధవారం అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో ఆయన్ను కలిసి అందజేశారు.

ఇక ఐదేళ్ల పిల్లల వరకు 'కాక్లియర్' చికిత్సలు

- రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కీలక నిర్ణయం
- ప్రస్తుతం మూడేళ్లలోపు ఉన్న వయసు పరిమితి పెంపు
- మూగ, వినికిడి లోపమున్న నిరుపేద చిన్నారులకు మేలు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: మూగ, వినికిడి లోపమున్న చిన్నారులకు అందించే కాక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్రచికిత్సల విషయంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఖరీదైన ఈ చికిత్స చేయించుకొనే చిన్నారుల వయసు పరిమితిని ప్రస్తుతమున్న మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పెంచింది. ఈ మేరకు ప్రభుత్వం జిల్లాల్లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ మేనేజర్లకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. చిన్నారుల్లో పుట్టుకతో వచ్చే ఈ వైకల్యం గురించి తల్లిదండ్రులకు స్పష్టత వచ్చేసరికే మూడేళ్లు దాటిపోతోంది. దీంతో సుమారు రూ. 8–10 లక్షల వరకు ఖర్చయ్యే ఈ చికిత్సను నిరుపేదలు వారి పిల్లలకు చేయించలేకపోతున్నారు. ప్రత్యామ్నాయంగా ఉండే వినికిడి పరికరాలతో నెట్టుకొస్తున్నారు. తాజాగా వయసు పరిమితిని ఐదేళ్లకు పెంచడంతో నిరుపేద చిన్నారులకు ఈ చికిత్స ఉచితంగా అందే అవకాశాలున్నాయి.

ఆరోగ్యశ్రీలో చేర్చిన వైఎస్సార్..

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించినప్పుడు అందులో కాక్లియర్ ఇంప్లాంటేషన్ చికిత్సను చేర్చలేదు. అయితే దీనిపై ఎందరో తల్లిదండ్రుల నుంచి విజ్ఞప్తులు రావడంతో స్పందించిన ఉమ్మడి ఏపీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి ఈ చికిత్సను ఆరోగ్యశ్రీలో చేర్చారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం కింద అందించే వైద్య సాయాన్ని రూ.10 లక్షలకు పెంచింది. ఈ పథకంలో అందించే ఉచిత వైద్య చికిత్సలు, సేవల సంఖ్యను 1,835కు పెంచింది. అయితే కొన్ని నిబంధనల కారణంగా నిరుపేదలకు ఈ ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్య ట్రస్ట్ కమిటీ దృష్టికి వెళ్లడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

బయటకు కనిపించకుండా..

కాక్లియర్ ఇంప్లాంటేషన్ చికిత్సలో భాగంగా చిన్నారుల చెవికి శస్త్రచికిత్స నిర్వహించి ప్రత్యేక పరికరాన్ని చెవిలో అమరుస్తారు. చెవి వెనుక అమర్చిన సౌండ్ ప్రాసెసర్‌ను ఉపయోగిస్తారు. ఇది ధ్వని సంకేతాలను మెదడుకు పంపుతుంది. ఈ పరికరం జీవితాంతం చెవి లోపలే ఉంటుంది. ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రి, నిమ్స్, ఉస్మానియా, గాంధీ వంటి ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు మరో మూడు ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా ఆరోగ్యశ్రీ పథకం కింద ఈ చికిత్సను అందిస్తున్నారు.

ఉప ఎన్నికలు రావు

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రులు చేసినవాళ్లు అనర్హులు కాలేదు. ఉప ఎన్నికలు రాలేదు. కానీ ఇప్పుడు ఉప ఎన్నికలు వస్తాయని, వచ్చే వారమే ఉప ఎన్నికలని అంటున్నారు. ఎట్లా వస్తాయి? రూల్‌బుక్ వాళ్లే రాశారు. రూల్‌బుక్ కూడా మారలేదు కదా.

ప్రచారం కూడా చేసుకుంటున్నరు..

ఒకాయన (తాటికొండ రాజయ్య) నేనే అభ్యర్థిని అని ఆడ, ఈడ ప్రచారం చేసుకొంటున్నారు. ఆయన అమాయకుడు. తెల్లపంచె కట్టుకొని తిరుగుతున్నడని గతంలో ఉప ముఖ్యమంత్రి పదవినే ఊడబీకిన్రు. ఇప్పుడు ఆయన.. ఉప ఎన్నిక వచ్చింది. వచ్చే వారమే ఎలక్షన్ అని తిరుగుతున్నరు. సభ్యులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఏ ఉప ఎన్నికలు రావు. వారు (హరీశ్‌రావు) ఉప ఎన్నిక కోరుకున్నా కూడా రావు. ఒకవేళ ఆయన ఇటొచ్చినా, అటొచ్చినా కూడా ఏ ఉప ఎన్నికలు రావు.

సభకు కోర్టు నుంచి రక్షణ ఉంటుంది..

పార్టీ ఫిరాయింపుల కేసు సుప్రీంకోర్టులో ఉంది. సభలో నేను మాట్లాడితే కొంత రక్షణ ఉంటుంది. బయట మాట్లాడేవాళ్లకు ఆ ప్రొటెక్షన్ ఉండదు. సభ బయట ఉప ఎన్నికలు వస్తాయని.. వచ్చే వారమే ఉప ఎన్నిక అని అంటున్నారు. అదంతా ఉత్తదే. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అభివృద్ధి మీదనే దృష్టి పెట్టాం. ఎన్నికలు, ఉప ఎన్నికల మీద మాకు దృష్టి లేదు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలి. తప్పు చేసినవాళ్లను శిక్షించాలి. అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయాలనేదే మా ఉద్దేశం..'' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

'కమీషన్ల'పై దద్దరిల్లిన సభ!

▶ మొదటి పేజీ తరువాయి

ధర్నాలు అవుతున్నాయి''అని వ్యాఖ్యానించారు. దీనిపై భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. ''కేటీఆర్‌ను చాలెంజ్ చేస్తున్నా.. మీ ఆరోపణలను రుజువు చేయండి. లేకుంటే సభకు, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పండి''అని సవాల్ చేశారు. గత ప్రభుత్వం పాపం వల్లే రూ.లక్ష కోట్ల పనులు చేసిన వారు బిల్లులు రాక సచివాలయం చుట్టూ తిరుగుతున్నారన్నారు.

ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడాలంటూ..

కేటీఆర్‌ను ఉద్దేశించి భట్టి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ''బాధ్యతతో రాజకీయాల్లోకి వచ్చాం. అడ్డగోలుగా మీలా రాష్ట్రం మీద పడి బరితెగించి దోపిడీ చేయడానికి రాలేదు. నాలాగా అణగారిన వర్గాలు, బాధితులు, పీడితులు, పేద కుటుంబాల కోసం ఏదో చేయాలని ఉన్నతమైన ఆశయంతో వచ్చిన వాళ్లం. మీలా ఏడెనిమిది లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని పాడు చేసిపోయేందుకు రాలేదు. మాట్లాడే ముందు బాధ్యత, నిబద్ధత ఉండాలి. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలి. ఏది పడితే అది మాట్లాడితే చెల్లుతుంది అనుకుంటున్నారా?''అని మండిపడ్డారు. ఇదే సమయంలో కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యులు పెద్ద ఎత్తున నినాదాలు మొదలుపెట్టారు. '30 శాతం కమీషన్..'అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను సభ రికార్డుల నుంచి తొలగిస్తామని ప్యానెల్ స్పీకర్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రకటించారు.

బీఆర్ఎస్ సభ్యుల నిరసనతో..

కేటీఆర్‌ను ఉద్దేశించి 'ఒళ్లు బలిసి'అంటూ భట్టి తప్పుడు మాటలు మాట్లాడారంటూ బీఆర్ఎస్ సభ్యులు నిరసనకు దిగారు. కేటీఆర్ మాట్లాడేందుకు మళ్లీ మైక్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వెల్ దగ్గరికి దూసుకెళ్లారు. మొదట కేటీఆరే రెచ్చగొట్టారని, ఒకట్రెండు అన్‌పార్లమెంటరీ పదాలుంటే తొలగిస్తామని ప్యానెల్ స్పీకర్ నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా నిరసన కొనసాగించారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని మాత్రమే తాను సూచించానని భట్టి వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కమీషన్లపై గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చెప్పిన మాటలనే కేటీఆర్ ప్రస్తావించారని చెప్పారు. బట్టలు విప్పి కొడతామంటూ సభలో సీఎం రేవంత్ అన్నప్పుడు లేని అభ్యంతరం తమ మాటలకు ఎందుకని ప్రశ్నించారు. దీంతో ప్యానల్ స్పీకర్ ఆయన మైక్ కట్ చేసి బీజేపీ సభ్యుడికి మాట్లాడే అవకాశం ఇచ్చారు. దీనికి నిరసనగా 'వద్దురా నాయనా.. ట్వెంటీ పర్సెంట్ పాలన'అంటూ నినాదాలు చేస్తూ సభ నుంచి బయటకు వచ్చారు. కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రవేశ ద్వారం వద్ద కాసేపు బైఠాయించి నినాదాలు చేశారు.

భట్టి దళితుడనే ఆరోపణలు: పొన్నం

దళితుడైన భట్టి విక్రమార్కకు ప్రతిపక్ష నేత పదవి దక్కవద్దనే ఉద్దేశంతోనే గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో విలీనం చేసుకున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇప్పుడు దళితుడు ఆర్థిక మంత్రిగా ఉండటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు.



దాన్ని అర్థరహితం చేయడం ద్వారా
జీవితాన్ని సులభతరం ఎలా చేసుకోవచ్చో మనిషి కనిపెట్టాడు.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 27 మార్చి 2025

ఎన్నాళ్లీ ఆగడాలు!

సందేహం లేదు... న్యాయస్థానాలతో ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఆటలాడుతున్నారు. పరిధులు గుర్తెరిగి విధినిర్వహణ చేయాలని పదిరోజులనాడు చెప్పినా తమ వెనకటి గుణం మానుకోవటానికి ససేమిరా అంటున్నారు. అందుకే ఏపీ హైకోర్టు మంగళవారం మరోసారి చీవాట్లు పెట్టవలసి వచ్చింది. హైకోర్టు ధర్మాసనం ముందు ప్రస్తావనకొచ్చిన ప్రేమ్‌కుమార్ కేసు విచిత్రమైనది. మాదిగ మహాసేన వ్యవస్థాపక అధ్యక్షుడైన ప్రేమ్‌కుమార్ రహదారుల బాగుకు నిధుల కోసం ఊరూరా టోల్‌గేట్లు పెడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటనపై వ్యంగ్యంగా, ప్రతీకాత్మకంగా ఒక చిన్న రూపకాన్ని సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. దానిపై ప్రజల్లో మంచి స్పందన వచ్చింది. తాము కట్టే పన్నుల్లో రోడ్ సెస్ వంటివి ఉండగా ఇలా ప్రత్యేకించి మళ్లీ వసూలు చేయడమేమిటన్న చర్చ మొదలైంది. అందుకే సర్కారువారికి కంటగింపైంది. ఆయన్ను ముప్పుతిప్పలు పెట్టడమే ధ్యేయంగా తప్పుడు కేసు సృష్టించారు. 'మనోభావాలు' దెబ్బతిన్నాయని ఒక వ్యక్తి ద్వారా ఫిర్యాదు చేయించి కర్నూలునుంచి గుంటూరుకు ఆగమేఘాలమీద వచ్చి అర్ధరాత్రి అరెస్టుకు పూనుకున్నారు. ఇంగితం మరిచి ఆయన భార్య, కుమార్తెలపై దౌర్జన్యం కూడా చేశారు. ఇదొక్కటే కాదు... నిరుడు డిసెంబర్‌నుంచి ఇలాంటి కేసులెన్నో ఉన్నత న్యాయస్థానం దృష్టికి వస్తూనేవున్నాయి. ఆ పిటిషన్లపై విచారించిన న్యాయమూర్తులు హెచ్చరిస్తూనే వున్నారు. కానీ పోలీసులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. బహుశా ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఏలినవారే చూసుకుంటారన్న ధైర్యమేమో! హైకోర్టుతో చీవాట్లు తిన్న మరునాడే శ్రీ సత్యసాయి జిల్లా రామగిరిలో పోలీసుల తీరు ఈ సందేహాన్నే కలిగిస్తోంది. ఎంపీపీ ఎన్నికల్లో విప్ జారీ చేయటానికి అధికారులను కలవడానికెళ్లిన వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులపై తెలుగుదేశం నేతలు దౌర్జన్యానికి దిగితే అడ్డుకోవాల్సిన పోలీసులు వైఎస్సార్ కాంగ్రెస్ నేతలపైనే తప్పుడు కేసు బనాయించి నిర్బంధంలోకి తీసుకున్నారు.

నిద్రపోయేవారిని లేపవచ్చు... నిద్ర నటిస్తున్నవారిని తెలివిలోకి తీసుకురావటం సాధ్యమేనా? వీళ్లంతా కొత్తగా విధి నిర్వహణలో చేరినవారు కాదు. 'జీ హుజూర్' అంటే తప్ప జీతంరాళ్లు రాని వారు కాదు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులద్వారా వచ్చే ఆదాయంతో నెలనెలా జీతభత్యాలు పొందుతున్నవారు. అంచెలంచెలుగా పదోన్నతులు పొందినవారు. కానీ పాలకులు మారేసరికి వీరిలో అపరిచితుడు బయటికొచ్చినట్టుంది. తప్పుడు వాగ్దానాలతో, ప్రత్యర్థులపై దుష్ప్రచారంతో, చడీ చప్పుడూ కాకుండా సాగించిన అక్రమాలతో అందలం ఎక్కిన పాలకులు ఎంతకాలం ఊరేగుతారు? వారిని నమ్ముకుని ఇష్టారాజ్యం చేయొచ్చనుకోవటం, తమకేమీ కాదనుకోవటం మంచిదికాదని అధికారులు గ్రహించాలి. ఈ పాలన కొడిగట్టి కొండెక్కాక తమ పరిస్థితేమిటన్న స్పృహ కలగాలి. అసలు దేశానికి రాజ్యాంగం ఉన్నదని, పౌరులకు దానిద్వారా హక్కులు సమకూరాయని, తమతో సహా అన్ని వ్యవస్థలూ వాటికి అనుగుణంగానే ప్రవర్తించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని తెలుసుకోవాలి. ఈ దేశంలో న్యాయస్థానాలు ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో సైతం నిర్భయంగా తీర్పులిచ్చిన ఉదంతాలున్నాయి. ఆ సంగతిని ప్రభుత్వమూ, పోలీసులూ కూడా తెలుసుకోవాలి.

విధినిర్వహణ తీరుతెన్నులెలా వుండాలో తెలిపే మాన్యువల్ గురించి ధర్మాసనం పోలీసులకు గుర్తు చేయక తప్పలేదు. సాధారణ స్థాయి కానిస్టేబుల్ మొదలుకొని డీజీపీ వరకూ విధినిర్వహణ ఎలా వుండాలో, బాధ్యతలేమిటో తెలిపే మాన్యువల్ అది. ఎఫ్ఐఆర్‌ల నమోదు, దర్యాప్తు విధి విధానాలూ, అధికారాల వినియోగంలో పాటించాల్సిన పద్ధతులు, పరిమితులు వగైరాలన్నీ అందులో నిర్దేశించివుంటాయి. పౌరులకుండే హక్కులేమిటో, విధినిర్వహణలో వాటిని పాటించాల్సిన అవసరమేమిటో మాన్యువల్ చెబుతుంది. హైకోర్టు భిన్న సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలు గమనిస్తే ఈ మాన్యువల్‌ను పోలీసులు పట్టించుకోవటం మానేశారని అర్థమవుతుంది. కనీసం గుర్తు చేస్తున్నా దున్నపోతు మీద వానపడిన చందాన ప్రవర్తిస్తున్నారు. వర్రా రవీంద్రరెడ్డి, అవుతు శ్రీధర్‌రెడ్డి, పప్పుల వెంకటరమణారెడ్డి, బొసా రమణ వగైరాల అరెస్టుల విషయంలో పదే పదే చెబుతున్నా నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారు. అందుకే పోలీసుల తీరు చూస్తే మాకు బీపీ పెరిగిపోతున్నదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అవసరాన్నిబట్టి కేసులు కాక, ఏదోవిధంగా కేసులు పెట్టాలి... ఎవరో ఒకర్ని అరెస్టు చేయాలని చూడటం సరికాదని హెచ్చరించింది.

తమ ముందు దాఖలైన పత్రాలను పూర్తిగా పరిశీలించకుండానే మేజిస్ట్రేట్‌లు రిమాండ్ విధిస్తున్నారని కూడా ఈ సందర్భంగా ధర్మాసనం అనటం గమనించదగ్గది. ప్రేమ్‌కుమార్ కేసు సంగతే తీసుకుంటే ఆయన అక్రమార్జనకు పూనుకున్నాడంటూ రూ. 300 స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో తెలిపారు. ఇంత హాస్యాస్పదంగా పెట్టే కేసుల్ని మేజిస్ట్రేట్‌లే తమ స్థాయిలో అడ్డుకోవచ్చు. అది లేకపోవటంవల్ల ఉన్నత న్యాయస్థానంలో కేసుల సంఖ్య పెరుగుతోంది. జిల్లా స్థాయిలో న్యాయవ్యవస్థ సక్రమంగా పనిచేయక పోవటంవల్ల బెయిల్ దరఖాస్తులు తమవద్దకు వెల్లువలా వచ్చిపడుతున్నాయని నిరుడు జూలైలో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆందోళన వ్యక్తం చేశారు. గత సోమవారం కూడా సుప్రీంకోర్టు ధర్మాసనం బెయిల్ దరఖాస్తులపై కిందిస్థాయి కోర్టుల తీరును తప్పుబట్టింది. హైకోర్టు ధర్మాసనం తాజా వ్యాఖ్యల్ని తేలిగ్గా తీసుకుంటే చిక్కులు తప్పవని తెలుసుకోవాలి. నిబంధనలు గుర్తెరిగి మసులుకోవాలి.

సత్తా ఉన్న విధానమే కానీ...

విశ్లేషణ



ప్రొ॥ వి. రామ్‌గోపాల్ రావు

దేశ విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడం జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) 2020 లక్ష్యం. ఈ నూతన విధానం గడచిన అయిదేళ్లలో అనేక విమర్శలు, ప్రతిఘటనలు ఎదుర్కొంది. బీజేపీ పాలిత ప్రాంతాలు అక్కున చేర్చుకుని అమలు చేస్తుండగా, తమిళనాడు వంటి ప్రతిపక్ష రాష్ట్రాలు అడ్డుకుంటున్నాయి. స్వయంప్రతిపత్తి, సాంస్కృతిక అస్తిత్వం ప్రమాదంలో పడతాయని భావిస్తూ ఎన్ఈపీని తిరస్కరిస్తున్నాయి. ఎన్ఈపీ విజన్ పక్కాగా ఉన్నప్పటికీ, అమలులో దక్షత కొరవడింది. నిధులు, మౌలిక వసతులు, సమాఖ్య ఏకాభిప్రాయం వంటి అంశాల్లో పలు సమస్యలు ఎదుర్కొంటోంది.

ఇప్పుడున్న 10+2 విధానం స్థానంలో 5+3+3+4 మోడల్ ప్రవేశపెట్టడం ఎన్ఈపీ 2020 తెచ్చిన కీలక సంస్కరణ. చిన్నారుల ఆరంభ విద్యకు ఇది ప్రాధాన్యం ఇచ్చింది. అలాగే, ఉపాధికి ఉపకరించేలా 6వ తరగతి నుంచే వృత్తివిద్యను ప్రవేశపెట్టడం ముఖ్యమైన మార్పు. కనీసం 5వ తరగతి వరకు మాతృభాషలో బోధన ఉండాలన్నది మరో ముందాలోచన. బహుళ విద్యా విభాగాల ద్వారా ఉన్నత విద్య అభ్యసించే వీలు ఈ నూతన విధానం కల్పిస్తోంది. ఇది చెప్పుకోదగిన మార్పు. ఉన్నత విద్యను అంతర్జాతీయకరించే దిశగా విదేశీ విశ్వవిద్యాలయాలు దేశంలో ప్రవేశించడానికి మార్గం సుగమం చేసింది. డిజిటల్ డివైడ్‌ను అధిగమించే ధ్యేయంతో 'నేషనల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫోరం' (ఎన్ఈటీఎఫ్) ఏర్పాటు వంటి చర్యలు ప్రతిపాదించింది. డిజిటల్ క్లాస్ రూములు, ఆన్‌లైన్ వనరుల వాడకం వంటి ఆధునిక పద్ధతులను కర్ణాటక, మహారాష్ట్ర అమలు చేస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నాయి. దేశీ విద్యలో అంతర్జాతీయ ట్రెండ్ ప్రతిబింబించేందుకు ఇవన్నీ దోహదపడతాయి.

లోటుపాట్లు

– ఎన్ఈపీ విజన్ ఎంతో స్పష్టంగా ఉన్నప్పటికీ అమలులో గట్టి సవాళ్లు ఎదురవుతున్నాయి. 2025 నాటికి సార్వత్రిక అక్షరాస్యత సాధించాలన్నది విధాన లక్ష్యం. విద్యారంగంలో మౌలిక వసతుల కోసం చాలినన్ని నిధులు కేటాయించకుండా, తగినంత మంది ఉపాధ్యాయులు లేకుండా ఇదెలా సాధ్యం?

– మూడు భాషల ఫార్ములా కాగితం మీద బాగానే ఉందనిపిస్తుంది. వాస్తవంలో ఇది ఎంత రాజకీయ రగడ సృష్టిస్తోందో చూస్తూనే ఉన్నాం. అమలు చేస్తున్న రాష్ట్రాల్లోనూ అస్పష్టత నెలకొని ఉంది. రెండు భాషల్లోనే ప్రావీణ్యం సాధించలేని విద్యార్థులు మూడు భాషలు ఎలా అభ్యసిస్తారో వాటికి అర్థం కావడం లేదు. పరభాషలు బోధించే సుశిక్షిత ఉపాధ్యాయుల లభ్యత గురించి ఎన్ఈపీ 2020 ప్రస్తావించలేదు.

– పాఠశాలల డిజిటలీకరణ కూడా ఇలాంటిదే. దీని వల్ల పట్టణ విద్యార్థులు ప్రయోజనం పొందుతారు. అయితే గ్రామాల మాటేమిటి? ఇప్పటికీ 60 శాతం మంది గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన ఇంటర్నెట్ సదుపాయం లేదు. దీన్ని పూడ్చేలా గట్టి పెట్టుబడులు పెట్టకపోతే డిజిటల్ అంతరం మరింత పెరుగుతుంది.

– అలాంటిదే వృత్తి విద్య. దీంతో ఎన్ని లాభాలున్నప్పటికీ ఆచరణలో దుర్వినియోగం అయ్యే ముప్పు ఉంది. ఇంటర్న్‌షిప్స్ మాటున పరిశ్రమలు ఇంటర్న్‌లను దోపిడీ చేసి లేబర్ ఖర్చు తగ్గించుకునే ప్రయత్నం చేస్తాయి. ప్రభుత్వం ఆశించినట్లు అర్థవంతమైన నైపుణ్యాభివృద్ధి జరగకపోవచ్చు.

– బహుశా నిధుల సమస్య ఎన్ఈపీ 2020 లోటుపాట్లలో అగ్రభాగాన నిలుస్తుంది. జీడీపీలో 6 శాతం విద్య మీద పెట్టుబడి పెడతామన్న ప్రభుత్వ వాగ్దానం శుష్కంగానే మిగిలి పోతోంది. ఇప్పటికీ ఇది 4–4.5 శాతం మించడం లేదు. రాష్ట్రాలకు సమగ్ర శిక్ష స్కీము కింద విడుదల చేసే కేటాయింపులను ఎన్ఈపీ అమలుతో ముడిపెట్టారు. కేంద్ర రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో ఉన్న విద్య మీద ప్రాంతీయ స్థాయి నిర్ణయాధికారాన్ని లక్ష్యపెట్టకుండా తీసుకున్న నిర్ణయం ఇది. దీనికి అనుగుణంగా తమిళనాడుకు రూ. 2,150 కోట్లను తొక్కిపట్టడంతో సమాఖ్య ఉద్రిక్తతలు మరింత ముదిరాయి.

ఏకాభిప్రాయమే శరణ్యం

బీజేపీ పాలిత రాష్ట్రాలు వీరావేశంతో ఎన్ఈపీని అమలు చేస్తుండగా, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు తృణీకరిస్తున్నాయి. తాము అమలు చేస్తున్న రెండు భాషల ఫార్ములాకే కట్టుబడి ఉన్నామని తమిళనాడు తెగేసి చెప్పింది. స్కూళ్లలో చేరే పిల్లల స్థూల జాతీయ సగటు (గ్రాస్ ఎన్‌రోల్మెంట్ రేషియో–జీఈఆర్) 27.1 శాతం ఉండగా, తమ రాష్ట్రంలో అది అత్యధికంగా 51.4 శాతంగా నమోదైందనీ, తమ విధానం విజయవంతమైందని చెప్పడానికి ఇది నిదర్శనమనీ అంటోంది.

సీయూఈటీ వంటి కేంద్రీకృత ప్రవేశ పరీక్షలను ప్రవేశపెట్టడం రాష్ట్రాలకు మింగుడుపడని మరో ప్రధానాంశం. రాష్ట్ర బోర్డుల ద్వారా వచ్చే విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది. ఈ జాతీయ ప్రవేశ పరీక్షల్లో సీబీఎస్ఈ స్టూడెంట్స్ అధికంగా స్కోరు చేస్తారు. విద్యలో అసమానతలు పెరుగుతాయి. అందుకే కేరళ ఈ విధానాన్ని వ్యతిరేకించింది.

అయితే ఎన్ఈపీ 2020 ఒక సఫల విధానమని కానీ లేదా ఫెయిల్యూర్ స్టోరీ అని కానీ చెప్పలేం. ఇది ఇంకా నిర్మాణ దశలో ఉన్న ప్రాజెక్టు లాంటిది. నూతన విద్యావిధానం విజయవంతం కావాలంటే, అది వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మార్చుకోగలగాలి. ఏకాభిప్రాయమే శరణ్యమని గుర్తించి అందుకు అవసరమైన చర్చలు జరపాలి. బలవంతంగా రుద్దాలని చూస్తే కుదరదు. భిన్న సంస్కృతుల సమాహారమైన భారత్ వంటి దేశంలో ఈ వైఖరి అసలే పనికి రాదు. రాష్ట్రాలకు వాటి సొంత మోడల్స్ విడిచిపెట్టకుండానే జాతీయ విధానంలోని ప్రధాన అంశాలు అమలు చేసే వెసులుబాటు ఉండాలి. తమిళనాడునే తీసుకుందాం. భాషల ఫార్ములా జోలికి పోకుండా వొకేషనల్ ట్రెయినింగ్, డిజిటల్ లెర్నింగ్ పద్ధతులను అది అమలుచేయొచ్చు.

విద్యావ్యవస్థను మార్చగలిగే సత్తా

అదే సమయంలో, కేంద్రప్రభుత్వం ఎన్ఈపీ అమలుకు అవసరమైన నిధులు, మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం తక్షణ అవసరం. 5+3+3+4 మోడల్‌కు మారుతున్నందున బోధనపరంగా కొత్త మార్పులు అవసరమవుతాయి. పెద్దపెట్టున శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనట్లయితే, నూతన విధానం సిద్ధాంతానికే పరిమితమవుతుంది. చిట్టచివరిగా, సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాలను భాగస్వాములుగా అంగీకరించి వాటితో కలిసి పనిచేయాలి. విరోధ భావన విడనాడాలి. రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతల ప్రమేయంతో జాతీయ స్థాయిలో చర్చ జరగాలి.

ఎన్ఈపీ 2020 సరైన దిశలో రూపొందించిన ఒక ఆశావహమైన విధానం. అయితే, విద్యాసంస్కరణలను హడావిడిగా బలవంతంగా తీసుకురాలేమన్నది ఈ అయిదేళ్లలో మనం నేర్చుకున్న పెద్ద పాఠం. వీటి అమలుకు ఎంతో సహనం, పరస్పర సహకారం అవసరం. ఎన్ఈపీ 2020కి దేశ విద్యావ్యవస్థను మార్చే సత్తా ఉంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. ఎటొచ్చీ రాజకీయాలకు అతీతంగా కార్యదక్షతతో సమస్యలు పరిష్కరించుకోవాలి. అందాకా ఇది భారత విద్యాసంస్కరణల చరిత్రలో ఒక అసంపూర్ణ అధ్యాయంగా మిగిలిపోతుంది.

వ్యాసకర్త బిట్స్ పిలానీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ చాన్స్‌లర్, ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్



◆ ఇప్పుడున్న 10+2 విధానం స్థానంలో 5+3+3+4 మోడల్ ప్రవేశపెట్టడం ఎన్ఈపీ 2020 తెచ్చిన కీలక సంస్కరణ. ఉపాధికి ఉపకరించేలా 6వ తరగతి నుంచే వృత్తివిద్యను ప్రవేశపెట్టడం మరో ముఖ్యమైన మార్పు.

◆ సీయూఈటీ వంటి కేంద్రీకృత ప్రవేశ పరీక్షలను ప్రవేశపెట్టడం రాష్ట్రాలకు మింగుడుపడని అంశం. దీంతో రాష్ట్ర బోర్డుల విద్యార్థులకు అన్యాయం జరుగుతుంది.

◆ నిధుల సమస్య ఎన్ఈపీ 2020 లోటుపాట్లలో అగ్రభాగాన నిలుస్తుంది. జీడీపీలో 6 శాతం విద్య మీద పెట్టుబడి పెడతామన్న ప్రభుత్వ వాగ్దానం శుష్కంగానే మిగిలి పోతోంది. ఇప్పటికీ ఇది 4–4.5 శాతం మించడం లేదు.

సోషల్ మీడియా

అవినీతికి పరిష్కారం



న్యాయ నియామకాల్లో మొత్తం నియంత్రణ కోసం జస్టిస్ యశ్వంత్ వర్మ ఉదంతాన్ని ప్రభుత్వం వాడుకుంటోంది. అది దారుణం. న్యాయవ్యవస్థలో అవినీతికి పరిష్కారం 'జ్యుడీషియల్ కంప్లెయింట్ కమిషన్'. జడ్జీల మీది ఫిర్యాదులను పరిష్కరించడానికి ఇది ప్రభుత్వం, న్యాయయంత్రాంగం నుంచి స్వతంత్రంగా ఉండాలి.

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

పెద్ద మార్పు



ఇవ్వాళ గాజాలో జరుగుతున్నది ముఖ్యమైనది. వేలాది మంది జనాలు వీధుల్లోకి వచ్చి, పెద్ద రిస్క్ తీసుకుంటూ హమాస్... తీవ్రవాదులు అని గొంతెత్తుతున్నారు. ఇజ్రాయెలీ బందీల్లాగా వీళ్లు కూడా హమాస్ బాధితులు. గాజాలో శాంతి నెలకొనాలంటే ఈ తీవ్రవాదులతో అంతర్జాతీయ సమాజం పోరాడాలి.

– దరియా సఫాయీ, బెల్జియం ఎంపీ

చిన్న సంస్కరణ



మెడికల్/హాస్పిటల్ బిల్లుల విషయంలో ఒక ప్రమాణ విధానం అవసరం. ఈ సాధారణ సంస్కరణ తేగలిగితే వైద్యవ్యవస్థ రోగులనుంచి వసూలు చేసే బిల్లుల్లో పారదర్శకత వస్తుంది.

– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

గొప్పగా లేదు!



చైనా దగ్గర తగినంత డబ్బు లేదు. ఆర్థిక వ్యవస్థ మందగిస్తోందని చెప్పడానికి ఇది మరో సంకేతం. కమ్యూనిస్టు ప్రభుత్వం ఆందోళనలో ఉంది. ఆ నాయకులు ఇప్పుడు ఏమైనా చేయగలరు!

– గోర్డాన్ జి. చాంగ్, పొలిటికల్ కామెంటేటర్

నీళ్లు నయం



కొబ్బరినీళ్ల గురించి మరీ ఎక్కువచేసి చెప్తారు. దానికి అంత డబ్బులు పెట్టి కొని తాగడం అనవసరం. మీకు తోటో, ఇంట్లో చెట్టో ఉంటే తాగండి. లేదంటే మంచినీళ్లు తాగండి.

– దీపక్ కృష్ణమూర్తి, కార్డియాలజిస్ట్

ఇన్ బాక్స్

విద్యార్థి సంఘాల వైఫల్యమే...

తెలుగు నేలపై 70వ దశకంలో వచ్చిన విద్యార్థి సంఘం వెలుగులో ఎన్నో విద్యార్థి సంఘాలు పురుడుపోసుకున్నాయి. కానీ, ఆ విద్యార్థి సంఘం అందించిన చైతన్యాన్ని అందుకోవడంలో నేటి ప్రగతిశీల, వామపక్ష విద్యార్థి సంఘాలుగా చలామణి అవుతున్న ఏ విద్యార్థి సంఘమూ సఫలీకృతం అవ్వలేదని చెప్పడం... బాధవేస్తున్నా అంగీకరించాల్సిన వాస్తవం.

తెలంగాణ ఉద్యమాన్ని వేలు పట్టుకొని, లక్ష్యం వైపు నడిపించిన చరిత్ర ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) విద్యార్థులకు ఉంది. తెలంగాణలో చైతన్యవంతమైన గడ్డ అని చెప్పుకొనే ఉస్మానియాలో విద్యార్థి వ్యతిరేక సర్క్యులర్ ఎందుకొచ్చింది? అన్ని వైపులా విమర్శలు వస్తాయని తెలిసి కూడా, క్యాంపస్‌లో నిరసన ప్రదర్శనలు జరిపే రాజ్యాంగబద్ధమైన హక్కును కాల రాసేలా సర్క్యులర్ జారీ చేశారంటే... ఏ ధైర్యంతో విడుదల చేసి ఉంటారు? పది రోజులుగా నిరసనలు, ధర్నాలు, బంద్ చేస్తున్నా ఇంకా ఎందుకు వెనక్కి తీసుకోవడం లేదు? ప్రస్తుత పోరాటం సరిపోవడం లేదా?

ఓయూలో విద్యార్థి సంఘాలు నాటి చైతన్యం, పోరాట తత్వాన్ని ఎత్తిపట్టడంలో ఫెయిల్ అయ్యాయని చెప్పక తప్పదు. నిరసనల రూపం మారింది. ధర్నాలు ట్రాక్ తప్పాయి. నిరసన తెలపడం ఎప్పటికీ తప్పుకాదు. కాని మేధోపరమైన ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించేలా ప్రజాస్వామ్యయుతంగా ప్రదర్శన ఉండాలి. కానీ అసహ్యకరంగా కాదుకదా? ఇటీవల అసెంబ్లీలో కేసీఆర్‌ను రేవంత్ దూషించారని సీఎం చిత్రపటం ఉంచి రేబిస్ ఇంజక్షన్ ఇస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఇదేం నిరసన ప్రదర్శన? అల్లరిమూకలు, వర్సిటీ విద్యార్థులు తెలిపే నిరసన ప్రదర్శనకు కాసింత అయినా తేడా ఉండొద్దా? వ్యక్తిగత ఇమేజీల కోసం, ప్రాపకం కోసం వర్సిటీ విద్యార్థుల తండ్లాట ఎందుకు? రాజకీయ నాయకులకు గులాంలుగా మారడం ఎందుకు? శత వసంతాల వర్సిటీ ఎన్నో ఉద్యమాలకు ప్రేరణ. అట్లాంటి పోరు గడ్డపై ఇట్లాంటి ఘటనలు విషాదకరం.

పాలకుల ఎత్తులను, కుట్రలను అంచనా వేస్తూ ప్రజల తరఫున మాట్లాడాల్సిన ఉస్మానియా ఇప్పుడు లీడర్లకు బాకా ఊదే స్థితికి చేరుకోవడం బాధాకరం.

– ప్రశాంత్ పగిళ్ళ, ఓయూ సోషియాలజీ విద్యార్థి

ఏం జరుగనున్నది సామీ?

అభిప్రాయం




మాడభూషి శ్రీధర్

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ అధికారిక నివాస ప్రాంగణంలోని ఔట్ హౌస్‌లో డబ్బుల బస్తాలు కాలిన విషయంపై అన్ని వర్గాలవారూ అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో సుప్రీం కోర్టును ఆశ్రయించిన మాథ్యూస్ జె నెడుంపరాతో పాటు మిగతా వారూ బుధవారం (మార్చి 26) సుప్రీం కోర్టులో ఈ విషయమై ఫిర్యాదును నమోదు చేసి, దర్యాప్తును చేపట్టమని ఢిల్లీ పోలీసులను వెంటనే ఆదేశించాలని వాదించారు. అయితే అందుకు సుప్రీం కోర్టు తిరస్కరించింది.

మార్చి14 నాడు న్యాయమూర్తి వర్మ నివాస ప్రాంగణంలో జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిన నోట్ల వ్యవహారం బయటపడినా ఇంతవరకు ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవడం, ఈ సంఘటనపై పోలీసు అధికారులు, అగ్నిమాపక శాఖ అధికారులు మాట్లాడిన మాటల మధ్య పొంతనలేకపోవడం వంటి కారణాలతో న్యాయవ్యవస్థపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం మార్చి 24 సోమవారం జస్టిస్ యశ్వంత్ వర్మను ఢిల్లీ హైకోర్టు నుండి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అలాగే కొలీజియం ముగ్గురు సభ్యుల కమిటీని కూడా ఈ వ్యవహారంపై అంతర్గత దర్యాప్తు చేయడానికి నియమించింది. అయితే ఈ కమిటీకి దర్యాప్తు చేయడానికి ఎటువంటి అధికారమూ లేదని నెడుంపారా వాదించారు. భారీగా నగదు నోట్లు కాలిపోయాయి కాబట్టి ఇది భారతీయ న్యాయ సంహిత ప్రకారం కాగ్నిజెన్స్ నేరం కిందకు వస్తుందనేది ఆయన వాదన. నిజానికి ఇది ప్రతి ఒక్కరి వాదన కూడా. కొలీజియం ఆ కమిటీకి విచారణ అధికారాన్ని ఇవ్వడం చెల్లదన్న వాదనా సరైనదే. పార్లమెంట్ లేదా రాజ్యాంగం స్వయంగా ఆ అధికారం కల్పించకపోతే, కొలీజియం తనంతట తానే విచారణ చేయించుకునే అధికారం కల్పించుకోలేదు. జస్టిస్ వర్మ తన నివాస ప్రాంగణంలో కాలిపోయిన డబ్బు తనది కాదనీ, దీనివెనుక ఏదో కుట్ర ఉందనీ అంటున్న మాటలనూ అనుమానించవలసి వస్తోంది. ఆ డబ్బు తనది కాకపోతే ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి, తనపై తప్పుగా కుట్ర పన్నేందుకు యత్నించిన వారిపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలని ఎందుకు కోరలేదన్న నెడుంపరాతో అందరూ ఏకీభవిస్తున్నారు.

జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసప్రాంగణంలో చోటు చేసుకున్న అగ్నిప్రమాద వీడియోలను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పెట్టారు. దేశ అత్యున్నత కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఏదీ దాచకుండా దొరికిన అన్ని దృశ్యాలకు సంబంధించిన వీడియోలను అందరికీ కనబడే పని చేశారు. ఇదే న్యాయ సమాచార హక్కు.



యశ్వంత్ వర్మ



అగ్ని ప్రమాదం నాటి దృశ్యం

అనుమానాలివీ!

మూటలలో డబ్బునోట్ల కట్టలు 'దొరికాయి'. కష్టపడి సంపాదించిన సొమ్ము పోగొట్టుకుంటారా?' అని ఢిల్లీ పోలీసు కమిషనర్ అన్న మాటలను అర్థం చేసుకోవాలి. ఢిల్లీ అగ్నిమాపక శాఖ ముఖ్య అధికారి అతుల్ గార్గ్ కాలిన నోట్లేమీ లేవని ముందు అన్నారు. ఆ తర్వాత తాను అలా అనలేదని మాట మార్చారు. మొత్తానికి అగ్నిమాపక శాఖ ఇచ్చిన రిపోర్టు 'హిందీ' భాషలో ఉంది. ఆ గదిలో మంటలు రేగినట్లు, మంటలు ఆపడానికి ప్రయత్నం చేసినప్పుడు అందులో సగం కాలిన నోట్లు ఉన్నాయని అందులో ఉంది. పోలీసులు ప్రమాదం స్థలానికి చేరిన సమయంలో ఆ కాలిన నోట్లు కనపడ్డాయి. అప్పుడు దొరికిన నోట్లను అక్కడే ఎందుకు ఉంచలేదు? జడ్జిగారి అధికారిక ఇంట్లోనే లెక్క చూపని డబ్బు దొరికినపుడు అది కాగ్నిజబుల్ నేరం అవుతుంది కదా. పోలీసులు నేరస్థలంలో ఉన్న పరిస్థితిని ఆదే విధంగా ఉంచాలి, దాన్ని మార్చడానికి వీల్లేదు. అగ్నిప్రమాదం జరిగిన స్థలంలో స్టోర్ రూంను లాక్ చేసి ఉంచాలని డాక్యుమెంట్ చెబుతున్నది. లాక్ చేసి ఉంచాం అని సీఆర్‌పీఎఫ్ గార్డ్ రూం రిపోర్ట్ అంటున్నది. మరి తాళం వేసి ఉంటే జస్టిస్ వర్మ అంటున్నట్లు పనివాళ్లు ఆ రూమ్‌ను ఎప్పుడు పడితే అప్పుడు ఎలా వాడుకోగలుగుతారు? నియమాల ప్రకారం, ఏదైనా అక్రమ సొమ్ము స్వాధీనం చేసుకున్నట్లయితే, దాన్ని పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసి, తర్వాత కోర్టుకు సమర్పించాలి. అదే విధంగా నేర సంఘటన జరిగినట్లయితే, పంచనామా కూడా తయారు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను పాటించారా లేదా అనేది తెలియడం లేదు.

సీజేఐ చర్యలు అద్భుతంగా ఉన్నాయని ఉప రాష్ట్రపతి మెచ్చుకుంటున్నారని అంటున్నారు. అదే సందర్భంలో మన దేశం 2010లో ప్రవేశపెట్టిన 'న్యాయ ప్రమాణాలు–జవాబుదారీ బిల్లు' (జుడీషియల్ స్టాండర్డ్స్ అండ్ అకౌంటబిలిటీ బిల్–2010)ను మళ్లీ చట్టంగా తీసుకురావడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని అంటున్నారు. సుప్రీం కోర్టును కూడా ఇదేవిధంగా ఆదేశించమని కూడా కోరారు. ఇది న్యాయవ్యవస్థలో అవినీతిని తగ్గించడానికి కీలకంగా ఉపయోగపడుతుందని న్యాయవాది నెడుంపరా వివరించారు. ఇదైనా విని న్యాయం చెబుతారని నమ్మకతప్పదు. ఏం జరగబోతున్నది? ఈ దెబ్బతో 2010 బిల్లు తెచ్చి న్యాయ వ్యవస్థను సైతం కేంద్రం చేతిలోకి తీసుకునే కుట్ర ఏదో నడుస్తున్నదని అనుమానాలు వస్తున్నాయి. ఏం జరుగనున్నది సామీ?

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా' ప్రొఫెసర్

నిజమైన జబ్బు

ఇంద్రియాలకు ప్రియమైన విషయాలు కొన్ని ఉంటాయి. వాటిపై కోరికలను పెంచుకోవడం వల్ల మనుషులు కష్టాల పాలవుతారు. ఒక వ్యక్తి బాగా చదువుకొన్నప్పటికీ లేక ఆరోగ్యవంతుడైనప్పటికీ లేక ఐశ్వర్యమును కలిగియున్నప్పటికీ... ఇంద్రియలోలుడై ఉన్నట్లయితే అతని మనస్సు ఎల్లప్పుడూ చంచలంగా, అసంతృప్తితో ఉంటుంది. ఇదే నిజమైన జబ్బు. శారీరక రుగ్మతల కంటే మానసిక రుగ్మతయే సుఖ, శాంతులకు ఎక్కువ విఘాతం కలిగిస్తుంది.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

మానవుడు ఎప్పుడూ మానసిక రుగ్మత నుండి విముక్తి పొందడానికి గట్టిగా ప్రయత్నించాలి. విచక్షణ శక్తిని ఉపయోగించి, ఇంద్రియాల తొందరపాటుతనాన్ని తగ్గించుకొన్నప్పుడే మనిషికి ఆనందం లభిస్తుంది. ఈ వాస్తవాన్ని ఎరిగి తగినట్లుగా మసలుకొని ఆనందాన్ని పొందడమే సరియైన మార్గం. నిజమైన ఆనందం ఆత్మనుండి మాత్రమే లభిస్తుంది కాని వేరే ఎక్కడా లభించదు. ఈ వాస్తవాన్ని తెలుసుకొని, ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలి.

సముద్రం ఉపరితలంపై లెక్కలేనన్ని అలలు ఏ విధంగా వస్తాయో, అట్లాగే మనస్సులో 'అహం', దాని తాలూకు భావనలు అసంఖ్యాకంగా కలుగుతూంటాయి. ఇటువంటి వాని పట్ల సాధకుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ధనవంతునికి తన ఐశ్వర్యంలో, రాజకీయ నాయకునికి అధికారంలో, పండితునికి పాండిత్యమందు, కళాకారునికి తాను పొందిన పేరు ప్రఖ్యాతులందు, అధికారికి తాను ఆక్రమించిన స్థానంలో, భక్తునికి భక్తియందు, సాధకునికి సాధనయందు... ఇలా అందరిలోనూ 'అహం' గోచరిస్తూనే ఉంటుంది. ఏమి విపరీతం!

జ్ఞానికి 'అహం' అనేది వట్టి భ్రమ మాత్రమే. ఇది తనకంటూ ఉనికి లేనటువంటి నీడవంటిది. కాని అదే 'అహంకారం' ఒక సామాన్య మానవునికి అడ్డుకట్టలాంటిది. దీనివలన సామాన్యుడు భగవత్ సాక్షాత్కారం పొందలేకపోతున్నాడు. కావున 'అహం' యెడల అప్రమత్తంగా ఉండాలి. ఎల్లప్పుడు మెలకువతో ఉండి, అది దానియొక్క ముఖమును చూపించకుండా జాగరూకతతో ఉండాలి.

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యేవ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బ.త్రయోదశి రా.9.08 వరకు, తదుపరి చతుర్దశి, నక్షత్రం: శతభిషం రా.11.00 వరకు, తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం: ఉ.6.51 నుండి 8.23 వరకు, తదుపరి తె.5.55 నుండి 6.33 వరకు (తెల్లవారితే శుక్రవారం), దుర్ముహూర్తం: ఉ.10.06 నుండి 10.54 వరకు, తదుపరి ప.2.58 నుండి 3.46 వరకు, అమృతఘడియలు: ప.3.56 నుండి 5.31 వరకు; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 6.15, సూర్యాస్తమయం: 6.05.

సూర్యాపేట డీఎస్పీపై బదిలీ వేటు

సూర్యాపేట టౌన్: సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో ఈ నెల 17న కాంగ్రెస్ సీనియర్ నేత మెంచు చక్రయ్యగౌడ్ హత్య కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో సూర్యాపేట డీఎస్పీ రవిపై బదిలీ వేటు పడింది. రవిని హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యాపేట ఇన్‌చార్జి డీఎస్పీగా కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

నాకు ప్రాణహాని ఉంది..

- అఘోరితో కలిసి పోలీసులను ఆశ్రయించిన యువతి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న శ్రీవర్షిణి

నెన్నెల: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరు వ్యక్తులతో తనకు ప్రాణహాని ఉందని గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన శ్రీవర్షిణి తెలిపింది. మంచిర్యాల జిల్లాకు చెందిన అఘోరితో కలిసి ఆమె మంగళవారం రాత్రి నెన్నెల పోలీసులను ఆశ్రయించింది. అనంతరం యువతి అఘోరి స్వగ్రామమైన నెన్నెల మండలంలోని కుశ్నపల్లి గ్రామానికి వెళ్లింది. బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్న తమ కూతురు శ్రీవర్షిణికి అఘోరి మాయమాటలు చెప్పి వెంట తిప్పుకుంటోందని, తమ కూతురిని తమకు అప్పగించాలని మంగళగిరిలో యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కాగా, తాను మేజర్‌నని తన ఇష్ట ప్రకారమే అఘోరి వెంట వచ్చానని, ఎవరూ బలవంతం చేయలేదని యువతి పోలీసులకు తెలిపింది. తాను కూడా అఘోరి దీక్ష తీసుకున్నానని శ్రీవర్షిణిలో చెప్పినట్లు ఎస్సై ప్రసాద్ పేర్కొన్నారు.

అన్న తిట్టాడని చెల్లి ఆత్మహత్య



హాసిని

మామునూరు: అన్న తిట్టాడని మనస్తాపం చెందిన చెల్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బుధవారం రాత్రి మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలంగాణ కాలనీలో చోటు చేసుకుంది. వరంగల్ 43వ డివిజన్ తెలంగాణ కాలనీకి చెందిన మార్గం నవీన్, పవిత్ర దంపతులిద్దరూ ప్రభుత్వ టీచర్లుగా పనిచేస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పదో తరగతి, కుమార్తె హాసిని (14) 9వ తరగతి చదువుతున్నారు. బుధవారం రాత్రి సరదాగా అన్న.. చెల్లి హాసినిని తిట్టడంతో సీరియస్‌గా తీసుకుంది. తన బెడ్రూంలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుంది. సోదరుడు నిద్రించేందుకు తన బెడ్రూంకు వెళ్తూ చెల్లి బెడ్రూం గడియపెట్టి ఉండటాన్ని గమనించి కిటికీలో నుంచి తొంగి చూశాడు. ఫ్యాన్‌కు హాసిని వేలాడుతూ కనిపించింది. విషయం తల్లిదండ్రులకు చెప్పగా.. వారు డోర్ తీసి చూడగా అప్పటికే హాసిని చనిపోయింది. విషయం తెలియడంతో ఎస్సై శ్రీకాంత్ విచారణ చేపట్టారు.

భద్రాద్రిలో కుప్పకూలిన భవనం

- నిర్మాణంలోని బహుళ అంతస్తుల భవనం శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు కూలీలు
- రంగంలోకి దిగిన జిల్లా యంత్రాంగం, ఎన్డీఆర్ఎఫ్ సహా రెస్క్యూ టీమ్‌లు
- ఒకరి గుర్తింపు..క్షేమంగా బయటకు తెచ్చేందుకు సహాయక చర్యలు ముమ్మరం
- అర్ధరాత్రి వరకు లభ్యం కాని మరో కూలీ ఆచూకీ
- పోలీసుల అదుపులో భవనం యజమాని!



నిర్మాణంలో ఉన్న భవనం (ఫైల్)



కూలీలను రక్షించేందుకు శిథిలాలను తొలగిస్తున్న సహాయక సిబ్బంది

భద్రాచలం/భద్రాచలం అర్బన్: భద్రాచలం పట్టణంలో బుధవారం మధ్యాహ్నం నిర్మాణంలో ఉన్న జీ + 5 భవనం కుప్పకూలింది. దీంతో నిర్మాణ పనుల్లో ఉన్న ఇద్దరు కూలీలు శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారం అందగానే రంగంలోకి దిగిన జిల్లా యంత్రాంగం ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టింది. ఫైర్, సింగరేణి రెస్క్యూ టీమ్‌లు వెంటనే రంగంలోకి దిగాయి. మధ్యాహ్నం 2.45 సమయంలో ప్రమాదం చోటు చేసుకోగా రాత్రి 6–57 గంటల సమయంలో కామేశ్వరరావు అనే కూలీని రెస్క్యూ బృందాలు కనిపెట్టాయి. అతన్ని బయటకు తీసుకొచ్చేందుకు రెస్క్యూ టీమ్‌లు శ్రమిస్తున్నాయి. శిథిలాల కింద ఉపేందర్ అనే మ రో కూలీ కూడా ఉన్నట్టు అనుమానిస్తున్నారు. బుధవారం మొత్తం ఆరుగురు పనిలో ఉండగా.. ఘటన సమయంలో నలుగురు మధ్యాహ్న భోజనానికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇద్దరు కూలీల కుటుంబసభ్యులు ఘటనాస్థలి దగ్గర కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పాత భవనంపై జీ ప్లస్ 5 నిర్మాణం

శ్రీపతి అనే వ్యక్తి పట్టణంలోని నెహ్రూ ప్రెస్ గల్లీలో సుమారు 400 గజాల స్థలంలో ఉన్న ఓ పాత ఇంటిని కొన్నేళ్ల క్రితం కొనుగోలు చేశాడు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఓ మూలన ఖాళీ స్థలంలో కనకదుర్గ ఆలయాన్ని నిర్మించాడు. ఆ తర్వాత రెండు పోర్షన్లుగా ఉన్న పాత కాంక్రీట్ భవనంపై జీ ప్లస్ 5 కింద అన్ని అంతస్తులకు శ్లాబ్‌లు వేశాడు. ప్రతి అంతస్తులో గదు లు నిర్మించేందుకు వీలుగా శ్లాబ్‌లపై ఇటుక, ఇసుక కుప్పలు కుప్పలుగా పోశారు. ఈ క్రమంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న పాత ఇంటి గోడలను కూలకొట్టారు. బలమైన పునాదులు, పిల్లర్లు లేని ఆ భవనం కింద ఉన్న గోడలను కూల్చేయడంతో అది కాస్తా బలహీనపడింది. గత నాలుగు రోజులుగా ప లుచోట్ల పిల్లర్లు, బీమ్‌లకు పగుళ్లు వచ్చాయి. దీంతో య జమాని మరమ్మతు పనులు చేయిస్తున్నాడు. బుధవారం కూ లీలు చిప్పింగ్ పనిలో ఉండగా ఒక్కసారిగా కుప్పకూలింది.

శ్రమిస్తున్న రెస్క్యూ టీమ్‌లు

భవనం స్లాబ్‌లు ఒక్కచోటనే కుప్పగా కూలాయి. దీంతో సహాయ బృందాలు పొక్లెయినర్ సాయంతో శిథిలాల పైనుంచి ఒక్కో ఫ్లోర్‌కు రంధ్రం చేస్తూ ఫస్ట్ ఫ్లోర్ వరకు చేరుకున్నారు. అక్కడ చీకట్లో ఒక సెల్‌ఫోన్ మోగుతుండటంతో లోపల ఎవరైనా ఉన్నారా? అంటూ రెస్క్యూ టీమ్‌లు పదేపదే కేకలు వేశాయి. దీంతో శిథిలాల కింద చిక్కుకున్న కామేశ్వరరావు బదులిచ్చాడు. దీంతో ఆ ప్రదేశానికి విక్టిమ్ లొకేషన్ కెమెరా పంపించి పరిశీలించారు. వెలుతురుతో పాటు కెమెరా చూసిన అతను కుడి చేయి ఊపుతూ స్పందించాడు. ఎడమ చేయి, కాలు భాగం శిథిలాల కింద ఇరుక్కున్నట్లు రెస్క్యూ టీమ్ గుర్తించింది. దీంతో అతనికి ఆక్సిజన్ సరఫరా ఏర్పాట్లు చేశారు. మరో కూలీ ఆచూకీ అర్ధరాత్రి వరకు లభ్యం కాలేదు. విజయవాడ నుంచి వచ్చిన 30 మంది ఎన్డీఆర్ఎఫ్ బృందంతో కలిసి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కాంక్రీట్ శిథిలాలను తొలగించేందుకు చాలా సమయం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. సహాయక చర్యలను కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ పర్యవేక్షిస్తున్నారు. స్లాబ్‌లు పక్కకు కూలితే చుట్టుపక్కల ఇళ్లల్లోని వారికి ప్రమాదం జరిగేది. కాగా భవన యజమానిని రాత్రి 9 గంటల సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

అధికారులు కూల్చివేసేందుకు యత్నించినా..

1/70 చట్టం అమల్లో ఉన్న షెడ్యూల్ ఏరియాలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలకు అనుమతి లేదంటూ గిరిజన సంఘాల వారు 2024 జూలైలోనే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ కట్టడాన్ని కూల్చేయాలంటూ గ్రామపంచాయతీ ఈఓ ఆదేశాలు ఇచ్చారు. భవనాన్ని కూల్చేసేందుకు పంచాయతీ అధికారులు ప్రయత్నించగా, ప్రస్తుత కేబినెట్‌లో కీలక శాఖ మంత్రిని..శ్రీపతి దంపతులు ఆశ్రయించి కూల్చివేత పనులు ముందుకు సాగకుండా చక్రం తిప్పారనే ఆరోపణలు ఉన్నాయి.

పండక్కి పిల్లలు వస్తారని..

'ఇద్దరం భవన నిర్మాణ పనులకు వెళ్తూ పిల్లలను హైదరాబాద్‌లో బీటెక్ చదివిస్తున్నాం. రోజువారి కూలీ కంటే రూ.500 ఎక్కువ ఇస్తానంటే మా ఆయన శనివారం నుంచి ఇక్కడ పనికి వస్తున్నాడు. నన్ను కూడా రమ్మన్నా ఒంట్లో బాగాలేక రాలేదు. మధ్యాహ్నం భోజనానికి వచ్చినప్పుడు 'పండక్కి పిల్లలు వస్తారు కదా.. ఖర్చులు ఉంటాయి. రేపు నువ్వు కూడా పనికి రా అని చెప్పి వెళ్లాడు..' అంటూ ఉపేందర్ భార్య రమాదేవి విలపిస్తోంది.

ఎల్ఆర్ఎస్ @ రూ. 27.33 కోట్ల ఫీజు

- జడ్చర్లలో 200 చ.గ. ప్లాటుకు ఆన్‌లైన్‌లో చూపించిన వైనం

జడ్చర్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఎల్ఆర్ఎస్‌ను వినియోగించుకోవాలని అధికారులు నెల రోజులుగా జోరుగా ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ఓ వినియోగదారురాలు తన ప్లాటుకు సంబంధించి ఎల్ఆర్ఎస్ ఫీజు కట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు సంబంధించి ఆన్‌లైన్‌లో తన ప్లాటుకు సంబందించి ఫీజును పరిశీలించగా ఏకంగా రూ.27,33,42,785 చూపించడంతో ఒక్కసారిగా కంగుతిన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మున్సిపాలిటీ కిష్టారెడ్డి నగర్‌లోని సర్వే నంబర్ 108లో కె.ఝాన్సీ తన వ్యక్తిగత ప్లాటు 200 చదరపు గజాలకు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్‌కు రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా ఎల్ఆర్ఎస్ ఫీజును కట్టేందుకు ఆన్‌లైన్‌లో తన దరఖాస్తును పరిశీలించగా.. రూ.27,33,42,785 కోట్లు చూపించింది. రెగ్యులరైజేషన్ చార్జీ రూ. 2,02,225.8గా.. 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీగా రూ.27,31,40,560 చూపించా రు. రూ.6,83,35,696.45 రాయితీ పోగా.. రూ.20,50,06,090 కట్టాల్సింది గా చూపించారు. దీనికి తోడు తన ప్లాటు 200 చదరపు గజాలు మాత్రమే ఉండగా 334.45 చ.గ.లుగా చూపించారని ఆమె పేర్కొన్నారు. దీనిపై జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డిని అడగ్గా టెక్నికల్ సమస్య వల్ల అలా జరిగి ఉండొచ్చని, స్థలం యజమానులు కార్యాలయానికి వస్తే.. పరిశీలించి సరి చేస్తామని తెలిపారు.

కులాల పేర్ల మార్పుపై ఏప్రిల్‌లో నివేదిక

- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందిస్తున్న దొమ్మరి కులస్తులు

సిరిసిల్ల: రాష్ట్రంలోని కొన్ని కులాల పేర్లను మార్పు చేసేలా ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. బుధవారం బీసీ కమిషన్ చైర్మన్, కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మి బృందం రాజన్నసిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడలో పర్యటించారు. చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ ఫలాలు బీసీల్లోని అన్ని కులాలకు అందించడమే తమ లక్ష్యమన్నారు. బీసీ కులాల్లోని బుడబుక్కల, దొమ్మరి, పిచ్చకుంట్ల, తమ్మలి కులాల వారు కులం పేరు కారణంగా ఆత్మన్యూనత భావానికి గురికావద్దని, కులం పేరు మార్పిడి కోసం ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికీ బీసీ రిజర్వేషన్లు పొందని కులాలకు ప్రభుత్వ ఫలాలు దక్కేలా చూస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కోరారు. కాగా, తమ సమస్యలు పరిష్కరించాలని పలు కులాల ప్రతినిధులు బీసీ కమిషన్ చైర్మన్‌కు విన్నవించారు. రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకోవడంలో ఇబ్బందులు పరిష్కరించేందుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని కోరారు. అంతకుముందు కమిషన్ సభ్యులు వేములవాడలో శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

చెట్ల నరికివేత హత్యకన్నా ఘోరం!

ఒక్క చెట్టు నరికితే రూ.లక్ష జరిమానా: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. ఒక చెట్టును నరికిన వ్యక్తికి లక్ష రూపాయలు జరిమానా విధించాలని ఆదేశించింది. పెద్ద సంఖ్యలో చెట్లను నరికివేయడం మనుషులను చంపడం కంటే దారుణమైనదని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. పర్యావరణం విషయంలో కనికరం చూపొద్దని ప్రభుత్వాలను హెచ్చరించింది. మధుర-బృందావన్‌లోని దాల్మియా ఫామ్స్‌లో ప్రైవేట్ భూమిలో శివశంకర్ అగర్వాల్ 454 చెట్లను చట్టవిరుద్ధంగా నరికివేశారు. వాటిలో 32 చెట్లు రక్షిత అటవీ భూమిలోని రోడ్డు పక్కన ఉన్నవి. దీనిపై ప్రభుత్వం కోర్టును ఆశ్రయించింది. ఈ సంఘటనపై దర్యాప్తు చేసిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సీఈసీ) కొన్ని సిఫార్సులు చేసింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. చెట్టుకు లక్ష రూపాయల చొప్పున రూ.4.54 కోట్ల జరిమానా విధించింది. 454 చెట్లు కూల్చేయడం వల్ల కోల్పోయిన పచ్చదనాన్ని తిరిగి తీసుకురావడానికి, అంత వృక్షజాలాన్ని పెంపొందించడానికి కనీసం వందేళ్లు పడుతుందని వ్యాఖ్యానించింది. అయితే.. తప్పు చేశానని అగర్వాల్ అంగీకరించారని, జరిమానాను తగ్గించాలని ఆయన తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. అంతేకాదు.. వ్యక్తిగత, అటవీయేతర భూముల్లో చెట్ల నరికివేతకు అనుమతిని ప్రస్తావించింది. జరిమానాను తగ్గించడానికి ధర్మాసనం నిరాకరించింది. అగర్వాల్‌ను సమీపంలోని స్థలంలో తోటలు వేసేందుకు అనుమతించాలని, ఆ తరువాతే అతనిపై దాఖలైన కోర్టు ధిక్కార పిటిషన్‌ను పరిశీలిస్తామని తెలిపింది. అంతేకాదు.. తాజ్ ట్రాపెజియం జోన్‌లో అటవీయేతర, ప్రైవేటు భూముల్లో చెట్లను నరికివేయడానికి ముందస్తు అనుమతి తీసుకోవాలన్న నిబంధనను తొలగిస్తూ 2019లో ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు గుర్తు చేసింది.

భూగర్భంలో మరో క్షిపణి నగరం

అమెరికా డెడ్‌లైన్ సమీపిస్తున్న వేళ బయటపెట్టిన ఇరాన్

అణ్వాయుధ కార్యక్రమాన్ని అటకెక్కించడానికి అమెరికా విధించిన డెడ్‌లైన్ సమీపిస్తున్న వేళ ఇరాన్ మరోసారి ధిక్కార ధోరణి ప్రదర్శించింది. భూగర్భంలో సిద్ధం చేసుకున్న మూడో 'క్షిపణి నగరం' తాలూకు విశేషాలను బుధవారం బయట పెట్టింది. ఇందుకు సంబంధించి 85 సెకన్ల వీడియోను ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ విడుదల చేసింది. సొరంగాల వంటి నిర్మాణాల నిండా భద్రపరిచి ఉంచిన ఖైబర్ షెకాన్, గదర్-హెచ్, సెజిల్ తదితర అత్యాధునిక క్షిపణులు అందులో కన్పిస్తున్నాయి. ఐఆర్‌సీజీ ఏరోస్పేస్ చీఫ్ అమిర్ అలీ హజీజాదే, పలువురు సైనిక ఉన్నతాధికారులు వాటిని చూస్తూ కన్పిస్తున్నారు. సదరు వీడియో ప్రభుత్వ టీవీ చానల్లో కూడా ప్రసారమైంది. ఇజ్రాయెల్ దూకుడును అడ్డుకునేందుకు ఆయుధ పాటవాన్ని పెంచుకునే విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఇరాన్ ఈ సందర్భంగా కుండబద్దలు కొట్టింది. అయితే కీలక ఆయుధాల నిల్వ విషయంలో ఇరాన్ బలహీనతలు ఈ వీడియోతో మరోసారి తెరపైకి వచ్చాయని రక్షణ నిపుణులు అంటున్నారు. వైమానిక దాడులు జరిగితే వాటిని కాపాడుకోవడం దాదాపుగా అసాధ్యమని అభిప్రాయపడుతున్నారు. క్షిపణి, ఇతర అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను ఇరాన్ భూగర్భంలో నిల్వ చేస్తున్న వైనం 2020లో తొలిసారిగా వెలుగులోకి వచ్చింది. యురేనియం శుద్ధి, అణు, క్షిపణి కార్యక్రమాలన్నింటినీ కట్టిపెట్టేలా నూతన ఒప్పందానికి ఒప్పుకోవాలంటూ ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి తెస్తుండటం తెలిసిందే. అందుకు రెండు నెలల డెడ్‌లైన్ విధించారు. ఆలోగా ఒప్పందానికి అంగీకరించని పక్షంలో మరిన్ని కఠిన ఆంక్షలతో పాటు సైనిక చర్య వంటివి కూడా తప్పవని హెచ్చరిస్తూ నెల క్రితం ఇరాన్‌కు లేఖ కూడా రాశారు. కానీ ఒప్పందానికి ఇరాన్ ససేమిరా అంటోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

అమెరికా బైక్‌లు, విస్కీపై...
సుంకాల కోత!

న్యూఢిల్లీ: అమెరికా నుంచి దిగుమతి అయ్యే హార్లీ-డేవిడ్‌సన్ మోటార్‌సైకిళ్లు, బౌర్బన్ విస్కీ, కాలిఫోర్నియా వైన్‌పై సుంకాలు తగ్గించాలని భారత ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. అమెరికాతో ప్రస్తుతం జరుగుతున్న వాణిజ్య చర్చల్లో భాగంగా ఈ ప్రతిపాదనను తెరపైకి తెచ్చినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పరస్పరం సుంకాలు తగ్గించుకొని, వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని భారత్-అమెరికా యోచిస్తున్నాయి. హార్లీ-డేవిడ్‌సన్ బైక్‌లపై కేంద్ర ప్రభుత్వం ఇంపోర్ట్ డ్యూటీని ఇప్పటికే 50 శాతం నుంచి 40 శాతానికి తగ్గించింది. దీన్ని మరింత తగ్గించే దిశగా చర్యలు చేపట్టబోతున్నట్లు సమాచారం. దీనివల్ల ఇండియాలో ఈ బైక్‌ల ధరలు భారీగా తగ్గే అవకాశం ఉంది. బౌర్బన్ విస్కీపై సుంకాన్ని ఇదివరకే 150 శాతం నుంచి 100 శాతానికి తగ్గించారు. ఇది మరింత తగ్గబోతోంది. కాలిఫోర్నియా వైన్‌పై కూడా సుంకాలు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ఈ విస్కీ, వైన్ ఇండియాలోని ఆల్కహాల్ ఉత్పత్తులతో పోటీ పడడం ఖాయం. ఇండియా-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కేవలం మోటార్‌సైకిళ్లు, విస్కీ, వైన్‌కే పరిమితం కావడం లేదు. ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులు, కెమికల్స్ పైనా చర్చలు జరుగుతున్నాయి. ఇండియాలో ఫార్మాస్యూటికల్ రంగం శరవేగంగా వృద్ధి చెందుతోంది. ఇందులో తమ వాటాను గణనీయంగా పెంచుకోవాలని అమెరికా పట్టుదలతో ఉంది. మరోవైపు తమ ఎగుమతులపై అమెరికా ప్రభుత్వం సుంకాలు భారీగా తగ్గించాలని భారత ప్రభుత్వం కోరుకుంటోంది.

ఓటింగ్‌పై ట్రంప్ కార్డు



ఇకపై అధీకృత గుర్తింపు కార్డుంటేనే అనుమతి

- పోలింగ్ తేదీ తర్వాత పోస్టల్ ఓట్లను లెక్కించరు
- ఎన్నికల సంస్కరణల ఉత్తర్వులపై సంతకం

బ్రెనాన్ సెంటర్ ఫర్ జస్టిస్ గణాంకాల ప్రకారం ఓటింగ్ వయసున్న అమెరికా పౌరుల్లో 9 శాతం మందికి, అంటే 2.13 కోట్ల మందికి పౌరసత్వాన్ని నిరూపించుకునే ఎలాంటి గుర్తింపు పత్రాలూ లేవు!

న్యూయార్క్: అగ్రరాజ్యంగా వెలుగొందుతున్న అమెరికాలో ఎన్నికల ప్రక్రియలో మరింత పారదర్శకత తెచ్చే లక్ష్యంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో సమూల సంస్కరణలు తెస్తూ బుధవారం మరో కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. ఇన్నాళ్లూ స్వీయప్రకటిత పత్రాన్ని సమర్పించి ఓటింగ్ కేంద్రంలో పౌరులు ఓటేస్తుండగా ఇకపై ఏదైనా అధీకృత గుర్తింపు పత్రం/కార్డును చూపించి అమెరికా పౌరుడిగా నిరూపించుకున్నాకే ఓటేసేందుకు అనుమతి ఇస్తామని ట్రంప్ తెగేసి చెప్పారు. దీంతో పెళ్లయ్యాక ఇంటి పేరు మారిన, సరైన డ్రైవింగ్ లైసెన్స్, కొత్త పాస్‌పోర్ట్‌లేని అమెరికా పౌరులకు ఓటింగ్ కష్టాలు మొదలుకానున్నాయి. భారత్, బ్రెజిల్ వంటి దేశాలు ఇప్పటికే 'ఓటింగ్ కేంద్రం వద్ద గుర్తింపు కార్డు' విధానాన్ని అవలంబిస్తుండగా ట్రంప్ సైతం అమెరికాను ఇదే బాటలో పయనింపజేయాలని నిశ్చయించుకున్నారు. వచ్చే ఏడాది మధ్యంతర ఎన్నికలున్న నేపథ్యంలో ఆలోపే ఎన్నికల సంస్కరణలను అమల్లోకి తేవాలని ట్రంప్ నిర్ణయించుకున్నారు. ఇందులోభాగంగా బుధవారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకంచేశారు. అయితే ఎన్నికల నిర్వహణ బాధ్యత రాష్ట్రాలకే ఉండటంతో ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ఏ మేరకు సమగ్రస్థాయిలో అమలవుతుందో తేలాల్సి ఉంది. ఈ కార్యనిర్వాహక ఉత్తర్వును కొన్ని రాష్ట్రాలు కోర్టుల్లో సవాల్‌చేసే అవకాశం ఉంది.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఇన్నాళ్లూ ఫెడరల్ ఎన్నికల్లో పౌరులు ఓటేసేటప్పుడు సెల్ఫ్ డిక్లరేషన్ పత్రాన్ని అందజేసి తమ ఓటు హక్కును వినియోగించుకునేవారు. ఇకపై ఆ విధానానికి స్వస్తి పలికి భారత్‌లో మాదిరి ఏదైనా గుర్తింపు కార్డును చూపిస్తేనే ఓటేసేందుకు అనుమతించాలని ట్రంప్ యంత్రాంగం నిర్ణయించింది. పాస్‌పోర్ట్, బర్త్ సర్టిఫికెట్ వంటి అధీకృత గుర్తింపు పత్రం/కార్డును ఓటింగ్ కేంద్రంలో చూపించాల్సి ఉంటుంది. అక్రమంగా అమెరికాలో ఉంటున్న వాళ్లను బహిష్కరిస్తూ, స్వదేశాలకు తరలిస్తూ ట్రంప్ సర్కార్ తీసుకుంటున్న చర్యలను అధికార రిపబ్లికన్ పార్టీ స్వాగతిస్తోంది. దీంతో నాన్-అమెరికన్లలో రిపబ్లికన్ పార్టీ పట్ల వ్యతిరేకత ఉంది. వీరిలో ఓటేసే అవకాశమున్న వాళ్లు విపక్ష డెమొక్రటిక్ పార్టీకి మద్దతు పలుకుతున్నారు. మధ్యంతర ఎన్నికల్లో డెమొక్రాట్ల గెలుపు అవకాశాలను దెబ్బతీసేందుకు, నాన్-అమెరికన్లు ఓటింగ్‌లో పాల్గొనకుండా అడ్డుకునేందుకు ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని అమెరికా మీడియాలో వార్తలొచ్చాయి. పౌరులుకాని వ్యక్తులను ఓటర్ల జాబితా నుంచి తొలగించేందుకు, తొలుత వారిని గుర్తించేందుకు హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ, సోషల్ సెక్యూరిటీ, స్టేట్ డిపార్ట్‌మెంట్‌లు అన్ని రాష్ట్రాల అధికారులకు ఈ జాబితాను అందజేయనున్నాయి.

వ్యతిరేకిస్తున్న హక్కుల సంఘాలు

గుర్తింపు కార్డు ఉంటేనే ఓటేసేందుకు అనుమతిస్తామనడం ఓటింగ్ హక్కును కాలరాయడమేనని ఓటింగ్ హక్కుల సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ''ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను అమలుచేస్తే ఓటర్ల జాబితాలోని నాన్-సిటిజన్లు కొద్దిమంది మాత్రమే ఓటింగ్‌ను కోల్పోరు. సరైన పత్రాలు లేని లక్షలాది మంది అమెరికా పౌరులు సైతం తమ ఓటు హక్కుకు దూరమవుతారు. ఇది ఓటింగ్ శాతంపై పెను ప్రభావం చూపుతుంది. గెలుపుపైనా ప్రభావం పడొచ్చు'' అని లాస్‌ఏంజెలెస్‌లోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఎన్నికల చట్టాల నిపుణుడు రిచర్డ్ హేసన్ అభిప్రాయపడ్డారు. ''మహిళల బర్త్ సర్టిఫికెట్‌లో అసలైన పేరు ఉంటుంది. పెళ్లయ్యాక లాస్ట్ నేమ్ మారుతుంది. పెళ్లయ్యాక తీసుకున్న పత్రాలు, బర్త్ సర్టిఫికెట్ ఒకలా ఉండవు. ఇలాంటి వాళ్లు ఓటేయడ కష్టమే'' అని ఆయన ఉదహరించారు.

14.6 కోట్ల మందికి పాస్‌పోర్ట్ లేదు

పబ్లిక్ సిటిజన్ అనే సంస్థ గణాంకాల ప్రకారం అమెరికన్ పౌరుల్లో దాదాపు 14.6 కోట్ల మందికి పాస్‌పోర్ట్ లేదు. ఓటింగ్‌కు పాస్‌పోర్ట్, బర్త్ సర్టిఫికెట్‌నే అనుమతించే అవకాశముంది. ఈ నేపథ్యంలో కోట్లాది మంది ఓటింగ్‌కు దూరమయ్యే అవకాశముంది. ''ట్రంప్ అతి చర్యల కారణంగా ప్రభుత్వ రికార్డులన్నింటిలో పేరు సరిపోలిన వాళ్లు మాత్రమే ఓటేసేందుకు అర్హులవుతారు. ఇంటి పేరు మారిన మహిళలు, కార్చిచ్చులు, తుపాన్లు, వరదల్లో ఇళ్లు కాలిపోయి డాక్యుమెంట్లు పోగొట్టుకున్న వాళ్లు ఇకపై ఓటు హక్కును వినియోగించుకోవడం అసాధ్యం'' అని డెమొక్రటిక్ నేత, దిగువసభ సభ్యురాలు జాస్మిన్ ఫెలిసియా క్రోకెట్ ఆందోళన వ్యక్తంచేశారు.

తర్వాత వచ్చే బ్యాలెట్ ఓట్లను పరిగణించరు

కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే ఎన్నికల తేదీ తర్వాత వచ్చే పోస్టల్ బ్యాలెట్ ఓట్లను అనుమతించబోరు. ఓటింగ్ తేదీకి ముందే మార్కింగ్ చేసి పోస్ట్‌లో పంపినట్లు రుజువైతే మాత్రమే తర్వాతి తేదీన అందినా అనుమతిస్తారు. ప్రస్తుతం 18 రాష్ట్రాలు, ప్యూర్టోరీకో మాత్రమే తర్వాత తేదీ నుంచి వచ్చినా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను అనుమతిస్తున్నాయి. అత్యధిక ఓటర్లు ఉన్న కాలిఫోర్నియా రాష్ట్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఏకంగా ఏడు రోజుల తర్వాత కూడా అనుమతిస్తారు.


ఎన్నికల విరాళాల మీదా ఆంక్షలు!

రాజకీయ పార్టీలకు వ్యక్తులు నేరుగా విరాళాలు ఇచ్చే అవకాశం లేదు. పొలిటికల్ యాక్షన్ కమిటీలను ఏర్పాటుచేసి వాటికి విరాళాలు అందించి వాటి ద్వారానే ఎన్నికల ఖర్చులకు సాయపడొచ్చు. ఈ ఎన్నికల విరాళాలపైనా కఠిన నియమాలను ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో పొందుపరిచినట్లు తెలుస్తోంది. అమెరికా పౌరులుగాని వ్యక్తులు విరాళాలు ఇవ్వకుండా నిషేధం విధిస్తున్నట్లు ట్రంప్ ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఎన్నికల నిబంధనల్లో విఫలమయ్యాం: ట్రంప్

''సుపరిపాలనలో మనం ఎన్నో దేశాలకు ఆదర్శంగా ఉన్నాం. కానీ ఎన్నికల ప్రాథమిక నిబంధనల పటిష్ట అమలులో విఫలమయ్యాం. ఈ విషయంలో అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందిన దేశాలు ఎంతో ముందున్నాయి. భారత్, బ్రెజిల్ వంటి దేశాలు ఓటర్ల జాబితాను బయోమెట్రిక్ డేటాబేస్‌తో పోల్చిచూస్తూ ముందంజలో ఉంటే మనం ఇంకా సెల్ఫ్-అటెస్టేషన్ స్థాయిలోనే ఆగిపోయాం. జర్మనీ, కెనడా వంటి దేశాలు పేపర్ బ్యాలెట్లను అందరి సమక్షంలో లెక్కిస్తూ ఎలాంటి వివాదాలకు తావివ్వడం లేదు. మనం వేర్వేరు రకాల ఓటింగ్ విధానాలను అవలంబిస్తూ సుదీర్ఘ ఓటింగ్ ప్రక్రియలో మునిగిపోయాం. మెయిల్-ఇన్ ఓట్ల విషయంలో డెన్మార్క్, స్వీడన్ ముందున్నాయి''.

బఘేల్ ఇంట్లో సీబీఐ సోదాలు



రాయ్‌పూర్/దుర్గ్: దాదాపు రూ.6,000 కోట్ల మహదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణం దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు బుధవారం ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ ఇంట్లో ఆకస్మిక సోదాలు నిర్వహించారు. రాయ్‌పూర్, భిలాయ్ పట్టణాల్లోని బఘేల్ నివాసాలతోపాటు బఘేల్‌కు అత్యంత సన్నిహితంగా ఉండే ఒక పోలీస్ ఉన్నతాధికారి ఇళ్లలోనూ సీబీఐ తనిఖీలు చేసింది. ఇటీవలే మద్యం కుంభకోణానికి సంబంధించిన కేసులోనూ బఘేల్, ఆయన కుమారుడి ఇళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు చేసింది. ఛత్తీస్‌గఢ్ పోలీస్‌శాఖలోని ఆర్థికనేరాల విభాగం పోలీసులతో సీబీఐ బృందం బుధవారం ఈ సోదాలు చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమైన సమావేశం కోసం బఘేల్ బుధవారమే ఢిల్లీకి బయల్దేరాల్సిన వేళ సీబీఐ రంగంలోకి దిగడం గమనార్హం. రాయ్‌పూర్, దుర్గ్ జిల్లాలో మరికొందరు కాంగ్రెస్ నేతలు, పోలీస్ అధికారుల నివాసాల్లోనూ సీబీఐ దాడులు జరిగాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. బెట్టింగ్ యాప్ కుంభకోణంలో గతంలోనే బఘేల్‌తోపాటు యాప్ ప్రమోటర్లు రవి ఉప్పల్, సౌరభ్ చంద్రకార్, సౌరభ్ సోని, అనిల్ కుమార్ అగర్వాల్, మరో 14 మంది పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చడం తెల్సిందే.

బీజేపీ కుట్ర: బఘేల్

తనిఖీలపై బఘేల్ తర్వాత 'ఎక్స్' ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు. ''ఏప్రిల్ 8న అహ్మదాబాద్‌లో జరగబోయే కీలక ఏఐసీసీ సమావేశాలకు సంబంధించిన 'ముసాయిదా కమిటీ' కీలక సమావేశంలో పాల్గొనేందుకు బుధవారం ఢిల్లీకి వెళ్లాల్సిన సమయంలోనే సీబీఐ అధికారులు రాయ్‌పూర్, భిలాయ్ నివాసాలకొచ్చారు. ఆర్థికనేరాల విభాగం నాపై ఎఫ్ఐఆర్ నమోదుచేయడం పూర్తిగా రాజకీయ ప్రేరేపితం. బీజేపీ ఈ విషయంలో కుట్ర పన్నింది'' అని బఘేల్ అన్నారు. సీబీఐ సోదాలను కాంగ్రెస్ పార్టీ తప్పుబట్టింది.

అత్యవసరంగా విచారణ చేపట్టలేం


యశ్వంత్ వర్మ వ్యవహారంలో సుప్రీంకోర్టు వెల్లడి

న్యూఢిల్లీ: అధికారిక నివాసంలో భారీగా నోట్ల కట్టలు దొరికిన ఘటనలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టలేమని బుధవారం వెల్లడించింది. సీనియర్ అడ్వొకేట్ మాథ్యూస్ జె.నెడుంపారా ఈ పిటిషన్ దాఖలు చేశారు. అత్యవసరంగా విచారణ ప్రారంభించాలని, యశ్వంత్ వర్మపై సాధ్యమైనంత త్వరగా విచారణ చేపట్టాలని కోరారు. కానీ, అందుకు అత్యున్నత న్యాయస్థానం అంగీకరించలేదు. పిటిషన్‌ను సంబంధిత అధికారులు కేసుల జాబితాలో చేరుస్తారని పిటిషనర్‌కు స్పష్టంచేసింది. జాబితా ప్రకారమే కేసులు తమ ముందు విచారణకు వస్తాయని తేల్చిచెప్పింది. మరోవైపు ఢిల్లీలో యశ్వంత్ శర్మ ఇంట్లో పోలీసులు అధికారుల బృందం బుధవారం సోదాలు నిర్వహించింది. దర్యాప్తులో భాగంగానే వారు ఇక్కడికి వచ్చినట్లు తెలిసింది.

అమానవీయ తీర్పు..!

- అలహాబాద్ హైకోర్టు తీర్పుపట్ల సుప్రీంకోర్టు ఆగ్రహం
- బాలిక లైంగిక వేధింపులకు గురైతే సానుభూతి లేని తీర్పు ఇస్తారా?
- హైకోర్టు తీర్పుపై స్టే విధించిన అత్యున్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ: బాలికపై లైంగిక వేధింపుల వ్యవహారంలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన వివాదాస్పద తీర్పును సుప్రీంకోర్టు నిలిపివేసింది. ఈ అమానవీయ తీర్పుపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. బాధితురాలి పట్ల ఏమాత్రం సానుభూతి లేకుండా, సున్నితత్వం అనేది కోల్పోయి తీర్పు ఇవ్వడం ఏమిటని ఆక్షేపించింది. బాలిక ఛాతీపై చెయ్యి వేసినా, పైజామా దారం లాగేసినా అది అత్యాచారం లేదా అత్యాచార యత్నంగా పరిగణించలేమని అలహాబాద్ హైకోర్టు మార్చి 17వ తేదీన తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పు దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. ప్రముఖ న్యాయ నిపుణులు, మేధావులు దీన్ని తప్పుపట్టారు. మహిళల రక్షణ విషయంలో చొరవ తీసుకోవాల్సిన న్యాయస్థానాలు వారిని మరింత అభద్రతకు గురిచేసేలా ఇలాంటి తీర్పులు ఇవ్వడం ఏమిటని నిలదీశారు. 'వుయ్ ద ఉమెన్ ఆఫ్ ఇండియా' పేరిట సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు కొందరు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం స్పందించింది. అలహాబాద్ హైకోర్టు తీర్పును సుమోటోగా స్వీకరించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసీతో కూడిన ధర్మాసనం బుధవారం దీనిపై విచారణ చేపట్టింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి హాజరయ్యారు. హైకోర్టు తీర్పు పట్ల ధర్మాసనం ఘాటుగా స్పందించింది. ఇది చాలా తీవ్రమైన విషయమని పేర్కొంది. హైకోర్టు అమానవీయ తీర్పు ఇచ్చినట్లు తేల్చిచెప్పింది. తాము తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకూ ఈ తీర్పుపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు

నిందితులపై అత్యాచార యత్నం కేసు పెట్టడం తప్పు అన్నట్లుగా హైకోర్టు తీర్పు ఉందని, చాలా తక్కువ తీవ్రత కలిగిన కేసులో విచారణను ఎదుర్కోవడానికి వారు అర్హులు అనేవిధంగా హైకోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని ధర్మాసనం పేర్కొంది. తీర్పును రిజర్వ్ చేసి నాలుగు నెలల తర్వాత ఇచ్చారంటే న్యాయమూర్తి అన్ని కోణాల్లో ఆలోచించి, బుద్ధిని ఉపయోగించి తీర్పు ఇచ్చినట్లు భావిస్తున్నామని ఉద్ఘాటించింది. ఈ మొత్తం వ్యవహారంపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి, ఈ కేసుతో సంబంధం ఉన్న హైకోర్టు పార్టీలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 15వ తేదీకి వాయిదా వేసింది.

ఉత్తరప్రదేశ్ బాలికపై అసభ్యకర ప్రవర్తన

2021 నవంబర్‌లో ఉత్తరప్రదేశ్‌లోని కాస్‌గంజ్ ప్రాంతానికి చెందిన మహిళ తన కుమార్తె(అప్పుడు 11 ఏళ్లు)తో కలిసి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా, అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు పవన్, ఆకాశ్ వారికి ఎదురయ్యారు. బాలికను ఇంటి వద్ద దింపుతామని నమ్మబలికారు. ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నారు. బైక్‌పై ప్రయాణిస్తూ బాలిక శరీర భాగాలను చేతులతో తాకుతూ అసభ్యకరంగా ప్రవర్తించారు. వారిలో ఒకడు ఆమె పైజామా దారం లాగేశాడు. యువకులిద్దరూ కలిసి బలవంతంగా కల్వర్ట్ కిందకు లాక్కెళ్లేందుకు ప్రయత్నించారు. భయాందోళనకు గురైన బాలిక గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని వ్యక్తులు అక్కడికి చేరుకున్నారు. దాంతో ఆ యువకులు బాలికను వదిలేసి పారిపోయారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో విచారణ పూర్తి చేసిన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా వెంటనే తీర్పు ఇవ్వకుండా నాలుగు నెలలపాటు రిజర్వ్ చేశారు. ఎట్టకేలకు ఈ ఏడాది మార్చి 17న తీర్పు ప్రకటించారు. బాలికతో లైంగిక చర్యలో పాల్గొనేందుకు యువకులు ప్రయత్నించినట్లు ఆరోపణలు లేవని చెప్పారు. సాధారణంగా ఇలాంటి నేరం.. వేధింపులు లేదా బాలికను నగ్నంగా చూడాలన్న ఉద్దేశంతో బలవంతంగా వివస్త్రను చేసేందుకు ప్రయత్నించడం కిందకు వస్తుందని తన తీర్పులో వివరించారు. ఈ వివాదాస్పద తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. అయితే, ఈ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టుకు చెందిన ఒక ధర్మాసనం నిరాకరించింది. కానీ, హైకోర్టు తీర్పు పట్ల దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు వ్యక్తం కావడంతో సుప్రీంకోర్టుకు చెందిన మరో ధర్మాసనం సుమోటోగా విచారణ ప్రారంభించడం గమనార్హం.

కొరియాలో కార్చిచ్చు

24 మంది మృతి • 12 మంది విషమం

సియోల్: దక్షిణ కొరియాను కార్చిచ్చు అతలాకుతలం చేస్తోంది. దేశ చరిత్రలోనే అత్యంత ఘోరమైందిగా చెబుతున్న కార్చిచ్చు ధాటికి ఇప్పటికే 44,000 ఎకరాల పైచిలుకు అడవి కాలిపోయింది. 24 మంది మంటలకు బలవగా 26 మందికి పైగా గాయపడ్డారు. వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో ఎక్కువ మంది వృద్ధులే. నలుగురు సివిల్ సర్వెంట్లు కూడా ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే 28 వేల మందికి పైగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉయిసాంగ్ నగరంలో క్రీ.శ 618 నాటి పురాతన గౌన్సా బౌద్ధాలయాన్ని కూడా కార్చిచ్చు దగ్ధం చేసింది. ప్రావిన్స్‌లోని అతిపెద్ద దేవాలయాలలో ఇదొకటి. జోసన్ రాజవంశానికి చెందిన జాతీ య సంపదగా భావించే ఈ బౌద్ధ నిర్మాణ నిర్మాణం ఉత్సవ గంటతో పాటుగా నేలమట్టమైంది. ప్రభుత్వ నిధిగా గుర్తించిన రాతి బుద్ధుడితో సహా ఇక్కడి పలు కళాఖండాలను ముందే ఇతర ఆలయాలకు తరలించారు. శుక్రవారం మధ్యాహ్నం సాంచియాంగ్ కౌంటీలో మొ దలైన మంటలు ఉయిసాంగ్‌కు వ్యాపించాయి. బలమైన, పొడి గాలుల కా రణంగా పొరుగు కౌంటీలైన అండాంగ్, చియోంగ్సాంగ్, యోంగ్యాంగ్, యోంగ్డియో క్‌లకు మంటలు వ్యాపిస్తున్నాయి.

జపాన్‌లోనూ: జపాన్‌లోనూ కార్చిచ్చు కొనసాగుతోంది. బలమైన గాలుల వల్ల మంటల్లో పశ్చిమ జపాన్ ప్రావిన్స్‌లోని పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఒకాయామా, తమానోలో వందల ఎకరాల్లో చెట్లు కాలిపోయాయి.



దక్షిణ కొరియాలోని ఉయిసాంగ్ ప్రావిన్స్‌లో కార్చిచ్చు తీవ్రత

మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు

- 8 రోజులుగా నిశ్శబ్దంగా కూర్చుంటున్నా
- విపక్ష నేత రాహుల్ గాంధీ అసంతృప్తి

న్యూఢిల్లీ: లోక్‌సభ అప్రజాస్వామిక విధానంలో నడుస్తోందని ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తంచేశారు. స్పీకర్ ఓం బిర్లా తనకు మాట్లాడే అవకాశంఇవ్వడం లేదని ఆక్షేపించారు. రాహుల్ బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. ''ఎనిమిది రోజులుగా సభలో నేను చేసిందేమీ లేదు. నిశ్శబ్దంగా కూర్చుంటున్నా. సభలో ప్రతిపక్షానికి విలువ లేకుండా పోయింది. గతవారం మహా కుంభమేళాపై ప్రధాని మోదీ ప్రకటన తర్వాత దేశంలో నిరుద్యోగ సమస్యపై మాట్లాడేందుకు ప్రయత్నిస్తే స్పీకర్ అనుమతించలేదు. బుధవారం సభలో స్పీకర్ నన్నుద్దేశించి ఆయన కటువుగా మాట్లాడారు. దానిపైనా స్పందించడానికి అవకాశమివ్వకుండా సభను వాయిదా వేసి వెళ్లిపోయారు'' అన్నారు. ఈ అంశంపై 70 మంది కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్‌ను ప్రత్యేకంగా కలిశారు.

స్పీకర్ ఆగ్రహం

సభలో రాహుల్ తీరుపై ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ గౌరవాన్ని కాపాడాలని, నిబంధనల ప్రకారం నడుచుకోవాలని హితవు పలికారు. అయితే రాహుల్‌పై స్పీకర్ ఆగ్రహానికి కారణం ఏమిటన్నది తెలియరాలేదు.

ఉపశమనం దక్కింది

బాధితురాలి కుటుంబం హర్షం

ప్రయాగ్‌రాజ్: అలహాబాద్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే నిర్ణయంతో తమకు ఎంతో ఉపశమనం దక్కిందని బాధిత మైనర్ బాలిక కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తంచేశారు. న్యాయం కోసం బాలిక తల్లి అలుపెరుగని పోరాటం చేస్తోందని వారి తరఫు న్యాయవాది రచనా త్యాగీ అన్నారు. ''వారిది నిరుపేద కుటుంబం. నిందితులపై పోలీసులు తొలుత ఎఫ్ఐఆరే నమోదు చేయలేదు. దానికోసం కూడా కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చింది'' బాలికను వేధించిన యువకులకు సుప్రీంకోర్టు తగిన శిక్ష విధిస్తుందని భావిస్తున్నా'' అని అన్నారు.

కేన్సర్, మధుమేహం ఔషధాలు మరింత ప్రియం!

ధరల పెంపుకు కేంద్రం ఆమోదం!

న్యూఢిల్లీ: కేన్సర్, మధుమేహం, హృదయ సంబంధ వ్యాధుల చికిత్సలో వాడే ఔషధాల ధరలు మరింత పెరిగే అవకాశముంది. వాటిని దాదాపు 1.7 శాతం పెంచే ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదముద్ర వేసినట్టు విశ్వసనీయ వర్గాలు బుధవారం వెల్లడించాయి. కొత్త ధరలు మూడు నెలల తర్వాత వర్తింవచ్చని ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్ (ఏఐఓసీడీ) ప్రధాన కార్యదర్శి రాజీవ్ సింఘాల్ చెప్పారు. ఫార్మా కంపెనీలు ప్రభుత్వం సూచించిన దానికంటే చాలా ఎక్కువకు ఔషధాలను విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడం తెలిసిందే. రసాయనాలు, ఎరువుల సంబంధ పార్లమెంటరీ స్థాయీ సంఘం నివేదికలోనూ దీన్ని ప్రస్తావించింది. నేషనల్ ఫార్మాసూటికల్ ప్రైసింగ్ అథారిటీ గణాంకాలు కూడా అదే చెబుతున్నాయి. ఇందుకు సంబంధించి 307 ఘటనలు నమోదయ్యాయి. అధిక ధరల వల్ల రోగులు ఔషధాలు కొనలేక అవస్థలు పడుతున్నారని, ఆర్థికంగా చితికిపోతున్నారని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పేర్కొంది. జాతీయ అత్యయిక ఔషధాల జాబితా-2022లోని మందుల ధరలను సవరించిన/తగ్గించిన తర్వాత దేశవ్యాప్తంగా రోగుల జేబుకు చిల్లు పడటం తగ్గిందని, రూ.3,788 కోట్ల సొమ్ము ఆదా అయిందని రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ మూడు వారాల క్రితం ప్రకటించడం తెలిసిందే.



ప్యాట్ కమిన్స్



‘ఎస్టేట్స్’ దూకుడు!

ఆదాయ లక్ష్యాలను చేరుకునేందుకు జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాలు ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. ట్యాక్స్ సెక్షన్ సెలవుల్లేకుండా పని చేస్తోంది.

-8లో



కశ్మీర్ అందాలతో..

సిటీలో స్నో థీమ్‌తో వింటర్ థ్రిల్లింగ్ ప్రదేశాలు సిద్ధంగా ఉన్నాయి. కశ్మీర్ మంచు కొండల అనుభూతిని నగరంలోనే సొంతం చేసుకునే అవకాశం కల్పిస్తున్నాయి.

- సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/23.0

నగరంలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 36, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



బుధవారం ఉప్పల్ స్టేడియంలో కసరత్తు చేస్తున్న సన్‌రైజర్స్, లక్నో జట్లు






రిషభ్ పంత్

పరుగుల ప్రవాహమే!

నేడు లక్నోతో రైజర్స్ ఢీ

దాదాపు ఏడాది క్రితం హైదరాబాద్‌లో లక్నోతో సన్‌రైజర్స్ పోరు.. లక్నో 165 పరుగులు చేస్తే హైదరాబాద్ కేవలం 58 బంతుల్లోనే వికెట్ నష్టపోకుండా 167 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ కలిసి 16 ఫోర్లు, 14 సిక్సర్లతో చెలరేగి ఫుల్ వినోదం పంచారు. ఇప్పుడు మళ్లీ లక్నో వర్సెస్ హైదరాబాద్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. గురువారం రాత్రి 7.30 గంటల నుంచి నగరంలోని ఉప్పల్ స్టేడియంలో జరిగే ఈ సమరం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. లక్నో జట్టులో అందరి కళ్లూ కెప్టెన్ రిషభ్ పంత్‌పైనే ఉన్నాయి. మరోవైపు మన జట్టు మళ్లీ చెలరేగితే స్టేడియం దద్దరిల్లిపోవడం ఖాయం. ఆదివారం రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో దూకుడు ప్రదర్శించిన రైజర్స్.. అదే జోరు కొనసాగించాలని పట్టుదలగా ఉంది. టీమ్ టాప్- 5 అభిషేక్ శర్మ, హెడ్, ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డి, క్లాసెన్ మెరుపు బ్యాటింగ్‌ను అభిమానులు ఆస్వాదించనున్నారు. మొదట హైదరాబాద్ బ్యాటింగ్ చేస్తే గనక ఎన్ని రికార్డులు బద్దలవుతాయో చూడాలి మరి.

– సాక్షి, హైదరాబాద్



ట్యాంకర్.. ఫికర్!

నీటి డిమాండ్‌తో రెట్టింపు తాకిడి

- పక్కదారిలో జలమండలి ట్యాంకర్లు
- సరఫరాపై విజిలెన్స్ నిఘా
- ఆరు ట్యాంకర్ల పట్టివేత
- రూ.20 వేల చొప్పున జరిమానా
- ట్యాంకర్ల కార్డులు సైతం బ్లాక్

రోజు రోజుకూ పెరిగిపోతున్న పెండెన్సీ

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి ట్యాంకర్ల పెండెన్సీ నానాటికీ పెరిగిపోతోంది. ముదురుతున్న ఎండలు.. అడుగంటుతున్న భూగర్భ జలాలతో తిప్పలు తప్పడంలేదు. తాగునీటితో పాటు నిత్యావసరాలకు సైతం ట్యాంకర్ల తాకిడి పెరిగింది. బుకింగ్ నుంచి డెలివరీ సమయం తగ్గించేందుకు సంబంధిత అధికారులు ఒక వైపు తీవ్ర కసరత్తు చేస్తున్నా... మరోవైపు బుకింగ్ పెండెన్సీ తారస్థాయికి చేరుతోంది. జలమండలి పరిధిలో మొత్తం 75 ఫిల్లింగ్ స్టేషన్లు ఉండగా.. 20 స్టేషన్లు మినహా మిగతా వాటిలో 24 నుంచి 48 గంటలు దాటితే కాని ట్యాంకర్లు డెలివరీ కానీ పరిస్థితి నెలకొంది. డోయెన్స్ ఫిల్లింగ్ స్టేషన్‌లో ఐదు రోజులు, ఎల్లారెడ్డిగూడెంలో నాలుగు రోజులు, షాపూర్‌నగర్, గచ్చిబౌలి-2, గాజుల రామారాం, మణికొండ, ఫతేనగర్‌లలో మూడు రోజులు, మిగతా ఫిల్లింగ్ స్టేషన్లలో ట్యాంకర్ల డెలివరీకి 48 గంటల సమయం పడుతున్నట్లు జలమండలి నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

ట్యాంకర్ యజమానుల చేతివాటం

డిమాండ్ పెరగడంతో ట్యాంకర్ యజమానులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వినియోగదారులకు తెలియకుండానే వారి క్యాన్ నెంబర్ పేరిట ట్యాంకర్‌ను బుక్ చేసి వాణిజ్య అవసరాలకు తరలిస్తున్నారు. మరోవైపు కొందరు వినియోగదారుల సహకారంతో ట్యాంకర్లను బుక్ చేసి బ్లాక్‌లో డెలివరీ చేయడం పరిపాటిగా మారింది. వాస్తవంగా మాదాపూర్, బంజారాహిల్స్, మూసాపేట, మణికొండ, జూబ్లీహిల్ తదితర ప్రాంతాల నుంచి ట్యాంకర్ల డిమాండ్ పెరుగుతోంది. రోజువారీగా సెక్షన్ల పరిధిలో అత్యధికంగా ఐదు వందలపైగా ట్యాంకర్లు బుకింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది.



అవసరానికి మించిన వినియోగంతో..

గత ఏడాదితో పోల్చితే ట్యాంకర్ల డిమాండ్ మార్చి నెలలో రెట్టింపు స్థాయిలో పెరిగింది. సాధారణంగా నగర పరిధిలో జనవరి నుంచి జూన్ రెండో వారం వరకు ట్యాంకర్లకు తాకిడి అధికంగానే ఉంటుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రతి యేటా ట్యాంకర్ల డిమాండ్ కనీసం 20 నుంచి 100 శాతం పెరుగుతూ వస్తోంది. వచ్చే నెలలో ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువ నమోదయ్యే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. వాస్తవంగా నగరంలో తాగునీటికి ఇంత డిమాండ్ ఏర్పడడానికి కారణం.. అవసరానికి మించి నీటిని వినియోగించడమేనని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. మొత్తమ్మీద 13 లక్షల నల్లా కనెక్షన్లలో కేవలం 42 వేల గృహాలు ట్యాంకర్లు బుకింగ్ చేస్తున్నట్లు జలమండలి అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందులో 500 మంది.. 75 రోజుల్లో 31 వేల ట్యాంకర్లు, 22 వేల మంది 90 శాతం ట్యాంకర్లను అంటే.. 2.84 లక్షల ట్యాంకర్లను బుక్ చేసినట్లు తెలుస్తోంది.

సంఖ్య పెరిగినా..

వాటర్ ట్యాంకర్ల సంఖ్య పెరిగినా.. పెండెన్సీ మాత్రం తగ్గడం లేదు. వాస్తవంగా గతేడాది 69 ఫిల్లింగ్ స్టేషన్లు ఉండగా ఈ ఏడాది మరో ఆరు స్టేషన్లను పెంచారు. ఫిల్లింగ్ పాయింట్ల సంఖ్య 93 నుంచి 123కు పెరిగింది. ట్యాంకర్ల సంఖ్య 577 నుంచి 977కు చేరింది.

వాటర్ ట్యాంకర్ల పెండెన్సీ ఇలా..

ఫిల్లింగ్ స్టేషన్	పెండెన్సీ
ఎల్లారెడ్డి గూడెం	229 నుంచి 320
గోల్డెన్ తులిప్	220- 310
షాపూర్‌నగర్	216- 305
డోయెన్స్	211- 280
గచ్చిబౌలి-2	126- 250
భవానీ నగర్	117- 190
షాపూర్‌నగర్ -2	106- 205
షేక్‌పేట	104- 201
అయప్ప సొసైటీ	93- 150
గాజుల రామారం	83 -145
మౌలాలీ	79- 120
దోమలగూడ	75- 110
మణికొండ	58 నుంచి 150

పక్కదారిపై నిఘా

వాటర్ ట్యాంకర్ల పక్కదారిపై జలమండలి విజిలెన్స్ విభాగం నిఘా ముమ్మరం చేసింది. ఆరు బృందాలను రంగంలోకి దింపింది. డోయెన్స్, వెంగళ్‌రావు నగర్, ఎస్ఆర్ నగర్, బంజారా హిల్స్ ఫిల్లింగ్ స్టేషన్ల పరిధిలో డొమెస్టిక్ ట్యాంకర్లను వాణిజ్య అవసరాలకు తరలిస్తున్న సుమారు ఆరు ట్యాంకర్లను గుర్తించి కేసులు నమోదు చేసింది. ఒక్కో ట్యాంకర్లపై రూ. 20 వేల చొప్పున జరిమానా విధించడంతో పాటు యజమానుల కార్డులను సైతం బ్లాక్ చేస్తోంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



దేవీ ప్రణయ్, హర్షిత్ (ఫైల్)

రాంగోపాల్‌పేట్: మితిమీరిన వేగంతో వచ్చిన ఓ కారు ఇద్దరు యువకులను బలి తీసుకుంది. బుధవారం ఉదయం మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురాం కథనం ప్రకారం.. బన్సీలాల్‌పేట్ చాచా నెహ్రూ నగర్‌కు చెందిన ఏడుకొండలు కుమారుడు గంటాడి దేవీ ప్రణయ్ (18), బన్సీలాల్‌పేట్ బీజేఆర్ నగర్‌కు చెందిన ఎర్రా హర్షిత్ (21) స్నేహితులు. వీరిద్దరూ మారేడుపల్లిలోని పెస్టోమెన్ అనే పెస్ట్ కంట్రోల్ సంస్థలో పని చేస్తున్నారు. రాత్రి విధులు ముగించుకున్న వీరు.. తమ యజమాని చెందిన ద్విచక్ర వాహనంపై ప్యారడైజ్ హోటల్‌కు వచ్చి టీ తాగారు. అనంతరం ఉదయం 4.40 గంటలకు జిమ్‌కు వెళ్లేందుకు ఎస్‌డీ రోడ్డు మీదుగా ప్యాట్నీ వైపు బైక్‌పై వస్తున్నారు. అదే సమయంలో కాప్రాకు చెందిన కొమురయ్య తాజ్‌హోటల్ వైపు వేగంగా కారు నడుపుతూ వచ్చి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బైక్ నడుపుతున్న దేవీ ప్రణయ్ తలకు, ఇతర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనుక కూర్చున్న హర్షిత్‌కు తీవ్ర గాయాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందాడు. కారు డ్రైవర్ కొమురయ్యను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీడని మిస్టరీ!



ఇంకా లభించని నిందితుడి ఆచూకీ

- ఎంఎంటీఎస్ రైలులో అత్యాచార యత్నం ఘటన
- ముమ్మరంగా కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు

సికింద్రాబాద్: ఈ నెల 22న మేడ్చల్ ఎంఎంటీఎస్ రైలులో జరిగిన అత్యాచార యత్నం ఘటన మిస్టరీ వీడలేదు. మరుసటి రోజు నుంచి ప్రత్యేక బృందాలుగా ఏర్పడిన పోలీసులు విస్తృతంగా దర్యాప్తు చేస్తున్నా నిందితుడి ఆచూకీ తెలియడంలేదు. పలు బృందాలుగా ఏర్పడిన రెండు వందలకు పైబడిన పోలీసులు బృందాలుగా ఏర్పడిన వివిధ విభాగాల పోలీసులు కేసు దర్యాప్తులో ఏమాత్రం ప్రగతి సాధించలేకపోతున్నారు.

- ఘటన మిస్టరీని ఛేదించడంలో పోలీసులకు రెండు సమస్యలు అడ్డుగా నిలుస్తున్నాయి. ఒకటి ఘటన జరిగిన ప్రాంతం నుంచి ఎటు పది కిలో మీటర్ల దూరంలోని ఎంఎంటీఎస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు లేకపోవడం. మరోవైపు బాధితురాలు ఘటన భయం నుంచి ఇంకా తేరుకోకపోవడం.
- ముఖానికి, తలకు తీవ్రమైన గాయాలు కావడం, పళ్లు ఊడిపోవడంతో యశోదా ఆసుపత్రిలో బాధితురాలికి పలు శస్త్ర చికిత్సలతో కూడిన వైద్యం చేస్తున్నారు. ఈ కారణంగా బాధితురాలు పోలీసులతో వివరంగా మాట్లాడలేకపోతోంది. బాధితురాలు కాస్త కోలుకుని ఘటన భయం నుంచి బయటపడి పూర్తి వివరాలు వెల్లడిస్తే గానీ దర్యాప్తు ముందుకు సాగే అవకాశం లేదన్నట్టు పోలీసులు భావిస్తున్నారు.
- ఘటన జరిగిన రెండో రోజే పలువురు పాత నేరస్తుల ఫొటోలను బాధితురాలికి పోలీసులు చూపించారు. ఇందులో నిందితుడి మాదిరి ఉన్నట్టు రెండు ఫొటోలను అనుమానితులుగా బాధితురాలు పేర్కొంది. ఆ ఇరువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు బాధితురాలికి చూపించగా వారిరువురు కాదన్నట్టు సమాధానం చెప్పడంతో దర్యాప్తు మళ్లీ మొదటికి వచ్చింది. ఘటన జరిగిన సమయంలో బాధితురాలు ఫోన్‌కాల్‌లో మాట్లాడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. బాధితురాలి మిత్రులను కూడా రప్పించిన పోలీసులు మరింత సమాచారం సేకరించే ప్రయత్నం చేస్తున్నారు.

త్వరలోనే నిందితుణ్ని గుర్తిస్తాం: రైల్వే పోలీసులు

అనుమానితులుగా భావిస్తున్న ఇరువురు పాత నేరస్తులు అత్యాచార యత్నానికి పాల్పడిన వారు కాదని బాధితురాలు చెప్పినప్పటికీ వారి కదలికలపై పోలీసులు దర్యాప్తు చేశారు. ఇందులో ఒకరు ఘటన జరిగిన సమయంలో కల్లు కాంపౌండ్‌లో మరొకరు ఇంకో ప్రదేశంలో ఉన్నట్టు పోలీసులు గుర్తించినట్టు సమాచారం. సికింద్రాబాద్ నుంచి మేడ్చల్ మీదుగా గుండ్ల పోచంపల్లి వరకు ఎంఎంటీఎస్ స్టేషన్లను ఆవరించి ఉన్న పలు గ్రామాల్లోనూ దర్యాప్తు చేపట్టిన పోలీసులకు నిందితుడి గుర్తింపు కోసం ఎటువంటి ఆధారాలు లభించలేదు. కాగా.. సీసీ కెమెరాలు లేకపోవడం వంటి సాంకేతిక సమస్యలతో దర్యాప్తులో ఆలస్యం జరుగుతోందని, త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని రైల్వే పోలీసులు చెబుతుండడం గమనార్హం.

మూడంచెల్లో..



చెత్త సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీ తిప్పలు

- రోజుకు మూడుసార్లు పరిశీలించే యోచన

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ విభాగాలకు సంబంధించిన సమస్యలకు ఎంతో కొంత పరిష్కారం చూపగలుగుతున్నప్పటికీ, చెత్త సమస్యలు మాత్రం తీరడం లేదు. ఏళ్ల తరబడిగా ఉన్న ఈ సమస్య పరిష్కారానికి వివిధ చర్యలు చేపడుతున్నట్లు చెబుతున్నప్పటికీ, తగిన ఫలితాలంటూ కనిపించడం లేదు. ఇంటింటి నుంచి చెత్త సేకరణ సవ్యంగా జరగకపోవడంతో రోడ్ల వెంబడి బహిరంగ ప్రదేశాల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. వీటిపై నిత్యం ఫిర్యాదులందుతున్నాయి. సోషల్ మీడియా వేదికగానూ ఫొటోలతో సహా ప్రజలు వీటిపై ఫిర్యాదు చేస్తుండటంతో ఆన్‌లైన్ మానిటరింగ్ విధాన్ని ప్రవేశపెట్టారు. అయినప్పటికీ ఫలితం కనిపించకపోవడంతో ఇప్పుడిక మూడు పర్యాయాలు చెత్త తరలింపును పరిశీలిస్తూ తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే రూ.1000 జరిమానాలు విధిస్తున్నా, ఇక్కడ చెత్త వేయొద్దని మైకుల్లో హెచ్చరిస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు. చెత్త వేసేవారికి ఈ- పెనాల్టీల విధానాన్ని సైతం అందుబాటులోకి తెచ్చారు. వీటి వల్ల జీహెచ్ఎంసీకి పెనాల్టీల రూపేణా ఆదాయం వస్తున్నప్పటికీ, ఎక్కడ పడితే అక్కడ ఉన్న చెత్త సమస్య సమసిపోలేదు.

మూడు పర్యాయాలు..

ఈ నేపథ్యంలో రోడ్ల వెంబడి చెత్త కనిపించకుండా ఉండేందుకు మూడుసార్లు పర్యవేక్షణతో, ఎక్కడ చెత్త తరలించలేదో గుర్తించి సంబంధిత సిబ్బంది, అధికారులను అప్రమత్తం చేయడం ద్వారా పరిష్కరించేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల ప్రవేశపెట్టిన ఈ విధానంలో మూడు అంశాల్ని పరిశీలిస్తున్నారు.

1. ఇంటింటి నుంచి చెత్త తరలించే స్వచ్ఛ ఆటోలు ఎన్ని గైర్హాజరవుతున్నాయో గుర్తించడం.
2. చెత్తను సర్కిళ్లలోని సమీప ట్రాన్స్‌ఫర్ స్టేషన్లకు తరలించాల్సిన ఆటోల్లో ఎన్ని పని చేయడం లేదో గుర్తించడం.
3. బహిరంగ ప్రదేశాల్లో చెత్తకుప్పలు గుట్టలుగా పోగయ్యే ప్రాంతాలను గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్‌గా గుర్తిస్తున్నారు. వాటిలో ఎన్నింటిని క్లీన్ చేసిందీ, ఎన్ని చేయనిదీ గుర్తిస్తున్నారు.

ఈ పనుల్ని కేవలం రోజుకు ఒక్కసారి మాత్రమే కాకుండా మూడు పర్యాయాలు పర్యవేక్షిస్తున్నట్లు శానిటేషన్ విభాగం అడిషనల్ కమిషనర్ సీఎన్ రఘుప్రసాద్ తెలిపారు. ఆమేరకు.. ఉదయం 8గంటలలోగా ఎన్ని స్వచ్ఛ ఆటోలు, ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల ఆటోలు తమ పని పూర్తిచేసింది గుర్తిస్తారు. పని చేయని ఆటోల సిబ్బందిని అలర్ట్ చేస్తారు. అలాగే జీవీపీల్లో ఎన్నింటిని శుభ్రం చేయలేదో గుర్తించి సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేస్తారు. తిరిగి మధ్యాహ్నం 1.30 గంటలకు మరోసారి పరిశీలిస్తారు. ఆ తర్వాత 2.30 గంటలకు మరోమారు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారు. ఉన్నతాధికారులు కార్యాలయాల నుంచే పరిశీలించేందుకు రియల్‌టైమ్‌లో ఆయా ప్రాంతాలు కనిపించేలా వెబ్‌పోర్టల్ నిర్వహిస్తున్నారు. తొలిదశలో ఉదయం 8 గంటలలోగా 30 శాతం కంటే తక్కువ పనిచేసిన వారిపై తగిన చర్యలు తీసుకోనున్నారు. తద్వారా ఒకేసారి కాకున్నా క్రమేపీ చెత్త సమస్యలు పరిష్కారమవుతాయని అధికారులు భావిస్తున్నారు.

ప్రియురాలి హత్య కేసులో పూజారికి జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పు



సాయి కృష్ణ, మృతురాలు అప్సర (ఫైల్)

శంషాబాద్ రూరల్/రంగారెడ్డి జిల్లా కోర్టులు: తనకు వివాహం జరిగిందనే విషయాన్ని దాచి.. ఆలయానికి వచ్చే మరో మహిళతో ప్రేమాయణం సాగించాడు. ప్రియురాలు పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి తేవడంతో.. ఆమెను వదిలించుకునేందుకు హత్య చేసిన పూజారికి కోర్టు జీవిత ఖైదు శిక్ష విధించింది. రెండేళ్ల క్రితం సంచలనం సృష్టించిన ఈ కేసు తీర్పు బుధవారం వెలువడింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సరూర్‌నగర్‌లో వెంకటేశ్వర కాలనీలో నివసించే పూజారి వెంకట సూర్యసాయి కృష్ణ (36)కు గతంలోనే పెళ్లి జరిగింది. ఈ ప్రాంతానికి చెందిన కారుగంటి అప్సర (30) తరచూ ఇతను పూజారిగా ఉన్న ఆలయానికి వస్తుండేది. ఆమెతో చనువు పెంచుకున్న సాయి కృష్ణ ప్రేమాయణం సాగించాడు. తనకు వివాహం అయిందనే విషయం దాచిపెట్టి ఆమెతో వివాహేతర సంబంధాన్ని ఏర్పర్చుకున్నాడు. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని సాయి కృష్ణపై అప్సర ఒత్తిడి చేయగా.. ఆమెను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు.

కారులో తీసుకొచ్చి..

కోయంబత్తూరు తీసుకెళ్లాలని అప్సర సాయికృష్ణను కోరగా.. ఇదే అదనుగా భావించి ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. అప్సరను 2023 జూన్ 3న సరూర్‌నగర్ నుంచి రాత్రి తన కారులో శంషాబాద్ తీసుకొచ్చి.. అక్కడే ఓ రెస్టారెంట్‌లో భోజనం చేశారు. ఆ తర్వాత నర్కూడలోని నవరంగ్ వెంచరులోకి తీసుకెళ్లగా.. అప్సర కారులోనే నిద్రలోకి జారుకుంది. ఈ సమయంలో ఆమె ముఖంపై కవర్ కప్పి ఊపిరి ఆడకుండా చేశాడు. స్పృహ కోల్పోయిన అప్సర తలపై రాయితో బాది హత్య చేశాడు. ఈ క్రమంలో అప్సర మిస్సింగ్ కేసు దర్యాప్తులో ఈ దురాఘతం వెలుగు చూసింది. అప్పటి ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీధర్‌కుమార్ చార్జ్‌షీట్ ఫైల్ చేయగా.. బాధితురాలి తరఫున ఈ కేసును పీపీ రవికుమార్ కోర్టులో వాదనలు వినిపించారు. ఈ కేసులో సాయి కృష్ణను ముద్దాయిగా నిర్ధారించిన రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయమూర్తి వై.జయప్రసాద్ బుధవారం అతడికి జీవిత ఖైదు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఏఎస్ఐ రామిరెడ్డి, కానిస్టేబుల్ ఎండీ.ఖాజాపాషాను ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ తీర్పుతో తన కూతురు ఆత్మకు శాంతి కలిగిందని, చివరకు న్యాయమే గెలిచిందని అప్సర తండ్రి శ్రీధర్ శర్మ ఆనందం వ్యక్తంచేశారు.

ఏటీఎంలలో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులను చూపిస్తున్న సీపీ సుధీర్‌బాబు

లింగోజిగూడ: శివారు ప్రాంతాల ఏటీఎంలే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4 లక్షల నగదు, కారు, వివిధ రకాల పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎల్‌బీనగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. రాజస్తాన్‌లోని డీగ్ జిల్లా సందీక గ్రామానికి చెందిన రాహుల్ అలియాజ్ రాహుల్ ఖాన్, మధ్యప్రదేశ్‌లో జేసీబీ మెకానిక్‌గా పని చేస్తున్న సందీక గ్రామానికి చెందిన జాహుల్ ఖాదన్ ఖాన్, జల్‌పల్లి షాజహాన్ కాలనీకి చెందిన ఎండీ సర్వారాజ్‌లు ఓ ముఠాగా ఏర్పడి ఏటీఎంలలో చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు గత ఫిబ్రవరి 22 నుంచి 26 రావిర్యాల, పహడీషరీఫ్, బాలాపూర్, జల్‌పల్లి, బీబీనగర్, భువనగిరి, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతాల్లోని ఏటీఎంల వద్ద రెక్కీ నిర్వహించారు. చివరకు రావిర్యాల, మైలార్‌దేవ్‌పల్లి ఏటీఎంలలో చోరీ చేయడానికి నిర్ణయించుకున్నారు. ఈమేరకు ఫిబ్రవరి 26న మరికొందరు స్నేహితుల సాయంతో రావిర్యాల ఎస్‌బీఐ ఏటీంలో రూ.29 లక్షల 69 వేల 900 ఎత్తుకెళ్లారు. అక్కడి నుంచి మైలార్‌దేవ్‌పల్లి, మధుబాన్ కాలనీలో మరో ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి ప్రయత్నించగా మిషన్‌లో మంటలు రావడంతో అక్కడి నుంచి నాందేడ్ మహారాష్ట్ర మీదుగా పారిపోయారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు రాహుల్‌ఖాన్, ముస్తాఖీన్ ఖాన్, వహీద్‌ఖాన్, షకీల్ ఖాన్‌లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4 లక్షల నగదు, కారు, చోరీకి ఉపయోగించిన వస్తువులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం



మహిళా సమాఖ్య సభ్యులకు చెక్కు అందిస్తున్న మంత్రి సీతక్క

గచ్చిబౌలి: రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. బుధవారం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో స్త్రీనిధి 12వ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ 2011లో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మొదలైన స్త్రీనిధి ఎంతో మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. అవకాశాలు ఇస్తే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని, కోటిమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. కోవిడ్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన యువతులను స్త్రీనిధి సభ్యులుగా చేర్చి ఆదుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అమ్మాయిలు గౌరవంగా ఉండే విధంగా మహిళాఆర్మీ కృషి చేస్తుందని, అందుకు త్వరలోనే మార్గదర్శకాలు రూపొందిస్తామని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా స్త్రీ నిధికి భవనం కేటాయిస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. స్త్రీనిధి బ్యాంక్‌పై సెర్ప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవిందర్‌రావు రూపొందించిన పాటను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. అనంతరం డివిడెండ్ ఫండ్ చెక్‌ను మహిళా సమాఖ్య సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈఆర్‌పీ సీఈఓ దివ్య, స్త్రీనిధి అధ్యక్షురాలు ఇందిర, ఎండీ విద్యాసాగర్‌రెడ్డి, కోశాధికారి సరస్వతి, కొమురంభీం అడిషనల్ కలెక్టర్ దీపక్‌తివారి, వరంగల్ అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, కోఆపరేటివ్ సొసైటీస్ రిజిస్ట్రార్ సురేంద్రమోహన్, మెప్మా మిషన్ డైరెక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పది వేల మందితో మళ్లీ వస్తాం

పేదల భూముల్లో గుడిసెలు వేస్తాం

- రెవెన్యూ సంబంధిత విషయంలో పోలీసుల జోక్యం తగదు
- రామోజీ యాజమాన్యంపై కేసులు పెట్టాలి
- త్వరలో పది వేల మందితో గుడిసెలు వేస్తాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



జాన్‌వెస్లీ, యాదయ్యతో మాట్లాడుతున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం/యాచారం: పది వేల మంది నిరుపేదలతో మరోసారి రామోజీ ఫిలిం సిటీకి వస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హెచ్చరించారు. యాజమాన్యం ఆక్రమించిన పేదల ఇళ్ల స్థలాలను వదిలేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఫిలింసిటీ వద్ద ఆందోళన నిర్వహించిన సీపీఎం నేతలను అరెస్టు చేసిన పోలీసులు వీరిని ఇబ్రహీంపట్నం, యాచారం పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాల వద్దకు వెళ్తున్న లబ్ధిదారులను పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని..ఆ భూములతో పోలీసులకు ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు. 2007లో అప్పటి ప్రభుత్వం సుమారు 600 మందికి 20 ఎకరాల్లో 60 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించి సర్టిఫికెట్లు ఇచ్చిందని.. అప్పటి నుంచి ఈ భూములు రామోజీ కబ్జాలోనే ఉన్నాయని ఆరోపించారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితంలేకపోవడంతో వారి స్థలాల్లోకి లబ్ధిదారులు వెళ్లారన్నారు. పోలీసులు రామోజీ యాజమాన్యానికి తొత్తులుగా మారి పేదలను అడ్డుకుంటున్నారని..రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకోవాల్సిన విషయంలో పోలీసులు తలదూర్చడం తగదన్నారు. రామోజీ కబంధ హస్తాల్లో ఉన్న మరో 300 ఎకరాల ప్రభుత్వ భూమిని సైతం బయటకు తీస్తామని అన్నారు. పేదల భూములు కబ్జా పెట్టిన రామోజీ యాజమాన్యంపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. పేదల పక్షాన పోరాడుతున్న తమపై కేసులు బనాయించడం సరికాదన్నారు.

నేడు, రేపు ఆందోళనలు: సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య

పోలీసుల అక్రమ అరెస్టలను నిరసిస్తూ గురు, శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పోలీసుల తోపులాటలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.జగన్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆయన్ను ఆస్పత్రికి తరలించారు. బుగ్గరాములు, సామేల్, జగదీశ్, జగన్, జంగయ్య, కిషన్, వెంకటేశ్, నర్సిరెడ్డి, ఎల్లేశ్, తులసిగారి నర్సింహ, అరుణ, స్వప్న, ప్రకాశ్‌కారత్, చరణ్, ఆనంద్, శ్రీకాంత్, శివ యాదగిరి, నర్సింహ తదితరులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసుల కస్టడీలో ఉన్న వారిని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్యపరామర్శించారు. అరెస్టులతో ప్రజా ఉద్యమాన్ని ఆపలేరన్నారు.

సమాజ పరివర్తనే సంఘ్ ప్రధాన లక్ష్యం



మీడియాతో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ నేతలు కాచం రమేష్, బర్ల సురేందర్ రెడ్డి

కాచిగూడ: సమాజ పరివర్తనే ప్రధాన లక్ష్యంగా సంఘ్ పనిచేస్తోందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) తెలంగాణ ప్రాంత కార్యదర్శి కాచం రమేష్ అన్నారు. బుధవారం బర్కత్‌పుర కేశవ నిలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ప్రాంత సంఘ చాలక్ బర్ల సురేందర్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ బెంగళూర్‌లో ఇటీవల జరిగిన ఆర్ఎస్ఎస్ అఖిల భారత ప్రతినిధుల సభలో చేసిన తీర్మానాలు, సంఘ్ శతాబ్ది సంవత్సరం సందర్భంగా తెలంగాణ, దేశ వ్యాప్తంగా చేపట్టనున్న ప్రత్యేక కార్యక్రమాలను వివరించారు. నూరేళ్ళ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సంఘ్ ఆలోచనలు, భావాలను సమాజం వద్దకు తీసుకెళ్లేలా వచ్చే నవంబర్–డిసెంబర్–జనవరి నెలల్లో దేశంలో ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి వెళ్లడానికి జన సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. సమాజ పరివర్తనకు సంబంధించిన అంశాలను ప్రజలకు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రతి లక్ష మంది ఒక యూనిట్‌గా హిందూ సమాజ ఉత్సవాలు చేస్తామని, ఇందులో స్థానిక నేతలు, హిందూ సంస్థలకు భాగస్వామ్యం కల్పించి హిందుత్వాన్ని, ధర్మాన్ని సమాజంలోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తామన్నారు.

మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు చేయండి

– గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీలలో నూతన పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని, విద్యార్థులు, పరిశోధకులు మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. బుధవారం ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ ఫిజిక్స్ విభాగంలో మల్టీ ఫంక్షనల్ మెటీరియల్స్ ఫర్ సొసైటల్ అప్లికేషన్స్ అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. కార్యక్రమానికి వీసీ ప్రొ.కుమార్ అధ్యక్షత వహించగా ఓయూ ఛాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. సమాజ అవసరాలు తీర్చేలా పరిశోధనలు జరగాలని అన్నారు. పరిశోధన ఫలాలు ప్రధానంగా గిరిజనులకు చేరాలన్నారు. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో విభిన్న విభాగాలు కలసి పని చేయాలని, తద్వారా నాణ్యతమైన ఉత్పత్తులు చౌకగా లభిస్తాయన్నారు. పరిశోధనలలో ఓయూ అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడుతోందని వీసీ ప్రొ.కుమార్ అన్నారు. అంతరం సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సదస్సు చైర్మన్, హెడ్ ప్రొ.శ్రీనివాస్, ఏఆర్‌సీఐ డైరెక్టర్ డా.విజయ్, ఎఎండీ డైరెక్టర్ ధీరజ్ పాండే, ప్రొ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్టేట్స్’ దూకుడు!

అద్దెలు చెల్లించని దుకాణాల సీజ్

- చర్యలతో దిగివస్తున్న నిర్వాహకులు
- రెండు రోజుల్లో 223 దుకాణాలకు పైగా సీజ్
- రూ. కోటికి పైగా ఆదాయం

సాక్షి, సిటీబ్యూరో: ఆర్థిక సంవత్సరం ముగియవస్తుండటంతో ఆదాయ లక్ష్యాలను చేరుకునేందుకు జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాలు ముమ్మర కసరత్తు చేస్తున్నాయి. ప్రభుత్వం ఆస్తిపన్ను బకాయిల వడ్డీలపై 90 శాతం రాయితీ కూడా ఇవ్వడంతో ట్యాక్స్ సెక్షన్ సెలవుల్లేకుండా పని చేస్తోంది. దాంతోపాటు ట్రేడ్ లైసెన్సుల విభాగం, ఎస్టేట్స్ విభాగాలు సైతం టార్గెట్లు చేరుకునేందుకు ముమ్మరంగా పర్యటిస్తూ దూకుడు పెంచాయి. ముఖ్యంగా, ఇటీవలి కాలం వరకు తన ఆస్తులేమిటో, ఎంత మొత్తం రావాలో కూడా పెద్దగా పట్టించుకోని ఎస్టేట్స్ విభాగం దూకుడు పెంచింది. ఆ విభాగానికి నగరంలోని పలు ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు, మార్కెట్లు ఉండటం తెలిసిందే. వాటిలో వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు ఎంతో ఆదాయాన్ని పొందుతున్నప్పటికీ, జీహెచ్ఎంసీకి చెల్లించాల్సిన నామమాత్రపు అద్దెలు మాత్రం చెల్లించడం లేదు. ఈ నేపథ్యంలో అద్దెల్ని కచ్చితంగా వసూలు చేయాలని భావించిన ఎస్టేట్స్ అధికారులు నిబంధనల మేరకు నోటీసులు, హియరింగ్‌లు వంటివి నిర్వహించారు. అంతిమంగా దుకాణాలను సీజ్ చేసే చర్యలు చేపట్టారు. ఈ నెల 8వ తేదీన తొలుత ఈ చర్యలు ప్రారంభించాక, కొద్దిమేర ఫలితం కనిపించింది. తిరిగి మళ్లీ పరిస్థితి షరామామూలుగా మారడంతో మంగళ, బుధ వారాల్లో సంబంధిత అధికారులు, సిబ్బంది దూకుడు పెంచారు. ప్రముఖ వాణిజ్య ప్రాంతాల్లో, భారీ వ్యాపాలు జరిగే ప్రాంతాల్లో ఉన్న కాంప్లెక్స్‌లలో భారీ బకాయిల అద్దెలున్న దుకాణాలను సీజ్ చేశారు.

- వీటితోపాటు సికింద్రాబాద్ ఓల్డ్ జైల్ కాంప్లెక్స్, పుత్లిబౌలి తదితర ప్రాంతాల్లోనూ కొన్ని షాపుల్ని సీజ్ చేశారు. వెరసి మొత్తం 223కు పైగా దుకాణాల్ని సీజ్ చేశారు.
- దీంతో దిగివచ్చిన వ్యాపారులు చెల్లించాల్సిన అద్దెల బకాయిల్లో కొంత చెల్లించి, మిగతా త్వరలో చెల్లిస్తామని వేడుకున్నారు. పుత్లిబౌలిలోని రెండు దుకాణాల నుంచే రూ.2.36 లక్షలు వసూలైంది. అలా రెండు రోజుల్లో రూ. 46 లక్షల అద్దెలు వసూలయ్యాయి. సీజ్ చేసిన మిగతా దుకాణాల నుంచీ అద్దెలు రాగలవని అధికారులు ఆశిస్తున్నారు. అలా ప్రస్తుతం సీజ్ చేసిన దుకాణాల నుంచి రూ. కోటికి పైగా వచ్చే అవకాశముందని చెబుతున్నారు.



సుల్తాన్‌బజార్‌లో అధికారులు సీజ్ చేసిన దుకాణం

సీజ్ చేసిన దుకాణాలు ఇలా..

ఎక్కడ	ఎన్ని
కోఠి సబ్‌వే	67
సుల్తాన్‌బజార్ కాంప్లెక్స్	53
పటాన్‌చెరు	56
మంగళ్‌హాట్ మార్కెట్	24
కుషాయిగూడ	23

నేటి నుంచి జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు

సాక్షి, సిటీబ్యూరో: గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో గురువారం నుంచి 4వ కేఐఓ జాతీయ కరాటే చాంపియన్ షిప్–2025 పోటీలు నిర్వహిస్తున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ కె.శివసేనారెడ్డి తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో దేశం నలుమూలల నుంచి సుమారు 1500 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉదయం టోర్నమెంట్ ఏర్పాట్లను పరిశీలించారు. దేశ వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులతో మన అథ్లెట్ల నైపుణ్యాన్ని పంచుకోవడం, కరాటే కమ్యూనిటీ బలోపేతానికి ఉపయోగపడుతుందన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరై పోటీలను ప్రారంభిస్తారన్నారు. శనివారం ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీలు విజయవంతం చేయడానికి స్పోర్ట్స్ అథారిటీ తరుపున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

గంజాయి ‘డాన్’ అరెస్టు

సికింద్రాబాద్: వివిధ రాష్ట్రాల వ్యాపారులతో ఒప్పందాలు చేసుకుని పెద్దమొత్తంలో గంజాయి సరఫరా చేస్తున్న లేడీ డాన్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి బుధవారం వెల్లడించిన కథనం ప్రకారం..ఒడిశా రాష్ట్రం కుర్ధా జిల్లా కాళీకోట్ గ్రామానికి చెందిన సంగీతా సాహు క్రమేణా అంతర్రాష్ట గంజాయి డాన్‌గా ఎదిగింది. ఇన్‌స్టాలో పోస్టింగ్‌లతో పలువురు ఫాలోవర్లను కలిగి ఉన్న సంగీతా సాహు అధికంగా డబ్బు సంపాదించడం కోసం గంజాయి వ్యాపారాన్ని ఎంచుకుంది. గంజాయి వినియోగం ఎక్కువ ఉండే ప్రాంతాలను టార్గెట్ చేసుకుని కస్టమర్లకు సరఫరా చేస్తుంది. తెలంగాణలో నమోదైన ఐదు గంజాయి కేసుల్లో నిందితురాలైన సంగీతా సాహు పరారీలో ఉన్నారు. ఇందులో ఒకటి సికింద్రాబాద్ రైల్వే పోలీసులు, మిగతా నాలుగు ధూల్‌పేట్ పోలీసులు నమోదు చేసినవి కావడం గమనార్హం. సంగీతా సాహును అదుపులోకి తీసుకునేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంను ఏర్పాటు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ స్పెషల్ టీం ఎస్ఐ సైదులు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీధర్, కానిస్టేబుళ్లు మహేశ్, అరుణ్, మంగలు ఒడిశా వెళ్లి నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు.

పత్తర్‌గట్టీ భవనం పెచ్చులూడి..ఇరువురికి గాయాలు



దూద్ బౌలి: పాతబస్తీలోని చారిత్రక కట్టడం పత్తర్‌గట్టీ భవనం పెచ్చులూడి ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. బుధవారం రాత్రి వందలాది మంది రంజాన్ షాపింగ్‌లో మునిగి ఉండగా..అకస్మాత్తుగా పత్తర్‌గట్టీ భవనంలోని ఓ షాపు కిటికీ పైనుంచి గచ్చు పెచ్చులు ఊడిపడగా షాపు ముందున్న ఓ చిరువ్యాపారి, మరో యువకుడు గాయపడ్డారు. సమాచారం అందుకున్న చార్మినార్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. పురావస్తు శాఖ అధికారులు చారిత్రాత్మక కట్టడం అయినా పత్తర్‌గట్టి భవనాన్ని పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వివాహం కావడం లేదని..

జీవితంపై విరక్తి చెంది వైద్యుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: పెళ్లి నిశ్చితార్థం చెడిపోవడం, వయసు మీరినా వివాహం కావడం లేదనే మానసిక ఆవేదనతో జీవితంపై విరక్తి చెంది ఓ ఎంబీబీఎస్ డాక్టర్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ రైల్వే ఎస్ఐ డి.రమేశ్ కథనం ప్రకారం..కాప్రా ప్రధానంపూరి కాలనీ అన్నపూర్ణ రెసిడెన్సీలో నివాసం ఉంటున్న పి.పురోహిత్ కిషోర్ (34) ఎంబీబీఎస్ డాక్టర్. అల్వాల్‌లోని బస్తీ ఆసుపత్రిలో డాక్టర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అవివాహితుడైన పురోహిత్ కిషోర్ అన్న, సోదరితో కలిసి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. పురోహిత్‌కు వివాహం అవడం లేదన్న బెంగ ఉండేది. కొద్ది రోజుల క్రితం ఒక అమ్మాయితో వివాహం కుదిరి నిశ్చితార్థం కూడా చేసుకున్నారు. ఇది జరిగిన కొద్ది రోజుల తరువాత అమ్మాయి తరపు వారు డాక్టర్‌తో పెళ్లి సంబంధం వద్దనుకుని జరిగిన నిశ్చితార్థాన్ని రద్దు చేసుకున్నారు. దీంతో డాక్టర్ పురోహిత్ మరింత మానసిక ఆందోళనకు గురయ్యాడు. ఇక తనకు పెళ్లి జరగదని మనోవేదనకు గురైన అల్వాల్ బస్తీ ఆసుపత్రి నుంచి నేరుగా తన ద్విచక్ర వాహనంపై బొల్లారం రైల్వేస్టేషన్ బ్యారక్ మెయిన్ లైన్ వద్దకు చేరుకున్నాడు. రైల్వే ట్రాక్ సమీపంలో తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి అదే సమయంలో వేగంగా వస్తున్న నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆర్డర్ల పేరుతో అందినంత స్వాహా

- నగరవాసికి టోకరా వేసిన సైబర్ నేరగాళ్లు
- ఢిల్లీలో ఇద్దరిని అరెస్టు చేసిన సిటీ సైబర్ కాప్స్



రణ్‌వీర్ సింగ్, అమర్‌నాథ్ సింగ్

సాక్షి, సిటీబ్యూరో: నగర వ్యాపారిని ఫోన్ ద్వారా సంప్రదించి, భారీ ఆర్డర్ల పేరుతో ఎర వేసి, మోసం చేసిన కేసులో ఇద్దరు సైబర్ నేరగాళ్లను సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీలో పట్టుబడిన వీరిపై దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో 17 కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించామని డీసీపీ దార కవిత బుధవారం వెల్లడించారు. ఇంటర్‌నెట్ ద్వారా నగర వ్యాపారి ఫోన్ నెంబర్ సంగ్రహించిన సైబర్ నేరగాళ్లు సంప్రదించారు. ఆయన ఉత్పత్తులకు ఉత్తరాదిలో మార్కెటింగ్ చేస్తామని, భారీ ఆర్డర్లు తెస్తామంటూ నమ్మబలికారు. దీనికోసం తమ వద్ద రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వీరి మాట నమ్మిన వ్యాపారి రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించారు. ఆపై వ్యాపారి ఉత్పత్తులకు దేశ, విదేశాల్లో భారీ డిమాండ్ ఉన్నట్లు, వారి నుంచి ఆర్డర్లు వస్తున్నట్లు సైబర్ నేరగాళ్లు నకిలీ ఈ–మెయిల్స్ సృష్టించారు. ఇవన్నీ నిజమేనని సదరు వ్యాపారి నమ్మారు. ఆ సరుకు సరఫరాకు ముందు తమకు రూ.9.5 లక్షల చెల్లించాలని చెప్పిన సైబర్ నేరగాళ్లు ఆ మొత్తం తన ఖాతాలో పడిన తర్వాత స్పందించడం మానేశారు. దీంతో మోసపోయినట్లు తెలుసుకున్న బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ కె.ప్రసాద్‌రావు నేతృత్వంలో కానిస్టేబుళ్లు జి.క్రాంతి కుమార్ రెడ్డి, ఎ.సతీష్, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, జె.వెంకటేష్, జి.రాకేష్‌లతో కూడిన బృందం దీన్ని దర్యాప్తు చేసింది. బ్యాంకు ఖాతాలతో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి ముందుకు వెళ్లిన అధికారులు ఢిల్లీలో ఓ డమ్మీ కంపెనీకి సీఈఓగా ఉన్న అమర్‌నాథ్ సింగ్, మార్కెటింగ్ హెడ్‌గా పని చేస్తున్న రణ్‌వీర్ సింగ్ బాధ్యులని తేల్చారు. అక్కడకు వెళ్లిన ప్రత్యేక బృందం వీరిని అరెస్టు చేసింది. వీరిపై మహారాష్ట్ర, పంజాబ్‌ల్లో రెండేసి, రాజస్థాన్‌లో 5, హర్యానా, పశ్చిమ బెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, కర్ణాటక, మధ్యప్రదేశ్‌ల్లో ఒక్కోటి చొప్పున కేసులు ఉన్నట్లు గుర్తించారు.

ఎంసీఈఎంఈని సందర్శించిన ఆర్మీ చీఫ్



కంటోన్మెంట్: టెక్నాలజీ పరంగా భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆర్మీ సంసిద్ధంగా ఉండాలని చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (సీఓఏఎస్) జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. బుధవారం ఆయన సికింద్రాబాద్‌లోని మిలటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ (ఎంసీఈఎంఈ)ని సందర్శించారు. ‘ఆత్మ నిర్భర్’లో భాగంగా ఎంసీఈఎంఈ పరిధిలోని ల్యాబరేటరీల్లో రూపొందించిన అధునాతన పరికరాలు, చేపట్టిన ప్రాజెక్టులను పరిశీలించారు. డ్రోన్‌లు, అటానమస్ రోబోటిక్స్, క్వాంటమ్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో ఈఎంఈ టెక్నీషియన్స్ సామర్థ్యాన్ని పరిశీలించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఈఎంఈలో చోటు చేసుకుంటున్న మార్పుల పట్ల సీఓఏఎస్ సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనున్నారు.

డీసిల్టింగ్ పనులు ముమ్మరం

- ప్రధాన నాలాల్లోంచి వ్యర్థాల తొలగింపు
- రెండు వారాల్లో పూర్తి చేయాలని లక్ష్యం
- వర్షాకాలంలో వరద నీటికి అడ్డంకులు లేకుండా పనులు

బంజారాహిల్స్: వర్షాకాల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వరదనీటి కాలువలో డీసిల్టింగ్ పనులు వేగవంతం చేశారు. వరద వచ్చినప్పుడు నీరు ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందుకుసాగేందుకు వీలుగా ముందస్తు చర్యలు చేపడతారు.

- జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలో భారీ వరదనీటి కాలువల్లో డీసిల్టింగ్ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ప్రేంనగర్ కారంపూడి బస్తీ నుంచి ఖైరతాబాద్ నాసర్ స్కూల్ మీదుగా హుస్సేన్‌సాగర్ మురుగునీటి శుద్ధి కేంద్రం వరకు 1.6 కిలోమీటర్ల మేర ఉన్న బుల్కాపూర్ నాలాలో గత పది రోజులుగా వ్యర్థాలు, బురద, మట్టిని తొలగిస్తున్నారు. ఇప్పటికే లారీల కొద్దీ వ్యర్థాలను తొలగించి కుప్పలుగా పోశారు.
- దీనిని జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు తరలించనున్నారు. ఏటా వానాకాలానికి ముందే నాలాల్లో బురదను తొలగించడం ద్వారా వర్షాలు పడ్డప్పుడు వరదనీరు ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందుకువెళ్లాలనే ఉద్దేశంతో ఈ పనులు చేస్తున్నారు.
- ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని 40కి పైగా చిన్నపాటి నాలాల్లో కూడా డీసిల్టింగ్ పనులు దాదాపుగా పూర్తి కావస్తున్నాయి. ఎప్పటికప్పుడు పనులను డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి పరిశీలిస్తున్నారు. సర్కిల్ పరిధిలో అతి పెద్ద నాలా బుల్కాపూర్ కాగా, ఇందులో నుంచే పెద్ద ఎత్తున వ్యర్థాలను వెలికితీయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.


ఖైరతాబాద్ నాలాలో డీసిల్టింగ్ పనులను పరిశీలిస్తున్న డీసీ రజనీకాంత్‌రెడ్డి

జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో..

మాన్సూన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో డీసిల్టింగ్ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ప్రధాన బుల్కాపూర్ నాలాలో నుంచి వ్యర్థాలను పెద్ద ఎత్తున తొలగిస్తున్నారు. షేక్‌పేట నుంచి ఫిలింనగర్, హకీంపేట, బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12 భోళానగర్, ఖాజానగర్ మీదుగా చింతల్ బస్తీ నుంచి కారంపూడి బస్తీ, ఖైరతాబాద్ మీదుగా ఈ కాలువ పారుతోంది. ప్రత్యేక నిధులు కేటాయించి డీసిల్టింగ్ పనులు చేపట్టారు.

- బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో ప్రధాన కాలువలతో పాటు అంతర్గత నాలాల నుంచి డీసిల్టింగ్ పనులు చేస్తున్నారు. మరో రెండు వారాల్లో ప్రీ మాన్సూన్ యాక్షన్ ప్లాన్ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ పనులను డీసీ ప్రశాంతి పర్యవేక్షిస్తున్నారు.

వ్యర్థాల తొలగింపులో నిర్లక్ష్యం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వెనుక రోడ్డు నిర్మాణ వ్యర్థాలను తొలగించడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆ నిర్మాణ వ్యర్థాల్లో సమీపంలోని వారు చెత్త వేసి మరింత దుర్గంధం వ్యాపింపజేస్తున్నారు. ఇక్కడి నందినగర్‌లో రోడ్డు నిర్మించిన తర్వాత ఆ నిర్మాణ వ్యర్థాలను తొలగించాలి. అయితే రోడ్డు నిర్మాణం రెండు నెలల క్రితమే పూర్తయ్యింది. రోడ్డు నిర్మించేటప్పుడు కూడా జీహెచ్ఎంసీ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడంతో నందినగర్‌లో నిర్మించిన రోడ్డు కూడా అప్పుడే శిథిలావస్థకు చేరుకున్నాయి. మరోవైపు రోడ్డు నిర్మాణ వ్యర్థాలను తొలగించాలంటూ స్థానికులు జీహెచ్ఎంసీకి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకుండాపోయింది. కొంతమంది నేరుగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి ఫిర్యాదు చేయడంతో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై మండిపడినట్లు తెలిసింది. వెంటనే నందినగర్‌లో పేరుకుపోయిన రోడ్డు నిర్మాణ వ్యర్థాలతో పాటు చెత్తను తొలగించాలని ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు రోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్‌పై మండిపడుతున్నారు. కమిషనర్ ఇలంబర్తి ఆదేశాల నేపథ్యంలో వీటిని తొలగిస్తారా? లేదా అని వేచిచూడాలి.


చెత్త కుప్పలా మారిన రోడ్డు నిర్మాణ వ్యర్థాలు

రాష్ట్రాలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

- కేంద్రం నిధుల్లో వాటా పెరగాలి
- మండ్యా విశ్వవిద్యాలయం వీసీ శివ చితప్ప

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగం, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఐసీఎస్ఎస్ఆర్ ఆధ్వర్యంలో 'భారతదేశంలో ఆర్థిక సమాఖ్యవాదం –వికేంద్రీకరణ, అభివృద్ధి, ఆర్థిక స్థితిగతులు' అనే అంశంపై జాతీయ సదస్సు బుధవారం జరిగింది. దీనికి మండ్యా విశ్వవిద్యాలయం (కర్ణాటక) ఉపకులపతి ఆచార్య కె.శివచితప్ప ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని, రాష్ట్రాలు ఆర్థిక స్వావలంబన సాధించాలంటే కేంద్రం అందించే నిధుల్లో రాష్ట్రాల వాటా పెంచాలని అభిప్రాయపడ్డారు. దేశంలో నెలకొన్న అసమానతలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక సంఘం ఇచ్చిన సూచన ప్రకారం ఆర్థిక సంఘం ఆ దిశగా ప్రయత్నాలు చేస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. సదస్సుకు అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి మాట్లాడుతూ... సమాజంలోని అన్ని వర్గాలకు అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉన్నత విద్యావకాశాలు కల్పిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు సేవలు అందిస్తుందన్నారు. ఐసీఎస్ఎస్ఆర్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ... దేశంలోని విశ్వవిద్యాలయాల్లో అనేక పరిశోధనలు కొనసాగుతున్నాయని, వాటికి అవసరమైన ఆర్థిక సహకారాన్ని ఐసీఎస్ఎస్ఆర్ అందిస్తోందని వివరించారు. దేశంలో నెలకొన్న ఆర్థిక అసమానతలను 16వ ఆర్థిక సంఘం తొలగిస్తుందని, దక్షిణాది రాష్ట్రాలకు న్యాయపరంగా రావాల్సిన ఆర్థిక కేటాయింపులు చేసేలా సంఘం సిఫారసులు చేస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సులో దేశవ్యాప్తంగా పలు విశ్వవిద్యాలయాల నుంచి ఆర్థిక శాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థులు, పలు విశ్వవిద్యాలయాల అధ్యాపకులు పాల్గొని తమ తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. అంబేడ్కర్ వర్సిటీ రిజిస్ట్రార్ విజయ కృష్ణారెడ్డి, సామాజిక శాస్త్రాల విభాగ డీన్ వడ్డాణం శ్రీనివాస్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ చిట్టేడి కృష్ణారెడ్డి, ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సదస్సు ముగింపు కార్యక్రమంలో మండ్యా విశ్వవిద్యాలయం వీసీ శివచితప్ప

'అక్షయపాత్ర'కు విద్యుత్ వాహనాల వితరణ

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, మార్కెట్‌లు, అంగన్‌వాడీలు, నగరంలో రూ. 5కు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న అక్షయపాత్ర ఫౌండేషన్‌కు వాఘ్ బక్రీ ఫౌండేషన్ తన తోడ్పాటును అందించింది. బుధవారం నార్సింగిలోని అక్షయ పాత్ర ఫౌండేషన్ వద్ద భోజనాన్ని తరలించేందుకు అవసరమైన 9 ఎలక్ట్రిక్ వాహనాలను అందజేశారు. ఆహారం తాజాదనాన్ని కాపాడేలా టెంపరేచర్ కంట్రోల్ సౌకర్యంతో వాటిని ప్రత్యేకంగా తయారు చేశారు. ప్రముఖ టీవీ నటి సుమ కనకాల, వాఘ్ బక్రీ టీ గ్రూప్ సీఈఓ సంజయ్‌సింగ్‌లు అక్షయపాత్ర ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు యాగ్నేశ్వర్‌దాస్‌కు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేదలకు నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్న అక్షయపాత్రకు తమ వంతు తోడ్పాటును అందిస్తామన్నారు. అక్షయపాత్ర 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలలోని 78 ప్రదేశాల్లో వంటశాలలను నిర్వహిస్తున్నదన్నారు. 23 వేల పాఠశాలలు, అంగన్‌వాడీలకు 22.5 లక్షల మంది పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని అందజేస్తున్నదన్నారు. వాఘ్‌బక్రీ ఫౌండేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యోగేశ్‌శిండే, దక్షిణ విభాగం అధిపతి పి.వి.సురేష్, సీఎస్ఆర్ అధిపతి అజయ్ సిసిలియా తదితరులు పాల్గొన్నారు.


వాహనాలను అందజేస్తున్న సుమ, వాఘ్ బక్రీ ప్రతినిధులు

జూనియర్ వైద్యురాలికి వేధింపులు

వెంగళరావునగర్: జూనియర్ వైద్యురాలిని వేధింపులకు గురి చేస్తున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... గుంటూరు ప్రాంతానికి చెందిన యువతి స్థానిక మధురానగర్‌కాలనీలో నివసిస్తూ జూనియర్ వైద్యురాలిగా విధులు నిర్వహిస్తుంది. ఈ నెల 23న ఆమెకు వాట్సాప్ నుంచి వల్గర్‌గా ఉన్న మెసేజ్ వచ్చింది. చదివిన అనంతరం మెసేజ్ తొలగించి ఆ నెంబర్‌ను బ్లాక్ చేసింది. అనంతరం మరో మెసేజ్ వచ్చింది. వీడియో కాల్ కూడా చేశాడు. అతని పేరు మహేష్ నాయుడు అని తెలిపాడు. ఆర్మీ సిబ్బందితో ఉన్నట్టుగా వీడియో ఉంది. ఆమె దానిని కూడా బ్లాక్ చేసింది. అనంతరం తన స్నేహితుడైన నవనీత్‌రెడ్డికి ఈ విషయాన్ని తెలిపింది. అతను 24వ తేదీ ఆ నెంబర్‌కు ఫోన్ చేయగా మహేష్ నాయుడు అనే వ్యక్తి నవనీత్‌రెడ్డిని సైతం అభ్యంతరకరమైన పదజాలంతో దూషించాడు. ఆమె తల్లిదండ్రులకు మెసేజ్‌లు పంపుతానని, బెదిరింపులకు గురి చేస్తున్నాడు. తనను మానసిక వేధింపులకు గురి చేస్తూ బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్న మహేష్ నాయుడుపై చర్యలు తీసుకోవాలని జూనియర్ వైద్యురాలు మధురానగర్ పీఎస్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్స్‌ను సందర్శించిన జిప్మర్ బృందం

లక్డీకాపూల్: పాండిచ్చేరి జిప్మర్ హాస్పిటల్ ఆఫీసర్ ఇంచార్జ్ డైటిక్స్ ప్రొఫెసర్ లత చతుర్వేదుల ఆధ్వర్యంలో వైద్యుల బృందం హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌ను బుధవారం సందర్శించారు. మొదట నిమ్స్ ఇంచార్జ్ డైరెక్టర్ డీన్ ప్రొఫెసర్ లీజా రాజశేఖర్ నిమ్స్ డైటిషన్ శాలిలను కలిశారు. నిమ్స్ డైటిక్స్ డిపార్టెమెంట్‌ను సందర్శించి వంటశాల, స్టోర్స్‌ను పరిశీలించారు. ఆరోగ్యశ్రీ ద్వారా రోగులకు అందుతున్న భోజన సదుపాయల గురించి నిమ్స్ డైటిషన్ శాలిని అడిగి తెలుసుకొని సంతప్తిని వ్యక్తం చేశారు.

చిన్నారి వైద్యానికి ఎమ్మెల్యే దానం చేయూత

- వైద్యం కోసం రూ. 6 లక్షలు సాయం చేసిన ఎమ్మెల్యే
- కోలుకున్న చిన్నారి భవ్యశ్రీ

బంజారాహిల్స్: వెంకటేశ్వరకాలనీ డివిజన్ ప్రతాప్ నగర్‌లో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి చెందిన కునా దుర్గాప్రసాద్ కుమార్తె భవ్యశ్రీ (6) ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధితో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో చేర్చారు. అయితే పాపకు మెరుగైన చికిత్సను అందించాలని, ఇందుకు రూ. 6 లక్షల వరకు ఖర్చవుతుందని హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. ఈ విషయాన్ని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలుసుకుని వెంటనే ఆస్పత్రి యాజమాన్యానికి ఫోన్ చేసి భవ్యశ్రీకి వెంటనే మెరుగైన చికిత్స అందించాలని కోరారు. పాప చికిత్సకు అయ్యే ఖర్చును తానే చూసుకుంటానని భరోసా ఇవ్వడంతో ఆస్పత్రి వర్గాలు పాపకు చికిత్సను అందించాయి. ప్రస్తుతం పాప ఆరోగ్యంగా హాస్పిటల్ నుంచి ఇంటికి రాగా కుటుంబ సభ్యులు పాపతో కలిసి బుధవారం ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.


ఎమ్మెల్యే దానంకు కృతజ్ఞతలు తెలుపుతున్న చిన్నారి భవ్యశ్రీ తల్లిదండ్రులు

మామిడిని రసాయనాలతో మగ్గబెట్టే వారిపై చర్యలు తీసుకోండి


ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న వినియోగదారుల హక్కుల సంస్థ ప్రతినిధులు

బంజారాహిల్స్: మామిడి పండ్లను ప్రమాదకర, నిషేధిత రసాయనాలతో మగ్గిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర వ్యాప్తంగా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పండ్లు రవాణా చేసే వాహనాలను తనిఖీ చేయాలని వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు కోరారు. బుధవారం ఆయన సంస్థ ప్రతినిధులతో కలిసి రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది మాదిరిగానే ఈ సారి కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని చెక్‌పోస్టుల వద్ద పండ్లు రవాణా చేసే లారీలను చెక్‌చేసేందుకు విజిలెన్స్ అధికారులతో పాటు సర్క్యులర్‌ను జారీ చేయాలని కోరారు. రసాయనాలతో మగ్గించిన పండ్లు తిని ప్రజలు ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్నారని ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రానికి వచ్చే వాహనాలతో పాటు మన రాష్ట్రం నుంచి కూడా ఇతర రాష్ట్రాలకు వందలాది పండ్ల లారీలు కెమికల్స్‌తో మగ్గించిన పండ్లను సరఫరా చేస్తున్నారని అన్నారు. పండ్ల మార్కెట్లలో కూడా రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని కోరారు. నిషేధిత రసాయనాలను అధిక మోతాదులో వాడటం వల్ల ఎంతో మంది పండ్లు తిని అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలైన ఘటనలను వారు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గూడపర్తి శివకుమార్, స్టేట్ సెక్రటరీ ఆర్.రాజేష్, ఎస్.క్రిస్టఫర్, తాండ్ర రమేష్, మధుబాబు, సంతోష్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ ఢీ కొని వ్యక్తి మృతి

పంజగుట్ట: రెండు రోజుల క్రితం ఓ వాటర్ ట్యాంకర్ డ్రైవర్ తప్పతాగి పంజగుట్ట పోలీసులకు చిక్కగా బుధవారం తెల్లవారు జామున మరో వాటర్ ట్యాంకర్ డ్రైవర్ మత్తులో వాహనం నడిపి ఓ వ్యక్తి మృతికి కారణమయ్యాడు. పోలీసుల సమాచారం మేరకు... ఏఎస్‌రావు నగర్‌లో ఉండే జి.వి.వి.బి.కిషోర్ (52) జూబ్లీహిల్స్‌లో ఓ సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేస్తుంటాడు. బుధవారం ఉదయం విధులు ముగించుకుని ఇంటికి వచ్చే క్రమంలో గ్రీన్‌ల్యాండ్స్ కూడలి వద్ద వాటర్ ట్యాంకర్ ఢీ కొట్టింది. దీంతో కిషోర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వాటర్ ట్యాంకర్ డ్రైవర్ అన్నానగర్‌కు చెందిన పి.బద్దు సింగ్ మద్యం మత్తులో నాంపల్లి నుంచిమ్యారీగోల్డ్ హోటల్‌కు వాటర్ ట్యాంకర్‌ను తీసుకువచ్చే క్రమంలో నిర్లక్ష్యంగా వాహనం నడిపి కిషోర్‌ను ఢీ కొట్టడంతో అతను మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. పోలీసులు బద్దు సింగ్‌ను అదుపులోకి తీసుకుని వాటర్ ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్లకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు

బంజారాహిల్స్: వేసవి నేపథ్యంలో బస్తీ దవాఖానాలు, అర్బన్ హెల్త్ సెంటర్లకు ఆరోగ్య శాఖ అధికారులు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పెద్ద ఎత్తున సరఫరా చేశారు. బంజారాహిల్స్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు బుధవారం 5 వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వేసవి నేపథ్యంలో చిన్న పిల్లలు, పెద్ద వారు ఎక్కువగా డీ హైడ్రేడ్ అవ్వడానికి అవకాశం ఉన్న నేపథ్యంలో వెంటనే వారికి తక్షణ ఎనర్జీని ఇచ్చేందుకు ఈ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎన్బీటీ నగర్ బస్తీ దవాఖానాతో పాటు ఎన్బీ నగర్, వెంకటేశ్వర నగర్, ప్రతాప్‌నగర్, ఫిలింనగర్, ఇందిరానగర్ బస్తీ దవాఖానాలకు సైతం ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.


బంజారాహిల్స్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు

జైస్వాల్‌వాడ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

హిమాయత్‌నగర్: జైస్వాల్‌వాడ బస్తీ సమస్యలపై యూత్ కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు బస్తీ వాసులు వినతి పత్రం అందజేశారు. బుధవారం మైనారిటీ లీడర్ ఎం.డి.సర్ఫరాజ్ ఉద్దీన్, ఇతర బస్తీ నేతలతో కలిసి అనీష్ కుమార్ ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిశారు. స్ట్రీట్ లైట్స్‌లో వాటర్ ప్రెషర్, డ్రైనేజ్, మాన్ హోల్ డామేజ్‌ల సమస్యలు తీవ్రంగా ఉన్నట్లుగా తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమస్యలపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు బస్తీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.

వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

వెంగళరావునగర్: వాహనదారులందరూ తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ట్రాక్స్ ఎస్ సేవా సంస్థ నిర్వాహకురాలు ఆరాధ్య కోరారు. యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లో ఉన్న సాయికృప హైస్కూల్ చిన్నారులకు బుధవారం ట్రాక్స్ ఎస్ సేవా సంస్థ నిర్వాహకులు దాదాపు 90 హెల్మెట్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఆరాధ్య మాట్లాడుతూ... ఐసీఐసీఐ బ్యాంకు సహకారంతోనే ఉచితంగా హెల్మెట్లు అందించామన్నారు. యూసుఫ్‌గూడ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్కూల్ చైర్మన్ రాజారావు, కరస్పాండెంట్ అంజనారావు, సంస్థ ప్రతినిధులు, స్కూల్ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లతో మతసామరస్యం

- నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి


ఇఫ్తార్‌కు హాజరైన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి


ఇఫ్తార్‌లో పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి

బంజారాహిల్స్: రంజాన్ మాసం సందర్భంగా రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని రెనోవా ఎన్ఐజీఎల్ హాస్పిటల్స్‌లో దావత్–ఇ–ఇఫ్తార్ విందును నిర్వహించారు. కార్యక్రమానికి జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కాలనీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... రంజాన్ మాసం సందర్భంగా నిష్టతో పాటించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం, శాంతి సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక దైవ ప్రార్థనలతో శాంతి, సోదరభావానికి ప్రతీక రంజాన్ పండగ అన్నారు. హాస్పిటల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్ పెద్దిరెడ్డి, ఆర్.వి.రాఘవేంద్రరావు, రాకేష్‌శర్మ, రాధాకృష్ణారావు సాగి, రవీంద్రనాథ్ గరగ, జహీర్, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సోదర భావం పెంపొందిస్తుంది: వినోద్‌రెడ్డి

హిమాయత్‌నగర్: ఇఫ్తార్ విందులు ప్రజల్లో సోదర భావం పెంపొందిస్తాయని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెం.14 ఆదర్శ్ బస్తీలో హిమాయత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ మైనారిటీ సీనియర్ నాయకుడు జాకి హుస్సేన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకీల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్‌రెడ్డి మాట్లాడుతూ... అల్లాకృప అన్ని వర్గాల ప్రజలపై ఉండాలన్నారు. కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయారెడ్డి, నిరంజన్, నాయకులు నవాబ్ ముజయద్, అలంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రహమత్‌నగర్: ఇఫ్తార్ విందులు కులమతాలకు అతీతంగా నిర్వహించడం మత సామరస్యానికి నిదర్శనమని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్ ఆధ్వర్యంలో సైట్–1 కమాన్ వద్ద కొనసాగుతున్న సహర్ కార్యక్రమంలో ఆయన బుధవారం ఉదయం పాల్గొని సేవలందించారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకుడు కాసుల మహేష్ కుమార్‌గౌడ్, నేతలు చెట్టి దేవేందర్, రాజీ, రజాక్, ఆనంద్, బాలరాజ్‌గౌడ్, షేక్ వలీ, చెన్నయ్య, వినయ్, కవిత, మున్నా, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సహర్‌లో చైర్మన్ శివసేనారెడ్డి, కార్పొరేటర్లు

బొమ్మగాని ధర్మభిక్షంకు నివాళి

లిబర్టీ: ఉద్యమమే ఊపిరిగా... పోరాటమే ధ్యేయంగా లోక్‌సభ మాజీ సభ్యుడు, కమ్యూనిస్టు కురువృద్ధుడు బొమ్మగాని ధర్మభిక్షం పని చేశారని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి అన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు... నిజాం పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. నేటి తరానికి ధర్మభిక్షం స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని స్పష్టం చేశారు. ధర్మభిక్షం వర్ధంతి సందర్భంగా బుధవారం లిబర్టీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యమమే ఆయనకు ఊపిరి పోసిందని పోరాటమే ఆయన ప్రాణమని గుర్తు చేశారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: వేసవిలో పాదచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు బస్తీ సంక్షేమ సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘాలు చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. బుధవారం బంజారాహిల్స్ రోడ్‌నెం. 4లోని సుభ్‌దేవ్‌నగర్ బస్తీలో నీలం లలిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వేసవి సందర్భంగా ప్రధాన రోడ్లపై, కాలనీ కూడళ్ల వద్ద మరిన్ని చలివేంద్రాలు ప్రారంభించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు నీలం నర్సింగ్‌రావు, పి. వెంకటేష్, ఎం. శ్రీనివాస్, ఎం. గోవర్ధన్, సుధాకర్ పాల్గొన్నారు.

'జైబాపు, జైభీమ్, జైసంవిధాన్'ను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయారెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ నియోజకర్గం పరిధిలో నిర్వహించబోయే జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమ సన్నాహక కార్యక్రమాన్ని బుధవారం ఖైరతాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ విజయారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ... త్వరలో నిర్వహించే జై బాపు, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–1/4 జీవీకే చౌరస్తాలో బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తాజ్‌కృష్ణా వైపు నుంచి పంజగుట్ట వైపు అదుపుతప్పిన వేగంతో దూసుకెళ్తున్న కారు జీవీకే చౌరస్తాలో కంట్రోల్ చేయలేక డివైడర్‌తో పాటు కరెంటు స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. అదృష్టవశాత్తూ కారు నడుపుతున్న వ్యక్తి క్షేమంగా బయటపడ్డాడు. ఈ ఘటనపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

శ్రీనగర్‌కాలనీ: ప్రజా ధనంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత యాదవ్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిగూడలో రూ. 40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె బుధవారం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వనం శ్రీనివాస్ యాదవ్, బస్తీ, కాంగ్రెస్ నాయకులు మనోజ్ యాదవ్, కిరణ్ యాదవ్, సంతోష్ గౌడ్, అంజిబాబు, షేక్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



సాక్షి
గురువారం । 27 । మార్చి । 2025

స్వల్ప కాల కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: ఓయూ రోడ్డులోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ(డీడీఎంఎస్) లిటరసీ హౌస్ అకాడమి క్యాంపస్‌లో వివిధ స్వల్ప కాల కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్, ట్యాలీ ప్రైమ్, బ్యూటీషియన్ సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ ఉంటుందని డీడీఎంఎస్ కార్యదర్శి కె.ఉషారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పోకెన్ ఇంగ్లిష్ కేరీర్ గైడెన్స్, పైథాన్, టైలరింగ్, డిజైనర్ బ్లౌజెస్, డ్రెస్ డిజైనింగ్, మగ్గం వర్క్స్, జ్యూట్ బ్యాగ్ మేకింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ కోర్సుల్లోనూ అన్ని వయస్సుల వారికి శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. పాట్ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్, డిజైనర్ పేపర్ బ్యాగ్స్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, యోగ, ఫ్లవర్ మేకింగ్, జ్యూవెలరీ మేకింగ్ తదితర వాటిల్లోనూ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఏప్రిల్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన వారు డీడీఎంఎస్ లిటరసీ హౌస్‌లో నేరుగా లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సెల్: 62811 39282 నంబర్‌లో సంప్రదించగలరు.

అవగాహనతోనే కొలొరెక్టల్ కేన్సర్‌కు చెక్


స్క్రీనింగ్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న అపోలో కేన్సర్ సెంటర్ వైద్యులు

బంజారాహిల్స్: కొలొరెక్టల్ కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి నిరోధించే సమగ్ర స్క్రీనింగ్ ప్రోగ్రాంను అపోలో కేన్సర్ సెంటర్(ఏసీసీ) బుధవారం ప్రారంభించింది. సర్వైవల్ రేట్‌ను పెంచడం, చికిత్స ఖర్చులను తగ్గించడం, చివరి దశరోగ నిర్ధారణలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆస్పత్రి వైద్యులు స్పష్టం చేశారు. ప్రారంభ స్క్రీనింగ్ కొలొరెక్టల్ కేన్సర్ నివారణలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఇది ముందస్తు పాలిప్స్‌ను గుర్తించి చికిత్స ఖర్చులను తగ్గించేందుకు సహాయపడుతుందని పేర్కొన్నారు. పెద్దవారు, యువతలో కొలొరెక్టల్ కేన్సర్ స్క్రీనింగ్‌ను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. సరైన జీవనశైలిని పాటించకపోవడం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, జన్యుపరమైన లక్షణాలు కొలొరెక్టల్ కేన్సర్ ప్రమాదాలను గణనీయంగా పెంచుతున్నాయన్నారు. కార్యక్రమంలో అపోలో కేన్సర్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ అజేష్ రాజ్ సక్సేనా, అపోలో హాస్పిటల్స్ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ రఘు, తెలంగాణ రీజియన్ సీఈఓ తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో లంబాడీలకు స్థానం కల్పించాలి



పంజగుట్ట: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు స్థానం కల్పించాలని తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కోరారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 40 లక్షల జనాభా ఉన్న లంబాడీలకు ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణ వచ్చిన తరువాత ప్రతి మంత్రివర్గంలో స్థానం ఉండేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నా ఇప్పటివరకు స్థానం కల్పించకపోవడం విచారకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నో సభల్లో మాట్లాడుతూ లంబాడీల మద్దతుతోనే అధికారంలోకి వచ్చామని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. సమావేశంలో నాయకులు రామచంద్ర నాయక్, సురేష్ నాయక్, హరికిషన్ నాయక్, సుబ్బు నాయక్, రమేష్ రాథోడ్, భావసింగ్, నరేందర్, నరేష్, కార్తిక్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన ఇండియానా ప్రతినిధులు



సాక్షి, సిటీబ్యూరో: అమెరికాలోని ఇండియానా స్టేట్ ప్రతినిధి బృందం జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఇండియానా స్టేట్, జీహెచ్ఎంసీల మధ్య 2010లో సిస్టర్ సిటీ ఒప్పందం కుదిరింది. నగరంలో జరుగుతున్న వివిధ కార్యక్రమాల గురించి మేయర్ సదరు బృందానికి వివరించారు. సిస్టర్ సిటీ ఒప్పందంలో భాగంగా తమ స్టేట్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు వారు తెలిపారని జీహెచ్ఎంసీ పేర్కొంది. కానీ..అవేమిటో పేర్కొనలేదు. జీహెచ్ఎంసీ కూడా ఒప్పందంలో భాగంగా ఏం చేసిందో తెలియజేయక పోవడం విశేషం. సిస్టర్ సిటీ ఒప్పందాలంటూ ఆర్భాటంగా చెబుతున్నప్పటికీ, అందులో భాగంగా నిర్వహించిన కార్యక్రమాలు, వాటి వల్ల నగరానికి జరిగిన ప్రయోజనం గురించి జీహెచ్ఎంసీ ఎలాంటి వివరాలూ వెల్లడించలేదు. జీహెచ్ఎంసీ గతంలో ఇతర దేశాలతోనూ సిస్టర్ సిటీ ఒప్పందాలు కుదుర్చుకుంది.

ఇష్టమైనవి తింటూ.. నచ్చినవి కొంటూ..

- నగరంలో ఊపందుకున్న రంజాన్ షాపింగ్
- పాతబస్తీలో జోరుగా నైట్ బజార్లు



సాక్షి, సిటీబ్యూరో/చార్మినార్ : రంజాన్ మాసంలో నగరంలోని మార్కెట్లు కళకళలాడుతున్నాయి. వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. నైట్ బజార్లు ఆకర్షిస్తున్నాయి. ముస్లింలు సాయంత్రం ఇఫ్తార్ అనంతరం వివిధ వస్తువుల కొనుగోలుకు ప్రాధాన్యమిస్తున్నారు. సాయంత్రం 4 నుంచి తెల్లవారుజాము 4 వరకు రాత్‌బజార్‌లు జోరుగా సాగుతున్నాయి. వస్త్రాల నుంచి పాదరక్షల వరకు కొత్తవి ధరించడం ఈద్ సంప్రదాయం. ఇళ్ల అలంకరణ వస్తువులు, జానీ మాజ్‌లు, సుర్మా, అత్తరు పరిమళాలు కొనుగోలు చేస్తున్నారు. రంజాన్ పండుగ రోజు తయారు చేసే షీర్ కుర్మాకు వినియోగించే పాత్రలతోపాటు వస్తువుల కొనుగోలులో బిజీబిజీగా ఉన్నారు. ఇఫ్తార్ అనంతరం హోటళ్లు, హలీం సెంటర్ల వద్ద కూడా కోలాహలం నెలకొంటోంది. పనిలో పనిగా నచ్చిన వస్తువులు కొనుగోలు చేస్తూ, ఇష్టమైన వంటకాలను ఆస్వాదిస్తున్నారు. నగరంలో ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాల్లో ఏ గల్లీలో చూసినా సందడే సందడి. అడుగడుగునా జనమే జనం. ఇక పాతబస్తీలో చెప్పనక్కర లేదు. మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు రంజాన్ బజార్లు కొనసాగుతున్నాయి. చార్మినార్ ప్రధాన రోడ్డులో ఒక్కోసారి కాలినడక కూడా సాధ్యంకావడం లేదు. రంజాన్ మాసం ముగియడానికి ఇంకా రెండు రోజుల సమయమే ఉండటంతో వినియోగదారులు భారీగా దుకాణాలకు తరలివస్తున్నారు. ఈ నెల 28న జుమ్మాతుల్ విదా, 30 తేదీ నెలవంక కనబడితే మునటి రోజు రంజాన్ పండుగ జరుపుకుంటారు.

ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా...

రంజాన్ పండుగ రోజు ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతి ముస్లిం కుటుంబంలోని సభ్యులు అందరూ నూతన దుస్తులు ధరిస్తారు. దీంతో వాటిని ఖరీదు చేయడానికి అధిక సంఖ్యలో వస్త్ర దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. పాతబస్తీలో టైలర్ షాపులకు కూడా గిరాకీ బాగా పెరిగింది. మహిళలు ముచ్చటగొలిపే రంగురంగుల గాజులను ఖరీదు చేయడానికి లాడ్‌బజార్ పరిసర ప్రాంతాల్లోని దుకాణాలకు తరలివస్తున్నారు. పాతబస్తీ ప్రజలే కాకుండా నగరంలోని వివిధ ప్రాంతాల, శివారు జిల్లాల నుంచి కూడా అధిక సంఖ్యలో ఇక్కడికి వచ్చి గాజులను ఖరీదు చేస్తారు.

ఆధునిక టెక్నాలజీదే భవిష్యత్తు

స్ఫూర్తి-2025 వర్క్‌షాప్‌లో వక్తలు


స్ఫూర్తి-2025 వర్క్‌షాప్‌లో పాల్గొన్న భరత్ నీడికొండ తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ: రానున్నదంతా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ యుగమేనని వక్తలు అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో బుధవారం స్ఫూర్తి-2025లో భాగంగా ఐఓటీ విత్ మిషన్ లెర్నింగ్ అనే అంశంపై రెండు రోజుల వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా స్వేచ్ఛ ఫౌండేషన్‌కు చెందిన భరత్ నీడికొండ, ఖాజా మహ్మద్, శ్రీనివాస్‌తోపాటు ఈసీఈ విభాగాధిపతి రజిని, సీనియర్ ప్రొఫెసర్ ప్రతాప రెడ్డి హాజరయ్యారు. హైదరాబాద్‌లోని వివిధ ఇంజనీరింగ్ కళాశాలల నుంచి దాదాపుగా 400 మంది విద్యార్థులు ఈ వర్క్ షాప్‌కి హాజరయ్యారు. ఈ సందర్భంగా భరత్ నీడికొండ, ఖాజా మహ్మద్, శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మాత్రమే సమాజంలో తనదైన పాత్ర పోషిస్తుందని, వందలాది మంది మనుషులు చేయగలిగే పనులను సైతం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, మిషన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక టెక్నాలజీలు పూర్తి చేస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమదైన శైలిలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సమాజంలో అనేక సంవత్సరాలుగా పేరుకుపోయిన సమస్యలకు పరిష్కారాలను వెతికి అభ్యున్నతి సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్ఫూర్తి-2025 నిర్వాహకులు అర్జున్, అనీష్, ప్రసన్న, గాయత్రి, అరవింద్, విజ్ఞత, సాహితి, హీరవర్ధన్, వేదశ్రీ, సాయికుమార్, వర్ష, షర్మిల పాల్గొన్నారు.

'యునానీ' ఆస్తిపన్ను బకాయి రూ. 3.28 కోట్లు చెల్లింపు


డీఎంసీకి చెక్కు అందజేస్తున్న ఆస్పత్రి డైరెక్టర్

వెంగళరావునగర్: ఏకకాలంలో యునానీ ఆస్పత్రి బకాయి మొత్తం చెల్లించారని జీహెచ్ఎంసీ సర్కిల్-19 ఉప కమిషనర్ జకియా సుల్తానా తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ(నేషనల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యునానీ మెడిసిన్) కేంద్రియ యునానీ ఆస్పత్రి జీహెచ్ఎంసీకి గత 14 ఏళ్లుగా దాదాపు రూ. 8 కోట్ల వరకు బకాయి ఉన్నట్టు చెప్పారు. బుధవారం యునానీ ఆస్పత్రి డైరెక్టర్‌ను కలిసి పెనాల్టీ మీద 90 శాతం రాయితీ ఉన్నట్టుగా వివరించగా మిగిలిన మొత్తం రూ.3 కోట్ల 28 లక్షలకు సంబంధించిన చెక్కు అందించినట్టు పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలో ఇంకా కోట్లాది రూపాయల బకాయిలు ఉన్నాయని, ప్రతి సంస్థ ముందుకు వచ్చి పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని సూచించారు. కాగా, ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే పెనాల్టీపై 90 శాతం రాయితీ ఇస్తుందని, అనంతరం అసలు, వడ్డీ పూర్తిగా చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 30, 31వ తేదీల్లో కూడా పన్నుకు సంబంధించిన సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, ఆన్‌లైన్‌లో కూడా చెల్లించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీలు బాల్‌రాజ్, కమల్, యునానీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజల సందర్శనార్థం ప్రవీణ్ భౌతికకాయం

రాంగోపాల్‌పేట్: అనుమానాస్పదంగా మరణించిన పాస్టర్ ప్రవీణ్ పగడాల భౌతికకాయాన్ని గురువారం సికింద్రాబాద్ క్లాక్‌టవర్ ప్రాంతంలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో ఉంచుతారు. గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఆయన భౌతికకాయాన్ని చర్చి ఆవరణలో ఉంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. అనంతరం తిరుమలగిరిలోని బాప్టిస్ట్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

హెచ్‌సీయూ-ఫ్లిండర్స్ వర్సిటీ ఒప్పందం


వీసీ ప్రొఫెసర్ బీజే రావు సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్న దృశ్యం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ-దక్షిణ ఆస్ట్రేలియాకు చెందిన ఫ్లిండర్స్ విశ్వవిద్యాలయం మధ్య వ్యూహాత్మక ఒప్పందం దక్షిణ ఆస్ట్రేలియా ప్రీమియర్, ఆస్ట్రేలియన్ దౌత్యవేత్తల సమక్షంలో బుధవారం జరిగింది. దీర్ఘకాలిక విద్యా సహకారం, ఆరోగ్య సంరక్షణ, వ్యాపార విద్యలో ప్రపంచస్థాయి సహకారాన్ని రెండు సంస్థలు పెంపొందించుకోవడం ఈ ఒప్పందం ఉద్దేశం. హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు, దక్షిణ ఆస్ట్రేలియా ఎంపీ పీటర్ మలినాస్కాస్, భారతదేశంలో ఆస్ట్రేలియన్ హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ ఓమ్, బెంగళూరులోని ఆస్ట్రేలియన్ కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీ సమక్షంలో హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగమ్, ఫ్లిండర్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కాలిన్ స్టిర్లింగ్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ప్రొఫెసర్ జీవీఆర్‌కే ఆచార్యులు అసోసియేట్ ప్రొఫెసర్ ఆంజీ ఏ షఫీ, డాక్టర్ మదన్ బాలసుబ్రమణియన్ తదితరులు పాల్గొన్నారు.

'భగీరథ' కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ


మాట్లాడుతున్న నరసింహ

హిమాయత్‌నగర్: మిషన్ భగీరథ పథకం పరిధిలో దాదాపు 17 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని, వీరికి కనీస వేతనాల జీవోలు వర్తింపజేయకుండా మెఘా కన్‌స్ట్రక్షన్స్, ఎల్ అండ్ టీ లాంటి పెద్ద కంపెనీలు శ్రమ దోపిడీ చేస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ అన్నారు. బుధవారం ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర మిషన్ భగీరథ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) సమావేశం రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడు తూ ఈ సంస్థలో పంప్ ఆపరేటర్లు, లైన్‌మెన్లు, హెల్పర్లు, ఫిట్టర్లు, ఎలక్ట్రీషియన్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, వాచ్‌మెన్లు, స్వీపర్లు అతి తక్కువ వేతనాలకు పని చేస్తున్నారన్నారు. జీవో నెం.60 ప్రకారం వీరికి కనీస వేతనాలు చెల్లించాలని చాలా ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని చెప్పారు. పండగలు, జాతీయ సెలవులు, ఆర్జిత సెలవులు, వారాంతపు సెలవులు, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ లాంటి సౌకర్యాలు కల్పించడంలేదని విమర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. కార్మికులు ఎం.రఘు, సి.శేఖర్, టి.సత్యనారాయణ, పి.శ్రీనివాస్, ఎం.ప్రభాకర్ రెడ్డి, ఎం.డి.జానీ, ఎస్.రాంప్రసాద్, పాషా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలకు మరింత ప్రోత్సాహం


ఒప్పందం కార్యక్రమంలో టీజీఐసీ తాత్కాలిక సీఈఓ మెరాజ్ ఫహీమ్ తదితరులు

18 కళాశాలలతో టీజీఐసీ ఒప్పందం

రాయదుర్గం: రాష్ట్రమంతటా ఆవిష్కరణలకు మరింత ప్రోత్సాహం కల్పించేందుకు తెలంగాణ ఇన్నోవేషన్ సెల్(టీజీఐసీ) ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. బుధవారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో టీజీఐసీ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 18 కళాశాలలతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. టీజీఐసీ తాత్కాలిక సీఈఓ మెరాజ్ ఫహీమ్ సమక్షంలో 18 కళాశాలల ప్రతినిధులు, టీజీఐసీ ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, హైదరాబాద్, కరీంనగర ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, వనపర్తి, వికారాబాద్, యాదాద్రి జిల్లాలకు చెందిన కళాశాలలతో టీజీఐసీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా మెరాజ్ ఫహీమ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతిస్థాయిలో ఆవిష్కరణలు వృద్ధి చెందడమే లక్ష్యంగా టీజీఐసీ పనిచేస్తుందన్నారు. అవగాహనా సదస్సులు నిర్వహించడం, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, కంపెనీలు ఏర్పాటయ్యేలా చూడటం వంటివి చేపట్టనున్నట్లు చెప్పారు. ఆయా విద్యా సంస్థల విద్యార్థులు తమ స్థానిక ఆవిష్కర్తలకు సాధికారత కల్పిస్తారని చెప్పారు. వ్యవస్థాపకత, వృద్ధికి గల అవకాశాలను అందరికీ అందుబాటులో ఉండేలా కృషి చేస్తుందన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు


నిందితుడు బబ్లూ సాగర్

రాజేంద్రనగర్: మైనర్ బాలిక కిడ్నాప్, లైంగిక దాడి కేసులో నిందితుడికి రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి పోక్సో కోర్టు పదేళ్ల జైలు శిక్ష, రూ.7 వేల జరిమానా విధించింది. ఈ మేరకు న్యాయమూర్తి అంజనేయులు బుధవారం తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.3 లక్షల పరిహారాన్ని అందించాలని ఆదేశించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ మల్లేష్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం... మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ మేఘన హిల్స్ ప్రాంతంలో కర్ణాటక రాష్ట్రం బీదర్ ప్రాంతానికి చెందిన భార్యాభర్తలు 15 ఏళ్ల కూతురుతో కలిసి నివసిస్తున్నారు. బీదర్‌కు చెందిన బబ్లూ సాగర్ (27) కూడా అక్కడే గుడిసె వేసుకొని నివసిస్తున్నాడు. 2018 జులై 22వ తేదీన సాయంత్రం బాలిక (15)కు బబ్లూసాగర్ మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేశాడు. రాత్రి అయినా బాలిక ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆమె కోసం వెతికారు. అయినా జాడ తెలియకపోవడంతో మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బబ్లూ సాగర్‌పై బాలిక కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు నిందితుడి ఆచూకీ తెలుసుకొని పట్టుకున్నారు. సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయమూర్తి బుధవారం తుది తీర్పునిచ్చారు.

42 శాతం రిజర్వేషన్లపై చట్టం తీసుకురావాలి

బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం


అభివాదం చేస్తున్న గుజ్జ సత్యం, నీల వెంకటేష్, రామకృష్ణ, అంజి

హిమాయత్‌నగర్: నలభై రెండు శాతం బీసీ రిజర్వేషన్లపై చట్టం చేసి ప్రభుత్వం వెంటనే రెండు జీవోలు జారీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బీసీ బిల్లుకు చట్టం రూపం తీసుకొచ్చి అమలు చేయాలన్నారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గుజ్జ సత్యం మాట్లాడుతూ తెలంగాణ బీసీ బిల్లుకు అఖిలపక్ష మద్దతు కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. బీసీలకు విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు 29 శాతం నుంచి 42 శాతం, స్థానిక సంస్థల రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచుతూ రెండు బిల్లులు పాస్ చేయడం చరిత్రాత్మకమని అన్నారు. అయితే ఈ బిల్లులను కేంద్రానికి పంపి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూడటం సరికాదన్నారు. జయలలిత గతంలో తమిళనాడు బీసీల కొరకు తమిళనాడు నుంచి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్ బిల్లు పాస్ అయ్యే వరకు అక్కడే ఉన్నారన్న విషయాన్ని గుర్తుచేశారు. బిహార్ అసెంబ్లీలో బిల్లు పాస్ అయిన తర్వాత ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, అంజి, జెల్ల నరేందర్, సూర్యనారాయణ, అనంతయ్య, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరు పెట్టాలి: కూనంనేని


ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సాంబశివరావు, ఎమ్మెల్సీ సత్యం

హిమాయత్‌నగర్: సూర్యాపేట జిల్లాకు సాయుధ పోరాట యోధుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు బొమ్మగాని ధర్మభిక్షం పేరు పెట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం ఇక్కడి మగ్దూం భవన్‌లో ధర్మభిక్షం 14వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ధర్మభిక్షం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించిన ధర్మభిక్షం గొప్ప నాయకుడని కొనియాడారు. అనేక మందికి ఆయన ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నగరంలోని రెడ్డి హాస్టల్ ప్రేరణతో తెలుగు భాష, విద్య అవసరాన్ని గుర్తించి సూర్యాపేట కేంద్రంగా హాస్టల్ నెలకొల్పి అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, గీత పనివారల సంఘం నేతలు బొమ్మగాని ప్రభాకర్, సాయిలు గౌడ్, ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, నాయకులు రమావత్ అంజయ్య నాయక్, మారుపాక అనిల్‌కుమార్, పుట్ట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల హత్యపై సమగ్ర విచారణ చేపట్టాలి


సమావేశంలో వివిధ క్రిస్టియన్ సంఘాల నేతలు

పలు క్రిస్టియన్ సంఘాల డిమాండ్

పంజగుట్ట/సుల్తాన్ బజార్: రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రంలోని బీజేపీ సంతోషం కోసమే పాలన సాగిస్తున్నట్లు ఉందని, ఇద్దరు నిజాయతీ గల పాస్టర్లు దారుణంగా హత్యకు గురైనా ప్రభుత్వాల్లో చలనం లేదని పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి హత్యలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజీవ్ సాగర్, సౌత్ ఇండియా జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ సాల్మన్ రాజు, హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రిస్టియన్ సంఘాల నేతలు బిషప్ పాస్టర్, సుజీవన్, సుధీర్‌కుమార్ మాట్లాడారు. ఏపీ పోలీసులపై తమకు నమ్మకం లేదని, ప్రవీణ్ హత్యను ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోందని, ఈ కేసును హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అన్నారు. ప్రవీణ్ శరీరం మీద ఉన్న దుస్తులు కొద్దిగా కూడా చినగలేవని, దీనిని బట్టి ఎవరో ఆయనపై దాడి చేసినట్లే ఉందని అన్నారు. ఒక వర్గం వారితో తనకు ప్రాణహాని ఉందని గత నెలలోనే ఆయన ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని విమర్శించారు. ఇటీవల హైదరాబాద్‌లో ఎర్రబాబు ఇజ్రాయల్‌ను అతి దారుణంగా హత్య చేశారని, ప్రవీణ్, ఇజ్రాయెల్ ఇద్దరూ పేదల కోసం సేవాకార్యక్రమాలు చేపట్టేవారని అన్నారు. సమావేశంలో క్యాథలిక్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ ప్రధానకార్యదర్శి లియో, రిటైర్డ్ జిల్లా జడ్జ్ రాజ్‌కుమార్, జిమ్మి కిరణ్, డేవిడ్, మోజెస్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రజకులకు రిజర్వేషన్లు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

పంజగుట్ట: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును అసెంబ్లీలో ఆమోదించిన నేపథ్యంలో రజకులకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని పలు రజక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర రజక ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓయూ జేఏసీ వైస్ చైర్మన్ గంపల శ్రీనివాస్, యువ నాయకుడు డాక్టర్ కె.వెంకన్న మాట్లాడుతూ తరతరాలుగా సమాజానికి సేవకులుగా ఉంటున్న రజకులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎంతో వెనకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రజక ఫెడరేషన్‌కు పాలకమండలిని నియమించి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు. మంత్రివర్గ విస్తరణలో రజక ఎమ్మెల్యేకుగానీ, ఎమ్మెల్సీకి గానీ అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఉప్పల్ భగాయత్‌లో రజక ఆత్మగౌరవ భవనం నిర్మాణానికి వెంటనే భూమిపూజ చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చైతన్యయాత్ర చేసిన అనంతరం ఏప్రిల్‌లో 50 వేల మంది రజకులతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో నాయకులు ఇందిరాల మురళి, బి.వెంకన్న, రామచంద్రరాజు, శ్రీకాంత్, సంపత్, రవికుమార్, శ్రీనివాస్, సారయ్య, అశోక్, రాజు, పోతరాజు పాల్గొన్నారు.

వర్సిటీల నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలు పెంచాలి

నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు వెంకటేష్



ధర్నాలో మాట్లాడుతున్న వెంకటేష్

కవాడిగూడ: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో టైం స్కేల్, డైలీ వేజ్, ఎన్ఎంఆర్, కాంటిజెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో విధులు నిర్వహిస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది వేతనాలను పెంచాలని, కాంట్రాక్టు ఉద్యోగులను టైమ్ స్కేల్ సిబ్బందిగా మార్చాలని తెలంగాణ యూనివర్సిటీస్ నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జె.వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీస్ నాన్‌టీచింగ్ సిబ్బంది వేతనాలు పెంచడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 18 యూనివర్సిటీల్లో దాదాపు 10 వేల మంది నాన్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారని, రెగ్యూలర్ ఉద్యోగులకు వీరికి వేతనాల్లో చాలా వ్యత్యాసాలు ఉన్నాయని అన్నారు. జేఎన్‌టీయూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ, కాకతీయ వర్సిటీల్లో ఈపీఎఫ్ అమలు చేయాలని కోరారు. రిటైర్ అయిన సిబ్బందికి 5 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్ అందించాలన్నారు. ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టు రవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.నారాయణ, ఉపాధ్యక్షులు ఎం.పద్మశ్రీ, కోశాధికారి మహ్మద్ సలార్, నాయకులు అమీర్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 27, మార్చి, 2025

ఎండలు మండుతున్నాయి.. ఉదయం 10 గంటలు దాటితే భానుడు భగ్గుమంటున్నాడు. ఈ సమయంలో మైనస్ డిగ్రీల్లో గడ్డకట్టే చల్లని ప్రదేశం కోసం ఎదురుచూస్తున్నారా..? ఉపశమనం కోసం హిమగిరుల్లో సేదతీరాలని కోరుకుంటున్నారా.. సిమ్లా పొగ మంచులో విహరించాలని, డార్జిలింగ్ గడ్డకట్టిన మంచుపై స్కేటింగ్ చేయాలని ఆశిస్తున్నారా.. అయితే మీకోసం నగరంలో స్నో థీమ్‌తో వింటర్ థ్రిల్లింగ్ ప్రదేశాలు సిద్ధంగా ఉన్నాయి. కశ్మీర్ మంచు కొండల అనుభూతిని కొండాపూర్‌లోని ఓ మాల్‌తో పాటు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఓ ప్రాంతంలో సొంతం చేసుకునే అవకాశం కల్పిస్తున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో

కశ్మీర్ అందాలతో..
హాయిదరాబాద్

కుటుంబ సభ్యులు, పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, కార్పొరేట్ సంస్థలు, ఐటీ కంపెనీ ఉద్యోగులు ఇలా వివిధ వర్గాలకు చెందిన వారిని ఆకట్టుకోవడానికి వింటర్ థ్రిల్లింగ్ వినోద కేంద్రాల్లో ప్రత్యేకించి ప్యాకేజీలు ప్రకటిస్తున్నారు. కుటుంబ వ్యవహారాలు, చదువు, పని ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం మైనస్ డిగ్రీల్లో సేదతీరేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. స్నో ప్రాంతంలోకి ప్రవేశించడానికి ముందు చలిని తట్టుకునే జర్కినీ, బూట్లు, చేతి గ్లౌజ్‌లు నిర్వాహకులు అందిస్తారు. విశాలమైన మంచు గదిలోకి వెళ్లగానే కశ్మీర్, సిమ్లా, డార్జిలింగ్ తదితర ప్రదేశాలు గుర్తుకొస్తాయి. మంచు కొండలు ఉన్న ప్రదేశాలకు వెళ్లాలంటే ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవచ్చు. ఇక్కడే తక్కువ ఖర్చుతో ఆ అనుభూతి పొందవచ్చు. మండు వేసవిలో గడ్డకట్టిన స్నో, పొగ మంచుపై కాసేపు సరదాగా ఎంజాయ్ చేయవచ్చు.







మంచు క్రీడలు..

విశాలమైన అతిశీతల గదుల్లో మంచు క్రీడలు అందుబాటులో ఉంటాయి. టోబోగానింగ్, స్నో స్లెడ్డింగ్, స్నో రాక్ క్లైమింగ్, స్నో డాన్స్, ఫ్లోర్‌లో డాన్స్ వంటివి ప్లాన్ చేసుకోవచ్చు. మంచు ప్యాలెస్‌లు, మంచుతో కప్పబడిన పర్వతాలు, నల్ల సీల్స్‌తో కూడిన ఓక్ చెట్లు, ధ్రువ ఎలుగుబంట్లు, పెంగ్విన్‌లు, ఇగ్లూలు కనువిందు చేస్తున్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో స్నో మచ్ ఫన్, గేమ్స్‌తో గొప్ప జ్ఞాపకాలను సొంతం చేసుకోవచ్చు. పిల్లలు, పెద్దలకు వేర్వేరుగా టికెట్ ధరలు ఉంటాయి.



పిల్లలు బాగా ఎంజాయ్ చేస్తున్నారు

హిమాలయాల్లో ఉన్నామన్న ఫీల్ ఉంది. చాలాబాగా నచ్చింది. గడ్డకట్టిన ఐస్, పొగమంచు, వివిధ రకాల థీమ్స్ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. మేం మొత్తం ఐదుగురం వచ్చాం. మా కంటే మా పిల్లలు బాగా ఎంజాయ్ చేస్తున్నారు.
– దీప, షేక్‌పేట్, హైదరాబాద్

బాగా నచ్చింది..

మాది విశాఖపట్నం. మా ఫ్రెండ్ బర్త్‌డే పార్టీకి గతంలో ఇక్కడికి వచ్చాం. ఈ ప్రాంతం ఎంతగానో నచ్చింది. మరో రావాలనిపించింది. పాఠశాలలకు సెలవులు కావడంతో మళ్లీ మా అక్క నేను వచ్చాం. మంచులో బాగా ఎంజాయ్ చేస్తున్నాం.
– హనీష్, రిథిమ, విశాఖపట్నం









మేజిక్.. మిస్టరీ.. మెంటలిజమ్ 5న..


సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ది హైదరాబాద్ కాంజురర్స్ గ్రూప్ ఆధ్వర్యంలో మేజిక్, మిస్టరీ, మెంటలిజమ్ పేరుతో వినోద భరిత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఒత్తిడితో కూడిన పరీక్షల అనంతరం విరామంతో పాటు వినోదాన్ని కోరుకునే విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని దీన్ని నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో మెజీషియన్స్, మెంటలిస్ట్స్.. తమ విన్యాసాలతో అబ్బురపరుస్తారన్నారు. నగరానికి చెందిన ఇంద్రజాలికుడు వేణు వింజమూరితో పాటు రాజేష్, మైను తదితరులు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. హైటెక్ సిటీలోని టి ఫైవ్‌లో ఈ కార్యక్రమం వచ్చేనెల 5వ తేదీన రాత్రి 6.15 గంటల నుంచి ఉంటుందని వివరించారు. బుక్ మై షో ద్వారా ఎంట్రీలను పొందవచ్చన్నారు.



థియేటర్ ఆర్ట్స్‌లో విద్యార్థి ప్రపంచ రికార్డు

మల్లాపూర్: నాచారం డక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి సాయిఅక్షయ్ అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి రికార్డు సృష్టించాడు. 'థియేటర్ ఆర్ట్స్' అనే అంశంపై గతనెలలో ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో మూడు భాషల్లో ఒకేసారి 5 నిమిషాల్లో అద్భుతమైన పాట మోనోలాంగ్ మైమ్‌ను ప్రదర్శించి ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈ సందర్భంగా పాఠశాలలో చైర్మన్ నవనీతరావు, ప్రిన్సిపాల్ సమామీనన్, కిషోర్‌కుమార్ రెడ్డి విద్యార్థిని అభినందించారు.

క్రియేటర్స్‌కి కేరాఫ్.. హైదరాబాద్



సాక్షి, సిటీబ్యూరో: నగరం సృజనాత్మక శక్తి కలిగిన క్రియేటర్లకు చిరునామాగా మారిందని సోషల్ మీడియా ప్రముఖులు అభిప్రాయపడ్డారు. ప్రముఖ సోషల్ వేదిక స్నాప్‌చాట్ తన తొలి స్నాప్‌చాట్ క్రియేటర్ కనెక్ట్‌ను నగరంలోని దుర్గం చెరువు సమీపంలో ఉన్న ఆలివ్ బిస్ట్రో రెస్టారెంట్‌లో బుధవారం నిర్వహించింది. కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ కంటెంట్ క్రియేటర్లకు తోడ్పడేందుకు నగరానికి చెందిన క్రియేటివ్ మీడియా సంస్థలు, తమడ మీడియా, చాయ్ బిస్కెట్, సిల్లీ మాంక్స్‌లతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించారు. క్రియేటర్లకు అన్ని రకాలుగా సహకారంతో పాటు ఆదాయం అర్జించే అవకాశాలను మెరుగుపరచమే లక్ష్యంగా ఈవెంట్ నిర్వహించినట్లు స్నాప్ ఇన్ కార్పొరేషన్ కంటెంట్, ఏఆర్ భాగస్వామ్యాల డైరెక్టర్, సాకేత్ ఝా సౌరభ్ తెలిపారు. క్రియేటర్లకు అవగాహన, మార్గదర్శకత్వం అందించడంతో పాటు తమ స్నాప్ స్కూల్ స్టోరీ చెప్పే నైపుణ్యాలను మెరుగుపరచడంలో, తమ ఇతర సాధనాలను ఉపయోగించుకోవడంలో సహాయపడుతుందన్నారు.

సృజనను పునర్నిర్వచిస్తున్నారు..

కార్యక్రమానికి సెలబ్రిటీ గెస్ట్‌గా హాజరైన సినీ హీరో నాని క్రియేటర్లతో కాసేపు సంభాషించి వారిలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ప్రస్తుతం యువ క్రియేటర్లు స్టోరీ టెల్లింగ్‌ను పునర్నిర్వచిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయని పావని, శ్వేతా నాయుడు, నైనికా అనసురు, ప్రణవి, అనుష రత్నం తదితర 50 మందికి పైగా అగ్రశ్రేణి క్రియేటర్లు పాల్గొన్నారు.

నెక్ట్స్ జనరేషన్ స్టోర్.. ఫ్యాషన్ హుషార్..

సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్ ఫ్యాషన్ స్టోర్స్ కారణంగా ఫ్యాషన్ ప్రియులు భారీగా పెరిగినట్టు అమేజాన్ ఫ్యాషన్ వెల్లడించింది. తమ నెక్ట్స్ జనరేషన్ స్టోర్ డేటా ఆధారంగా ఈ విషయం స్పష్టమవుతోందని, ముఖ్యంగా ద్వితీయ, తృతీయశ్రేణి పట్టణాల నుంచి ఫ్యాషన్ స్పృహలో గణనీయమైన పెరుగుదల కనిపిస్తోందని తెలియజేసింది. దాదాపు 2 మిలియన్‌కు పైగా ఉత్పత్తులతో 340పైగా దేశీయ అంతర్జాతీయ బ్రాండ్స్‌కు చెందిన విస్తృతమైన పోర్ట్ ఫోలియోను ప్రదర్శిస్తుండటం దీనికి ఒక కారణంగా పేర్కొంది. ఈ నేపథ్యంలో మరిన్ని బ్రాండ్స్, ఫ్యాషన్ ట్రెండ్స్ స్టోర్స్‌లో వెల్లువెత్తనున్నాయని తెలిపింది.



- జాక్ ఫ్రూట్ హలీం.. మష్రూమ్ ఛాయ్‌తో పాటు ఎన్నెన్నో..
- రీన్-ది చెఫ్స్ స్టూడియో వేదికగా 'పెహ్‌చాన్' పాప్-అప్
- ముంబైకి చెందిన 'మసాలా లైబ్రరీ' ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్ట్

ఫుడ్ లవర్స్ కోసం వినూత్న రుచులు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో హలీం అంటే దాదాపు తెలియని వారుండరు.. కానీ జాక్ ఫ్రూట్ హలీం గురించి ఎప్పుడైనా విన్నారా..? ఈ హలీంతో పాటు వినూత్నంగా స్మోక్ ఫుల్ లాంబ్ హలీమ్, కోల్డ్ బ్రూ బ్రిన్డ్ జామున్ విత్ ఫిల్టర్ కాఫీ స్నాప్ వంటి పసందైన వంటకాలు నగరం వేదికగా అలరిస్తున్నాయి. నగరంలోని రీన్-ది చెఫ్స్ స్టూడియో వేదికగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ 'పెహ్‌చాన్' పాప్-అప్ ఆహార ప్రియులకు వినూత్న రుచులను అందిస్తోంది. ముంబైకి చెందిన జిగ్స్ కల్రా 'మసాలా లైబ్రరీ' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పాప్ అప్ 29వ తేదీ వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన సాంస్కృతిక వంటల వైవిధ్యాలకు ఆధునిక పాకశాస్త్ర నైపుణ్యాలను అద్దించి వండిన వంటకాలను నగరవాసులకు చేరువ చేస్తున్నట్లు సంస్థ జనరల్ మేనేజర్ రాజేష్ గోపాలకృష్ణన్ తెలిపారు.





ఈ ప్రపంచమే ఓ రంగస్థలం.. అందులో మనుషులంతా పాత్రధారులే.. ఎవరి పాత్రలో(జీవితంలో) వాళ్లు నటిస్తుంటారని అన్నారో కవి. అయితే రంగస్థలంపై నటించడం అంటే గొప్ప గుర్తింపే.. నాటకంలో ఒక పాత్రకు న్యాయం చేయాలంటే అంత ఈజీ కాదు. ఏ చిన్న పొరపాటు దొర్లకుండా పాత్రల్లో ఒదిగిపోయి గంటల తరబడి ఆ పాత్రతో ప్రేక్షకులను రంజిపజేయడం గొప్ప విషయం. అప్పట్లో ఒక నాటిక ప్రదర్శన అనంతరం కొన్ని నెలల పాటు చర్చ జరిగేది. అందులోని పాత్రదారులకు అంతే గౌరవం లభించేది. నేడు అంతర్జాతీయ రంగస్థలం దినోత్సవం సందర్భంగా..
- మల్లాపూర్



రంగస్థలం..
రంగరంగ వైభవంగా..

1980లో నాటకాలు అంటే అమితమైన అభిమానం.. తమ ప్రాంతంలో నాటకం ప్రదర్శన ఉందంటే ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎటు చూసినా సందడే.. ప్రేక్షకులతో ఆ ప్రాంతం మొత్తం నిండిపోయేది. అలా.. నాటక రంగంపై ఇష్టం పెంచుకున్న నాచారం ప్రాంతానికి చెందిన ప్రభాకరాచారి ఎన్నో నాటకాలను ప్రదర్శించి ప్రశంసలు పొందారు. చిన్నప్పుడే మిత్రులతో మొహానికి రంగు పూసుకోవడం, జానపద సినిమా హీరోల్లా కత్తిసాము చేస్తుండటం, డైలాగులు చెప్పడంతో స్నేహితులు అతడిని ప్రోత్సహించారు. యాదగిరి క్షేత్ర మహాత్మ్యం అనే నాటకంలో వెనుక నుంచి పద్యాలు పాడి అనేక సంవత్సరాలు ఒక వెలుగు వెలిగారు.



పాఠశాలలో పిల్లలతో వేషాలు..



యాదగిరిగుట్ట ప్రాంతం బేగంపేట హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా కొనసాగుతున్న సమయంలో పిల్లలతో కూడా వేషాలు వేయించి 2005లో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. రాజాపేట పాఠశాలలో కూడా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి 2008లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. నగరంలోని ఓయూ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్ నేతృత్వంలో ఒక నాటకంలో నటించి ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నాడు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి కీర్తన వాహిని వ్యవస్థాపక అధ్యక్షుడిగా అనేక సాంఘిక సేవా కార్యక్రమాలే కాకుండా లక్ష్మీ నరసింహస్వామిపై 1500 పైగా కీర్తనలను రాశారు.

సురభి నాటక సంస్థ ఆధ్వర్యంలో..

నాచారం ప్రాంతానికి చెందిన ప్రభాకరాచారి ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఓవైపు విద్యార్థులను ఆణిముత్యాల్లా తీర్చిదిద్దుతూనే.. మరోవైపు రేడియో, సంగీతం, పాటలు రాయడంతో పాటు నటిస్తూ అందరి మన్ననలు పొందాడు. 1985 సంవత్సరం నుంచి యాదగిరిగుట్ట పట్టణంలో కొన్ని నెలల పాటు సురభి నాటక సంస్థ పట్టణంలో కృష్ణ రాయభారం నాటకం వేసి కర్ణుడిగా, దుర్యోధనుడిగా నటించి ప్రేక్షకుల మెప్పు పొందారు.

క్లుప్తంగా...

పోలవరం ముంపుపై నేటి సమావేశం వాయిదా

ఏప్రిల్ 8న నిర్వహణ.. ఇరు రాష్ట్రాలకు పీపీఏ లేఖ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణ భూభాగంలో ఉన్న ముంపు ప్రభావంపై చర్చించడానికి గురువారం హైదరాబాద్‌లోని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) కార్యాలయంలో ఏపీ, తెలంగాణతో నిర్వహించనున్న సమావేశాన్ని వచ్చే నెల 8వ తేదీకి వాయిదా వేసినట్టు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) తెలిపింది. ఏపీ సీఎం చంద్రబాబు గురువారం పోలవరం ప్రాజెక్టును సందర్శించనుండటంతో సమావేశానికి రాలే మని ఏపీ అధికారులు తెలపడంతో పీపీఏ ఈ నిర్ణయం తీసుకుంది. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రభావంపై 2022, సెప్టెంబర్ 22న సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల అమలులో భాగంగా ఈ సమావేశం జరగాల్సి ఉంది.

పేద ఖైదీలకు కేంద్రం చేయూత

వెల్లడించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



సాక్షి, న్యూఢిల్లీ: పేద ఖైదీల కోసం కేంద్ర ప్రభుత్వం చేయూతను అందిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ తెలిపింది. ఇందుకోసం 2023-24, 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.20 కోట్ల చొప్పున కేటాయించినట్లు ఆ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బుధవారం రాజ్యసభలో చెప్పారు. పేద ఖైదీలకు సహాయం చేసేందుకు 2023లో 'పేద ఖైదీలకు మద్దతు'పథకాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. పేదలు ఖైదీలుగా ఉన్న సమయంలో జరిమానాలు చెల్లించకపోవడం, బెయిల్‌పై విడుదల అయిన తర్వాత సమర్పించే బాండ్‌కు డబ్బు లేకపోవడం వంటి వాటి నుంచి వారిని ప్రోత్సహించేందుకు తాము సాయం అందిస్తున్నట్లు సంజయ్ వెల్లడించారు. 2023-26 మధ్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు సీఎస్‌ఏ ద్వారా ఇప్పటి వరకు రూ.22,84,451 తీసుకున్నట్లు లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ

నలుగురు నిందితులు కోర్టుకు హాజరు

సిటీ కోర్టులు: రాష్ట్రంలో సంచలనంగా మారిన ఫోన్‌ట్యాపింగ్ కేసు విచారణ బుధవారం నాంపల్లి కోర్టులో జరిగింది. ఈ కేసులో ఇప్పటికే బెయిల్‌పై విడుదలైన ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావు నేరుగా కోర్టుకు హాజరయ్యారు. అయితే ఇతర దేశాల్లో తలదాచుకున్న ఏ-1 ప్రభాకర్‌రావు, ఏ-6 శ్రవణ్‌కుమార్‌పై ఎన్‌బీడబ్ల్యూ జారీ కాగా.. పెండింగ్‌లో ఉండగా రెడ్‌కార్నర్ నోటీస్ కూడా జారీ చేసిన విషయం తెలిసిందే. వీరిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. అయితే ముందస్తు బెయిల్ కోసం వారు ప్రయత్నిస్తున్నారు. ఈ కేసుపై విచారణ చేపట్టిన నాంపల్లిలోని 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు తదుపరి విచారణను ఏప్రిల్ 21కి వాయిదా వేసింది.

రాష్ట్రంలో శాటిలైట్ క్యాంపస్‌లు ఏర్పాటు చేయండి

లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో శాటిలైట్ క్యాంపస్‌లు, మొబైల్ శిక్షణ యూనిట్లు ఏర్పాటు చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కేంద్రాన్ని కోరారు. లోక్‌సభలో బుధవారం త్రిభువన్ సహకార విశ్వవిద్యాలయ బిల్లు-2025పై చర్చ సందర్భంగా ఆమె మాట్లాడారు. సహకార రంగంలో వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు దేశవ్యాప్తంగా శాటిలైట్ క్యాంపస్‌లను ప్రోత్సహించాలని ఆమె సూచించారు. కేంద్రం ప్రవేశపెట్టిన త్రిభువన్ సహకార విశ్వవిద్యాలయం బిల్లు ఆశాకిరణాలతో పాటు అనిశ్చితిని కూడా తెస్తోందన్నారు. ఈ బిల్లును వరంగల్ రైతులు, సహకార కార్మికుల సంక్షేమం కోసం జాగ్రత్తగా పరిశీలిస్తున్నామని తెలిపారు. గుజరాత్‌లోని ఆనంద్‌లో ఏర్పాటు చేయనున్న ఈ విశ్వ విద్యాలయం.. సహకార రంగంలో శిక్షణ, పరిశోధనకు ఊతమిస్తున్నా.. వరంగల్ రైతులకు అందుబాటులో ఉంటుందా? అని ఎంపీ కావ్య ప్రశ్నించారు.

ఏప్రిల్ 2న ఢిల్లీ గడ్డమీద చరిత్రాత్మక సభ: జాజుల



పంజగుట్ట (హైదరాబాద్): బీసీలకు విద్య, ఉద్యోగం, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు పార్లమెంట్‌లో ఆమోదింపచేసుకునేందుకు ఏప్రిల్ 2వ తేదీన ఢిల్లీ గడ్డమీద ఒక చరిత్రాత్మక సభ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. 142 బీసీ కులాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారిని వారివారి కులవృత్తిని ప్రదర్శించేలా సుమారు 10 వేల మందితో వినూత్న ప్రదర్శన చేస్తామని, ఈ ప్రదర్శన ద్వారా పార్లమెంట్‌లో తప్పక బీసీ బిల్లుపై చర్చ వస్తుందని ఆయన అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో జాజుల మాట్లాడుతూ.. ఢిల్లీ సభకోసం ఒక ప్రత్యేక రైలును ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు కనీవినీ ఎరుగని రీతిలో నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు.

ఇఫ్తార్ విందుకు హాజరైన వైఎస్ జగన్



విజయవాడలో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో 'దువా' చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత జగన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల విరమణ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ముస్లింలకు బుధవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. విజయవాడ ఎస్‌ఏసీ కల్యాణ మండపంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ''ఈద్ ముబారక్'' అంటూ ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అందరి ప్రార్థనలు సఫలం కావాలని ఆకాంక్షించారు. అల్లా చల్లని ఆశీస్సులతో అందరూ బాగుండాలని కోరుకున్నారు.

తెలంగాణకు 555 టీఎంసీలు కేటాయించినా ఏపీకి నష్టం ఉండదు

బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ ప్రభుత్వం వాదన

సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాల్లో తెలంగాణకు 555 టీఎంసీలు కేటాయించినా, ఏపీకి నష్టమేమీ ఉండదని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ స్పష్టం చేశారు. ఏపీ బేసిన్ బయట ప్రాంతాలకు కృష్ణా జలాలను ఏ మేరకు మళ్లిస్తోందని ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ప్రశ్నించగా.. ఉమ్మడి రాష్ట్రంలో అంతర్గత ఏర్పాటు ద్వారా 512 టీఎంసీలను ఏపీ వినియోగించుకుంటోందని వైద్యనాథన్ వివరించారు. ఇందులో ఇతర బేసిన్‌లకు 323 టీఎంసీలను మళ్లిస్తోందని, కృష్ణా బేసిన్‌లో 189 టీఎంసీలను మాత్రమే వినియోగిస్తోందని తెలిపారు. ఢిల్లీలో జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్.తాళపత్ర సభ్యులుగా ఉన్న ట్రిబ్యునల్ ఎదుట బుధవారం మూడోరోజు తన వాదనలు కొనసాగించారు.



ఉమ్మడి రాష్ట్రంలో అన్యాయం

ఏపీలో కృష్ణా డెల్టాకు డ్రెయిన్ల కింద 43.2 టీఎంసీలు, పోలవరం ప్రాజెక్టు నుంచి మళ్లించే 80 టీఎంసీల గోదావరి జలాలు అందుబాటులో ఉన్నాయని ట్రిబ్యునల్‌కు వైద్యనాథన్ వివరించారు. పోలవరం ప్రాజెక్టుకు దిగువన గోదావరిపై పట్టిసీమ ఎత్తిపోతలను ఏపీ నిర్మించిందని, 2015 నుంచి ఆ ఎత్తిపోతల ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలిస్తోందన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా ఏడాదిలో 100 టీఎంసీలను కృష్ణా డెల్టాకు తరలిస్తున్నారని చెప్పారు. కృష్ణా బేసిన్‌లో 2023-24లో తీవ్రమైన నీటి కొరత ఉందని, ఆ ఏడాది శ్రీశైలం ప్రాజెక్టులోకి కేవలం 145 టీఎంసీల ప్రవాహం మాత్రమే వచ్చిందన్నారు. అయినాసరే కృష్ణా డెల్టా కింద దాదాపు 125 టీఎంసీలను ఏపీ వినియోగించుకుందని వివరించారు. ఇందులో పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా తరలించిన జలాలే 40 టీఎంసీలన్నారు. ఏపీలోని ప్రాజెక్టులకు అదనపు నీటి వనరులు అందుబాటులో ఉన్నాయని.. అక్కడ ఆదా చేసిన నీటిని తెలంగాణలో బేసిన్‌లోని ప్రాజెక్టులకు కేటాయించాలని కోరారు.

ఏప్రిల్ 15కు వాయిదా

కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు పంపిణీ చేయడంపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ మూడు రోజుల విచారణ బుధవారం ముగిసింది. విచారణను ఏప్రిల్ 15-17కు ట్రిబ్యునల్ వాయిదా వేసింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున తుది వాదనలను వినగా, తదుపరి వాదనలను ఏప్రిల్ 15 నుంచి చేపట్టే విచారణలో వింటామని ట్రిబ్యునల్ పేర్కొంది.


ఎస్‌ఆర్‌బీసీ, ఎస్‌ఎల్‌బీసీ ఒకేసారి చేపట్టినా...

శ్రీశైలంఎడమ గట్టు కాలువ(ఎస్‌ఎల్‌బీసీ)ని నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు గ్రావిటీ ద్వారా 150 టీఎంసీలను అందించడానికి ప్రతిపాదించారన్నారు. కానీ.. ఈ పథకానికి నీటిని కేటాయించాలని కేడబ్ల్యూడీటీ-1 ఎదుట ఉమ్మడి రాష్ట్రం ఒత్తిడి చేయలేదని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర ప్రాంతంలో ఇతర బేసిన్‌లలోని ప్రాజెక్టులకు నీటిని తరలించేందుకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. శ్రీశైలం కుడి గట్టు కాలువ(ఎస్‌ఆర్‌బీసీ), ఎస్‌ఎల్‌బీసీలను 1980లో ఒకేసారి చేపట్టారని.. ఎస్‌ఎల్‌బీసీకి మిగులు జలాలుగా కేటాయించగా, ఎస్‌ఆర్‌బీసీకి 75 శాతం లభ్యత కింద నికర జలాలను ఉమ్మడి రాష్ట్రం కేటాయించిదని ట్రిబ్యునల్‌కు వివరించారు. కేడబ్ల్యూటీ-2 ఎదుట ఎస్‌ఆర్‌బీసీకి నికర జలాలను కేటాయించాలని కోరకుండా.. బేసిన్ బయటకు నీటిని తరలించే తెలుగుగంగ ప్రాజెక్టుకు నీటిని కేటాయించాలని ఉమ్మడి రాష్ట్రం ట్రిబ్యునల్‌పై ఒత్తిడి తెచ్చిందని వివరించారు.

గణితం ప్రశ్నలు బయటకు..

- జుక్కల్ ఉన్నత పాఠశాల టెన్త్ సెంటర్‌లో ఘటన
- పరీక్ష కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురి సస్పెన్షన్

నిజాంసాగర్/కామారెడ్డి టౌన్: పదో తరగతి గణితం పేపర్‌లోని ప్రశ్నలు కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. పైగా ఓ సెంటర్‌లో మాస్ కాపీయింగ్ కూడా జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్ష కేంద్రం నుంచి బుధవారం గణితం ప్రశ్నలను కాగితంపై రాసి బయటకు పంపారు. వాటికి సంబంధించిన సమాధానాల చిటీలు కూడా సెంటర్‌లోని విద్యార్థులకు అందజేసి మాస్ కాపీయింగ్‌కు పాల్పడ్డారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వచ్చిన నేపథ్యంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఈవో ఎస్ రాజు, తహసీల్దార్, పంచాయతీ అధికారి, ఎంఈవో, పోలీసులు విచారణ జరిపారు. వాస్తవమని తేలడంతో పరీక్ష కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ సునీల్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ భీమ్, ఇన్విజిలేటర్ దీపికలను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ డీఈవో బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. తమ పాఠశాలలో వంద శాతం ఫలితాలు సాధించేందుకు కొందరు ఉపాధ్యాయులు కలిసి ప్రశ్నపత్రంలోని ప్రశ్నలు బయటకు పంపి మాస్ కాపీయింగ్‌కు పాల్పడేలా చేసినట్టు అధికారులు అనుమానిస్తున్నారు. మాల్ ప్రాక్టీస్, పేపర్ లీకేజీలు చేయొద్దని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నా, పలు కేంద్రాల్లో ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.



పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిన గణితం ప్రశ్నల చీటీ ఇదే

ఏడుగురి అరెస్టు

గణితం ప్రశ్నల లీకేజీ కేసులో ఇప్పటివరకు ఏడుగురు నిందితులను గుర్తించి అరెస్టు చేశామని ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. 'ఓ తండ్రి తన కుమారుడి కోసం ఎగ్జామ్ సెంటర్‌లో తాత్కాలికంగా వాటర్ సప్లయ్ చేసే ఓ వ్యక్తితో కొన్ని ప్రశ్నలు బయటకు తెప్పించాడు. బయట సంజయ్ అనే మరో వ్యక్తి ఈ ప్రశ్నలను సేకరించాడు. కొంతమంది మీడియా ప్రతినిధులు అతడి నుంచి ప్రశ్నలు తీసుకొని సోషల్ మీడియాలో వైరల్ చేశారు. విషయం తెలుసుకున్న విద్యాశాఖ అధికారులు, పోలీసులు రంగంలోకి దిగి విచారణ జరిపారు. ఈ వ్యవహారంలో జాదవ్ సంజయ్, షేక్ ముబీన్(వాటర్‌మ్యాన్), కాండే మనోజ్ (జీపీ కారోబార్), విద్యార్థులు ఇబాత్‌వార్ ఫిలిప్స్, ఇబాత్‌వార్ వరప్రసాద్, మీడియా ప్రతినిధులు మెహరీ హనుమండ్లు, కొప్పుల గంగాధర్‌లను నిందితులుగా గుర్తించి అరెస్టు చేశాం'అని ఎస్పీ తెలిపారు.

కేటీఆర్‌పై మూడు కేసులు

- ప్రశ్నపత్రం లీకేజీలో తప్పుడు ప్రచారం చేశారని అభియోగం
- అట్రాసిటీ కేసు కూడా నమోదు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నల్లగొండ జిల్లా నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయి. ఒక కేసులో ఏ1గా, మరో కేసులో ఏ2గా, ఇంకో కేసులో ఏ3గా ఉన్నారు. ఆయనతోపాటు ఆ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కొణతం దిలీప్, మన్నెం క్రిశాంక్‌లపైనా పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేశారు. ఇందులో అట్రాసిటీ కేసు కూడా ఉంది. నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన పదోతరగతి పేపరు లీకేజీ విషయంలో ఓ టీవీ చానల్‌తోపాటు, రెండు యూట్యూబ్ చానళ్లు తప్పుడు ప్రచారం చేశాయని, ఆ వార్తలను నిర్ధారించుకోకుండా ఆ ముగ్గురు ట్విట్టర్‌లో తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేశారంటూ నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత, తాటికల్ పీఏసీఎస్ డైరెక్టర్ నకిరేకంటి నరేందర్, కాంగ్రెస్ నాయకుడు ఉగ్గిడి శ్రీనివాస్ పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. ఆ ముగ్గురు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు మంగళవారం రాత్రి కేసులు నమోదు చేశారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపుతోనే కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య నల్లగొండలో మాట్లాడుతూ అన్నారు. తెలుగు ప్రశ్నపత్రం లీకేజీ కేసులో ఎమ్మెల్యే వీరేశం అనుచరులే ఉన్నారన్నారు.

కృష్ణాజలాలు, కాళేశ్వరంపై వాదోపవాదాలు

మంత్రి ఉత్తమ్, మాజీమంత్రి హరీశ్ మధ్య మాటల యుద్ధం

సాక్షి, హైదరాబాద్: సాగునీటి జలాల విషయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మధ్య మాటల యుద్ధం సాగింది. గోదావరిలో తమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదని మరో ప్రత్యామ్నాయం చూసుకోవాలని సీడబ్ల్యూసీ సూచించిందని హరీశ్‌రావు చెబుతూ అందుకు సంబంధించిన లేఖ తన వద్ద ఉందన్నారు. దీంతో మంత్రి ఉత్తమ్ స్పందిస్తూ..'మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు కట్టడానికి సీడబ్ల్యూసీ ఎలాంటి సిఫారసు చేయలేదు. ఆ తప్పుడు వాదనతో రూ. లక్ష కోట్లు వృథా చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం నియమించిన ఐదుగురు చీఫ్ ఇంజనీర్ల కమిటీ కూడా మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మాణం చేయొద్దని సిఫారసు చేసినా పట్టించుకోలేదు'అని అన్నారు, సాగునీటి పద్దుపై బుధవారం రాత్రి శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ఈ వాదోపవాదాలు జరిగాయి. 'ఐదుగురు చీఫ్ ఇంజనీర్లు ఇచ్చిన నివేదిక మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మించొద్దని కాదు. మేడిగడ్డ నుంచి మిడ్‌మానేరుకు నేరుగా ఎత్తిపోయడం సాధ్యం కాదు'అని మాత్రమేనని హరీశ్‌రావు అన్నారు. కృష్ణాజలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 512 టీఎంసీలు తీసుకునేలా ఒప్పందంపై సంతకాలు పెట్టిందే హరీశ్‌రావు, కేసీఆర్ హయాంలో అని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ఏపీకి నీటిని తరలించడానికి ప్రాజెక్టులు నిర్మిస్తుంటే మౌనంగా ఉన్నారని మంత్రి ఆరోపించారు. దీనిపై హరీశ్ స్పందిస్తూ.. అది కేవలం తాత్కాలిక సర్దుబాటు మాత్రమేనని, సెక్షన్ మూడు కింద సుప్రీం కోర్టుకు వెళ్లి,.. బచావత్ విచారణ జరిగేలా ఉత్తర్వులు తీసుకొచ్చామని ఇప్పుడు ప్రభుత్వం సరిగా వాదిస్తే 555 టీఎంసీలు తెలంగాణకు సులభంగా తెచ్చుకోవచ్చని సూచించారు.





ప్రాణహిత ప్రాజెక్టును నిర్మించి తీరుతాం : ఉత్తమ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను సస్యశ్యామలంగా చేసే ప్రాణహిత ప్రాజెక్టును నిర్మించి తీరుతామని ఉత్తమ్ అన్నారు. పదేళ్లపాటు ఆదిలాబాద్ జిల్లాను ఎండబెట్టి అక్కడి రైతులను అష్టకష్టాల్లోకి నెట్టింది బీఆర్‌ఎస్ పాలన ఘనకార్యమే అని విమర్శించారు. పదేళ్లలో కాళేశ్వరం వల్ల ఆయకట్టు పెరగలేదన్నారు. ఏడాదిన్నరగా కాళేశ్వరం ప్రాజెక్టు పనిచేయనప్పటికీ యాసంగిలో 153 లక్షల మెట్రిక్ టన్నులు, రబీలో 131 లక్షల టన్నుల వరి దిగుబడి రానున్నట్టుచెప్పారు. ఈ సమయంలో హరీశ్‌రావు జోక్యం చేసుకుంటూ కేసీఆర్ ముందుచూపు వల్లే వరిసాగు పెరుగుతూ వచ్చిందన్నారు. ఇంతలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ సభ్యులు వాదప్రతివాదనలకు దిగడంతో సభలో తీవ్ర గందరగోళం చోటుచేసుకుంది. ఆ తర్వాత నిరసన వ్యక్తం చేస్తూ కూర్చుంటున్నట్టు హరీశ్‌రావు తెలిపారు.

నేరపూరిత నిర్లక్ష్యం బీఆర్‌ఎస్‌ది : బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్

పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నేరపూరిత నిర్లక్ష్యం వల్లనే ఆదిలాబాద్ జిల్లా రైతులు కరువులో కొట్టుమిట్టాడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ అన్నారు. 'సాగునీరు ఇవ్వకుండా రైతులను తీవ్రగోసలోకి నెట్టిన బీఆర్‌ఎస్ పార్టీకి ఉమ్మడి ఆదిలాబాద్ రైతుల ఉసురు ముట్టింది. మరింత అనుభవిస్తారు'అని ఆవేశంగా పాల్వాయి హరీశ్ అన్నారు. దీంతో బీఆర్‌ఎస్ సభ్యులు ఆందోళనకు దిగడంతో గందరగోళం చోటుచేసుకుంది. మంత్రి సీతక్క జోక్యం చేసుకుంటూ ఆదిలాబాద్ రైతుల గోసను పాల్వాయి హరీశ్ వ్యక్తం చేశారని. ఆయనపైకి బీఆర్‌ఎస్ సభ్యులు గొడవకు దిగడం సరికాదన్నారు.

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెడిపోయిన ధాన్యం టెండరు వేశారని, ఏడాదిన్న గడిచినా కాంట్రాక్టర్ డబ్బులు చెల్లించకపోవడంపై సమాధానం చెప్పాలన్నారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. మార్చిలోగా డబ్బు చెల్లించకపోతే ఆ టెండర్‌ను రద్దు చేస్తామని స్పష్టం చేశారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఒప్పందం కుదుర్చుకుంటున్న సిస్కో, టాస్క్ ప్రతినిధులు. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

సీఎంతో సిస్కో బృందం భేటీ

స్కిల్ యూనివర్సిటీలో నైపుణ్య శిక్షణ కోసం ఎంవోయూ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో సిస్కో బృందం భేటీ అయింది. బుధవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో నైపుణ్య శిక్షణ అందించేందుకు సిస్కోతో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఒప్పందం కుదుర్చుకుంది. కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎంతో ఆస్ట్రేలియా ప్రతినిధి బృందం కూడా భేటీ అయింది. ఈ మర్యాదపూర్వక సమావేశంలో ప్రీమియర్ ఆఫ్ సౌత్ ఆస్ట్రేలియా పీటర్ మాలినాస్కస్ (ఎంపీ), భారత్‌లో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్‌తో పాటు రాష్ట్ర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో విస్తృత విద్యావకాశాలు

- పోస్ట్ స్టడీ వర్క్‌కు అవకాశం
- వీసా నిబంధనలు కూడా కఠినం కాదు
- స్టడీ అడిలైడ్ సదస్సులో ఆస్ట్రేలియా ప్రీమియర్ పీటర్ మలినౌస్కస్

సాక్షి, ఎడ్యుకేషన్: భారతీయ విద్యార్థులకు విదేశీ విద్య కోణంలో ఆస్ట్రేలియాలో విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, రీసెర్చ్ ఆధారిత కోర్సుల ఫలితంగా వారిలో నైపుణ్యాలు పెరిగేందుకు అవకాశం ఉంటుందని.. దక్షిణ ఆస్ట్రేలియా ప్రీమియర్ (ప్రభుత్వ అధినేత) పీటర్ మలినౌస్కస్ తెలిపారు. అదే విధంగా వీసా నిబంధనలు కూడా కఠినంగా లేవని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన స్టడీ అడిలైడ్ సదస్సుకు ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ.. 'ఆస్ట్రేలియాలో ఆర్‌అండ్‌డీ, టెక్, సైన్స్, హాస్పిటాలిటీ, ఇంజనీరింగ్ విభాగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయి. భారత విద్యార్థులు కొత్త అంశాలను తెలుసుకునేందుకు ఎంతో ఆసక్తి చూపుతారు. ఇదే వారిని అన్ని రంగాల్లో ముందంజలో నిలుపుతోంది. దక్షిణ ఆస్ట్రేలియాలోని ఫ్లిండర్స్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ అడిలైడ్, యూనివర్సిటీ ఆఫ్ సౌత్ ఆస్ట్రేలియాలు టాప్ యూనివర్సిటీలుగా ఉన్నాయి. ఇక్కడ ప్రవేశాలు పొందిన వారికి మెరిట్ ఆధారిత స్కాలర్‌షిప్స్ కూడా లభిస్తాయి' అని తెలిపారు. దక్షిణ ఆస్ట్రేలియా ప్రభుత్వం పరిశోధనలు, ఉన్నత విద్య అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. అదే విధంగా దక్షిణ ఆస్ట్రేలియాలో పోస్ట్ స్టడీ వర్క్ విషయంలో నిర్దేశిత సమయానికి అదనంగా మరో ఏడాది ఉద్యోగం చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. కాగా, మలినౌస్కస్, భారత్‌లో ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిలరీ మెక్‌గిచీ సమక్షంలో ఫ్లిండర్స్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ కలసి హెల్త్‌కేర్, బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో జాయింట్ ట్విన్నింగ్ ప్రోగ్రామ్స్ అందించేలా ఒప్పందం కుదుర్చుకున్నాయి. మరోవైపు స్టడీ అడిలైడ్ కార్యక్రమంలో భాగంగా ఎంప్లాయ్‌మెంట్ కనెక్ట్ పేరుతో కొత్త విధానాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టడీ అడిలైడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జేన్ జాన్‌స్టన్ మాట్లాడుతూ గత రెండేళ్లలో 400 మందికిపైగా భారత విద్యార్థులు దక్షిణ ఆస్ట్రేలియాలో ఉపాధి పొందారని చెప్పారు. ఈ సదస్సులో భాగంగా పలువురు ప్రముఖులతో ప్యానెల్ డిస్కషన్స్ నిర్వహించారు. వీటికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొఫెసర్ జీవీఆర్‌కే ఆచార్యులు, ఒనెస్ క్రయోజెనిక్స్ సీఈఓ రామ్ కె. ఆలూరు, రీసెర్చ్ శాట్ వ్యవస్థాపకుడు దుగ్గినేని రవితేజ ప్రతినిధులుగా వ్యవహరించారు.





బాధితులనుద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

రామోజీ ఫిల్మ్‌సిటీ ముట్టడి

- 200 మంది బాధితులతో కలిసి వెళ్లిన సీపీఎం నేతలు
- గేట్లు తోసుకుంటూ దూసుకెళ్లిన నిరసనకారులు
- స్వల్ప లాఠీచార్జ్..పలువురి అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్: సీపీఎం ఆధ్వర్యంలో 200 మంది బాధితులు రామోజీ ఫిల్మ్ సిటీని ముట్టడించారు. బుధవారం గేట్లు తోసుకుంటూ లోపలకు వెళ్లి ప్రభుత్వ స్థలాల్లో ఎర్రజెండాలు పాతారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి రెవెన్యూ పరిధిలో 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన స్థలాలను ఫిల్మ్‌సిటీ యాజమాన్యం ఆక్రమించిందని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతోనే ఫిల్మ్‌సిటీని ముట్టడించామని సీపీఎం నేతలు చెప్పారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో కదిలిన బాధితులు ఆక్రమణకు గురైన తమ స్థలాల్లో ఎర్ర జెండాలు పాతారు.

సీపీఎం నేతల అరెస్టు.. ఉద్రిక్తత

జాన్‌వెస్లీ బాధితులనుద్దేశించి మాట్లాడుతుండగా ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు అక్కడకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరిమధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఆందోళన విరమించి, వెళ్లిపోవాలని పోలీసులు సూచించగా.. పోలీసులకు ఇక్కడ ఏం పని అంటూ సీపీఎం నేతలు నిలదీశారు. అనంతరం జాన్‌వెస్లీతోపాటు సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, జిల్లా నేతలు సామేలు, జగదీశ్, జగన్, మండల నాయకులు బుగ్గ రాములు, జంగయ్యను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని తరలిస్తుండగా మహిళలు జీపులకు అడ్డు తగిలారు. పోలీసులు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. మహిళల పట్ల పోలీసుల దురుసు ప్రవర్తనపై నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనకారులు శాంతించకపోవడంతో పోలీసులు స్వల్ప లాఠీచార్జ్ చేశారు. దీంతో సీపీఎం నాయకులు జగన్, నాగన్‌పల్లికి చెందిన వరికుప్పల వెంకటమ్మ స్పృహతప్పి పడిపోయారు. ఏసీపీ రాజు, సీఐ జగదీశ్వర్ నచ్చజెప్పడంతో ఆందోళనకారులు శాంతించారు. అనంతరం ఘటనా స్థలానికి చేరుకున్న డీసీపీ సునీతా రెడ్డి వివరాలు తెలుసుకున్నారు. అరెస్టు చేసిన వారిని ఇబ్రహీంపట్నం, యాచారం పోలీస్ స్టేషన్లకు తరలించారు.

కొడతాం, చంపుతామంటే చూస్తూ ఊరుకోం

- చట్టానికి ఎవరూ అతీతులు కారు
- కౌశిక్‌రెడ్డిపై శ్రీధర్‌బాబు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: 'మేం తిడతాం, కొడతాం, మర్డర్లు చేస్తాం, అరాచకత్వం సృష్టిస్తాం.. కానీ మాపై కేసులు పెట్టొద్దు అంటే ఊరుకుంటామా, చట్టానికి ఎవరూ అతీతం కాదు, కచ్చితంగా చర్యలు తీసుకుంటాం'అని మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపక్షాన్ని ఉద్దేశించి హెచ్చరించారు. తాను అధికారుల విధులను అడ్డుకున్నానంటూ ఆర్డీఓతో తప్పుడు కేసు పెట్టించి పండగ వేళ అరెస్టు చేయించారని బీఆర్‌ఎస్ సభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణకు మంత్రి శ్రీధర్‌బాబు ఇలా స్పందించారు. పద్దులపై చర్చలో భాగంగా బుధవారం రాత్రి శాంతిభద్రతల అంశంపై మంత్రి సమాధానాలిస్తూ కౌశిక్‌రెడ్డి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సైబరాబాద్ డీసీపీ, మాదాపూర్ ఏసీపీ, గచ్చిబౌలి సీఐలు పైలట్ ఎస్కార్టులతో గూండాలను తీసుకొచ్చి తన ఇంటిపై దాడి చేయించారని, దాడి చేసిన వారిని అరెస్టు చేయలేదన్న కౌశిక్‌రెడ్డి మాటలకు స్పందించిన మంత్రి, చట్టానికి అతీతంగా వ్యవహరించి ఉంటే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం ఉంటే ఆ ప్రభుత్వానికి వంతపాడుతూ పోలీసు అధికారులు ఎంజాయ్ చేస్తున్నారని ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి కామెంట్ చేశారు. ఎన్నో సవాళ్ల మధ్య పోలీసులు విధులు నిర్వర్తిస్తారని, వారిపై అభాండాలు సరికాదని కాంగ్రెస్ సభ్యుడు నాగరాజు పేర్కొన్నారు. వినాయకచవితి రోజు తాను హైదరాబాద్‌లో ఉంటే, తన ఇంటిపై కొందరు యువకులు దాడి చేసి ఇంట్లో ఉన్న వారిపై దాడి చేశారని, అయినా పోలీసులు చర్యలు తీసుకోలేదని బీఆర్‌ఎస్ సభ్యురాలు సునీతా లక్ష్మారెడ్డి పేర్కొనగా, విచారణ జరిపిస్తామని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. మరో ప్రశ్నపై స్పందిస్తూ, జిల్లాల్లో కూడా పోలీసు కమాండ్ కంట్రోల్ కేంద్రాలను ఏర్పాటు చేయటంతోపాటు నిఘా కోసం పెద్ద సంఖ్యలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

ట్రాన్స్‌జెండర్లను అవమానించొద్దు..

ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ గైడ్లుగా నియమించి దేశానికే ఆదర్శంగా నిలిచామని శ్రీధర్‌బాబు పేర్కొన్న సమయంలో బీఆర్‌ఎస్ సభ్యుల్లో కొందరు నవ్వటాన్ని ఆయన ఖండించారు. ట్రాన్స్‌జెండర్ల ప్రస్తావన వచ్చినప్పుడు వ్యంగ్యంగా నవ్వడం వారిని అవమానపరిచినట్టేనని మంత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు.

● డిబేట్



నలుపు అంటే శక్తి

నాలుగు సంవత్సరాల అమ్మాయి తన తల్లిని 'అమ్మా... నన్ను తిరిగి నీ గర్భంలోకి తీసుకొని తెల్లగా పుట్టించగలవా?' అని అడిగింది.

తల్లి ఆశ్చర్యంగా చూసి 'ఎందుకమ్మా?' అని అడిగింది.

'నల్లపిల్ల అంటూ నన్ను అందరూ వెక్కిరిస్తున్నారు' కళ్లనీళ్లతో చెప్పింది ఆ అమ్మాయి.

'రంగుది ఏముందమ్మా! నువ్వు చదువుకొని పెద్ద స్థాయిలో ఉంటే రంగు గురించి ఎవరూ మాట్లాడరు' అన్నది ఆ తల్లి ఓదార్పుగా.

కట్ చేస్తే.... ఆ అమ్మాయి కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిలాంటి పెద్ద పదవిలోకి వచ్చింది. అయినా నల్లటి ఆమె ఒంటి రంగును హేళన చేస్తూ అయిదు దశాబ్దాలుగా ఆమెను బాధిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో తన ఆవేదనకు అక్షర రూపం ఇచ్చి ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శారదా మురళీధరన్.

'నలుపు' అనే ముద్ర వేసి వెక్కిరించడంపై శారదా మురళీధరన్ గొంతు విప్పారు. 'ఇది విశ్వం యొక్క సర్వవ్యాప్త సత్యం అయినప్పుడు ఆ రంగును ఎందుకు కించపరుస్తున్నారు?' అంటూ ప్రశ్నించారు.

వర్ణ, లింగ వివక్షకు సంబంధించిన కామెంట్స్‌పై ఫేస్‌బుక్‌లో ఆమె పెట్టిన పోస్ట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది.

శారదకు ఎంతోమంది నుంచి మద్దతు వెల్లువెత్తింది.'నల్ల రంగు కారణంగా నేను ఇతరుల కంటే తక్కువ అనే భావన నాలో ఉండేది. నా పిల్లలు మాత్రం నలుపు అంటే అందం అంటారు. నల్లజాతి వారసత్వాన్ని కీర్తించారు. నేను గమనించని చోట అందాన్ని వెదుక్కుంటూ వచ్చారు. వారి మాటలు నలుపు వర్ణం విలువను, అందాన్ని గుర్తించేలా చేసింది' అంటారు శారద.

శారద 1990 బ్యాచ్ ఐఏఎస్ ఆఫీసర్. ఆరేళ్ల పాటు ప్రతిష్ఠాత్మకమైన 'కుటుంబ శ్రీ'కి నేతృత్వం వహించారు. ఆ తర్వాత జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పనిచేశారు. పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖలో సంయుక్త కార్యదర్శిగా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు.

త్రివేండ్రం జిల్లా కలెక్టర్‌గా, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కమిషనర్‌గా... ఇలా ఎన్నో ఉన్నత పదవులు నిర్వహించారు.

గత సంవత్సరం భర్త డాక్టర్ వేణు నుంచి కేరళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.

అయినా సరే... 'నలుపు' పేరుతో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వెక్కిరింపులు ఎదురవుతూనే ఉన్నాయి. కేరళ చీఫ్ సెక్రటరీగా తన భర్త నుంచి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన రంగుతో పోల్చుతూ, ఆ పదవికి మీరేం సరిపోతారు? అన్నట్లుగా కొందరు కామెంట్స్ చేశారు. వారి కామెంట్స్‌లో నలుపు రంగును తక్కువ చేసి వెక్కిరించడం ఉంది. ఆడవాళ్లకు పెద్ద పదవులు ఎందుకు? అనే పురుషాధిపత్య భావజాలం ఉంది. ఈ నేపథ్యంలోనే తన మనసులోని ఆవేదనను ఫేస్‌బుక్ పోస్ట్‌లో పెట్టారు శారద. ఆ పోస్ట్‌పై మొదట్లో కొందరి కామెంట్స్ చూసిన తరువాత ఆ పోస్ట్‌ను డిలీట్ చేశారు. 'మీ పోస్ట్ నేపథ్యంలో చర్చించాల్సిన విషయాలు చాలా ఉన్నాయి' అని శ్రేయోభిలాషులు చెప్పడంతో మరోసారి పోస్ట్ చేశారు. రీ-షేర్ చేసిన తరువాత ఆమె పోస్ట్‌కు మద్దతుగా ఎన్నో కామెంట్స్ వచ్చాయి.

> 'నల్లరంగు కారణంగా నేను ఇతరుల కంటే తక్కువ అనే భావన నాలో ఉండేది. నా పిల్లలు మాత్రం నలుపు అంటే అందం అంటారు. నల్లజాతి వారసత్వాన్ని కీర్తించారు. నేను గమనించని చోట అందాన్ని వెదుక్కుంటూ వచ్చారు. వారి మాటలు నలుపు వర్ణం విలువను, అందాన్ని గుర్తించేలా చేసింది'

శారద ధైర్యసాహసాలకు సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆమెను ప్రశంసించిన వారిలో కేరళ అసెంబ్లీలో ప్రతిపక్షనేత సతీశన్ కూడా ఉన్నారు.

● ప్రపంచ రంగస్థల దినోత్సవం



ప్రాణమైన వేదిక

రాజుల కాలం నుంచి విరాజిల్లుతూ నేటికీ తన ప్రాభవాన్ని నిలబెట్టుకుంటున్న రంగం నాటకరంగం...
మరింతమందికి ఈ రంగాన్ని చేరువ చేయడానికి కృషి చేస్తున్నవారు ఎందరో. ప్రపంచవ్యాప్తంగా మార్చి 27న **రంగస్థల దినోత్సవం** జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా చదువుకు సాధనంగా, సామాజిక మార్పు కోసం ప్రభావవంతంగా పనిచేసే నాటకం ప్రాముఖ్యత, మన సంస్కృతిలో ఎంతగా మమేకం అయ్యిందో తెలియజేస్తున్నారు కళాకారులు సురభి లలిత, ఆర్.రేఖ, ఇరిగి త్రివేణి.

నైపుణ్యాలకు మెరుగు



ఎనిమిదేళ్ల వయసు నుంచే నాటకరంగంలోకి వచ్చాను. 28 ఏళ్లుగా నాటకరంగంలో ప్రదర్శనలు ఇస్తూనే ఉన్నాను. నెలలో 4 నుంచి 8 వరకు ప్రోగ్రామ్స్ చేస్తుంటాం. ఈ నెల 29న హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు స్వేచ్ఛ నాటక ప్రదర్శన ఉంది. ఒక నాటకం చూడటానికి 500 నుంచి 800 మంది హాజరవుతుంటారు. లైవ్ పెర్ఫార్మెన్స్ కాబట్టి ఎంతో సంతోషం ఉంటుంది. ఎప్పటికప్పుడు ఇంప్రూవ్ చేసుకోవడానికి పనికివస్తుంది. ఒక్కొక్క నాటిక 50 నుంచి వందసార్లు కూడా ప్రదర్శిస్తుంటాం. ఎంత ఇబ్బంది ఉన్నా, రాత్రిళ్లు నిద్ర లేకపోయినా సరే ఒకసారి మేకప్ వేసుకొని, వేదిక ఎక్కగానే ఎక్కడలేని ఉత్సాహం వచ్చేస్తుంది. 'గడి' అనే నాటికకు ఉత్తమ నటి అవార్డు వచ్చింది. కిందటేడాది వేసిన స్వేచ్ఛ, నిశి.. నాటికలలో నా పాత్రకు మంచి గుర్తింపు వచ్చింది. నాటక ప్రదర్శనలు లేనప్పుడు సినిమా ఆడిషన్స్‌కి వెళుతుంటాను. ఆ విధంగా 'బలగం' సినిమాలో మంచి పాత్ర వచ్చింది. కొన్ని వెబ్‌సిరీస్‌లలోనూ నటిస్తున్నాను.

- సురభి లలిత, హైదరాబాద్

ఎన్నో అవకాశాలకు దారి చూపింది



మా నాన్న వారసత్వంగా నాటక, హరికథా కళాకారిణిగా ప్రదర్శనలు ఇచ్చేదాన్ని. ఆ ఇష్టంతోనే ఎం.ఎ. థియేటర్ ఆర్ట్స్ చేశాను. సీతారాముల కళ్యాణంలో సీత పాత్ర, చరణదాసు నాటకంలో రాణి పాత్రలతో నాటకరంగానికి పరిచయం అయ్యాను. డా.బిఆర్ అంబేడ్కర్ రాజ గృహప్రవేశం నాటకంలో రమాబాయి పాత్రకు మంచి పేరు వచ్చింది. జాతీయ బహుమతి పొందిన రేడియో తెలుగు నాటకాలు– ఒక పరిశీలన అనే అంశంపై పరిశోధన చేస్తున్నాను. గాయనిగా వేదికల మీద ప్రదర్శనలు ఇస్తుంటాను. సినిమాలకు డబ్బింగ్ ఆర్టిస్ట్‌గానూ పనిచేస్తున్నాను. ఇవన్నీ నాటకం నాకు ఇచ్చిన వరాలుగా చెప్పవచ్చు. గురుకుల పాఠశాలలో మ్యూజిక్ టీచర్‌గా చేస్తున్నాను.

- ఆర్.రేఖ, హైదరాబాద్



వెక్కిరించినవారే మెచ్చుకున్నారు




మాది గ్రామీణ నేపథ్యం. తెలుగు యూనివర్శిటీలో జానపదం, అక్కడే థియేటర్ ఆర్ట్‌లో పీజీ చేశాను. వర్క్‌షాప్స్ చేస్తూ, నాలుగేళ్లుగా నాటకాలు వేస్తున్నాను. సమ్మక్క సారలమ్మ, చాకలి ఐలమ్మ, వి ఆర్ ఇండియన్స్.. ఇలా నాటకాల జాబితా ఎక్కువ. ఇప్పుడు చాలా థియేటర్ గ్రూప్స్ వస్తున్నాయి. సినిమాల వాళ్లు కూడా థియేటర్‌లో నటిస్తున్నవారికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటికి పది రాష్ట్రాలలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నాను. మన వారసత్వం, సంప్రదాయాలు మన ముందు తరాలకు పరిచయం చేయాలని టీచింగ్ వైపుకు వచ్చాను. డ్యాన్స్, మ్యూజిక్, థియేటర్.. టీచర్‌గా కిందటి నెలలో సోషల్ వెల్ఫేర్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు బోధిస్తున్నాను. నేను చదువుకునేటప్పుడు మా చుట్టుపక్కల వాళ్లు ఈ నాటకాలు, డ్యాన్సులు ఏంటి.. పెళ్లి చేసుకోకుండా అనేవారు. ఇప్పుడు 'సాధించావు' అంటుంటారు.

- ఇరిగి త్రివేణి, దేవరకొండ, నల్లగొండ

– నిర్మలా రెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ప్రియాంక చోప్రా... ఫ్రీడమ్ సెలబ్రేషన్

● పేరెంటింగ్



పిల్లలను నిద్రపుచ్చడానికి తల్లులు పడే పాట్లు ఇన్నీ అన్నీ కావు. అల్లరి బిడ్డ నిద్రలోకి జారుకుంటే ఆ తల్లి ఆనందం ఇంతా అంతా కాదయా! ఇలాంటి అనుభవాన్ని బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా సొంతం చేసుకుంది. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను సరదాగా సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటుంది ప్రియాంక చోప్రా. ఈసారి తన సరికొత్త పోస్ట్‌లో స్వాతంత్ర్య వేడుకల గురించి మాట్లాడింది!

నిద్రిస్తున్న తన కూతురు మాల్తీ మేరీ జోనాస్ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది ప్రియాంక.

'మీ సూపర్ యాక్టివ్ బేబీ నిద్ర పోతుంటే' అని ప్రియాంక ఈ వీడియోను పరిచయం చేసింది. దీంతోపాటు లాఫింగ్ ఇమోజీని కూడా షేర్ చేసింది. కొన్ని సెకన్ల తరువాత టామ్, జెర్రీ డ్యాన్స్ చేస్తుండగా బ్యాక్‌గ్రౌండ్‌లో పాట వినిపిస్తుంది. ఈ వీడియోకు 'ఆజాదీ' అనే కాప్షన్ ఇచ్చింది.

కూతురు అల్లరి చేయకుండా హాయిగా నిద్ర పోవడమే... తనకు స్వాతంత్ర్య వేడుక!

● మన(సు)లో మాట

డాక్టర్! మా చెల్లెలి వయస్సు 28 ఏళ్లు. డిగ్రీ పాసయ్యింది. ఐదేళ్లుగా మానసిక వ్యాధికి మందులు ఇప్పిస్తున్నాం. తనలో తాను నవ్వుకోవడం, గొణుక్కోవడం, ఎవరేది అంటున్నా తన గురించేననడం. చెవిలో ఎవరివో మాటలు వినబడుతున్నాయనడం... పనేమీ చేయదు. సైకియాట్రిస్ట్ పర్యవేక్షణలో వైద్యం చేయించిన తర్వాత చాలా మెరుగైంది. కానీ పూర్తిగా మామూలు మనిషి కాలేదు. మా నాన్న లేరు. చెల్లికి పెళ్ళి చేయాలని అమ్మ తాపత్రయం. చెల్లి మానసిక స్థితి గురించి చెప్పకుండా చేస్తే తర్వాత సమస్యలొస్తాయని భయం. ఇలాంటి వారికి పెళ్ళి చెయ్యొచ్చంటారా? దీనికి పరిష్కారం ఉందా?

– ఉదయరాణి, హైదరాబాద్

ఆమెకు పెళ్లి చేయవచ్చా?

మీరు చెప్పినదాన్ని బట్టి మీ చెల్లెలు...'స్కిజోఫ్రీనియా' అనే మానసిక వ్యాధితో బాధ పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యాధి వచ్చినవారు చాలా సంవత్సరాలపాటు డాక్టరు పర్యవేక్షణలో మందులు వాడాల్సి ఉంటుంది. ఈ వ్యాధి పూర్తిగా నయం కాకపోవచ్చు. షుగర్, బి.పి. లాగా స్కిజోఫ్రీనియాని కూడా మందులతో అదుపు చేయవచ్చే తప్ప, పూర్తిగా నయం చేయడం కష్టమే!

ఇలాంటి వారికి కేవలం మందులే కాకుండా, కొంతకాలం 'రిహాబిలిటేషన్' సెంటర్‌లో ఉంచితే, ఆమె యాక్టివ్‌గా, నలుగురిలో కలిసేటట్లుగా తన పనులే కాకుండా, ఇంటిపని, వంటపని, పిల్లలను చూసుకోవడం లాంటి లక్షణాలు ఆమెలో పెంపొందించేట్లుగా శిక్షణ ఇస్తారు. ఇలా చేసిన తర్వాతే అవతలివారికి విషయం చెప్పి వారు ఒప్పుకుంటే వివాహానికి అభ్యంతరం లేదు. చెప్పకుండా చేయడం అనర్థదాయకం. అన్ని విషయాలు చెబితే కొందరు ఒప్పుకోవచ్చు. అవసరమైతే డాక్టరు దగ్గరికి కూడా అవతలి పార్టీని తీసుకొచ్చి వారి అనుమానాలు నివృత్తి చేయడం మంచిది. అన్నీ చెప్పి వాళ్ల సమ్మతి మీద పెళ్లి చేసిన సందర్భాలలో భవిష్యత్తులో ఏమైనా తేడాలే వచ్చినప్పుడు ఒకవేళ వారు విడాకుల కేసు వేసినా కోర్టు అంత సులభంగా విడాకులు మంజూరు చేయదు. ఎందుకంటే గతంలో ఒకరు తన భార్యకు స్కిజోఫ్రీనియా ఉంది కాబట్టి విడాకులివ్వాలని కోర్టుకెక్కాడు. అయితే స్కిజోఫ్రీనియా జబ్బు వచ్చినంత మాత్రాన విడాకులు ఇవ్వలేం, కానీ ఆ వ్యాధి వలన ఆ భర్త, పిల్లలు, కుటుంబం ఏమేరకు నష్టపోయిందనే విషయాలను నిర్ధారించగలిగితేనే అలాంటి కేసుల విషయంలో విడాకులు ఇవ్వాలా, వద్దా... అనే దాన్ని నిర్ణయించవలసి ఉంటుందని గతంలో సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. ఈ జడ్జిమెంట్‌ను ఇప్పటికీ మన దేశంలో ప్రామాణికంగా పాటిస్తూ ఉన్నారు.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:sakshifamily3@gmail.com

● ఆర్ట్ అండ్ కల్చర్



వరల్డ్ ఆర్ట్ మార్కెట్‌లో మన ఆర్ట్ వాటా 0.5 శాతమే! అసలు విలువ రెండువేల కోట్లకు పైమాటే అని చెబుతున్నారు నిపుణులు! మరెందుకు అంత తక్కువంటే.. 'మనకు ఆర్ట్‌ను మార్కెట్ చేసుకోవడం తెలీక' అంటారు ఆర్ట్‌లో పీహెచ్‌డీ, ఆర్ట్ ట్రేడ్‌లో అపార అనుభవం గడించిన హైదరాబాద్ కళాకారిణి, శిల్పి డాక్టర్ స్నేహలతా ప్రసాద్. ఆమె పరిచయం.. .

స్నేహ శిల్పం

డాక్టర్ స్నేహలతా ప్రసాద్ సొంతూరు జోధ్‌పూర్. తండ్రి దివాన్ సింగ్ నరూకా డిఫెన్స్‌లో పనిచేసేవారు. అమ్మ.. లీలా దివాన్ హోమ్ మేకర్. ఆడపిల్లల మీద ఆంక్షలుండే రాజపుత్ర కుటుంబమైనా తల్లిదండ్రులిద్దరూ చదువుకున్నవారవడంతో స్నేహలతకు స్వేచ్ఛనిచ్చారు. ఆమె డాక్టర్ అవ్వాలని తండ్రి ఆశపడ్డాడు. కానీ స్నేహకు చిన్నప్పటి నుంచీ డ్రాయింగ్ అంటే ఆసక్తి. చక్కగా బొమ్మలు వేసేది. ఆర్మేచర్, క్లే ఆర్ట్ మీద వ్యాక్స్‌తో అలంకరించేది. అది గమనించే లీలా దివాన్ కూతురు ఆర్టిస్ట్ అవ్వాలని కోరుకుంది. ఆమె అనుకున్నట్టే స్నేహ ఆర్టిస్ట్ అయింది. పీహెచ్‌డీ చేసింది. తన ఆర్ట్‌ని మార్కెట్ చేసుకునే ఆర్టూ తెలిసుండాలని ఫారిన్ ట్రేడ్ కోర్స్ కూడా చేసింది. సొంతంగా గ్యాలరీ పెట్టుకుంది. ఆర్ట్ + 2ఎగ్జిబిషన్స్‌లో ఆమె పెయింటింగ్స్ ఎమ్మెఫ్ హుస్సేన్ పెయింటింగ్స్‌తో సమంగా సేల్ అయ్యేవి! అలా రాజస్థాన్‌లో టాప్ టెన్ యంగ్ ఆర్టిస్ట్‌లో ఒకరుగా నిలిచింది.

పెళ్లితో...

సంప్రదాయ రాజపుత్ర కుటుంబాల నుంచి వచ్చిన పెళ్లి సంబంధాలన్నీ పెళ్లయ్యాక స్నేహ గృహిణిగా ఉండాలనే షరతుతో వచ్చినవే! దాంతో వాటిని తిరస్కరించారు స్నేహ తల్లిదండ్రులు. అప్పుడే స్నేహ వాళ్ల ఫ్యామిలీ ఫ్రెండ్ ఒక సంబంధం తీసుకొచ్చారు. అబ్బాయి డాక్టర్. నాన్‌మెడికల్ ప్రొఫెషన్ అమ్మాయి కోసం వెదుకుతున్నాడతను. అందరికీ నచ్చడంతో 2004లో పెళ్లి అయింది. అతని పేరు డాక్టర్ ప్రసాద్ పత్రి. తెలుగు వ్యక్తి. అయితే అది రాజ్‌పుత్ సంబంధం కాదని ఆ పెళ్లికి స్నేహ వాళ్ల దగ్గరి బంధువులెవరూ రాలేదు. కొత్తదంపతులు హైదరాబాద్ వచ్చేశారు. పెళ్లయిన వెంటనే పిల్లలు పుట్టడంతో మాతృత్వాన్ని ఆస్వాదించాలనుకుంది స్నేహ. దాంతో పెయింటింగ్‌కి బ్రేక్ పడింది.

> 'కళతోపాటు మార్కెట్‌ను క్రియేట్ చేసుకునే స్కిల్ కూడా ఉండాలి. ఎమ్మెఫ్ హుస్సేన్ సాబ్ గనుక తన మార్కెట్‌ను డెవలప్ చేసుకోకపోయి ఉంటే ఈరోజు ఆయన ఎవరికీ తెలిసుండేవారు కాదు. ఆర్ట్‌కి మార్కెట్ అంత ఇంపార్టెంట్. ఆర్ట్ అకడమిక్స్‌లోనూ మార్కెటింగ్‌ని చేర్చాలి. విమెన్ ఆర్టిస్ట్‌లు తమ పరిధిని విస్తృతం చేసుకోవాలి. బడ్డింగ్ ఆర్టిస్ట్‌లకు చెప్పేదొకటే.. ఓన్ స్టయిల్‌ను తద్వారా ఓన్ మార్కెట్‌ను క్రియేట్ చేసుకోవాలి.'
>
> **- డాక్టర్ స్నేహలతా ప్రసాద్**

స్నేహలతా ఆర్ట్ క్రెడిట్స్



రాజస్థాన్, ఢిల్లీ, హరియాణా హైఫై, పుణె, హైదరాబాద్, కొత్తగూడెంలలో స్కల్ప్టింగ్ చేసింది. దేశంలోని పలు ప్రాంతాల్లో పదిహేను ఎన్విరాన్‌మెంట్ ఫ్రెండ్లీ పార్క్స్‌ను డిజైన్ చేసింది. సికంద్రాబాద్ కంటోన్మెంట్‌లోనూ స్కల్ప్టింగ్ చేసింది. వందల ఏళ్ల నాటి శిల్పాలను రెస్టొరేట్ చేసింది. ఏఐ ఇంటీరియర్ డిజైన్ చేస్తోంది. బికనీర్ ఆర్మీ కోసమూ పనిచేస్తోంది.

సెకండ్ ఇన్నింగ్స్...

పదేళ్ల తర్వాత మళ్లీ కాన్వాస్ ఫ్రేమ్ చేసుకుంది స్నేహ. అయితే అదంత ఈజీ కాలేదు. పెళ్లికిముందు ఆర్టిస్ట్‌గానే కాదు మంచి ఆంట్రప్రెన్యూర్‌గానూ స్పేస్ సంపాదించుకున్న ఆమెకు ఈ పదేళ్లలో చాలా మారిపోయినట్టనిపించింది. దాంతో జీరో నుంచి స్టార్ట్ చేయాల్సి వచ్చింది. సెకండ్ ఇన్నింగ్స్ ఫస్ట్ షో కోసం ఢిల్లీ లలిత కళా అకాడమీని బుక్ చేసుకుంది. నెల రోజుల్లో ప్రదర్శన. బ్రేక్ తీసుకున్న పదేళ్ల కాలాన్నే పద్నాలుగు పెయింటింగ్స్‌తో వ్యక్తపరచింది. మరోటి 'గోల్డెన్ ఎరా ఆఫ్ ఇండియన్ పెయింటింగ్'.



తనను ఇన్‌స్పైర్ అండ్ ఇన్‌ఫ్లుయెన్స్ చేసిన ఆర్ట్‌ఫామ్స్‌ని ట్రాన్స్‌పరెంట్ ఫామ్‌లో వేసిన 32 అడుగుల తన తొలి పెద్ద పెయింటింగ్. దాని కోసం చాలా కష్టపడింది. ఆ శ్రమ వృథా కాలేదు. కాంప్లిమెంట్స్‌తోబాటు కాసులూ వచ్చాయి. లలిత కళా అకాడమీలో ఆమెకు లభించిన ఆదరణ చూసి భర్త ప్రసాద్ సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ఆమె కెరీర్‌కి సపోర్ట్‌గా నిలిచారు.

శిల్పం...

2013లో లలిత కళా అకాడమీ వాళ్లదే సిమ్లాలో ఆర్ట్ క్యాంప్ ఉంటే వెళ్లింది స్నేహ. అందులో పెయింటింగ్, స్కల్ప్చర్ రెండూ ఉన్నాయి. అక్కడ వుడ్ స్కల్ప్టింగ్ చూసేసరికి ఒక్కసారిగా తన చిన్నప్పటి స్కల్ప్టింగ్ ఆశ రెక్కలు తొడుక్కుంది. స్కల్ప్టింగ్‌కి ప్రయత్నించింది. తొలుత క్లే మోడలింగ్‌తో స్కల్ప్టింగ్ జర్నీ స్టార్ట్ చేసింది. తర్వాత స్టోన్ వర్క్ మొదలుపెట్టింది. ఆర్ట్ అండ్ కల్చర్ మినిస్ట్రీ జూనియర్ ఫెలోషిప్ కూడా పొందింది. ఎన్నో ఆర్ట్ క్యాంప్స్, నేషనల్, ఇంటర్నేషనల్ సింపోజియమ్స్‌ను నిర్వహించింది. ఈ మధ్యనే 25వ సోలో షో చేసింది. ఇంటర్నేషనల్ ఆర్ట్ షోస్‌నూ క్యూరేట్ చేస్తోంది. ఆర్ట్ లెక్చర్స్ ఇస్తుంది. లాంగెస్ట్ పెయింటింగ్ ఆఫ్ ఇండియాలో పేరు సంపాదించింది. హైదరాబాద్‌లో 'స్నేహ డి ఆర్ట్స్' పేరుతో గ్యాలరీ ప్రారంభించింది. పెయింటింగ్, స్కల్ప్చర్‌లో శిక్షణ ఇస్తోంది. సంప్రదాయానికి విరుద్ధంగా తనను చదివించినందుకు, కళారంగంలో ప్రోత్సహించినందుకు ఎవరైతే స్నేహ కుటుంబాన్ని విమర్శించారో వాళ్లంతా స్నేహను చూసి మొత్తం ఖాన్‌దాన్‌కే ఖ్యాతినార్జించి పెట్టిందని గర్వపడే స్థాయికి ఎదిగింది.

– సరస్వతి రమ





● తన బృందంతో స్నేహలతా ప్రసాద్



భారత గడ్డపై మళ్లీ మెస్సీ... ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడనున్న అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం

న్యూఢిల్లీ: ఫుట్‌బాల్ 'ఆల్‌టైమ్ గ్రేట్'లలో ఒకడైన లయోనల్ మెస్సీ ఆటను మరోసారి ప్రత్యక్షంగా చూసే అవకాశం భారత అభిమానులకు కలగనుంది. 14 సంవత్సరాల తర్వాత అతను మళ్లీ భారత్‌లో ఆడేందుకు సిద్ధమయ్యాడు. ఈ ఏడాది అక్టోబరులో కేరళలోని కొచ్చిలో మెస్సీ నేతృత్వంలోని అర్జెంటీనా జట్టు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడనుంది. దీనిపై చాలా కాలం క్రితమే కేరళ క్రీడాశాఖ మంత్రి అబ్దురహ్మాన్ ప్రకటన చేసినా... ఇప్పుడు దానికి అధికారిక ముద్ర పడింది. ప్రముఖ బ్యాంక్ 'హెచ్‌ఎస్‌బీసీ' ఈ పర్యటనలో అర్జెంటీనా టీమ్‌కు ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. భారత్‌లో ఫుట్‌బాల్‌ను ప్రమోట్ చేసేందుకు తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడిస్తూ అర్జెంటీనా రాకను హెచ్‌ఎస్‌బీసీ హెడ్ సందీప్ బత్రా ఖరారు చేశారు. 2025లో భారత్‌తో పాటు సింగపూర్‌లో కూడా మ్యాచ్‌లు ఆడేందుకు అర్జెంటీనా ఫుట్‌బాల్ సంఘం 'హెచ్‌ఎస్‌బీసీ'తో ఒప్పందం చేసుకుంది. 2011లో వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్ ఆడేందుకు మెస్సీ మొదటిసారి భారత్‌కు వచ్చాడు. కోల్‌కతాలో జరిగిన ఈ మ్యాచ్‌లో వెనిజులాతో తలపడిన అర్జెంటీనా 1-0తో విజయం సాధించింది.



సెమీస్‌లో అనాహత్

ముంబై: జేఎస్‌డబ్ల్యూ ఇండియన్ ఓపెన్ స్క్వాష్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారిణులు అనాహత్ సింగ్, జోష్నా చినప్ప సెమీఫైనల్లోకి ప్రవేశించారు. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో అనాహత్ 11-6, 12-14, 8-11, 11-6, 11-9తో నాదియా (ఈజిప్ట్)పై, జోష్నా 12-10, 13-11, 9-11, 9-11, 11-5తో టాప్ సీడ్ ఆకాంక్ష సాలుంఖే (భారత్)పై విజయం సాధించారు. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ అభయ్ సింగ్ సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు. క్వార్టర్ ఫైనల్లో అభయ్ 11-5, 11-8, 11-7తో అమీషెన్‌రాజ్ (మలేసియా)పై గెలిచాడు.

నితేశ్‌కు కాంస్యం



అమ్మాన్ (జోర్డాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో రెండో రోజు భారత్‌కు మరో కాంస్య పతకం లభించింది. పురుషుల గ్రీకో రోమన్ స్టయిల్ 97 కేజీల విభాగంలో భారత రెజ్లర్ నితేశ్ కాంస్య పతకాన్ని సాధించాడు. అమాన్‌బెర్డీ అగమమెదోవ్ (తుర్క్‌మెనిస్తాన్)తో బుధవారం జరిగిన కాంస్య పతక బౌట్‌లో నితేశ్ 9-0 పాయింట్ల తేడాతో గెలుపొందాడు. తొలి రౌండ్‌లో 'బై' పొంది నేరుగా క్వార్టర్ ఫైనల్ బౌట్ ఆడిన నితేశ్ 9-0తో ఇలియాస్ గుచిగోవ్ (కజకిస్తాన్)పై విజయం సాధించాడు. అయితే సెమీఫైనల్లో నితేశ్ 0-9తో వరల్డ్ నంబర్‌వన్ మొహమ్మదాదీ సరావీ (ఇరాన్) చేతిలో ఓడిపోయి కాంస్య పతక పోరుకు అర్హత సాధించాడు. భారత్‌కే చెందిన మరో రెజ్లర్ నీరజ్ (67 కేజీలు) త్రుటిలో కాంస్య పతకాన్ని కోల్పోయాడు. కాంస్య పతక బౌట్‌లో నీరజ్ 0-5తో కత్సుకి ఎండో (జపాన్) చేతిలో ఓడిపోయాడు. తొలి రోజు మంగళవారం సునీల్ కుమార్ (87 కేజీలు) భారత్‌కు తొలి కాంస్య పతకాన్ని అందించాడు.

డికాక్ ధమాకా

61 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లతో 97 నాటౌట్

ఐపీఎల్‌లో పరుగుల వరద పారిన రెండు వరుస మ్యాచ్‌ల తర్వాత ఆ జోరుకు కాస్త విరామం. పొడిగా, బ్యాటింగ్‌కు అనుకూలంగా లేని పిచ్‌పై సాగిన మ్యాచ్‌లో సీజన్‌లో తక్కువ స్కోరు నమోదు కాగా, డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) పైచేయి సాధించి తొలి విజయాన్ని నమోదు చేసింది. వరుణ్ చక్రవర్తి, మొయిన్ అలీ కట్టుదిట్టమైన స్పిన్‌తో ముందుగా రాజస్తాన్‌ను నైట్‌రైడర్స్ తక్కువ స్కోరుకే పరిమితం చేసింది. ఆ తర్వాత డికాక్ దూకుడైన బ్యాటింగ్‌తో లక్ష్యఛేదనను సునాయాసం చేసేశాడు. 15 బంతులు మిగిలి ఉండగానే కేకేఆర్ విజయాన్నందుకుంది. అన్ని రంగాల్లో విఫలమైన రాజస్తాన్ రాయల్స్ తమ 'హోం గ్రౌండ్'లో పేలవ ప్రదర్శనతో వరుసగా రెండో ఓటమిని మూటగట్టుకుంది.

- కోల్‌కతా నైట్‌రైడర్స్ గెలుపు బోణీ
- రాజస్తాన్ రాయల్స్‌పై 8 వికెట్లతో విజయం
- కోల్‌కతా బౌలర్ల సమష్టి ప్రదర్శన


డికాక్

గువహటి: డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్ ఈ ఐపీఎల్ సీజన్‌లో గెలుపు బోణీ చేసింది. గత మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓడిన నైట్‌రైడర్స్ బుధవారం జరిగిన పోరులో 8 వికెట్ల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 151 పరుగులు చేసింది. ధ్రువ్ జురేల్ (28 బంతుల్లో 33; 5 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా, యశస్వి జైస్వాల్ (24 బంతుల్లో 29; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), తాత్కాలిక కెప్టెన్ రియాన్ పరాగ్ (15 బంతుల్లో 25; 3 సిక్స్‌లు) ఫర్వాలేదనిపించారు. స్పిన్‌కు అనుకూలించిన పిచ్‌పై వరుణ్, మొయిన్ అలీ 8 ఓవర్లలో 40 పరుగులకే 4 వికెట్లు తీసి రాయల్స్‌ను దెబ్బ కొట్టారు. వైభవ్ అరోరా, హర్షిత్ కూడా చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం కోల్‌కతా 17.3 ఓవర్లలో 2 వికెట్లకు 153 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' క్వింటన్ డికాక్ (61 బంతుల్లో 97 నాటౌట్; 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) త్రుటిలో శతకం చేజార్చుకున్నాడు. సునీల్ నరైన్ అనారోగ్యం కారణంగా మ్యాచ్‌కు దూరం కావడంతో మొయిన్ అలీకి కోల్‌కతా చోటు కల్పించగా, ఫారుఖీ స్థానంలో రాజస్తాన్ జట్టులోకి హసరంగ వచ్చాడు.

సమష్టి వైఫల్యం...

రాజస్తాన్ ఇన్నింగ్స్ ఆసాంతం ఒకే తరహాలో సాదాసీదాగా సాగింది. ఆశించిన స్థాయిలో దూకుడైన బ్యాటింగ్ లేకపోగా, ఒక్కటీ సరైన భాగస్వామ్యం రాలేదు. జైస్వాల్ ధాటిగానే మొదలు పెట్టినా... మరోవైపు సంజు సామ్సన్ (11 బంతుల్లో 13; 2 ఫోర్లు) ఎక్కువ సేపు నిలవలేదు. 'లోకల్ బాయ్' పరాగ్ తన తొలి 7 బంతుల్లో 2 సిక్సర్లు బాది అభిమానులను ఆకట్టుకున్నాడు. వరుణ్ ఓవర్లోనూ డీప్ మిడ్‌వికెట్ మీదుగా భారీ సిక్స్ బాదిన అతను...అదే ఓవర్లో మరో షాట్‌కు ప్రయత్నించి వెనుదిరగడంతో మైదానంలో నిశ్శబ్దం ఆవరించింది. ఆ తర్వాత హసరంగ (4)ను ముందుగా పంపిన ప్రయోగం ఫలితం ఇవ్వకపోగా, నితీశ్ రాణా (9 బంతుల్లో 8), శుభమ్ దూబే (12 బంతుల్లో 9; 1 ఫోర్) కూడా విఫలమయ్యారు. 67/1తో మెరుగైన స్థితిలో కనిపించిన రాజస్తాన్ 15 పరుగుల వ్యవధిలో 4 వికెట్లు కోల్పోయి 82/5కి చేరింది. దాంతో 'ఇంపాక్ట్ సబ్'గా అదనపు బ్యాటర్‌ను శుభమ్ దూబే రూపంలో ఏడో స్థానంలో బరిలోకి దింపింది. అయితే ఒత్తిడిలో అతనూ ప్రభావం చూపలేకపోయాడు. ఈ దశలో జురేల్ కొన్ని చక్కటి షాట్లతో జట్టును ఆదుకున్నాడు. హర్షిత్ రాణా వరుస ఓవర్లలో అతను రెండేసి ఫోర్లు కొట్టాడు. అయితే హర్షిత్ తన తర్వాతి ఓవర్లో జురేల్, ప్రమాదకర బ్యాటర్ హెట్‌మైర్ (8 బంతుల్లో 7; 1 ఫోర్)లను వెనక్కి పంపించాడు. చివర్లో ఆర్చర్ (7 బంతుల్లో 16; 2 సిక్స్‌లు) కొట్టిన రెండు సిక్సర్లతో రాజస్తాన్ స్కోరు 150 పరుగులు దాటింది.


వరుణ్ చక్రవర్తి, రహానే

ఐపీఎల్-2025: అప్‌డేట్, వివరాలు, విశ్లేషణ కోసం స్కాన్ చేయండి

డికాక్ మెరుపులు...

ఛేదనలో డికాక్ ఆరంభం నుంచే ధాటిగా ఆడాడు. పవర్‌ప్లేలో జట్టు స్కోరు 40 పరుగులు కాగా, డికాక్ ఒక్కడే 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34 పరుగులు సాధించాడు. మరోవైపు కేకేఆర్ తరఫున ఐపీఎల్‌లో తొలి మ్యాచ్ ఆడిన మొయిన్ అలీ (5) రనౌట్ కావడంతో జట్టు మొదటి వికెట్‌ను కోల్పోయింది. కెప్టెన్ అజింక్య రహానే (15 బంతుల్లో 18; 1 ఫోర్, 1 సిక్స్) కూడా ఎక్కువ సేపు నిలవలేకపోయినా, డికాక్ జోరుతో స్కోరు వేగంగా సాగిపోయింది. 35 బంతుల్లోనే డికాక్ హాఫ్ సెంచరీ పూర్తయింది. అతనికి గెలుపు దిశగా అంగ్‌క్రిష్ రఘువంశీ (17 బంతుల్లో 22 నాటౌట్; 2 ఫోర్లు) సహకరించాడు. దూకుడు తగ్గించని డికాక్ శతకం దిశగా దూసుకుపోయాడు. చివరి 3 ఓవర్లలో నైట్‌రైడర్స్ విజయానికి 17 పరుగులు, డికాక్ సెంచరీకి 19 పరుగులు అవసరం కాగా, ఆర్చర్ ఓవర్లో డికాక్ ఒక ఫోర్, 2 సిక్స్‌లు బాదినా... చివరకు 97 వద్దే అతను ఆగిపోవాల్సి వచ్చింది.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
హైదరాబాద్	1	1	0	2	2.200
బెంగళూరు	1	1	0	2	2.137
పంజాబ్	1	1	0	2	0.550
చెన్నై	1	1	0	2	0.493
ఢిల్లీ	1	1	0	2	0.371
కోల్‌కతా	2	1	1	2	-0.308
లక్నో	1	0	1	0	-0.371
ముంబై	1	0	1	0	-0.493
గుజరాత్	1	0	1	0	-0.550
రాజస్తాన్	2	0	2	0	-1.882

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) హర్షిత్ రాణా (బి) అలీ 29; సామ్సన్ (బి) అరోరా 13; పరాగ్ (సి) డికాక్ (బి) వరుణ్ 25; నితీశ్ రాణా (బి) అలీ 8; హసరంగ (సి) రహానే (బి) వరుణ్ 4; జురేల్ (బి) హర్షిత్ రాణా 33; శుభమ్ (సి) రసెల్ (బి) అరోరా 9; హెట్‌మైర్ (సి) రఘువంశీ (బి) హర్షిత్ రాణా 7; ఆర్చర్ (బి) జాన్సన్ 16; తీక్షణ (నాటౌట్) 1; తుషార్ దేశ్‌పాండే (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం** (20 ఓవర్లలో 9 వికెట్లకు) 151. **వికెట్ల పతనం:** 1-33, 2-67, 3-69, 4-76, 5-82, 6-110, 7-131, 8-138, 9-149. **బౌలింగ్:** స్పెన్సర్ జాన్సన్ 4-0-42-1, వైభవ్ అరోరా 4-0-33-2, హర్షిత్ రాణా 4-0-36-2, మొయిన్ అలీ 4-0-23-2, వరుణ్ 4-0-17-2.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: మొయిన్ అలీ (రనౌట్) 5; డికాక్ (నాటౌట్) 97; రహానే (సి) దేశ్‌పాండే (బి) హసరంగ 18; రఘువంశీ (నాటౌట్) 22; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం** (17.3 ఓవర్లలో 2 వికెట్లకు) 153. **వికెట్ల పతనం:** 1-41, 2-70. **బౌలింగ్:** జోఫ్రా ఆర్చర్ 2.3-0-33-0, మహీశ్ తీక్షణ 4-0-32-0, రియాన్ పరాగ్ 4-0-25-0, సందీప్ శర్మ 2-0-11-0, హసరంగ 3-0-34-1, నితీశ్ రాణా 1-0-9-0, తుషార్ 1-0-7-0.

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ X లక్నో
వేదిక: హైదరాబాద్
రాత్రి 7:30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

ఇంకెందుకు లేటు...


చిరంజీవి, అనిల్ రావిపూడి

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'చిరుఅనిల్' (వర్కింగ్ టైటిల్) అనే మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని సాహు గారపాటి నిర్మించనున్నారు. కాగా ఈ సినిమా స్క్రిప్ట్ పూర్తి స్థాయిలో లాక్ అయ్యిందని అనిల్ రావిపూడి తెలిపారు. "ఫైనల్ నరేషన్ పూర్తయింది. చిరంజీవిగారికి నా కథలోని పాత్ర శంకర్ వరప్రసాద్ (చిరంజీవి అసలు పేరు శివ శంకర వరప్రసాద్)ని పరిచయం చేశాను. స్క్రిప్ట్ నరేషన్ సమయంలో చిరంజీవిగారు ఎంజాయ్ చేశారు. ఇంకెందుకు లేటు? త్వరలో మూహూర్తంతో... చిరునవ్వుల పండగ బొమ్మకి శ్రీకారం'' అని అనిల్ రావిపూడి పేర్కొన్నారు. ఈ సినిమాను 2026 సంక్రాంతికి విడుదల చేయనున్నారు.

హిస్టారికల్ ప్యారడైజ్


నాని

'దసరా' (2023) వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల, నిర్మాత సుధాకర్ చెరుకూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్‌ఎల్‌వీ సినిమాస్‌పై రూపొందుతోన్న ఈ మూవీ 2026 మార్చి 26న విడుదల కానుంది. కాగా ఈ సినిమా సరిగ్గా 365 రోజుల్లో తెరపైకి రానుందని పేర్కొని, 'వన్ ఇయర్ టు గో... ఇండియన్ సినిమా విట్నెస్ ది మ్యాడ్నెస్' అంటూ కొత్త పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. "ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతోన్న చిత్రం 'ది ప్యారడైజ్'. ఇప్పటికే విడుదలైన మా టీజర్‌కి అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ గ్రిప్పింగ్ టీజర్ అందరి దృష్టిని ఆకర్షించి రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్ సాధించింది. హైదరాబాద్ చారిత్రక నేపథ్యంలో రూపొందుతున్న 'ది ప్యారడైజ్' నానిని మోస్ట్ ఇంటెన్స్ క్యారెక్టర్‌లో చూపించనుంది. సుధాకర్ చెరుకూరి అత్యున్నత స్థాయి నిర్మాణ విలువలతో ఈ చిత్రం నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి అనిరుధ్ రవిచందర్ సంగీతం, ఏఓ విష్ణు సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. మా చిత్రం తెలుగు, ఇంగ్లిష్, స్పానిష్ సహా 8 భాషల్లో విడుదల కానుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

పోటీ తప్పదనే మైండ్‌సెట్‌తో ఉండాలి

- నిర్మాత వై. రవిశంకర్


వెంకీ కుడుముల, వై. రవిశంకర్, నితిన్

"రాబిన్ హుడ్‌లో మంచి వినోదం ఉంది. ఓ హార్ట్ టచింగ్ పాయింట్‌ను ఈ సినిమాలో టచ్ చేశాం. ఆడియన్స్ కొత్త అనుభూతి పొందుతారు'' అని నితిన్ అన్నారు. నితిన్, శ్రీలీల జంటగా నటించిన తాజా చిత్రం 'రాబిన్ హుడ్'. ఆస్ట్రేలియన్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ అతిథి పాత్రలో నటించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం విలేకరుల సమావేశంలో హీరో నితిన్ మాట్లాడుతూ– "ఈ సినిమాలో నాది చాలా ఇంటలెక్చువల్ రోల్. క్లైమాక్స్‌లో నా క్యారెక్టర్ రౌండప్, వచ్చే ట్విస్ట్‌లు, షాక్‌లు ఆడియన్స్‌కు ఫ్రెష్‌గా అనిపిస్తాయి'' అని అన్నారు. "ఈ సినిమాలో ఫన్ ఉన్నప్పటికీ కథలో ఆత్మ మాత్రం ఎమోషనే. ఆ ఎమోషన్ సీక్వెన్స్ బాగా వర్కౌట్ అయింది'' అని తెలిపారు వెంకీ కుడుముల. "ఈ రోజుల్లో ఉన్న పోటీ ప్రపంచంలో సోలో రిలీజ్ డేట్ ఆశించకూడదు. మేం వస్తున్నామన్నప్పుడు మా ఒక్క సినిమానే ఉంది. కానీ ఇప్పుడు రెండు డబ్బింగ్ సినిమాలు వచ్చాయి. మనం మూవీ చేస్తున్నప్పుడే పోటీ తప్పదనే మైండ్ సెట్‌తో దిగాలని భావిస్తా. ఇక వచ్చే ఏడాది మా బ్యానర్‌కు చాలా ముఖ్యం. ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్, రామ్‌చరణ్–బుచ్చిబాబు, ప్రభాస్–హను రాఘవపూడి, రిషబ్ శెట్టి 'జై హనుమాన్', రాహుల్ సంకృత్యాన్–విజయ్ దేవరకొండ మూవీ, పవన్ కల్యాణ్ సినిమా... ఈ అరడజను సినిమాలపై మా ప్రస్తుత ఫోకస్ ఉంది. ఇక తమిళ హీరో అజిత్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' మూవీకి మంచి ఓపెనింగ్స్ వస్తాయని ఆశిస్తున్నాం. మా బేనర్లో ఇంకొన్ని సినిమాలు కూడా ఉన్నాయి'' అని అన్నారు.

రెట్టింపు వినోదంతో...


సంగీత్ శోభన్, విష్ణు, హారిక, నార్నే నితిన్, రామ్ నితిన్

"మ్యాడ్ స్క్వేర్' సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకులు మనస్ఫూర్తిగా నవ్వుకుంటారు. థియేటర్స్‌కి వచ్చిన ప్రతి ఒక్కరూ తాము టిక్కెట్ కోసం పెట్టిన ప్రతి రూపాయికి న్యాయం జరిగిందని భావిస్తారు'' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ పేర్కొన్నారు. నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ హీరోలుగా నటించిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం రేపు (శుక్రవారం) రిలీజ్ కానుంది. బుధవారం నిర్వహించిన ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హారిక సూర్యదేవర మాట్లాడుతూ– "కుటుంబమంతా కలిసి చూడదగ్గ చిత్రమిది'' అన్నారు. నార్నే నితిన్ మాట్లాడుతూ– "మ్యాడ్' సినిమాని ఆదరించిన ప్రేక్షకులకు రుణపడి ఉంటాం. ఇప్పుడు 'మ్యాడ్ స్క్వేర్'లో వినోదం రెట్టింపు ఉంటుంది. చూసి ఆనందించండి'' అని తెలిపారు. "మా ట్రైలర్ అందరికీ నచ్చిందనుకుంటున్నాం. సినిమా కూడా కచ్చితంగా నచ్చుతుంది'' అన్నారు సంగీత్ శోభన్, రామ్ నితిన్.

ఏం జరిగినా మంచికే జరుగుతుంది

- ఖుష్బూ




నయనతార

నయనతార ప్రధాన పాత్రలో నటిస్తున్న తమిళ చిత్రం 'మూక్కుత్తి అమ్మన్ 2'. సుందర్. సి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఇటీవల ప్రారంభమైంది. కాగా ఈ సినిమా సెట్స్‌లో కాస్ట్యూమ్స్ విషయంలో నయనతారకు, ఓ అసిస్టెంట్ డైరెక్టర్‌కు మధ్య వాగ్వాదం జరిగిందని, దీంతో నయనతారకు, సుందర్. సి మధ్య కూడా భేదాభిప్రాయాలొచ్చాయనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఈ విషయంపై నటి–నిర్మాత ఖుష్బూ (సుందర్.సి సతీమణి) 'ఎక్స్' వేదికగా స్పందించారు. "మూక్కుత్తి అమ్మన్ 2' సినిమా గురించి అనవసరమైన పుకార్లు ప్రచారంలోకి వచ్చాయి. ఈ సినిమా చిత్రీకరణ సజావుగా సాగుతోంది. సెట్స్‌లో సుంద ర్. సి నాన్‌సెన్స్ క్రియేట్ చేసే పర్సన్ కాదు. నయనతార ఎంతో ప్రొఫెషనల్‌గా ఉంటారు. గతంలో ఆమె పోషించిన పాత్రనే మళ్లీ ఈ సినిమాలో చేస్తున్నారు ('మూక్కుత్తి అమ్మన్' పార్ట్ 1 సినిమాలో నయనతార లీడ్ రోల్ చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ...). ఇక 'మూక్కుత్తి అమ్మన్ 2' ఆగిపోయిందని వచ్చిన వార్తల వల్ల మా సినిమాకు దిష్టి తీసినట్లయింది. ఏం జరిగినా మంచికే జరుగుతుంది'' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు ఖుష్బూ. అవ్నీ సినీ మ్యాక్స్, రౌడీ పిక్చర్స్, వేల్స్ ఫిల్మ్ ఇంటర్‌నేషనల్ పతాకాలపై ఇషారి కె. గణేశ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇక 2020లో ఓటీటీలో విడుదలైన 'మూక్కుత్తి అమ్మన్' ('అమ్మోరు తల్లి') సినిమాకు సీక్వెల్‌గా 'మూక్కుత్తి అమ్మన్ 2' రూపొందుతోంది.

ఫన్ షురూ


మమితా బైజు, ప్రదీప్ రంగనాథన్, కీర్తీశ్వరన్

'లవ్ టుడే, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' వంటి చిత్రాలతో తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు తమిళ నటుడు ప్రదీప్ రంగనాథన్. ఆయన హీరోగా తెలుగు–తమిళ భాషల్లో 'పీఆర్ 04' (వర్కింగ్ టైటిల్) అనే కొత్త చిత్రం ఆరంభమైంది. అసిస్టెంట్ డైరెక్టర్ కీర్తీశ్వరన్ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుండగా, సీనియర్ నటుడు శరత్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా బుధవారం ప్రారంభమైంది. "ప్రదీప్ రంగనాథన్ తమిళ సినిమాల్లోనే కాకుండా తెలుగులో కూడా పేరు తెచ్చుకున్నారు. ఆయన నటిస్తున్న 'పీఆర్ 04' మూవీ న్యూ ఏజ్ కథతో పూర్తి స్థాయి వినోదాత్మకంగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. హృదు హరూన్, ద్రవిడ్ సెల్వం తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సీఈఓ: చెర్రీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అనిల్ ఎర్నేని, సంగీతం: సాయి అభ్యంకర్, కెమెరా: నికేత్ బొమ్మి.

మనసే వినదా..


చాందిని, విక్రాంత్

'నాలో ఏదో మొదలైందని... నీతో చెలిమే రుజువైందని... కనులే చెబితే మనసే వినదా..' అంటూ సాగుతుంది 'నాలో ఏదో..' పాట. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటిస్తున్న 'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రంలోనిది ఈ పాట. సంజీవ్ రెడ్డి దర్శకత్వంలో మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలోనే రిలీజ్ కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'నాలో ఏదో..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. చిత్రసంగీత దర్శకుడు సునీల్ కశ్యప్ స్వరపరచిన ఈ పాటకు శ్రీ జో సాహిత్యం అందించగా అదితీ భావరాజు, దినకర్ పాడారు. "సంతాన ప్రాప్తిరస్తు' ఒక కాంటెంపరరీ ఫిల్మ్' అని తెలిపారు మధుర శ్రీధర్ రెడ్డి. "ప్రస్తుత సమాజంలోని ఓ సమకాలీన సమస్యను చూపించే చిత్రమిది. సినిమాలో హీరో హీరోయిన్ల లవ్ జర్నీని తెలిపేలా తాజాగా విడుదల చేసిన 'నాలో ఏదో...' పాట ఉంటుంది'' అన్నారు సంజీవ్ రెడ్డి.

వేసవిలో సోదరా


'సోదరా' పోస్టర్

సంపూర్ణేష్ బాబు, సంజోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. ప్రాచీ బంసాల్, ఆరతి గుప్తా, బాబా భాస్కర్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. మోహన్ మేనంపల్లి దర్శకత్వంలో చంద్ర చగంలా నిర్మించారు. ఈ సినిమాను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ– "అన్నదమ్ముల అనుబంధం ఎంత గొప్పదో అందరికీ తెలుసు. అలాంటి అన్నదమ్ముల అనుబంధాన్ని వెండితెరపై ఆవిష్కరించనున్న సినిమాయే 'సోదరా'. ఈ వేసవికి ఈ సినిమా ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. "సంపూర్ణేష్ బాబు నుంచి ప్రేక్షకులు ఆశిస్తున్న ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఆయనలోని మరో కోణాన్ని ప్రేక్షకులు ఈ చిత్రంలో చూడబోతున్నారు'' అని తెలిపారు చంద్ర చగంలా. ఈ సినిమాకు సంగీతం: సునీల్ కశ్యప్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
	729	182
	77,288	23,487

విదేశీ సూచీలు (రాత్రి 11:30 ముగింపు)		
నాస్‌డాక్	17,873	▽ 399
డోజోన్స్	42,550	▽ 210
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,690	△ 26
డాక్స్	22,839	▽ 271
షాంఘై	3,369	▽ 1
నికాయ్	38,027	△ 247

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	87,791	△ 40
బంగారం (99.5 స్వచ్ఛత)	87,439	△ 39
వెండి (కిలో)	98,794	△ 872

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		84.05	87.36
£	బ్రిటన్ పౌండ్		108.11	112.67
€	యూరో		90.23	94.39
¥	జపాన్ ఎన్ (100)		46.00	67.00
AUS	ఆస్ట్రేలియా డాలర్		51.89	56.28
S$	సింగపూర్ డాలర్		61.81	66.22
SAR	సౌదీ రియాల్		21.96	23.50
UAE D	యూఏఈ దిర్హామ్		22.45	24.22
¥	చైనా యువాన్		10.92	12.74

ఈ దేశాన్ని విడిచి వెళ్లిపోతాం..



- 22 శాతం సంపన్న భారతీయుల అభిమతం
- మెరుగైన జీవన ప్రమాణాలు కరువు
- వ్యాపార అనుకూల పరిస్థితులూ లేవు
- ఈవై-కోటక్ ప్రైవేటు సర్వేలో వెల్లడైన అంశాలు

ముంబై: దేశంలోని అత్యంత ధనవంతుల్లో 22 శాతం మంది ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని అనుకుంటున్నారు. విదేశాల్లో మెరుగైన జీవన పరిస్థితులు, వ్యాపార అనుకూల వాతావరణం వారిని ఆకర్షిస్తున్నాయి. 150 మంది అల్ట్రా హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (అల్ట్రా హెచ్‌ఎన్‌ఐలు) అభిప్రాయాలను కోటక్ ప్రైవేటు (వెల్త్ మేనేజర్), ఈవై ఇండియా సర్వే చేశాయి. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, యూఏఈ దేశాల్లో స్థిరపడేందుకు ఎక్కువ మంది అల్ట్రా హెచ్‌ఎన్‌ఐ భారతీయులు ఆసక్తి చూపిస్తున్నారు. ఆయా దేశాలు ఆఫర్ చేస్తున్న గోల్డెన్ వీసా పథకం అనుకూలంగా ఉన్నట్టు కోటక్-ఈవై నివేదిక తెలిపింది. ఏటా 25 లక్షల మంది విదేశాలకు వలసపోతున్న గణాంకాలను ప్రస్తావించింది. సర్వేలో పాల్గొన్న ప్రతి ఐదుగురు అల్ట్రా హెచ్‌ఎన్‌ఐలలో ఒకరు విదేశాలకు వలసపోయే ప్రణాళికతో ఉన్నట్టు తెలిసింది. వీలైతే అక్కడే శాశ్వతంగా ఉండిపోవాలని, అదే సమయంలో భారతీయ పౌరసత్వాన్ని కొనసాగించుకునే ఆలోచనతో ఉన్నారు. మెరుగైన జీవన ప్రమాణాలు, ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలు, విద్య, జీవనశైలి ఇలా అన్నింటా విదేశాల్లో మెరుగైన ప్రమాణాలను వారు కోరుకుంటున్నారు. మరీ ముఖ్యంగా ప్రతి ముగ్గురిలో ఒకరు విదేశాల్లో వ్యాపార నిర్వహణలో ఉండే సౌలభ్యం తమను ఆకర్షిస్తున్నట్టు చెప్పారు. ముఖ్యంగా ఆరోగ్యం, శ్రేయస్సుకు వీరు ప్రాధాన్యం ఇస్తుండడం గమనార్హం.

2.83 లక్షల అల్ట్రా హెచ్‌ఎన్‌ఐలు

2023 నాటికి మన దేశంలో 2.83 లక్షల మంది అల్ట్రా హెచ్‌ఎన్‌ఐలు ఉన్నారు. ఒక్కొక్కరి నెట్‌వర్త్ (నికర సంపద విలువ) రూ.25 కోట్లకు పైన ఉండడాన్ని ప్రామాణికంగా తీసుకుని, వీరి జనాభా లెక్క గట్టారు. వీరందరి ఉమ్మడి సంపద విలువ రూ.2.83 లక్షల కోట్లుగా ఉంది. 2028 నాటికి అల్ట్రా హెచ్‌ఎన్‌ఐల సంఖ్య 4.3 లక్షలకు పెరుగుతుందని, వీరి నిర్వహణలోని సంపద రూ.359 లక్షల కోట్లకు విస్తరిస్తుందని ఈ సర్వే నివేదిక పేర్కొంది. బలమైన ఆర్థిక వృద్ధి, అధిక వినియోగం, పనిచేయతగిన యువ జనాభా ఎక్కువగా ఉండడం అల్ట్రా హెచ్‌ఎన్‌ఐల విభాగం వృద్ధికి అనుకూలిస్తాయని తెలిపింది.

పిల్లల విద్యకూడా కారణమే..

విదేశాలకు వలసపోవాలన్న నిర్ణయాన్ని భవిష్యత్ పెట్టుబడిగా ఈ సర్వే నివేదిక అభివర్ణించింది. వారి పిల్లలకు అత్యుత్తమ ఉన్నత విద్య సదుపాయం సైతం వారిని ఆ దిశగా నడిపించొచ్చని పేర్కొంది. ''విదేశాలకు వలసపోవాలన్న నిర్ణయాన్ని పెట్టబడులు తరలిపోవడంగా చూడరాదు. ఈ తరహా కార్యకలాపాలపై పరిమితులు విధించడం ద్వారా పౌరసత్వ హోదా మారినప్పటికీ వారి పెట్టుబడులు తరలిపోకుండా చూడొచ్చు. భారత్‌లో నివసించే పౌరుడు ఏడాదికి ఇంటికి తీసుకెళుతున్నది సగటున 2,50,000 డాలర్లే. అదే విధంగా నాన్ రెసిడెంట్‌ను సైతం ఏటా మిలియన్ డాలర్లనే తీసుకెళ్లేందుకు అనుమతించడం వల్ల పెట్టుబడులు తరలిపోవు''అని కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రెసిడెంట్ గౌతమి గవంకర్ అభిప్రాయపడ్డారు. వ్యాపారవేత్తల కంటే వృత్తి నిపుణులే ఎక్కువగా విదేశాలకు వలసపోయే ఉద్దేశంతో ఉన్నారు. అది కూడా అల్ట్రా హెచ్‌ఎన్‌ఐలలో 36-40 ఏళ్ల వయసులోని వారు, 61 ఏళ్లపైన వయసువారు వలసవెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

బ్యాంకులు, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ

- ఏడు రోజుల వరుస ర్యాలీకి బ్రేక్
- సెన్సెక్స్ 729 పాయింట్లు మైనస్
- నిఫ్టీ నష్టం 182 పాయింట్లు

ముంబై: మార్చి డెరివేటివ్స్ కాంట్రాక్టుల గడువు ముగింపునకు ముందు(నేడు) బ్యాంకులు, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. దీంతో స్టాక్ సూచీల ఏడురోజుల వరుస ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ 729 పాయింట్లు నష్టపోయి 77,288 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 182 పాయింట్లు కోల్పోయి 23,487 వద్ద నిలిచింది. అమెరికా ప్రతీకార సుంకాల అమలు గడువు (ఏప్రిల్ 2) సమీపిస్తుండటం, క్రూడాయిల్ ధరలు 3 వారాల గరిష్టానికి చేరుకోవడం, డాలర్ ఇండెక్స్, యూఎస్ బాండ్లపై రాబడులు పెరగడమూ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఒక దశలో సెన్సెక్స్ 823 పాయింట్లు క్షీణించి 77,194 వద్ద, నిఫ్టీ 216 పాయింట్లు పతనమై 23,452 వద్ద కనిష్టాలు తాకాయి. క్యాపిటల్ గూడ్స్ మినహా అన్ని రంగాల షేర్లూ అమ్మకాలు ఒత్తిడికి లోనయ్యాయి. సూచీల వారీగా ఆయిల్అండ్‌గ్యాస్ ఇండెక్స్ 1.52% అత్యధికంగా క్షీణించింది. రియల్టీ 1.37%, యుటిలిటీ 1.32%, ఇంధన 1.29%, బ్యాంకెక్స్ 1.08%, ఐటీ 1% చొప్పున నష్టపోయాయి.



ఐటీ షేర్లకు ఏమైంది?

కొద్ది నెలలుగా వెనకడుగు

- ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ వెయిటేజీలో క్షీణత
- యాక్సెంచర్ గైడెన్స్, టారిఫ్‌ల ఎఫెక్ట్
- ఐటీ దిగ్గజాల ఫలితాలు గుడ్
- విశ్లేషకుల అంచనాలు సానుకూలమే



ఇటీవల కొంత కాలంగా దేశీ ఐటీ దిగ్గజ కౌంటర్లలో కొనుగోళ్లకంటే అమ్మకాలే అధికంగా నమోదవుతున్నాయి. దీంతో స్టాక్ ఎక్స్ఛేంజీలలో ఐటీ రంగం వెనకడుగులో ఉంది. వెరసి ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ-50లో ఐటీ బ్లూచిప్స్ వెయిటేజీ 16 ఏళ్లలోనే కనిష్టానికి పడిపోయింది. ఇందుకు పలు అంశాలు కారణమైనప్పటికీ టీసీఎస్, ఇన్ఫోసిస్ తదితర దేశీ దిగ్గజాలు మెరుగైన పనితీరునే ప్రదర్శించనున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

కొత్త ఏడాదిలో యూఎస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార టారిఫ్‌లకు తెరతీశారు. అమెరికానే ప్రాధాన్యత అంటూ పలు దేశాలపై ఆంక్షలు విధిస్తున్నారు. దీంతో యూఎస్ ఆర్థిక వ్యవస్థ మందగించనున్న అంచనాలు ఇటీవల బలపడుతున్నాయి. ఫలితంగా ఉత్తర అమెరికా మార్కెట్లపై అధికంగా ఆధారపడి బిజినెస్ నిర్వహించే దేశీ సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీలపై ప్రతికూల ప్రభావం పడనున్నట్లు పరిశ్రమ వర్గాలలో అంచనాలకు తెరలేచింది. దీంతో స్టాక్ మార్కెట్లలో కొత్త ఏడాది (2025) ఐటీ కౌంటర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఎన్‌ఎస్‌ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ-50లో ఐటీ రంగం వెయిటేజీ తాజాగా 11.66%కి పరిమితమైంది. ఇది 16 ఏళ్ల కనిష్టం కాగా.. 2024 డిసెంబర్‌లో నమోదైన 13.53% నుంచి వెనకడుగు వేస్తూ వస్తోంది. 2022 మార్చిలో 17.67 శాతాన్ని తాకడం ద్వారా 25 ఏళ్ల గరిష్టాన్ని తాకిన ఇండెక్స్ ప్రస్తుతం భారీగా క్షీణించింది.

2025లో వీక్..

2025 జనవరి నుంచి ఐటీ ఇండెక్స్ 14 శాతానికి పైగా క్షీణించింది. దేశీయంగా టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా తదితర టాప్-10 కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే ఇండెక్స్ ఎఫ్‌పీఐల అమ్మకాల ఒత్తిడితో ఇటీవల డీలా పడుతోంది. 2024 జనవరి-డిసెంబర్‌లో నిఫ్టీ 9 శాతమే బలపడగా.. ఐటీ ఇండెక్స్ 22 శాతం లాభపడింది. ఐటీ కంపెనీల ఆదాయం గత కొన్ని త్రైమాసికాలుగా సింగిల్ డిజిట్ వృద్ధికే పరిమితమవుతున్నాయి. అయినప్పటికీ రక్షణాత్మక పెట్టుబడుల రంగంగా ఇన్వెస్టర్లు భావిస్తుంటారని విశ్లేషకులు పేర్కొన్నారు. అయితే ట్రంప్ టారిఫ్‌లు, అమెరికా ఫస్ట్ విధానాలు దేశీ ఐటీ కంపెనీలకు చేటు చేయవచ్చన్న ఆందోళనలు ఇటీవల పెరిగినట్లు తెలియజేశారు. మరోపక్క యూఎస్ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారవచ్చన్న అంచనాలు నెలకొనడంతో ఐటీ షేర్లలో అమ్మకాలు పెరిగినట్లు విశ్లేషించారు. దీంతో రూపాయి బలహీనపడినప్పటికీ ఇన్వెస్టర్లు ఇతర రంగాలవైపు దృష్టిపెడుతున్నట్లు వివరించారు.

ఐటీపై భరోసా

గత వారం ఐటీ దిగ్గజం యాక్సెంచర్ ఫలితాల విడుదల సందర్భంగా యూఎస్ ప్రభుత్వ వ్యయాలు తగ్గడం ఆదాయంపై ప్రభావం చూపినట్లు పేర్కొంది. అయితే టీసీఎస్, ఇన్ఫోసిస్ తదితర దేశీ దిగ్గజాలు యూఎస్ ప్రభుత్వం, ఫెడరల్ ఏజెన్సీల కాంట్రాక్టులపై అతితక్కువగా ఆధారపడుతున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలియజేశాయి. యూఎస్ ఆదాయంలో వీటి వాటా సుమారు 2 శాతమేనని తెలియజేశాయి. అయితే యాక్సెంచర్ యూఎస్ ఆదాయంలో వీటి వాటా 16 శాతంకాగా.. అక్కడి ప్రభుత్వ కాంట్రాక్టుల ప్రభావం దేశీ దిగ్గజాలపై తక్కువేనని నిపుణులు వివరించారు.

-సాక్షి, బిజినెస్ డెస్క్

నేలచూపులో ఐటీ రంగం

కంపెనీ	2024 డిసెంబర్31	2025 మార్చి26
ఐటీ ఇండెక్స్	43,338	37,337
టీసీఎస్	4,095	3,631
ఇన్ఫోసిస్	1,880	1,599
విప్రో	302	267
హెచ్‌సీఎల్ టెక్	1,917	1,626
టెక్ మహీంద్రా	1,706	1,411
కోఫోర్జ్	9,663	8,016
పెర్సిస్టెంట్	6,458	5,490
ఎల్‌టీఐమైండ్‌ట్రీ	5,586	4,611
ఎంఫసిస్	2,847	2,515

(ఇండెక్స్ పాయింట్లలో-షేరు ధర రూ.లలో)

విప్రోకు ఫీనిక్స్ గ్రూప్ భారీ కాంట్రాక్ట్

డీల్ విలువ రూ. 5,524 కోట్లు



న్యూఢిల్లీ: ఐటీ సర్వీసుల దిగ్గజం విప్రో తాజాగా బ్రిటిష్ బీమా దిగ్గజం ఫీనిక్స్ గ్రూప్ నుంచి భారీ కాంట్రాక్టును పొందింది. 10 ఏళ్ల కాలానికి 50 కోట్ల పౌండ్ల (రూ.5,524 కోట్లు) విలువైన డీల్ కుదుర్చుకున్నట్లు విప్రో వెల్లడించింది. డీల్‌లో భాగంగా రీఏష్యూర్ బిజినెస్ కోసం జీవిత బీమా, పెన్షన్ బిజినెస్ నిర్వహణ సంబంధిత సాఫ్ట్‌వేర్‌ను డిజైన్ చేయాల్సి ఉంటుందని విప్రో పేర్కొంది. క్లయింట్లకు అత్యుత్తమ సర్వీసులు అందించడంలో ఫైనాన్షియల్ సంస్థలకు విప్రో సహకారాన్ని, కట్టుబాటును ప్రస్తుత ల్యాండ్‌మార్క్ డీల్ పట్టిచూపుతున్నదని విప్రో యూరప్ సీఈవో ఓంకార్ నిశల్ తెలియజేశారు.

భారీ డీల్ నేపథ్యంలో విప్రో షేరు బీఎస్‌ఈలో 1.4% క్షీణించి రూ. 267 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
టెలీ కాలింగ్ ఉద్యోగాల బూమింగ్ | ప్రైవేటు పెట్టుబడులు పుంజుకోవాలి

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

బీఈఎల్, హైదరాబాద్‌లో 32 పోస్టులు

హైదరాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 32.
» **పోస్టుల వివరాలు:** ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రైనీ (ఈఏటీ)-08, టెక్నీషియన్ సీ-21, జూనియర్ అసిస్టెంట్-03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ,డిప్లొమా, ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 01.03.2025 నాటికి 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్‌కు రూ.21,500 నుంచి రూ.82,000, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ట్రైనీకి రూ.24,500 నుంచి రూ.90,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 09.04.2025.
» **వెబ్‌సైట్:** https://bel-india.in

సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐ, న్యూఢిల్లీలో 209 పోస్టులు

న్యూఢిల్లీలోని సీఎస్ఐఆర్-సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఆర్ఆర్ఐ).. గ్రూప్-సి(నాన్ గెజిటెడ్) జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 209.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్-177, జూనియర్ స్టెనోగ్రాఫర్-32.
» **అర్హత:** సంబంధిత విభాగంలో 10+2/ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్యార్హత, టైపింగ్ స్కిల్స్, స్టెనోగ్రఫీ ప్రావీణ్యం ఉండాలి.
» **వయసు:**జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌కు 28 ఏళ్లు, జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు 27 ఏళ్లు మించకూడదు. ఎస్సీ,ఎస్టీ అభ్యరులకు ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్ అభ్యర్థులకు మూడేళ్లు,దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌కు రూ.19,900 నుంచి రూ.63,200, జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు రూ.25,500 నుంచి రూ.81,100.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్టెనోగ్రఫీ, టైపింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.04.2025
» **రాతపరీక్ష తేది:** మే/జూన్ 2025.
» **వెబ్‌సైట్:** https://crridom.gov.in

సీఎస్ఐఆర్-సీఎస్ఎంసీఆర్ఐ, భావ్‌నగర్‌లో 15 పోస్టులు

భావ్‌నగర్(గుజరాత్)లోని సీఎస్ఐఆర్-సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎస్ఎంసీఆర్ఐ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15.
» **పోస్టుల వివరాలు:** సెక్యూరిటీ ఆఫీసర్-01, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్-01, జూనియర్ స్టెనోగ్రాఫర్-04, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(జనరల్)-05, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్)-02, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(స్టోర్స్ అండ్ పర్చేజ్)-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, 10+2 ఉత్తీర్ణులవ్వాలి. పారా మిలటరీ బలగాల్లో పనిచేసిన అనుభవం ఉండాలి. **వయసు:** 31.03.2025 నాటికి సెక్యూరిటీ ఆఫీసర్‌కు 35 ఏళ్లు, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్‌కు 30 ఏళ్లు, జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు 27 ఏళ్లు, మిగతా పోస్టులకు 28 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.03.2025
» **వెబ్‌సైట్:** www.csmcri.res.in

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పదో తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, సిలబస్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, టెక్ట్స్ బుక్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

మెరైన్ కెరీర్స్‌కు మార్గం.. ఐఎంయూ

» కేంద్ర నౌకాయాన శాఖ పరిధిలో ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ
» దేశవ్యాప్తంగా ఆరు ఐఎంయూ క్యాంపస్‌లు
» వీటిలో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఐఎంయూ-సెట్
» నేవీ, మర్చంట్ నేవీ, కార్గో షిప్పింగ్ సంస్థల్లో కొలువులు

నౌకాయాన రంగం.. వేగంగా వృద్ధి చెందుతున్న రంగం! దేశంలోని పలు షిప్పింగ్ కంపెనీలు తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి. షిప్ డిజైన్ నుంచి కస్టమర్ సర్వీస్ వరకూ.. ఆయా విభాగాల్లో ప్రత్యేక నైపుణ్యాలున్న వారికి అవకాశాలు కల్పిస్తున్నాయి. మెరైన్ రంగంలో ఉద్యోగాలు, కెరీర్ అవకాశాలకు వీలుకల్పించే కోర్సులను అందిస్తోంది..ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ!! ఐఎంయూ యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ప్రతి ఏటా ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తోంది! తాజాగా ఐఎంయూ-సెట్ 2025 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఐఎంయూ-సెట్ వివరాలు, కోర్సులు, కెరీర్ మార్గాలపై ప్రత్యేక కథనం..



ఐఎంయూ సెట్ 2025

ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీని 2008లో కేంద్ర నౌకాయాన శాఖ పరిధిలో ఏర్పాటు చేశారు. నౌకాయాన రంగంలో శిక్షణ, పరిశోధనలే లక్ష్యాలుగా ఏర్పాటైన ఈ యూనివర్సిటీలో పలు కోర్సులను అందిస్తున్నారు. ప్రస్తుతం ఆరు క్యాంపస్ (చెన్నై, కొచ్చి, కోల్‌కత, ముంబై పోర్ట్, నవీ ముంబై, విశాఖపట్నం)ల్లో కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అవి.. డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్, బీఎస్సీ నాటికల్ సైన్స్, బీఈ/బీటెక్ (మెరైన్ ఇంజనీరింగ్), బీటెక్ (నావెల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషన్ ఇంజనీరింగ్), బీబీఏ(మారిటైమ్ లాజిస్టిక్స్), బీటెక్ నావెల్ ఆర్కిటెక్చర్ అండ్ షిప్ బిల్డింగ్, ఎంటెక్ మెరైన్ ఇంజనీరింగ్, ఎంటెక్ నావెల్ ఆర్కిటెక్చర్ అండ్ ఓషన్ ఇంజనీరింగ్, పీజీ డిప్లొమా ఇన్ మెరైన్ ఇంజనీరింగ్, ఎంబీఏ (పోర్ట్ అండ్ షిప్పింగ్ మేనేజ్‌మెంట్), ఎంటెక్ (డ్రెడ్జింగ్ అండ్ హార్బర్ ఇంజనీరింగ్), ఎంబీఏ (ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (పోర్ట్ అండ్ షిప్పింగ్ లాజిస్టిక్స్), ఎంబీఏ (మారిటైమ్ మేనేజ్‌మెంట్‌లో ఆన్‌లైన్ కోర్స్), ఎంటెక్ (ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్).

ఐఎంయూ సెట్‌తో ప్రవేశాలు

ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ క్యాంపస్‌లు అందిస్తున్న బీటెక్, బీఎస్సీ, డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్, ఎంటెక్ ప్రోగ్రామ్స్, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశానికి ఐఎంయూ-సెట్ పేరుతో ఏటా ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు.

అర్హతలు

- **బీఎస్సీ/బీటెక్:** ఎంపీసీ గ్రూప్‌తో 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత.
- **ఎంటెక్:** 55 శాతం మార్కులతో సంబంధిత స్పెషలైజేషన్‌లో బీటెక్ ఉత్తీర్ణత.
- **బీబీఏ:** 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంబీఏ:** 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.

పరీక్ష విధానం వేర్వేరుగా

ఐఎంయూ క్యాంపస్‌ల్లో ఆయా టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఐఎంయూ-సెట్‌ను ప్రతి కోర్సుకు ప్రత్యేకంగా నిర్వహిస్తారు.

- యూజీ టెక్నికల్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి 200 మార్కులతో(ఇంగ్లిష్, జనరల్ ఆప్టిట్యూడ్, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ) పరీక్ష ఉంటుంది.
- ఎంబీఏ(పీఎస్ఎం/ఐటీఎల్ఎం) కోర్సులకు 120 మార్కులతో(క్వాంటిటేటివ్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, వెర్బల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్) పరీక్ష నిర్వహిస్తారు.
- పీజీ టెక్నికల్ ప్రోగ్రామ్స్‌కు కూడా 120 మార్కులతో పరీక్ష ఉంటుంది. ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్, అదేవిధంగా ఎంపిక చేసుకున్న స్పెషలైజేషన్‌ను అనుసరించి మెకానికల్ /సివిల్/మెరైన్ ఇంజనీరింగ్/నేవల్ ఆర్కిటెక్చర్/ఓషన్ ఇంజనీరింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- మూడు విధానాల్లోని పరీక్షలు ఆబ్జెక్టివ్ ప్రశ్నలతోనే ఉంటాయి.
- పరీక్ష వ్యవధి రెండు గంటలు.

ఉమ్మడి కౌన్సెలింగ్

ఐఎంయూ సెట్‌లో పొందిన ర్యాంకు ఆధారంగా ఉమ్మడి కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు. ఐఎంయూ సెట్‌తోపాటు సీయూఈటీ-యూజీ, సీయూఈటీ-పీజీ, క్యాట్, గేట్, సీమ్యాట్, మ్యాట్ ర్యాంకులను కూడా ప్రవేశాలకు పరిగణనలోకి తీసుకుంటారు. ఐఎంయూ సెట్‌లో ర్యాంకు పొందిన వారికి తొలి ప్రాధాన్యం ఇస్తారు. బీబీఏ ప్రోగ్రామ్‌కు మాత్రం ఇంటర్మీడియెట్ మార్కుల ఆధారంగా నేరుగా కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశం కల్పిస్తారు.

విస్తృత అవకాశాలు

ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ క్యాంపస్‌లలో బ్యాచిలర్, పీజీ కోర్సులు పూర్తి చేసిన వారికి విస్తృత కెరీర్ అవకాశాలు లభిస్తున్నాయి. షిప్ బిల్డింగ్, షిప్ డిజైన్, షిప్ ఆపరేషన్స్, షిప్ మెయింటనెన్స్ వంటి కీలక విభాగాలతోపాటు.. క్రూయిజ్ లైనర్స్, కార్గో సంబంధిత లాజిస్టిక్ షిప్స్ రెండింటిలోనూ ఆకర్షణీయ కెరీర్స్ లభించనున్నాయి. బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో నాటికల్ సైన్స్, మెరైన్ ఇంజనీరింగ్, ఓషియన్ ఇంజనీరింగ్ వంటి కోర్సులు పూర్తి చేయడం ద్వారా మర్చెంట్ నేవీలో కొలువులు సొంతం చేసుకోవచ్చు. ఇవి పూర్తి చేసుకున్న వారికి డెక్ ఆఫీసర్, ఎలక్ట్రో టెక్నికల్ ఆఫీసర్, ఇంజనీర్ వంటి ఉద్యోగాలు లభిస్తాయి. ఎంట్రీ లెవల్‌లో రూ.40 వేల నుంచి రూ.50 వేల మధ్యలో వేతనం లభిస్తుంది. బీటెక్ స్పెషలైజేషన్స్ పూర్తి చేసిన వారికి ఇంజనీర్స్ హోదాలో ఉద్యోగాలు లభిస్తాయి. ఎంబీఏ కోర్సు పూర్తి చేసిన వారికి పోర్ట్ ఆపరేషన్స్ విభాగంలో మేనేజర్స్, ఫైనాన్షియల్ అనలిస్ట్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, కార్గో మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్ విభాగాల్లో ప్రారంభంలో మేనేజ్‌మెంట్ ట్రైనీలుగా కెరీర్ అవకాశాలు లభిస్తాయి.

ముఖ్యమైన ఉపాధి వేదికలు

ఈ రంగంలో షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎస్సార్ షిప్పింగ్, బీఎస్ఎం, ఎంఎస్ఐ, డాకెన్‌డేల్, వీఆర్ మారిటైమ్ సర్వీసెస్, ఫ్లీట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ తదితర సంస్థలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, మే 2
- **ఐఎంయూ సెట్ తేదీ:** 2025, మే 24
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.imu.edu.in/imunew

సెట్‌లో ర్యాంకు ఇలా

ఐఎంయూ సెట్‌లో బెస్ట్ ర్యాంకు సొంతం చేసుకోవడానికి అభ్యర్థులు ఇంగ్లిష్, జనరల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఎబిలిటీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

వెర్బల్ ఎబిలిటీ

ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు ఉండే విభాగమిది. ఒక నిర్దేశిత ప్యాసేజ్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ ప్రశ్నల్లోనూ అధిక శాతం ప్యాసేజ్ సారాంశం అర్థమైతేనే సమాధానం ఇవ్వగలిగేవిగా ఉంటాయి. అభ్యర్థులు స్పీడ్ రీడింగ్ హ్యాబిట్‌తోపాటు ఒక అంశాన్ని చదువుతున్నప్పుడే అందులో కీలక అంశాలను గుర్తించే విధంగా నైపుణ్యం సొంతం చేసుకోవాలి. పంక్చుయేషన్స్ నుంచి ప్యాసేజ్ మెయిన్ కాన్సెప్ట్ వరకు అన్నింటిపై అవగాహన పెంచుకోవాలి. అర్థాలు, సమానార్థాలు, ఫ్రేజెస్, వర్డ్ యూసేజ్, సెంటెన్స్ ఫార్మేషన్ అంశాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. వీటితోపాటు వొకాబ్యులరీపైనా పట్టు సాధించాలి. ఫలితంగా ఆయా ప్యాసేజ్‌లలో వినియోగించిన పదజాలాన్ని వేగంగా అర్థం చేసుకుని నిర్దేశిత సమయంలో సమాధానాలిచ్చే నైపుణ్యం లభిస్తుంది.

రీజనింగ్

డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లో అధిక శాతం ప్రశ్నలు స్వీయ విశ్లేషణ,సూక్ష్మ పరిశీలన ఆధారంగా సమాధానం రాబట్టేవిగా ఉంటాయి. అంటే.. గ్రాఫ్‌లు, చార్ట్‌లలో ఇచ్చిన దత్తాంశాలపై నేరుగా ప్రశ్నలు అడగకుండా సంబంధిత కాన్సెప్ట్‌ను అర్థం చేసుకుని.. ఏ ఫార్ములా ఆధారంగా సమాధానం కనుక్కోగలమనే విధంగా ఈ ప్రశ్నలు ఉంటాయి. దీంతోపాటు పర్సంటేజెస్, యావరేజెస్‌పైనా పట్టు సాధించాలి. ఇందుకోసం ఏదైనా క్యాట్ స్టాండర్డ్ మెటీరియల్ లేదా ఆన్‌లైన్ టెస్ట్‌లోని ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి. విభిన్న క్లిష్టతతో కూడిన సమస్యలను సాధించడానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

క్వాంటిటేటివ్ ఎబిలిటీ

మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్ అంశాలతో ఉండే సెక్షన్ ఇది. ఇందులో రాణించేందుకు కాలిక్యులేషన్స్ వేగంగా చేయగలిగే నేర్పు సొంతం చేసుకోవాలి. నాన్-మ్యాథ్స్ అభ్యర్థులు ప్రాబబిలిటీ అండ్ పెర్ముటేషన్స్/కాంబినేషన్స్, నెంబర్స్, అల్జీబ్రా, జామెట్రీ విభాగాలపై దృష్టి పెట్టాలి. వీటికి సంబంధించిన బేసిక్ కాన్సెప్ట్స్‌పై పట్టు సాధించాలి. ఫార్ములా బేస్డ్ ప్రశ్నల సాధనకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రస్తుత సమయంలో సబ్జెక్ట్ ప్రిపరేషన్‌తోపాటు ఆయా సెక్షన్లలో ప్రీవియస్ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి. ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీల కోసం ఎంసెట్, జేఈఈ ప్రిపరేషన్‌ను అనుసంధానం చేసుకోవచ్చు.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- కంప్యూటర్ అవేర్‌నెస్



అత్తారింటికి దారేది?

ఆదిలాబాద్ రూరల్ మండలం అంకాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బుర్కి ఆదివాసీ గ్రామానికి సరైన రోడ్డు లేదు. చిన్నపాటి మొరం రోడ్డు గుండానే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. వర్షాకాలంలో సమస్య మరీ అధ్వానం. ఆ గ్రామానికి చెందిన యువకుడు ఆనంద్‌రావుతో.. బుధవారం దొండారిగూడెంకు చెందిన అనితతో పెళ్లి జరగాల్సి ఉంది. ఇందుకోసం ఆడపెళ్లివారు పెళ్లికూతురితో కలిసి బయల్దేరారు. కోలాంగూడ సగం దూరం వరకు ఐషర్, ద్విచక్రవాహనంపై వచ్చారు. అక్కడినుంచి బుర్కికి వెళ్లేందుకు రోడ్డు లేకపోవడంతో.. పెళ్లికూతురితో సహా బంధువులంతా కాలినడకన బయల్దేరారు. మండుటెండలో కాళ్లకు చెప్పులు కూడా లేకుండా ఎట్టకేలకు పెళ్లి బృందం బుర్కికి చేరుకుంది. అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్.. బుర్కిని ఆదివాసీ గ్రామాభివృద్ధికి దత్తత తీసుకున్నారు. ఈ గ్రామ రహదారి దుస్థితిపై ప్రస్తుత గవర్నర్ జిష్ణుదేవ్ కూడా ఇటీవల అధికారులను ఆరా తీశారు. – చింతల అరుణ్ రెడ్డి, సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్ రూరల్

మనదే విని‘యోగం’!

ఏంజెల్ వన్ తాజా నివేదికలో వెల్లడి

- ప్రపంచ వినియోగ రాజధానిగా భారత్.. దేశంలో వచ్చే 25 ఏళ్లలో 10 రెట్లు దాటనున్న పొదుపు
- వినియోగ వ్యయం పెరిగేందుకు దీనితోనే మార్గం
- 2035 నాటికి మొత్తం ఖర్చుల్లో సగానికిపైగా జెనరేషన్ జెడ్ తరం నుంచే..



(సాక్షి, స్పెషల్ డెస్క్)

శరవేగంగా పెరుగుతున్న వినియోగదారుల సంఖ్య, అధికమవుతున్న చిన్న కుటుంబాలు.. వెరసి ప్రపంచ వినియోగ రాజధానిగా భారత్ అవతరించనుందని ఏంజిల్ వన్ నివేదిక వెల్లడించింది. 2034 నాటికి దేశంలో వినియోగం రెట్టింపు అవుతుందని.. ప్రధాన ఆర్థిక వ్యవస్థలను భారత్ అధిగమిస్తుందని అంచనా వేసింది. వినియోగానికి జనరేషన్ జెడ్ ఆజ్యం పోయనుందని.. అదే సమయంలో పొదుపులు కూడా దూసుకెళ్లనున్నాయని వెల్లడించింది. అంటే కావాల్సిన వస్తుసేవల కోసం పొదుపు చేసుకున్న సొమ్మునే విరివిగా వెచ్చించనున్నారని తెలిపింది. దేశంలో వినియోగం స్థూల దేశీయ ఉత్పత్తిలో (జీడీపీ) 56 శాతం వాటా కలిగి ఉందని పేర్కొంది. ఏంజెల్ వన్ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం..

మన దేశంలో చిన్న కుటుంబ ధోరణుల కారణంగా.. జనాభా పెరుగుదల కంటే ఇళ్ల సంఖ్యలో వృద్ధి ఎక్కువగా ఉంటోంది. ఇది అధిక వినియోగానికి కీలక చోదకంగా మారుతోంది. ప్రపంచ శ్రామిక శక్తి వృద్ధిలో కూడా భారత్ ముందుండబోతోంది. రాబోయే 25 ఏళ్లలో భారత్‌లో పొదుపులు (సేవింగ్స్) గత 25 సంవత్సరాల మొత్తం పొదుపు కంటే 10 రెట్లు

103 ట్రిలియన్ డాలర్లకు..

ఎక్కువగా ఉంటాయి. 1997 నుంచి 2023ఆర్థిక సంవత్సరం మధ్య దేశంలో మొత్తం సేవింగ్స్ 12 ట్రిలియన్ డాలర్లు (రూ.10,32,00,000 కోట్లు) అయితే.. 2047 నాటికి 103 ట్రిలియన్ డాలర్లకు (రూ.88,58,00,000 కోట్లు) చేరుకుంటాయని అంచనా. వినియోగం భారీ స్థాయిలో పెరిగేందుకు ఇది దోహదం చేయనుంది.

అనవసరపు ఖర్చుల పెరుగుదల వైపు..

ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో పన్ను ఊరట కారణంగా ప్రజల చేతుల్లోకి రూ.లక్ష కోట్లు అదనంగా అందుబాటులోకి వస్తాయని అంచనా. దీంతో వినియోగం రూ.3.3 లక్షల కోట్లు పెరుగుతుందని.. ఇది దేశ జీడీపీని 1% పెంచే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అమెరికా, చైనా లో అనవసర ఖర్చులు అవసరాలను అధిగమించాయి. సగటు ఆదాయం పెరగనుండటంతో భారతదేశంలోనూ ఆ పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది. అమెరికాలో గతంలో తలసరి ఆదాయం బాగా పెరిగిన సమయంలో.. వినియోగ వ్యయం 10 రెట్లు పెరగడం గమనార్హం. తలసరి ఆదాయం పెరిగే కొద్దీ భారత వినియోగంలో కూడా ఇదే విధమైన వృద్ధిని చూడవచ్చని ఏంజెల్ వన్ నివేదిక పేర్కొంది.

జెనరేషన్ జెడ్ తరంతో..

కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, దుస్తులు, ఉపకరణాలు (ఆభరణాలు సహా), ఎక్స్‌పీరియెన్స్ కోసం వినియోగదారులు అధికంగా ఖర్చు చేయనున్నారని నివేదిక పేర్కొంది. దేశంలో ఇప్పటికీ 92శాతం రిటైల్ వ్యాపారం కిరాణా దుకాణాల ద్వారానే జరుగుతోందని... మార్కెట్ వాటాను పెంచుకోవడానికి ఆధునిక రిటైల్‌కు భారీ అవకాశం ఉందని తెలిపింది. యూఎస్ మొత్తం జనాభాను మించి భారత్‌లో జనరేషన్ జెడ్ తరం (1996–2012 మధ్య పుట్టినవారు) ఉంది. 2035 నాటికి భారత్‌లో చేసే ఖర్చులో సగం జనరేషన్ జెడ్ తరం నుంచే ఉంటుందని.. భారత వినియోగ వృద్ధి పథానికి ఇది తోడ్పడుతుందని నివేదిక తెలిపింది.

ఉమ్మడి ఏపీలో తొలిసారి మద్యంపై వ్యాట్ ప్రవేశపెట్టా

- నాటి సీఎంలు జలగం, చెన్నారెడ్డి, ఎన్టీఆర్ దగ్గర పనిచేశా
- అప్పటి సీఎం టి.అంజయ్యతో సత్సంబంధాలు ఉండేవి
- ‘ఫైర్‌సైడ్ చాట్’లో 85 ఏళ్ల రిటైర్డ్ ఐఏఎస్ ఎం.గోపాలకృష్ణ




గోపాలకృష్ణను సత్కరిస్తున్న సురేష్ సింఘాల్, చిత్రంలో అయ్యదేవర శ్రీనివాస్

నాంపల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా తొలిసారి మద్యంపై వ్యాట్‌ను ప్రవేశపెట్టానని ప్రముఖ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అయిన 85 ఏళ్ల ఎం. గోపాలకృష్ణ గుర్తుచేసుకున్నారు. అస్సాంలో పని చేసిన మొదటి తెలుగు అధికారిని తానేనని చెప్పారు. నాటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, ఎన్టీ రామారావు దగ్గర పనిచేశానని పేర్కొన్నారు. అలాగే అప్పటి సీఎం టి.అంజయ్యతో తనకు సత్సంబంధాలు ఉండేవన్నారు. హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన ‘ఫైర్‌సైడ్ చాట్’లో గోపాలకృష్ణ పాల్గొన్నారు. తాను ఇటీవల రాసిన ఆత్మకథ ‘లైఫ్ ఆఫ్ కర్మయోగి’ పుస్తకంలోని అంశాలను సభికులతో పంచుకున్నారు. జలగం వెంగళరావు, మర్రి చెన్నారెడ్డి, ఎన్టీఆర్‌లలో ఉత్తమ సీఎంగా ఎవరికి రేటింగ్ ఇస్తారని అడగ్గా జలగం పేరు చెప్పారు. చెన్నారెడ్డి పనులు పూర్తి చేయడంలో ఉత్తముడన్నారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అయ్యదేవర శ్రీనివాస్ మోడరేటర్‌గా వ్యవహరించారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు డాక్టర్ సురేష్ కుమార్ సింఘాల్ ప్రారంభోపన్యాసం చేశారు. హెచ్ఎంఏ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, కార్యదర్శి ఆర్.రవికుమార్ పాల్గొన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


ఐదేళ్ల క్రితం చింతపల్లిలోని చింతచెట్లపై సైబీరియన్ కొంగలు


చింతపల్లిలో కొట్టేసిన ఒక చింతచెట్టు

ముఖం చాటేసిన అతిథులు!

ఖమ్మం రూరల్ మండలం చింతపల్లి గ్రామానికి క్రమం తప్పకుండా వచ్చే సైబీరియన్ కొంగలు నాలుగేళ్లుగా ముఖం చాటేశాయి. జనవరి నెలలో వచ్చే సైబీరియన్ కొంగలు జూన్ వరకు చింతపల్లిలోని చింతచెట్లపై ఆవాసం ఏర్పరచుకునేవి. ఇక్కడే గుడ్లు పెట్టి పొదిగాక.. రెక్కలొచ్చిన పిల్లలతో తిరిగి వెళ్లేవి. ఈ క్రమంలో వీటిని అతిథులుగా భావిస్తూ.. కొంగలు గూళ్లు పెట్టే ఒక్కొక్క చింత చెట్టు యజమానికి అటవీ శాఖ రూ.వెయ్యి చొప్పున చెల్లించడమే కాక.. సంరక్షణ నిమిత్తం ఒక ఉద్యోగిని కేటాయించేది. కానీ గ్రామంలో కోతులు పెరగడం.. కొంగల గుడ్లను అవి పాడు చేయడం, గూళ్లను కింద పడేస్తుండడంతో కొంగలు రావడం మానేశాయి. మరోవైపు చాలాచోట్ల చింతచెట్లను కూడా కొట్టేశారు. కాగా, సమీపంలోని చెరువుకు కొంగలు వచ్చి వెళ్తున్నట్లు స్థానికులు చెబుతున్నా.. గతంతో పోలిస్తే వాటి సంఖ్య మాత్రం తగ్గింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

నేడు బీజేపీ రైతు సత్యాగ్రహ దీక్షలు

బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతులకు ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ...గురువారం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్షలు నిర్వహిస్తున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను నట్టేటముంచిందని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల ముందు వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో చేసిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీ లు నెరవేర్చకుండా రైతులకు అరచేతిలో వైకుంఠం చూపితే, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అంతకంటే మోసకారిగా మారిందని మండిపడ్డారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ అని చెప్పి 25 లక్షల మంది రైతులకు కూడా రుణ మాఫీ చేయలేదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించలేని, రైతుల సమస్యలు తీర్చలేని రేవంత్‌రెడ్డి... డీలిమిటేషన్ పేరిట చెన్నైలో జరిగిన సమావేశానికి బీఆర్‌ఎస్ నేతలతో కలిసి వెళ్లారని ఆయన ధ్వజమెత్తారు.

బండి సంజయ్.. ఆరోపణలకు ఆధారాలు చూపండి

బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన ఆరోపణలపై స్పష్టమైన ఆధారాలుంటే చూపాలని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. లేదంటే చట్టపరంగా, రాజకీయంగా, నైతికంగా ఎదురయ్యే ఫలితాలను ఎదుర్కోవాలని బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల్లో బండి సంజయ్ ఒక రాజకీయ తోలు బొమ్మగా మారిపోయారని, పార్లమెంట్ స్థానం కోసం రేవంత్‌రెడ్డి చేసిన సహాయానికి ఈ విధంగా కృతజ్ఞత తెలుపుతున్నట్లుందని శ్రవణ్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు ఒకప్పుడు నిరాధార ఆరోపణ చేశారని, ఇప్పుడు అదే ఆరోపణను బండి సంజయ్.. రేవంత్ చేతిలోని చిలుకలా పదేపదే చెపుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

ధరణి అక్రమాలపై విచారణ జరపాలి

కాంగ్రెస్, బీజేపీ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ధరణి అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని కాంగ్రెస్ సభ్యుడు పటోళ్ల సంజీవరెడ్డి, బీజేపీ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. శాసనసభలో బుధవారం జరిగిన బడ్జెట్ పద్దులపై చర్చలో సభ్యులిద్దరూ మాట్లాడారు. గత ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ నేతలు రైతులను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు తీసుకోవడంతో పాటు వారి భూములను తమ పేరుతో రాయించుకున్నా రని సంజీవరెడ్డి ఆరోపించారు. ధరణితో కబ్జా చేసిన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్నారు.

దక్షిణాదికి అన్యాయం జరిగితే పోరాడేది మేమే: బీజేపీ

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో తెలంగాణతో సహా దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే తొలుత ముందుడి పోరాడేది తామేనని బీజేపీ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. 11 ఏళ్లలో తెలంగాణకి కేంద్రం రూ.11 లక్షల కోట్లుఇచ్చిందన్నారు. అయితే అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్టే తెలంగాణకు కూడా కేంద్ర నిధులొచ్చాయని, రాష్ట్రానికి ప్రత్యేక నిధులు ఏమైనా తెచ్చారా అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. కేంద్ర సహకారం లేకుంటే రాష్ట్రం ఒక్క రోజుకూడా మనుగడ సాధించలేదని హరీశ్ బదులిచ్చారు. బెట్టింగ్స్ యాప్స్ బూచితో ఏడాది కాలంలో 24 మంది ఆత్మహత్యకి పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అమేజాన్ వేర్‌హౌస్‌పై బీఐఎస్ దాడి

2,783 వస్తువుల స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) అధికారుల బృందం మంగళవారం శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని అమేజాన్ వేర్‌హౌస్‌పై ఆకస్మిక దాడి చేసింది. బీఐఎస్ చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తూ, వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించిన అధికారులు, 2,783 వస్తువులను స్వా. దీనం చేసుకున్నారు. బీఐఎస్ డైరెక్టర్ పీవీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో రాకేశ్ తన్నీరు (జాయింట్ డైరెక్టర్), కవిన్ కె. (డిప్యూటీ డైరెక్టర్), ఎస్‌పీఓ అభిసాయ్ ఎట్టా, జేఎస్ఏ శివాజీలతో కూడిన బృందం పాల్గొంది. ఈ సందర్భంగా అమేజాన్ వేర్‌హౌస్ నుంచి 150 స్మార్ట్ వాచ్‌లు, 15 ఎలక్ట్రిక్ వాటర్ హీటర్లు, 30 సీసీటీవీ కెమెరాలు, 16 డొమెస్టిక్ ఎలక్ట్రిక్ ఫుడ్ మిక్సర్లు, 10 డొమెస్టిక్ ప్రెజర్ కుక్కర్లు, 1,937 స్టెయిన్‌లెస్ స్టీల్ వాటర్ బాటిల్స్, 326 వైర్‌లెస్ ఇయర్‌బడ్స్, 170 మొబైల్ చార్జర్లు, 90 ఎలక్ట్రిక్, నాన్–ఎలక్ట్రిక్ బొమ్మల వంటి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఉత్పత్తులన్నీ భారత ప్రభుత్వం జారీ చేసిన క్వాలిటీ కంట్రోల్ ఆర్డర్స్ (క్యూసీఓలు) పరిధిలోకి వస్తాయని, వీటికి బీఐఎస్ సర్టిఫికేషన్‌ను తప్పనిసరి అని అధికారులు తెలిపారు. ఈ వస్తువులకు బీఐఎస్ స్టాండర్డ్ మార్క్ లేకుండా అమ్మకానికి ఉంచినట్లు తేలింది. అధికారులు పట్టుకున్న ఈ ఉత్పత్తుల విలువ రూ. 50 లక్షలకు పైగా ఉంటుందని అంచనా.

మాట్లాడేందుకు అవకాశం ఇచ్చి సభ వాయిదా వేస్తారా?

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా తీరుపై ఎంపీ చామల ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాట్లాడేందుకు అ వకాశం ఇచ్చి.. వెంటనే సభను ఎలా వాయిదా వేస్తారు? అని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో చామల విలేకరులతో మాట్లాడారు. రాహుల్ గాంధీ మాట్లాడేందుకు సమాయత్తం అవుతుండగా స్పీకర్ సభను వాయిదా వేసి వెళ్లిపోవడం సరికాదన్నారు. ప్రతిపక్ష పార్టీలను, అధికార పార్టీని స్పీకర్ సమానంగా చూడాలని స్పీకర్‌కు సూచించారు. అలాగే మిస్ వరల్డ్ పోటీలపై బీఆర్‌ఎస్ మాజీమంత్రి కేటీఆర్ చేస్తున్న విమర్శలపై ఎదురుదాడి చేశారు. ఫార్ములా ఈ–కార్ రేస్ నిర్వహించడాన్ని తాము తప్పు పట్టలేదన్నారు. మంత్రివర్గంలో తీర్మానం చేయకుండా అనుచరులకు మేలు జరిగేలా రేస్ నిర్వహించారని ఆరోపించామని చామల గుర్తుచేశారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను విశ్వవ్యాప్తం చేయడానికే అందాల పోటీలు నిర్వహిస్తున్నామని స్పష్టంచేశారు. కాగా, ఎల్ఐసీ, రెగ్యులేటరీ అథారిటీలు ఇటీవల విధించిన విధాన మార్పుల కారణంగా ఎల్ఐసీ ఏజెంట్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చామల తెలిపారు. వారి ఇబ్బందులపై దృష్టి సారించాలని లోక్‌సభలో జీరో అవర్‌లో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.


స్పీకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ కవిత

అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

స్పీకర్ ప్రసాద్ కుమార్‌కి కవిత విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి నాయకులు, బీసీ సంఘాల నాయకులతో కలిసి అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను బుధవారం ఆమె కలిశారు. ఏప్రిల్ 11న పూలే జయంతి నేపథ్యంలో ఆలోపే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. విగ్రహ ఏర్పాటు ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరింత ఇనుమడింపజేస్తుందని తెలిపారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు బీసీల చిరకాల కోరిక అని కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి పోరాటాలతో గతంలో అసెంబ్లీ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. స్పీకర్‌ను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వివేకానంద గౌడ్, కాలేరు వెంకటేశ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, యునైటెడ్ పూలే ఫ్రంట్ కోకన్వీనర్ బొల్ల శివశంకర్, జాగృతి నాయకులు శ్రీధర్‌రావు ఉన్నారు.

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై ఎక్స్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తూ ఆయన ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారన్న ఆరోపణలపై బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలు మానస, బానోత్ రేవంత్, సత్యలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు బుధవారం కేసు నమోదు చేశారు. ఈ మేరకు బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ గోకుల్ రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టీజీసీఎస్‌బీ డీఎస్పీ కేవీఎం ప్రసాద్ కేసు నమోదు చేశారు.

ఆయిల్‌పామ్ రైతుల సమస్యలను పరిష్కరించండి

కేంద్ర వ్యవసాయమంత్రికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వినతి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో కొంతకాలంగా ఆయిల్ పామ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కేంద్ర వ్యవసాయ శాఖమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు. తెలంగాణ ఆయిల్ ఫెడ్ కింద ఉన్న ఖమ్మం జిల్లా కొత్తగూడెం రైతులు 2016 నుంచి నాణ్యత లేని జన్యుపరంగా లోపం ఉన్న మొలకలను అందుకుంటున్న విషయాన్ని వివరించారు. బుధవారం పార్లమెంట్‌లో కొత్తగూడెం రైతులు మహేశ్వర్ రెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, చెలికాని వెంకట్రావుతో కలిసి వద్దిరాజు.. కేంద్ర మంత్రితో భేటీ అయ్యారు. నాణ్యతలేని, జన్యుపరలోపంతో ఉన్న మొక్కల కారణంగా కష్టపడి పెట్టుబడి పెట్టిన తర్వాత దిగుబడి రాక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. దీంతో ఈసమస్యపై సంబంధిత అధికారులను నివేదిక ఇవ్వాలని కేంద్రమంత్రి ఆదేశాలు జారీచేశారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించాలి

ఆన్‌లైన్ మోసాలు, సురక్షిత బ్యాంకింగ్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రచారాలను నిర్వహించాలని వద్దిరాజు రవిచంద్ర కేంద్రానికి సూచించారు. డిజిటల్ బ్యాంకింగ్ టెక్నాలజీలను స్వీకరించడానికి, శిక్షణా కార్యక్రమాలను అందించడానికి, ప్రోత్సాహకాలు, సిబ్బంది కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవడానికి, ప్రభుత్వం, బ్యాంకులు రుణ లభ్యతను మెరుగుపరచడానికి కలిసి పనిచేయాలన్నారు. బుధవారం రాజ్యసభలో బ్యాంకింగ్ చట్టాల సవరణ బిల్లు–(2024)పై జరిగిన చర్చలో వద్దిరాజు రవిచంద్ర మాట్లాడారు.

రేషన్‌కార్డులది అంతులేని కథ

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్



సాక్షి, హైదరాబాద్: రేషన్‌కార్డుల జారీ అంతులేని కథ అని, కార్డులు ఇస్తామని ప్రజల నుంచి పలు దఫాలుగా దరఖాస్తులు తీసుకున్నా.. ప్రభుత్వం గత 15 నెలల్లో ఒక్క కార్డు కూడా ఇవ్వలేదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం ఆయన అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో చిట్‌చాట్ చేస్తూ, ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖల పద్దులపై సభలో మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ధాన్యం అమ్మకం టెండర్లలో రూ.700 కోట్లు నుంచి 1,000 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఈ కుంభకోణంపై సభా సంఘం వేయాలని, లేదంటే సీబీఐతో విచారణ జరిపించాలని గంగుల డిమాండ్ చేశారు. అవినీతి గురించి ప్రశ్నిస్తామన్న భయంతోనే ప్రభుత్వం తమకు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదని ధ్వజమెత్తారు. ఎల్ఎండీలో కేవలం నాలుగు టీఎంసీల నీరు మాత్రమే ఉందని, కరీంనగర్‌కు తాగునీటి కొరత ఏర్పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.

బీసీల రిజర్వేషన్ల కోసం ఉద్యమాలు ఉధృతం చేద్దాం: దాసు సురేశ్



సాక్షి, హైదరాబాద్: బీసీలకు రిజర్వేషన్ల కోసం ఇకపై ఉద్యమాలు ఉధృతం చేద్దామని బీసీ ఐక్య కూటమి కన్వీనర్ దాసు సురేశ్ పిలుపునిచ్చారు. బీసీ సంఘాలు సమన్వయంతో కదిలితేనే విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలు సాకారం అవుతుందని బుధవారం ఒక ప్రకటనలో ఆశాభావం వ్యక్తంచేశారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ హామీని నిలబెట్టుకునేలా అసెంబ్లీలో బీసీ బిల్లును ప్రవేశపెట్టి పాస్ చేయించిందన్నారు. దీనికి చట్టబద్ధత కల్పించేందుకు ఐక్యంగా కదిలి కేంద్రంపై ఒత్తిడి తీసుకువద్దామని బీసీ నాయకులను సురేశ్ కోరారు. విద్యాఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, జాతీయ స్థాయిలో కులగణన, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లలో బీసీలకు సబ్ కోటా వంటి డిమాండ్ల సాధనకు ఐక్య కూటమి ఏర్పాటైందని సురేశ్ తెలిపారు.

భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల కింద వచ్చే రెండేళ్లలో సృష్టించనున్న కొత్త ఆయకట్టు వివరాలు ఇలా..

భారీ ప్రాజెక్టులు	2025–26	2026–27
ఎస్‌ఆర్‌ఎస్‌పీ–2వ దశ	12,130	0
కల్వకుర్తి	1,19,000	25,000
రాజీవ్ భీమా	42,710	2,290
జవహర్ నెట్టెంపాడు	20,000	38,000
ఏఎంఆర్‌పీ(ఎస్ఎల్‌బీసీ)	54,768	27,000
జె.చొక్కారావు దేవాదుల	80,000	1,32,012
శ్రీపాద ఎల్లంపల్లి	41,000	68,000
చిన్న కాళేశ్వరం	10,767	35,000
ఇందిరమ్మ వరద ప్రవాహ కాల్వ	29,683	11,743
దిగువ పెన్‌గంగా, చనకా కొరాటా	27,794	23,206
డిండి	18,914	73,774
సీతారామ	....	49,751
కోయిల్‌సాగర్	16,872	....
పిప్రి	4,214	....
మధ్య తరహా ప్రాజెక్టులు		
పాలెంవాగు	1,632	....
నీల్వాయి	....	2000
మత్తడివాగు	....	....
జకొర–చందూరు	1500	4724
కొమురం భీం	10,000	12,500
సదర్‌మట్ బరాజ్	9016	....
మంజీరా ఎల్ఐఎస్	5000	5000

విద్యకు నిధులు పెంచాలి

- ప్రైవేటు విద్యాసంస్థలను కట్టడి చేయాలి
- ఫీజు నియంత్రణ చట్టం అమల్లోకి తేవాలి
- మండలిలో ఎమ్మెల్సీల సూచన
- ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తాం : మంత్రి దామోదర



సాక్షి, హైదరాబాద్: బడ్జెట్‌లో విద్యాశాఖకు తగినన్ని నిధులు కేటాయించాలని పలువురు శాసన మండలి సభ్యులు కోరారు. తెలంగాణలో విద్య అంశంపై శాసనమండలిలో బుధవారం జరిగిన స్వల్పకాలిక చర్చలో ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, వాణీదేవి, కవిత, తాతా మధు, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, నవీన్‌కుమార్, తెల్లా వెంకటరమణారెడ్డి, యాదవరెడ్డి, ఏవీఎన్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, అలుగుబెల్లి నర్సింహారెడ్డి, తీన్మార్ మల్లన్న, బల్మూరి వెంకట్, కోదండరాం తదితరులు మాట్లాడారు. ప్రైవేటు విద్యాసంస్థలను కట్టడి చేయాలని, ఫీజు నియంత్రణ చట్టం అమల్లోకి తేవాలని వారు కోరారు. చర్చ అనంతరం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమాధానమిస్తూ.. విద్యా వ్యవస్థకు పునాది అయిన ప్రీ ప్రైమరీ, ప్రాథమిక విద్యావ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. అమ్మాయిల చదువుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు, అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఫీజు రెగ్యులేటరీ కమిటీని నియమిస్తామని తెలిపారు. చర్చ సందర్భంగా ప్రైవేటు సంస్థల్లో ఫీజుల పెంపుపై తీన్మార్ మల్లన్న.. ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, రవీందర్‌రావుల పేర్లను ప్రస్తావించడంతో కొంత వాగ్వాదం చోటు చేసుకుంది. ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు చైర్మన్ గుత్తా ప్రకటించారు.

ఖాతాదారుల రక్షణకు చర్యలు తీసుకున్నారా?

కేరళ ఎస్‌బీఐకి తెలంగాణ హైకోర్టు ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: కోట్ల రూపాయల సైబర్ క్రైమ్‌కు పాల్పడిన భారత్ ఎంటర్ ప్రైజెస్ సంస్థ బ్యాంక్ ఖాతా రిజర్వు బ్యాంక్ నిబంధన మేరకే ఉందా అని కేరళ కీజ్మాద్ ఎస్‌బీఐ బ్రాంచ్‌ను తెలంగాణ హైకోర్టు ప్రశ్నించింది. ఇలాంటి మోసాలు జరిగినప్పుడు ఖాతాదారుల ప్రయోజనాలను రక్షించడం కోసం ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఆదేశించింది. ఈ మేరకు పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. సైబర్ మోసం కారణంగా హైదరాబాద్‌కు చెందిన మోహన్‌రావు భారత్ ఎంటర్‌ప్రైజెస్‌కు గత ఏడాది రూ.50 లక్షలు ఆన్‌లైన్‌లో పంపారు. కొందరి సూచన మేరకు తర్వాత ఆయన పోలీసులను సంప్రదించగా సెప్టెంబర్‌లో కేసు నమోదు చేశారు. భారత్ ఎంటర్‌ప్రైజెస్ ఖాతాలను సీజ్ చేయాలని పోలీసులు బ్యాంకుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే మోహన్‌రావు సొమ్ము వాపసు చేయాలని అక్టోబర్‌లో కూకట్‌పల్లి కోర్టు ఆదేశించినా నగదు బదిలీ చేయలేదు. దీంతో మోహన్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. సెప్టెంబర్ నాటికి రూ.5.43 కోట్ల దాకా భారత్ ఎంటర్ ప్రైజెస్ ఖాతాలలో ఉండగా, రూ.4.94 కోట్లు బదిలీ అయ్యాయని కీజ్మాద్ ఎస్‌బీఐ తరపు న్యాయవాది పేర్కొన్నారు. రూ.50.14 లక్షలు ఖాతాలో ఉందన్నారు. పలు కోర్టులు సొమ్ము చెల్లింపుపై ఆదేశాలు ఇచ్చాయని, అయితే.. ప్రాధాన్యత క్రమం నిర్ణయించడంలో ఇబ్బందుల కారణంగా కూకట్‌పల్లి కోర్టు ఉత్తర్వులు అమలు చేయలేకపోయామని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఖాతా ప్రారంభించినప్పుడు ఆర్‌బీఐ నిబంధనలు పాటించారా అని బ్యాంక్‌ను ప్రశ్నించారు. కౌంటర్ వేయాలని ఆదేశిస్తూ, తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎవరికీ ఎలాంటి చెల్లింపులు చేయరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణ ఏప్రిల్ 5కు వాయిదా వేశారు.

ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ మేటి

- పదేళ్లలో రూ.7.02 లక్షల కోట్ల ఎగుమతులు
- అత్యధికంగా 2023–24లో రూ.1.21 లక్షల కోట్ల విలువైన ఎగుమతులు
- కేంద్ర ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద



సాక్షి, న్యూఢిల్లీ: పదేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో ఐటీ ఎగుమతుల్లో పెరుగుదల నమోదైందని కేంద్ర ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. 2014–15 నుంచి 2023–24 వరకు రూ.7,02,368.33 కోట్ల ఐటీ ఎగుమతులు జరిగాయని వివరించారు. ఇందులో అత్యధికంగా 2023–24 సంవత్సరంలో రూ.1,21,116.62 కోట్ల ఐటీ ఎగుమతులు జరిగాయని తెలిపారు. బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు బుధవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వకంగా ఈ వివరాలు అందజేశారు.

తెలంగాణలో 148 కిలోల సింథటిక్ డ్రగ్స్ స్వాధీనం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో 2021 నుంచి 2024 మధ్య 148.14 కిలోల సింథటిక్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ తెలిపారు. అత్యధికంగా 2024 సంవత్సరంలోనే 118.42 కేజీల డ్రగ్స్‌ను పట్టుకున్నారని పేర్కొన్నారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో 93 కేజీల సింథటిక్ డ్రగ్స్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు స్వాధీనం చేసుకున్నాయని బుధవారం రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వకంగా తెలిపారు. అత్యధికంగా 2024లో 92.16 కేజీల డ్రగ్స్‌ను ఆంధ్రప్రదేశ్‌లో పట్టుకున్నారని వివరించారు. కాగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో హైదరాబాద్ జోన్‌లో 40 మంది, విశాఖపట్నం జోన్‌లో 30 మంది సిబ్బంది పనిచేస్తున్నారని కేంద్రమంత్రి వెల్లడించారు.

ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌పై ప్రభుత్వ ప్రకటన భేష్

తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు జగదీశ్వరరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై త్వరలో ఒక ప్రత్యేక నిఘా విభాగాన్ని ఏర్పాటు చేయనున్నామని, ఈ ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌ను నిరోధించేందుకు అసెంబ్లీలో కఠినమైన చట్టాన్ని తెస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అన్ని రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా చట్టం తేవాలని బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. భారత దేశంలో ఆన్‌లైన్ గేమింగ్ మార్కెట్ ప్రస్తుతం 30 శాతం పెరిగిందని, మహిళలు సైతం ఈ ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌కు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం వెంటనే ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్‌పై ఉక్కుపాదం మోపేందుకు టాస్క్‌ఫోర్స్‌ను నియమించాలని కోరారు. ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ సైట్లు, పోర్టల్‌ను బ్లాక్ చేయాలని డిమాండ్ చేశారు.



మట్టి నుంచి మహాద్భుతంగా..

మట్టి మనకు అన్నీ ఇస్తుంది. కడుపు నింపుతుంది. బతకటానికి జాగాను ఇస్తుంది. బతుకు దెరువుకు తోవ చూపిస్తుంది. అదే మట్టితో ఎందరో కుమ్మరి వృత్తిదారులు మట్టి పాత్రలను కళాత్మకంగా తయారు చేస్తున్నారు. వేసవి ప్రారంభమవడంతో విజయవాడ శివారు ప్రాంతంలో కొత్తూరు తాడేపల్లి సమీపంలో వివిధ ఆకారాల్లో మట్టికుండలు, వాటర్ బాటిల్స్, వంట పాత్రలను ఇలా విక్రయానికి పెట్టారు.

– చక్రపాణి, సాక్షి, ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఈత.. కారాదు కడుపు కోత

ఒకవైపు సూర్యుడు భగభగలు.. మరోవైపు వేసవి సెలవులు. ఎండ వేడిమి నుంచి తప్పించుకోవడానికి, సరదాగా గడపడానికి చిన్నారులు నీటి వనరుల వద్దకు ఈత కోసం పరుగులు తీస్తుంటారు. ఇదే క్రమంలో అనంతపురంలోని సోమలదొడ్డి- పాములాయి మధ్యలో ఉన్న చెరువులో ప్రమాదకరంగా ఉన్న ముళ్లపొదల వద్ద చిన్నారులు ఈతకొడుతున్న దృశ్యాలను 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– ఎండీ బాషా, సాక్షి, ఫొటోగ్రాఫర్, అనంతపురం

క్లుప్తంగా...

పాల కల్తీపై నిత్యం అప్రమత్తంగా ఉండాలి

ఉపలోకాయుక్త జస్టిస్ రజనీ

కర్నూలు(సెంట్రల్): అనంతపురం జిల్లాలో విపరీతమైన పాల కల్తీ నేపథ్యంలో 26 జిల్లాల్లో 215 పాల శాంపిళ్లను సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపి పరిక్షించగా 5 శాంపిళ్లలో కల్తీ జరిగినట్లు తేలినట్లు ఫుడ్ సేఫ్టీ రాష్ట్ర కమిషనర్ లోకాయుక్తకు నివేదిక సమర్పించారు. 2025 ఫిబ్రవరి 7న ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజనీ ఆదేశాలతో అన్ని జిల్లాల్లో పాల శాంపిళ్లను సేకరించినట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. ఈక్రమంలో పాల కల్తీపై అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని, డెయిరీలు, పాల శీతలీకరణ సెంటర్లు, పాల సరఫరా ఏజెన్సీలపై నిఘా ఉంచి కల్తీ జరగకుండా చర్యలు తీసుకోవాలని లోకాయుక్త సూచిస్తూ కేసును మూసి వేశారు. అయితే కొన్ని మార్గదర్శకాలను పాటించాలని సూచించారు.

టీటీడీకి రూ.1.01 కోట్లు విరాళం



తిరుమల: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు, నున్న సరోజినిదేవి దంపతులు శ్రీవేంకటేశ్వర విద్యా దాన ట్రస్టుకు బుధవారం రూ.1.01 కోట్లను విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకులు మండపంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఏఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

ఏసీబీకి చిక్కిన మత్స్యశాఖాధికారి



పార్వతీపురంటౌన్: బలహీన వర్గాలకు చెందిన మత్స్యకారులకు సీడ్ బిల్లుల చెల్లింపులో పార్వతీపురం మన్యం జిల్లా మత్స్యశాఖాధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖాధికారులకు బుధవారం పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. పాలకొండ మండలం టీడీ పురానికి చెందిన బొప్పన అప్పన్నదొరకు సంబంధించిన కోటదుర్గ ఫిష్ సీడ్ సంస్థలోని విత్తన నిల్వలను తనిఖీ చేసి, రూ.60 లక్షల బిల్లు మంజూరు చేసినందుకు జిల్లా మత్స్యశాఖాధికారి వేముల తిరుపతయ్య రూ.60 వేలు డిమాండ్ చేశారు. అప్పన్నదొరకు లంచం ఇవ్వడం ఇష్టంలేక విజయనగరం ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వలపన్నాం. బాధితుడి నుంచి పార్వతీపురంలోని మత్స్యశాఖ కార్యాలయంలో రూ.60 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నాం. ఆయనపై కేసు నమోదు చేసి, లంచం డబ్బులు రూ.60వేలు సీజ్ చేశాం. నిందితుడిని విశాఖలోని ఏసీబీ కోర్టులో గురువారం హాజరుపరచనున్నారు.

జీతాల కోసం పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులు జీతాల కోసం రోడ్డెక్కారు.3 నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడంతో పారిశుద్ధ్య కార్మికులు మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారులు అందరికీ మొరపెట్టుకున్నారు. అయినా సరే వారెవ్వరు కనికరించకపోవడంతో బుధవారం గ్రామ సచివాలయం ముందు ఆందోళనకు దిగారు. సీఐటీయూ నేతలు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు వెంటనే విడుదల చేసి, పంచాయతీ సిబ్బందిగా గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

స్టీల్‌ప్లాంట్ వీఆర్ఎస్‌లో నాన్ ఎగ్జిక్యూటివ్‌లే ఎక్కువ

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆమోదించిన స్వచ్ఛంద పదవీ విరమణ(వీఆర్ఎస్)లో ఎగ్జిక్యూటివ్‌లు కంటే నాన్ ఎగ్జిక్యూటివ్‌లే ఎక్కువగా ఉన్నారు. ఉక్కు యాజమాన్యం ఇచ్చిన వీఆర్ఎస్ పథకానికి 1,613 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో ఉపసంహరణ, తిరస్కరణ దరఖాస్తులు పోగా మిగిలిన 1,126 మందికి ఆమోదం తెలిపారు. వీఆర్ఎస్ పొందిన వారిలో చీఫ్ జనరల్ మేనేజర్ ఒకరు, జనరల్ మేనేజర్లు 38 మంది ఉన్నారు.

పెట్టుబడి కూడా రాలేదు



నా పేరు నిరంజన్‌రెడ్డి. మా ఊరు చిన్నమండెం మండలం రెడ్డివారిపల్లె. 20 ఎకరాల్లో దోస సాగు చేశా. పంట దిగుబడి వచ్చే వరకు 30 లక్షల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఉద్యానవన అధికా రుల సూచనలతో పురుగు నివారణ మందులు పిచికారీ చేశాను. ఎకరాకు నాలు గైదు టన్ను లు వస్తుందని ఆనందపడ్డాను. ప్రకృతి కరుణించలేదు, తెగుళ్ల వీడలేదు. ఫలితంగా సగం తోట దెబ్బతిన్నది. వచ్చిన దిగుబడితోనైనా పెట్టుబడి వస్తుందని ఆశించాను. మార్కెట్‌కి వెళ్తే ధరలు లేక, పెట్టిన పెట్టుబడి రాక ఆర్థికంగా కుంగిపోయే పరిస్థితులు వచ్చాయి.

దళారీల సిండికేటుతో ఇక్కట్లు



నా పేరు ఎద్దుల ప్రసాద్. మాది రైల్వేకోడూరు. పది ఎకరాలలో కర్బూజా పంటను సాగు చేశా. దళారుల సిండికేట్ వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలోని వ్యాపారులు కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారు కూడా కలిసి వాట్సాప్ గ్రూపులలో దోస, కర్బూజా ధరలను పంచుకుంటున్నారు. ఒక వ్యాపారి తోట దగ్గరికి వచ్చి కిలో 5 రూపాయలతో కొనుగోలు చేస్తామని చెప్పి వెళ్లిన విషయాన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా రైతు పేరుతోపాటు గ్రూపులలో షేర్ చేస్తున్నారు. దీంతో మిగిలిన వ్యాపారులు అదే ధరకు లేదా మరో రూపాయి అదనంగా ఇస్తామని మాత్రమే చెబుతున్నారు.

ఇదీ ఈ ఇద్దరి రైతుల ఆవేదనే కాదు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితి నెలకొంది.

కన్నీటి దిగుబడి

కర్బూజ, దోస రైతు కుదేలు | పెట్టుబడి కూడా రాని వైనం | దోచుకుంటున్న దళారులు | పట్టించుకోని ప్రభుత్వం | అప్పుల పాలైన అన్నదాత



రైల్వేకోడూరు నియోజకవర్గంలో తోటలోనే వదిలేసిన కోహినూర్ దోస పంట

రాయచోటి/రైల్వేకోడూరు అర్బన్: అన్నమయ్య జిల్లాలో దోస, కర్బూజ పంటలు పండించే రైతులకు ఫలితాలు.. ఈ ఏడాది కూడా ఆశాజనకంగా లేవు. నట్టేట ముంచి అప్పులపాలు చేస్తున్నాయి. ఫిబ్రవరి నెల ఆఖరులో, మార్చి మొదటి వారంలో దోస 22 రూపాయలు, కర్బూజ 18 రూపాయలు ధరలు పలకడంతో కొందరు రైతులు లాభపడ్డారు. దీంతో రైతులు కొండంత ఆశ పెట్టుకొన్నారు. కానీ అందరి దిగుబడి చేతికి వచ్చే సరికి.. దళారులు మోసాలతో ధరలను పాతాళానికి పడేశారు. జిల్లాలో భారీగా దోస, కర్బూజ పంటలు సాగు చేశారు. ముఖ్యంగా రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి ప్రాంతాలలో వందలాది మంది రైతులు వేశారు. తెగుళ్లు, దళారీల మోసాలు, గిట్టుబాటు ధరలు లేక భారీగా నష్టపోతున్నారు. ఓబులవారిపల్లిలో కోహినూర్ దోస వేసి ఎగుమతులు లేక రూ.లక్షల్లో నష్టపోయారు.

ఎరువులు, పురుగు మందుల పిచికారీ కోసం..

దోస, కర్బూజ పంటల సాగు ప్రారంభ దశ నుంచే రైతులకు మందుల పిచికారీ, ఎరువులు పెను భారంగా మారింది. విత్తన దశ నుంచి క్రిమి సంహారక మందులకు వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తుంది. దీనికి తోడు పూతకు పిందెలు వచ్చే సమయం నుంచి తెగుళ్ల నివారణకు మందుల పిచికారీ అధికంగా ఉంటుంది. వాతావరణ మార్పుల వల్ల పూత రావడానికి, పిందె నిలవడానికి, తెగుళ్లకు రెండు రోజులకు ఒక సారి అయినా మందులు పిచికారీ చేయాలి. కేవలం మందులకే రైతులు దుకాణాల్లో రూ.లక్షలు అప్పులు చేశారు.

తూకాల్లో కోత

రైతులు పంటకు ధరలు పడి పోయి కన్నీరు కారుస్తుంటే.. పలువురు దళారీలు ఇదే అదునుగా మరింతగా రేటు తగ్గిస్తున్నారు. ఇక్కడి దిగుబడిని ఇతర రాష్ట్రాలకు కూడా తరలిస్తుంటారు. ఇదే అదునుగా రైతులకు, వ్యాపారులకు మధ్య దళారులు చేరి అక్కడ ఒకరేటు, రైతులకు ఒకరేటు, లోడ్ తూకాలలో కోత, కమీషన్‌లు ఇలా రకరాలుగా మోసం చేస్తున్నారు.

కరుణించని పాలకులు

మార్కెట్ ధరలు లేక అప్పుల ఊబిలో కూరుకుపోయిన దోస రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం.. ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గిట్టుబాటు ధరలు రావడం లేదని రైతు సంఘాల నేతలు గళమెత్తి అరుస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదు. కనీసం జిల్లాలోని అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు సైతం.. కష్టాల కడలిలో ఉన్న కర్షకులను పరామర్శ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ ప్రాంతం ఎమ్మెల్యేలు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో దోస, కర్బూజ పంట సాగు వివరాలు (హెక్టార్లలో)

నియోజకవర్గం	దోస	కర్బూజ
రైల్వేకోడూరు	2210	1720
రాయచోటి	480	346
రాజంపేట	179	225
మదనపల్లి	125	56
పీలేరు	230	42
తంబళ్లపల్లి	708	–



అనుకూలించని రేటు



రైల్వేకోడూరు ప్రాంతంలో సాగు చేసిన కర్బూజ పంట

కష్టపడి పండించిన కర్బూజాకు మార్కెట్ ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కొంత మంది రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా దోస, పుచ్చకాయ పంటను సాగు చేశారు. మార్కెట్లో కేజీ దాదాపు రూ.15 నుంచి రూ.20 పలుకుతోంది. దళారులు కేజీ రూ.5 లేదా రూ.8 మాత్రమే చెల్లిస్తున్నారు. కానీ ఎకరాకు పెట్టుబడి 50 వేల నుంచి లక్ష రూపాయలకు పైగా అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. దీంతో పంటపై పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పొలంలోనే కాయలను వదిలి వేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని వాపోతున్నారు.

రైతులను ఆదుకోవాలి



సంబేపల్లి మండలం రెడ్డివారిపల్లె పంచాయతీ సీఎం కొత్తపల్లిలో రైతు రామచంద్ర 4 ఎకరాలలో రూ.6 లక్షలు ఖర్చు చేసి సాగు చేశారు. దళారులు అడిగినంతకు కాయలు ఇవ్వలేదని వాటిని కొనుగోలు చేయలేదు. కాయలు తోటలోనే కుళ్లిపోవాల్సిన పరిస్థితి. పండించిన పంటను మార్కెట్‌కి తరలించలేక రైతు తోటలోనే కూలిపోయాడు. ఇలా వేల మంది రైతులు దోస, కర్బూజ తోటలను సాగు చేసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కావున ప్రభుత్వం వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– బాలకృష్ణారెడ్డి, రైతు సంఘం రీజనల్ కోఆర్డినేటర్, అన్నమయ్య జిల్లా

ప్రజల ఆహారపు అలవాట్లలో మార్పు రావాలి



జిల్లాలో సాగవుతున్న పంటలో సగం ఒక పైగా రైతులు పండ్ల తోటలు వేస్తున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మంచి ఆదాయాన్ని గడించవచ్చని దోస పంట సాగు చేశారు. రైతులు పండించిన పంటకు మంచి గిట్టుబాటు ధరలు రావాలంటే ప్రజలు ఆహారపు అలవాట్లను మార్చుకుంటే మంచిది. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు మంచి ఆరోగ్యం కోసం ఆహారంలో 200 గ్రాములు పండ్లను తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. జిల్లాలో పండించిన రైతుకు బాగుంటుంది.

– రవిచంద్రబాబు, జిల్లా ఉద్యానవన అధికారి, అన్నమయ్య జిల్లా



జ్ఞానసాగర్ గ్రంథాలయం

కారాగారంలో విజ్ఞాన కాంతులు

- ఖైదీల విద్యా వికాసానికి కృషి
- ఖర్చంతా జైలు సంక్షేమ నిధి నుంచే..
- విద్యా కేంద్రంగా విశాఖ సెంట్రల్ జైలు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారం శిక్షా కేంద్రంగానే కాకుండా.. విద్యా కేంద్రంగానూ రూపాంతరం చెందుతోంది. నేరాల చీకటిలో మగ్గుతున్న ఖైదీలకు విద్య ద్వారా కొత్త జీవితాన్ని వెలిగించే ప్రయత్నం జరుగుతోంది. కారాగారం నాలుగు గోడల మధ్యనే ప్రాథమిక విద్య నుంచి పోస్ట్–గ్రాడ్యుయేషన్ వరకు చదువుకునే సౌకర్యం ఉండటం విశేషం. 2024–25 విద్యా సంవత్సరంలో 120 మంది ఖైదీలు విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో 90 మంది ప్రాథమిక విద్యను పూర్తి చేస్తుండగా.. 19 మంది పదో తరగతి ఓపెన్ పరీక్షలు రాస్తున్నారు. 11 మంది ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షలను రాశారు. అంతేకాకుండా ఆసక్తి ఉన్న ఖైదీలు ఖాళీ సమయాల్లో చదువుకుంటూ డిగ్రీలు పొందుతున్నారు. కంప్యూటర్ విద్య, స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు, వివిధ వృత్తుల్లో ఇక్కడ ఖైదీలు శిక్షణ పొందుతున్నారు. గతంలో ఇక్కడ శిక్ష అనుభవించిన ఒక ఖైదీ పీజీ పూర్తి చేసి బంగారు పతకం సాధించడం విశేషం. పని చేస్తూనే చదువుకునే వెసులుబాటు ఉండటంతో, శిక్ష పూర్తయిన అనంతరం విద్యావంతులుగా బయటకు వస్తున్న ఖైదీల సంఖ్య పెరుగుతోంది.

అన్నీ జ్ఞానసాగర్‌లోనే..

జైలు లోపల 'జ్ఞానసాగర్' పేరుతో విద్యాలయం ఉంది. ఇక్కడ గ్రంథాలయం, తరగతి నిర్వహణ, విద్యా **బోధన, పరీక్షల నిర్వహణ తదితర సౌకర్యాలు ఉన్నాయి. రిమాండ్‌లో ఉన్న ఖైదీలు, శిక్ష పడిన ఖైదీలు ఇక్కడ చదువుకుని పరీక్షలు రాయవచ్చు. చదువు లేని వారికి వయోజన విద్య ద్వారా అక్షరజ్ఞానం కలిగిస్తున్నారు. వారికి ప్రాథమిక స్థాయి నుంచి చదవడం,** రాయడం నేర్పుతున్నారు. ఇందుకోసం జైళ్ల శాఖ ప్రత్యేకంగా ఒక ఉపాధ్యాయుడిని నియమించింది. ఈ ఉపాధ్యాయుడు ఖైదీల విద్యా సంబంధిత విషయాలన్నింటినీ చూసుకుంటారు. ఖైదీలు పరీక్షలకు దరఖాస్తు చేసినప్పటి నుంచి వారికి తరగతులు నిర్వహించడం, సందేహాలు తీర్చడం, పరీక్షలు నిర్వహించడం వరకు ఆయనే ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. తరగతులు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 4 గంటల వరకు జరుగుతాయి.

ఖైదీల్లో మార్పు కోసం..



ఖైదీల్లో పరివర్తనం సాధించడానికి చదువు ఉపయోగపడుతుంది. విచక్షణ కల్పించడానికే ఇక్కడ ఖైదీలను విద్యావంతులను చేసే ప్రయత్నం చేస్తున్నాం. ప్రత్యేకంగా నియమించిన ఉపాధ్యాయుడు ద్వారా వారికి బోధన జరుగుతోంది. ఖైదీల చదువుకు అయ్యే ఖర్చు, పరీక్ష ఫీజులను జైలు సంక్షేమ నిధి నుంచే చెల్లిస్తున్నాం. చదువు మధ్యలో నిలిపివేసి జైలుకు వచ్చినవారు.. ఇక్కడ చదువు కొనసాగించుకోవచ్చు.

– ఎస్.సాయిప్రవీణ్, జైలు డిప్యూటీ సూపరింటెండెంట్

ఐదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే..

ఇక్కడ ప్రతి సంవత్సరం చదువుకున్న ఖైదీల సంఖ్య మారుతూ ఉంటుంది. కొత్త వారు రావడం, శిక్ష పూర్తయిన వారు వెళ్లిపోవడం వల్ల ఈ సంఖ్యలో మార్పు ఉంటుంది. గడిచిన ఐదేళ్లలో మొత్తం 55 మంది ఖైదీలు ఓపెన్ పదో తరగతిలో చేరారు. 20 మంది ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. డిగ్రీ స్థాయిలో బీఏ కోర్సును 29 మంది పూర్తి చేయగా, ఒకరు పీజీలో ఎంఏ పరీక్షలు రాశారు.



జైలులో ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాస్తున్న ఖైదీలు (ఫైల్)

- 2020–21లో 80 మంది ప్రాథమిక విద్య, 26 మంది ఓపెన్ టెన్త్, 14 బీఏ చదువుకున్నారు.
- 2021–22లో 90 మంది ప్రాథమిక విద్య, 10 మంది ఓపెన్ టెన్త్, 9 మంది బీఏ విద్యనభ్యసించారు.
- 2022–23లో 82 మంది ప్రాథమిక విద్య, ఆరుగురు బీఏ, ఒకరు ఎంఏ చదివారు.
- 2023–24లో 80 మంది ప్రాథమిక విద్య, 9 మంది ఓపెన్ ఇంటర్మీడియట్ చదివారు.
- 2024–25 (ప్రస్తుతం)లో 90 మంది ప్రాథమిక విద్య కొనసాగిస్తుండగా, 19 మంది ఓపెన్ టెన్త్ పరీక్షలు రాస్తున్నారు. 11 మంది ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు.

రంజాన్ మాసంలో ప్రత్యేకం
ఉపవాసదారులకు సత్తువను పెంచే ఆహారం

బలవర్ధక ఆహారం 'గంజి'

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): రంజాన్ మాసం వచ్చిందంటే చాలు..మసీదుల్లో ప్రత్యేకమైన గంజిని తయారు చేస్తారు. దీనికి ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పాతబస్తీ పెట్టింది పేరు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్న పానీయాలు లేకుండా దైవారాధనలో గడిపే ఉపవాసపరులకు ఇఫ్తార్ వేళ కడుపు నిండా అన్నం పెట్టలేకపోయినా కనీసం బలవర్ధకమైన ఆహారం ఏదైనా అందించాలనే తలంపుతో గంజి వంటకం ఉద్భవించింది. నాటి హైదరాబాద్, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఉమ్మడి కృష్ణాలోకి ప్రవేశించినట్లు ముస్లిం పెద్దలు చెబుతారు. పాతబస్తీలో మాత్రం ప్రతి ఏడాది దీన్ని ప్రత్యేకంగా తయారు చేస్తారు. తక్కువ ఖర్చుతో తక్షణ శక్తిని అందించే ఆహారంగా ప్రాచుర్యం పొందింది.

విజయవాడలో గంజి ప్రత్యేకం

హైదరాబాద్లోని ఆయా ప్రాంతాలు హలీమ్ ప్రసిద్ధిని పొందాయి. విజయవాడలో పాతబస్తీ ప్రాంతం గంజిని ఇంటింటికీ పంపిణీ చేస్తారు. వన్‌టౌన్ పాతబస్తీలోని షాహీ మసీదు, సరాయి మసీదుతో పాటుగా వించిపేట, తారాపేట, భవానీపురం, చిట్టినగర్, విద్యాధరపురం పరిసర ప్రాంతాల్లో రోజు కూలి చేసుకునే పేద ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉంటారు. పగలంతా వీరు నిష్ఠతో దీక్షలో ఉండి శక్తి కోసం 'గంజి' సేవిస్తారు. ప్రతి రోజూ మసీదుల వద్ద తయారు చేసిన గంజిని ఇంటింటికి పంపిణీ చేస్తారు.



విజయవాడ వించిపేట షాహీ మసీదు వద్ద గంజిని సిద్ధం చేస్తున్న చిత్రం

తయారీ ఇలా...

ఉప్మా రవ్వ గాని, బియ్యం రవ్వగాని, అల్లం, వెల్లుల్లి, యాలకులు, దాల్చిన చెక్క, టమోటా, కొత్తిమీర, పుదీనా వేసి ప్రత్యేకంగా గంజిని తయారు చేస్తారు. ముందుగా మసాలా దినుసులు, అల్లం, వెల్లుల్లి టమోటాలను నూనెలో వేయిస్తారు. వంట పాత్రలో నీరు పోస్తారు. సుమారు గంట పాటు బాగా కాగిన తర్వాత నీటిలో రవ్వ కలుపుతారు. ఇలా గంజి తయారీ పూర్తయ్యాక కొద్ది సేపు వంట పాత్రలో ఉంచి పంపిణీ చేస్తారు. ఉదయం నుంచి గంజి తయారీని ప్రారంభిస్తే మధ్యాహ్నానికి పూర్తవుతుంది. బలవర్ధకమైన ఆహారంగా పేరొందిన గంజి వంటకం ఉపవాస దీక్ష చేస్తున్న వారి శరీరం లోని వేడిని తగ్గించి, చల్లబరుస్తుంది. ఇఫ్తార్ సమయంలో పండ్లు, అల్పాహారం లేకపోయినా ఒక్కగ్లాసు గంజి తాగేందుకు చాలామంది ముస్లింలు ఇష్టపడతారు.



ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. క్యూలైన్ ఎంబీసీ వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 64,252 మంది స్వామివారిని దర్శించుకోగా 25,943 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.68 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మావుళ్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మవారి దేవస్థానంలో బుధవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 30 రోజులకు రూ.21,06,063 నగదు, బంగారం 38.500 గ్రాములు, వెండి 120 గ్రాములు, విదేశీ కరెన్సీ లభించినట్టు ఆలయ సిబ్బంది తెలిపారు.

వేడుకగా అన్నమయ్య వర్ధంతి మహోత్సవాలు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో అన్నమాచార్యుల 522వ వర్ధంతి మహోత్సవాలు అన్నమాచార్య కళామందిరంలో బుధవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన సప్తగిరి సంకీర్తనల గోష్టిగానం అలరింపజేసింది. ఉదయం 9 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, స్థానిక కళాకారులు కలిసి దినము, ద్వాదశి, సప్తగిరి సంకీర్తనలను రాగయుక్తంగా ఆలపించారు. అనంతరం హారతి మహానివేదన చేపట్టారు.

కాశీకంటే పురాతన పుణ్యక్షేత్రం
వృద్ధాచలక్షేత్రం

కాశీక్షేత్రం అతి పురాతనమైనదని, శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైనదనీ అందరికీ తెలుసు. అయితే కాశీకంటే పురాతన క్షేత్రం ఒకటి ఉంది. అది తమిళనాడులోని విరుదాచలం. ఇది కాశీ క్షేత్రం కంటే పురాతనమైనది. అందువల్లే ఇక్కడ స్వామివారిని పూజిస్తే కాశీలో విశ్వనాథుడిని సేవించిన దానికంటే ఎక్కువ పుణ్యం వస్తుందని విశ్వసిస్తారు. అంతేకాకుండా ఇక్కడ పుట్టినా, చనిపోయినా అప్పటి వరకూ చేసిన తప్పులు సమిసిపోయి తప్పక కైలాసానికి వెళ్తారని ప్రతీతి. అందుకే కాశీలో జీవిత చరమాంకం గడపడానికి వీలు కుదరని వారు ఇక్కడికి వచ్చి దైవ సన్నిధిలో తమ శేష జీవితాన్ని ముగిస్తారు. ఈ నేపథ్యంలో ఆ దేవాలయానికి సంబంధించిన కథనం.




వృద్ధాచలాన్ని వృద్ధ కాశి అని కూడా పిలుస్తారు. ఇక్కడి స్థలపురాణం ప్రకారం వృద్ధ కాశిగా పేరొందిన ఈ విరుదాచలంలో మరణిస్తే కాశీలో మరణించిన వారికంటే ఎక్కువ పుణ్యమే లభిస్తుందని చెబుతారు.

కాశీలో చెప్పినట్టే ఇక్కడ కూడా చనిపోతున్నవారి శిరస్సును తన ఒడిలో ఉంచుకొని ఇక్కడ కొలువై ఉన్న వృద్ధాంబిక తన చీర కొంగుతో విసురుతూ ఉండగా వారి చెవిలో పరమేశ్వరుడు తారక మంత్రాన్ని ఉపదేశించి వారికి మోక్షం ప్రసాదిస్తాడని చెబుతారు. అదే విధంగా పరమశివుడు నటరాజ రూపంలో నాట్యానికి ప్రసిద్ధి. ఈయన చిదంబరంలో కాళీమాతతో పోటీపడి నాట్యం చేస్తే ఈ విరుదాచలం లేదా వృద్ధాచలంలో తన సంతోషం కోసం నాట్యం చేశాడని చెబుతారు. అంతే స్వామి సంతోష తరంగాల్లో తేలిపోతూ నాట్యం చేసిన ప్రదేశం ఇదే.

స్థలపురాణం...

పూర్వం ఇక్కడ ప్రజలు కరువు కాటకాల వల్ల నిత్యం అష్ట కష్టాలు పడేవారు. దీంతో స్థానికంగా ఉండే విభాసిత మహర్షి, స్వామివారికి సేవ చేస్తే ఫలితం ఉంటుందని చెప్పాడు. దీంతో ఆ ఊరిపెద్దలంతా కలిసి స్వామి వారికి దేవాలయం నిర్మించాలని తీర్మానించారు. అయితే ఆ సమయంలో వారి జీవనం ఎలా అన్న అనుమానం మొదలయ్యింది. దీనికి విభాసిత మహర్షి, వృద్ధేశ్వర స్వామి వారిపై నమ్మకంతో పని చేయండి చేసుకొన్నవారికి చేసుకొన్నంతగా లాభం చేకూరుతుందని చెప్పారు. దీంతో ప్రజలు ఆ పనికి పూనుకొన్నారు. ఇక ఉదయం నుంచి సాయంత్రం వరకూ పనిచేసిన వారికి విభాసిత మహర్షి స్థానికంగా ఉంటున్న చెట్టు నుంచి కొన్ని ఆకులు తీసుకొని పనిచేసిన వారికి ఇచ్చేవాడు. ఆశ్చర్యం... ఎవరు ఎంత పని చేసారో అంతకు సమానంగా ఆ ఆకులు నాణాలుగా మారేవి. అప్పటి నుంచే చేసిన వారికి 'చేసినంత, చేసుకున్న వారికి చేసుకొన్నంత' అనే నానుడి మొదలయ్యిందని చెబుతారు.



ఐదుతో అవినాభావ సంబంధం...

ఈ ఆలయంలో 5 అంకెకు విశిష్ట స్థానం ఉంది. ఈ ప్రాంగణంలో పూజలందుకొనే మూర్తులు 5. వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరుడు, శివుడు, శక్తి, భైరవుడు. ఇక్కడ స్వామి వారికి 5 పేర్లు ఉన్నాయి. అవి విరుధ గిరీశ్వరుడు, పరుమలైనాథార్, విరుద్ధాచలేశ్వర్, ముద్దుకుండ్రీశ్వరుడు, వృద్ధ గిరీశ్వరుడు. ఆలయానికి 5 గోపురాలు, 5 ప్రాకారాలు, 5 మండపాలు, 5 నందులు ఉన్నాయి. వేకువ జాము నుంచి రాత్రి దాకా స్వామికి నిర్ణీత సమయంలో 5 సార్లు పూజలు చేస్తారు. ఇక్కడ 5 రథాలు ఉన్నాయి. ఇక్కడ స్వామి వారు స్వయంభువుడు. ఇక్కడ శివుడిని ప్రార్థించిన వారికి మనశ్శాంతి కలగడమే కాకుండా అన్ని రకాల శరీర రుగ్మతల నుంచి వెంటనే విముక్తి కలుగుతుందని చెబుతారు. ఇక్కడ





ఉన్న దుర్గాదేవిని పూజిస్తే వివాహం, సంతానం కలగడం వంటి కోరికలు నెరవేరుతాయని చెబుతారు. పాతాళ వినాయకుడు శ్రీ కాళహస్తిలో ఉన్నట్లు ఇక్కడ విఘ్నేశ్వరుడు భూతలం నుంచి కిందికి ఉన్న ఆలయంలో ఉంటాడు. ఈ ఆలయంలోని స్వామివారిని సందర్శించడానికి 18 మెట్లు దిగి కిందికి వెళ్లాల్సి ఉంటుంది. చనిపోయిన వారి చితా భస్మాన్ని ఇక్కడున్న మణి ముత్తా నదిలో నిమజ్జనం చేస్తే అవి చిన్న రాళ్లుగా మారి నది అడుగున చేరుతాయని చెబుతారు. ఈ విరుదా చలంలోని నదిలో వేసిన నాణాలు తిరువారూరు కోవెల పుష్కరిణిలో తేలుతాయని చెబుతారు.

వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడు...

ఇక్కడ వల్లీ దేవసేనలతో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుడు కొలువు తీరి ఉన్నాడు. ఆయన ఆలయంలో పైన చక్రాలు ఉంటాయి. అవి శ్రీ చక్రం, సుబ్రహ్మణ్య చక్రం, అమ్మవారి చక్రం. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఇలాంటి చక్రాలు చాలా తక్కువ శివాలయంలో చూస్తాం. అందులో ఇది ఒకటి. అందుకే ఇక్కడ స్వామివారికి విన్నించుకొన్న కోరికలు త్వరగా తీరుతాయని చెబతారు.

ఈ ఆలయం ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకూ అదే విధంగా సాయంకాలం 3.30 గంటల నుంచి 9 గంటల వరకూ అందుబాటులో ఉంటుంది. ఇక్కడ కూడా తిరువణ్ణామలైలో చేసినట్లుగానే ప్రతి పౌర్ణమికీ భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారు. దీనివల్ల వారికి స్వర్గ ప్రాప్తి కలుగుతుందని నమ్మకం.

చెన్నై నుంచి 230 కిలోమీటర్ల దూరంలో కడలూర్ జిల్లాలో ఉన్న ఈ క్షేత్రానికి చేరుకోవడానికి నిత్యం బస్సులు, రైళ్లు అందుబాటులో ఉన్నాయి.

– డి.వి.ఆర్

ఇక్కడ వేసిన నాణేలు అక్కడి కొలనులో ...

ఒకసారి సుందరర్ అనే శివభక్తుడు ఈ దారిగుండా వెడుతూ ఇక్కడి స్వామివారిని స్తుతించాడు. దీంతో స్వామి వారు స్వయంగా 12 వేల బంగారు నాణాలను అంద జేస్తాడు.తాను తిరువారూర్ వెళ్లాల్సి ఉందని అయితే తోవలో దొంగల భయం ఉందని సుందరార్ భయపడుతాడు.

ఇదే విషయాన్ని శివుడికి చెబుతాడు. దీంతో శివుడు తాను ఈ నాణాలను ఇక్కడే ఉన్న మణిముత్తా నదిలో వేస్తానని, నీవు తిరువారూర్ వెళ్లిన తర్వాత అక్కడి కొలనులో తీసుకోవచ్చని చెబుతాడు. ఇందుకు అంగీకరించిన సుందరార్ తిరువారూర్ వెళ్లి అక్కడ కొలనులో నుంచి 12వేల బంగారు నాణాలను తీసుకొన్నాడని కథనం. అదే విధంగా ఆ నాణ్యాల నాణ్యతను సాక్షాత్తు వినాయకుడు పరీక్షించి అటు పై ఆ భక్తాగ్రేసరుడికి ఇచ్చారని చెబుతారు.

● రమజాన్ కాంతులు

లైలతుల్ ఖద్ర్... ఘనమైన రాత్రి

దివ్య ఖుర్ఆన్ అవతరణ రమజాను మాసంలోనే ఒక రాత్రి సమయంలో అవతరించడం ప్రారంభమైంది. అందుకే ఈ రాత్రిని అన్వేషించాలని ఆదేశించడం జరిగింది. దానిని 21,23,25,27,29 బేసి రాత్రులలో అన్వేషించాలి. ఈ రాత్రిని ఘనమైన రాత్రిగా దివ్య ఖుర్ఆన్ పేర్కొంది. ఈ ఒక్క రాత్రి 1000 నెలల కంటే మేలైనదిగా చెప్పబడింది. ఎవరికి ఈ రాత్రి దొరుకుతుందో వారి పాపాలన్నీ క్షమించబడతాయి.

ఈ నెలలో ముఖ్యంగా చేయవలసిన దానం 'జకాత్ దానం...

జకాత్ అంటే విధిదానం తప్పకుండా చెల్లించవలసిన దానం. అల్లాహ్ ఎక్కడైతే నమాజు చేయమని ఆజ్ఞాపించాడో అక్కడే జకాత్ చెల్లించండి అని కూడా అన్నాడు. 'వఅఖీముస్సలాత వ ఆతుజ్జకాత' అంటే ఎవరి వద్దనైనా ఒక లక్ష రూపాయలు ఉంటే దానిపై రెండున్నర శాతం అంటే 2500 రూపాయలు తీసి బీదవారికి చెల్లించాలి.ఇది వారి హక్కు, ఇది దానం కాదు. సంవత్సరం గడిస్తే లేక ఏడున్నర తులాలు బంగారం లేక 52న్నర తులాల వెండి ఉండి దాని మీద సంవత్సరం గడిస్తే రెండున్నర శాతం తీసి బీదలకు పంచాలి. బీదవారిలో మన కుటుంబంలోని బీదవారికి ప్రథమ స్థానం ఇవ్వాలి. ఈ జకాత్ అనేది ఒంటెలపై, గొర్రెలపై, పంట పొలాల దిగుబడి పై కూడా ఉంటుంది.



'ఏతికాఫ్: ఏతికాఫ్ అంటే తపోనిష్ఠ...

రమజాన్ మాసం చివరి పది రోజులు మస్జిదులో ఏకాంతంగా గడపడం. భార్య పిల్లలను, వ్యవహారాలను, ఉద్యోగాన్ని... అన్నిటినీ త్యజించి, ఏకాంతంగా ఒక మూల కూర్చొని దైవ ధ్యానంలో లీనమవడం. అత్యధికంగా దివ్య ఖుర్ఆన్ పారాయణం చేయడం, దైవ నామస్మరణ లో లీనమవడం, ఎవరితోనూ మాట్లాడకుండా దైవంతో సంబంధం కలిగి ఉండడం. ఈ పది రోజులు ప్రాపంచిక వ్యవహారాలన్నింటినీ త్యజించి దైవ గృహంలో గడపడం. ఎతికాఫ్ పాటించేవాడిని మోతకిఫ్ అంటారు. ఈ మోతకిఫ్ పది రోజులు దైవ గ్రహమైన మస్జిదులో దేవుని అతిథిగా ఉంటాడు. అప్పుడు దేవుడు ఈ అతిథిని బాగా సత్కరించి అంటే అతని కోరిన వాటిని మన్నించి అంగీకరించి అతని వేడుకోలు పరిపూర్ణం చేస్తాడు.

ఏతెకాఫ్‌లో స్త్రీలు కూడా పాల్గొనవచ్చు అయితే వారు తమ ఇంటిలోనే ఒక చోటు తపోనిష్ఠ కోసం ఎంపిక చేసుకొని అక్కడే పురుషులు ఏ విధంగా మస్జిదులలో నియమాలు పాటిస్తున్నారో ఆ విధంగానే స్త్రీలు కూడా పాటిస్తూ గడపాలి.

ఫిత్రా దానం...

ఫిత్రా అంటే రమజాన్ మాసంలో ఇచ్చే ప్రత్యేక దానం. ఈ ఫిత్రా పదం వల్లనే రమజాన్ మాసానికి మరొక పేరు ఈదుల్ ఫితర్ అని వచ్చింది. అంటే పండుగకు ఒక రెండు మూడు రోజులు ముందు బీదవారికి ఫిత్రా దానం చెల్లించాలి. ఎందుకంటే, వారు కూడా మనతోపాటు పండుగ సంబరంలో, పాల్గొనాలని నిర్ణయించబడింది. ఒక ఫిత్రా వచ్చేసి రెండు కిలోల గోధుమలు లేదా ఫిత్రా ఇచ్చే వ్యక్తి స్థాయిని బట్టి ఖర్జూరాలు గాని, కిస్మిస్ గాని ఇవ్వవచ్చు. ఇంట్లో నలుగురు ఉంటే, 8 కిలోల గోధుమలు బీదవారికి ఇవ్వాలి అప్పుడే పుట్టిన బిడ్డపై కూడా ఫిత్రా చెల్లించాలి.

మళ్లీ నెలవంక కనిపిస్తుంది. నెలవంక చూసి రెండవరోజు పండుగ జరుపుకుంటారు. ఈ పండుగలో ఉన్న వాటిలోనే మంచి వస్త్రాలు ధరించి అత్తరు పూసుకొని దేవుని నామం స్మరిస్తూ ఈద్గాకు గాని, మస్జిదుకు గాని బయలుదేరుతారు. అక్కడ నమాజ్ చేసి తిరిగి వచ్చేటప్పుడు ముస్లిమేతర సోదరులతో ఈద్ ముబారక్ అంటూ ఒకరినొకరు అలైబలై తీసుకుంటారు. ఇది చూడ ముచ్చటైన దృశ్యం. ఇంకా చేయి చాపిన వారికి ఎంతో కొంత దానం ఇస్తూ ఇంటికి చేరుకుంటారు. తమ పిల్లలకు తమ పొరుగువారి పిల్లలకు 'ఈదీ' ఇస్తారు. ఈదీ అంటే పండుగ బహుమానంగా డబ్బులు ఇస్తారు. పిల్లలు తీసుకొని మహా సంతోషపడుతూ తమకు తోచిన విధంగా కొనుక్కుంటారు. ఈ విధంగా రమజాన్ నెల సంతోష సంబరాలతో ముగుస్తుంది

– మొహమ్మద్ అబ్దుల్ రషీద్
రచయిత, ఖురాన్ అనువాదకులు

● మంచి మాటలు

- గడ్డిపోచ విలువ చేయని చిన్న పనైనా, సింహాసనం మీద కూర్చుని రాజ్యమేలే పెద్ద పనైనా వాటిపై ప్రేమ లేనప్పుడు ఆ పనులు చేయకుండా ఉండడమే మేలు.
- నువ్వు వంద మంచి పనులు చేసిన రాని గుర్తింపు ఒక్క పొరపాటు చేస్తే వస్తుంది. ఎందుకంటే ఇక్కడ లోపాలకు ఉన్న విలువ నీలో ఉన్న మంచితనానికి, సామర్థ్యానికీ ఉండదు.
- నీ మాటకు, నీ సంకల్పానికి ఉన్న బలాన్ని తక్కువగా అంచనా వేసుకోకు. ఈ ప్రపంచంలో సంకల్ప శక్తికి మించిన బలమైన ఆయుధమేదీ లేదు.
- 'క్షమార్పణ అడగటం క్షమించ గలగడం ఈ రెండూ రాగలిగితే జీవితంలో సగం విజయం సాధించినట్లే.
- సమస్య... సహనాన్ని పరీక్షిస్తుంది. సహనం... జీవితాన్ని నిలబెడుతుంది. మార్పు... నిన్ను గమ్యం వైపు అడుగులేయిస్తే... ఓర్పు... నిన్ను గెలుపుకి దగ్గర చేస్తుంది.
- ఆశయం గొప్పదైతే, ఆలోచన పవిత్రమైతే, ఆత్మబలమే ఆయుధమైతే, విజయం తప్పక వరిస్తుంది. మౌనానికి రూపం లేకపోవచ్చు. కానీ, అగ్ని వలే దహించే శక్తి ఉంది. మాటకు పదును లేకపోవచ్చు. కానీ, మనసును ముక్కలు చేసే శక్తి ఉంది.
- ప్రశ్న ఏదైనా సరే... ప్రేమతో బదులిస్తే, మనం గడిపే ప్రతిరోజు ఇంకొంచెం అందంగా ఉంటుంది.
- నీ పరిస్థితిని ఎప్పుడూ, ఎవరూ ఆలోచించరు. నీ పలకరింపు మాత్రమే గుర్తు పెట్టుకుంటారు.
- మనిషి దిగజారినా, అభివృద్ధి చెందినా అది అతని స్వయంకృతమే.'
- తాత్కాలిక సుఖాల కోసం తాత్కాలిక కష్టాలను పక్కకు పెడితే... జీవితంలో శాశ్వత కష్టాలను భరించాల్సి ఉంటుంది.'

● లెంటు

విమోచనా సమయం

విశ్వవ్యాప్తంగా క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ఆచరించే 40 దినాలు ఉపవాస ధ్యాన సమయంలో గడిచిన కాలంలో దేవుని ఆజ్ఞలకు వ్యతిరేకమైన కార్యకలాపాలు చేసిన వాటి నుండి విమోచన పొందుటకు సాత్వికాహారం తీసుకొని నియమ బద్ధమైన జీవితం గడుపుతూ ఉపవాస ప్రార్థనలు ఆచరించాలి. ఈ ఉపవాస సమయంలో ఐహికమైన సంగతులను మరచి ప్రార్థనవైపే మనసు కేంద్రీకరించాలి. లెంటు అనే మాటకు చిగురించి అని అర్థం. ఆ విధమైన ప్రార్థనలు చేసి, పాపప్రక్షాళన పొంది తిరిగి చిగురించేలా ప్రక్షాళన చేసుకుంటూ గడపాలి.



ఉపవాస కాలంలో ఆచరించే ప్రార్థనలు ఆచరించే ముందు ఎలా ఆచరించాలి అనే విషయంలో యేసుప్రభువులవారు బోధించినదేమనగా– మీరు ఉపవాసముండునప్పుడు మీ ముఖాలను వికారంగా మనుష్యులకు కనపడవలెనన్న దృక్పథంతో కాకుండా రహస్యమందున్న తండ్రియైన దేవునికి కనపడే విధంగా వుండాలి. ఆ విధంగా చేసినట్లయితే దేవుడు చూసి మీకు ప్రతిఫలమిచ్చునని తెలిపెను. (మత్తయి 6 : 6 – 11).

ఒకసారి ఒకడు ప్రభువు దగ్గరకు వచ్చి– బోధకుడా! నా కుమారునికి మూగ దయ్యం ఒకటి పట్టి ఎక్కడ పట్టునో అక్కడ పడవేయుచున్నదని అతడు తెలుపగా– క్రీస్తు దయ్యం పట్టిన వానిని చూసి– మూగవైన చెవిటి దయ్యమా! వదిలిపొమ్మని ఆజ్ఞాపించగా, ఆ దయ్యం విడిచిపోయెను. అట్టి కార్యం ఏసుప్రభువు శిష్యులు చేయలేకపోయారు. మేమెందుకు చేయలేదని ప్రభువును వారు అడగ్గా, ప్రభువు వారితో ప్రార్థన వలననే కాని ఇలాంటివి వదలిపోవునని చెప్పెను. కాబట్టి ప్రార్థన ముఖ్యం. కావున ఉపవాస ప్రార్థనలో శక్తి వున్నది. (మార్కు 9 : 17–29). ప్రార్థనలో (భక్తుడు) విశ్వాసులు దేవునితో అనుసంధానం కావాలి.

ఉపవాస ప్రార్థనా సమయాల్లో సామాజికసేవ ప్రామాణికం. అది ఎటువంటిదంటే దిక్కులేని పిల్లలను, విధవరాండ్రను వారి ఇబ్బందుల్లో పరామర్శిస్తూ ఇహలోక మాలిన్యం అంటకుండా తమను తాము కాపాడుకొనుట ప్రాముఖ్యమని వాక్యం స్పష్టీకరించుచున్నది (యాకోబు1: 27). యెరూషలేములో స్వస్థపరిచే కోనేటిలోతనను ఎవరూ దించేవారు లేక పడిగాపులు పడుతున్న ముప్పది ఎనిమిది సంవత్సరాల నుండి వ్యాధి గల మనుష్యుడిని చూసిన ప్రభువు అతనితో నీవు లేచి నీ పరుపు ఎత్తుకొని నడవమని చెప్పగా అతడు స్వస్థత నొంది నడిచాడని వాక్యం స్పష్టంగా తెలిపింది. (పరియోహాను 6:1–9).

ఆ విధంగా ఎన్నో సంవత్సరాల నుండి దేవుని ఆజ్ఞలకు వ్యతిరేక కార్యకలాపాలు చేసినవారు ఈ ఉపవాస కాల సమయంలో దేవునితో ప్రార్థనలో గడిపి పాప క్షమాపణ పొంది విమోచించబడుదురు. కాబట్టి అట్టి విమోచన ఈ ఉపవాస సమయంలో పొందుదురుగాక.

– కోట బిపిన్

● నిర్మల వాణి

సహజ యోగం.. సమతుల్య జీవనం

మానవుల ఆధ్యాత్మిక ప్రయాణంలో స్త్రీ పాత్ర అత్యంత కీలకమైనది. పురుషులు నిత్యజీవితంలో తమ చుట్టూ ఉండే స్త్రీలను గౌరవించడం ద్వారా తమ సూక్ష్మ శరీరం లోపల శక్తి కేంద్రాలను లేదా షట్చక్రాలను చైతన్యవంతం చేసుకోవచ్చు. తల్లిని గౌరవించినప్పుడు అతని లోపల శ్రీ గణేశుని సుగుణాలు స్థిరపడడం వలన మూలాధార చక్రము చైతన్యవంతం అవుతుంది. అలానే తల్లితో ఉండే అనుబంధం చక్కగా ఉన్నప్పుడు ఎడమవైపు హృదయ చక్రం చైతన్యవంతం అవుతుంది. తన సోదరీమణులను గౌరవించినప్పుడు, ఎడమవైపు విశుద్ధి చక్రం చైతన్య వంతం అవుతుంది. తన భార్యను గౌరవించినప్పుడు ఆమె తన ఇంటికి గృహ లక్ష్మి కాబట్టి ఎడమవైపు నాభీ చక్రం చైతన్యవంతం అవుతుంది. అలానే భార్యతో అతని సంబంధం చక్కగా ఉన్నప్పుడు ఎడమవైపు హృదయ చక్రం చైతన్యవంతం అవుతుంది. పరస్త్రీలను తల్లి వలె లేదా సోదరి వలె గౌరవించినప్పుడు ఆజ్ఞా చక్రం చైతన్యవంతం అవుతుంది. కాబట్టి పురుషులు తమ ఆధ్యాత్మిక ఉన్నతి కోసం స్త్రీలను గౌరవించవలసిన ఆవశ్యకతను తెలుసుకొని తదనుగుణంగా నడుచుకోవాలి.



పరమపూజ్య
శ్రీ మాతాజీ నిర్మలాదేవి

ఎప్పుడైతే ఒక స్త్రీ తన సంపూర్ణ శక్తులను ధరించి ఉపయోగిస్తుందో అప్పుడు ఆమె చాలా శక్తివంతమై భీకరంగా ఉంటుంది. అలా కాకుండా ఎప్పుడూ వాదిస్తూ, కొట్లాడుతూ, విమర్శిస్తూ, చౌకబారుగా ప్రవర్తిస్తుందో, అప్పుడు ఆమె శక్తులన్నీ వధా అయిపోతాయి. ఆమె కావాలనుకుంటే పురుషులకంటే ఎక్కువగా పని చేయగలదు.



అయితే మొట్టమొదటగా ఆమె ఎంతో నమ్రతతోను, అణకువతోనూ, హుందాతనంతోను, చక్కటి అవగాహనతోను, వాత్సల్యపూరితంగా ఉండి తనలోగల శక్తులను గౌరవించుకుంటూ, శాంతిని నెలకొల్పటం నేర్చుకోవాలి. ఒక కవచం వలే రక్షణను కల్పించటం స్త్రీ యొక్క బాధ్యత. కవచం కత్తి యొక్క పనిని చేయలేదు. అలానే కత్తి కవచం చేసే పనిని చేయలేదు. అయితే ఆ రెండింటిలో ఏది గొప్ప? కవచమే గొప్ప. ఎందుచేతనంటే అది కత్తి యొక్క దెబ్బను తట్టుకోవాలి కాబట్టి. కత్తి విరుగుతుందేమో కానీ, కవచం మాత్రం విరగదు. అలా స్త్రీలు వారి శక్తులను గుర్తించి అందులో స్థిరపడాలి. నమ్రత అనేది ఆ శక్తికి ఒక గొప్ప ఇరుసు లాంటిది. ఎంతో నమ్రతా భావంతో, విధేయతతో ఆ శక్తులను తమ లోనికి గ్రహించుకుని వారు అందులో స్థిరపడాలి. మనం రోజూ పేపర్లో కానీ టీవిలో కానీ సోషల్ మీడియాలో కానీ ఎన్నోహింసాత్మక, అనైతిక కార్యక్రమాలను చూస్తున్నాము. వాటి ప్రభావం చిన్న పిల్లల మీద, స్త్రీల మీద పడి సమాజం నాశనమవుతోంది. సహజయోగ మార్గాన్ని సరైన రీతిలో అర్థం చేసుకొని ఆచరించడం ద్వారా మహిళలు అటువంటి సమాజంలో పరివర్తన తీసుకు రాగలరు.

ప్రపంచ వ్యాప్తంగా సహజ యోగా ధ్యాన సాధన చేస్తున్న మహిళలు అందరూ శ్రీ మాతాజీ నిర్మలా దేవి అనుసరించిన, ప్రబోధించిన స్త్రీ ధర్మాలను ఆచరిస్తూ ఉత్తమ కుటుంబ సభ్యులుగా తమ తమ దైనందిన జీవితంలో ప్రశాంతమైన, సమతుల్య జీవనం గడుపుతున్నారు.

– డా. పి. రాకేష్
శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల ఆధారంగా



ధర్మ సందేహం

విభూది ధరించడంలోని ఆంతర్యం ఏమిటి?

విభూదిని ధరించడం హిందూ సంప్రదాయం. ముఖ్యంగా కార్తీకమాసంలో భక్తులందరూ విభూదిని నుదుటిమీద తప్పకుండా ధరిస్తారు. కొందరు భుజాలు, ఛాతి, ఇతర శరీర భాగాలకు కూడా విభూతితో రేఖలు దిద్దుకుంటారు. ఎందుకంటే, ఏదైనా వస్తువును లేదా పదార్థాన్ని కాల్చితే అది బూడిదగా మారుతుంది. ఆ బూడిదను తిరిగి కాల్చితే మళ్లీ అది బూడిదే మిగులుతుంది తప్ప రూపాంతరం చెందదు. అందుకే అది అతి పవిత్రమైనదని శాస్త్రాలు చెబుతున్నాయి. వైజ్ఞానికపరంగా చూస్తే విభూదిని ఒంటికి రాసుకోవడం వల్ల ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుందని, శరీర ఉష్ణోగ్రత అదుపులోకి వస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి.

● జెన్ పథం

అందం.. వికారం..

అతను ఓ చిత్రకారుడు. అతనికి ఓ అందమైన నగుమోము, వికారమైన మోము చిత్రాలు గీయాలనుకున్నాడు. ముందుగా అతను ఓ అందమైన నగుమోము గల ఓ చిత్రం గీయడానికి నిర్ణయించుకున్నాడు. చాలాకాలానికి అతను అనుకున్నట్టే ఓ అందమైన అయిదేళ్ళ చిన్నవాడొకడు కనిపించాడు. ఆ పసివాడు పెద్దల అనుమతితో వాడి బొమ్మ గీశాడు. ఆ చిత్రం ఎంతో అందంగా ఉంది.



ఆ తర్వాత వికారస్వరూపమోము కోసం వెతకడం మొదలుపెట్టాడు. చాలా కాలమే పట్టింది. అతనిలో విసుగు మొదలైంది. అయినా ప్రయత్నం మానలేదు. ఉన్నట్లుండి అతనికి ఓ ఆలోచన వచ్చింది. ఎక్కడెక్కడో వెతకడమెందుకు ఒక జైలుకి వెళ్తే తాననుకున్న వికారస్వరూపుడు తారసపడతాడనుకున్నాడు. దాదాపు ఇరవై ఏళ్ళ తర్వాత అతను అనుకున్నట్టే ఒక జైలులో ఓ వికారమైన మోముగల ఒక వ్యక్తి కనిపించాడు. దాంతో అప్పటి దాకా అతనిలో ఉన్న నీరసం, విసుగు మటుమాయమయ్యాయి. ఉత్సాహం ఉప్పొంగింది. జైలు అధికారి అనుమతితో ఆ వికారస్వరూపుడి బొమ్మ గీయడం మొదలుపెట్టాడు. గీస్తున్నంతసేపు ఆ వికారస్వరూపుడిని మాటల్లో పెట్టాడు. అతని ఊరు, పేరు, పెద్దల వివరాలు ఇలా ఎన్నో విషయాలు అడిగి తెలుసుకున్నాడు.

అతను చెప్పిన వివరాలన్నీ విన్న తర్వాత చిత్రకారుడు నిశ్చేష్టుడయ్యాడు. ఎందుకంటే అతను మరెవరో కాదు, అందమైన చిన్నవాడనుకుని కొన్నేళ్ళ క్రితం గీసిన ఆ కుర్రాడే ఇప్పుడీ వికారస్వరూపుడు. కాలక్రమంలో ఆ అందమైన చిన్నోడు అనేక నేరాలూ ఘోరాలు చేసి ఇప్పుడిలా వికారస్వరూపుడిగా మారి తనముందున్నాడు. ఈ నిజం తెలిసి చిత్రకారుడి నోటి వెంట మాట లేదు.

ప్రతి మనిషిలోనూ అందమూ, వికారమూ ఉంటాయి. అయితే అతన్ని ఒకసారి అందంగానూ, మరోసారి వికారంగానూ చూపేది అతనున్న పరిస్థితులే!

– యామిజాల జగదీశ్

బిజినెస్ రీల్

చిన్న పట్టణాలపై ఐఐఎఫ్‌ఎల్ హోమ్ ఫైనాన్స్ ఫోకస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: గృహ, తనఖా రుణాల సంస్థ ఐఐఎఫ్ఎల్ హోమ్ ఫైనాన్స్ ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల మీద మరింతగా దృష్టి పెడుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా 10 శాఖలను ప్రారంభించడంతో పాటు రూ. 4,000 కోట్ల వ్యాపార లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అలాగే, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0పైనా ఫోకస్ చేస్తున్నట్లు కంపెనీ జోనల్ సేల్స్ హెడ్ శ్రీనివాస రేకపల్లి తెలిపారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ప్రతి నెలా రూ. 250 కోట్ల మేర రుణ వితరణ ఉంటోందని చెప్పారు. అల్పాదాయ, ఆర్థికంగా బలహీన వర్గాల వారిపై ప్రధానంగా దృష్టితో రూ. 5 లక్షల నుంచి గృహ రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. డిజిటల్ దన్నుతో, తక్కువ డాక్యుమెంటేషన్‌తో ముప్పై నిమిషాల్లోనే రుణాలను మంజూరు చేస్తున్నట్లు శ్రీనివాస తెలిపారు. ప్రస్తుతం ఐఐఎఫ్ఎల్ హోమ్ ఫైనాన్స్ పోర్ట్‌ఫోలియో రూ. 38,387 కోట్లుగా ఉండగా ఇందులో తెలుగు రాష్ట్రాల వాటా దాదాపు 16 శాతం ఉందన్నారు. దేశవ్యాప్తంగా 384 శాఖలు ఉండగా, ఇక్కడ 90 బ్రాంచీలు ఉన్నాయని పేర్కొన్నారు.

6,000 కోట్లు ముందస్తుగా చెల్లించిన ఎయిర్‌టెల్



న్యూఢిల్లీ: గతేడాది వేలంలో కొనుగోలు చేసిన స్పెక్ట్రంనకు సంబంధించి అదనంగా రూ. 5,985 కోట్ల మొత్తాన్ని టెల్కో భారతి ఎయిర్‌టెల్, దాని అనుబంధ సంస్థ భారతి హెక్సాకామ్ చెల్లించాయి. రుణాలు, వడ్డీ వ్యయాల భారాన్ని తగ్గించుకుని, ఆర్థిక క్రమశిక్షణ పాటించడంలో భాగంగా ఈ మేరకు చెల్లించినట్లు ఎయిర్‌టెల్ తెలిపింది. దీనితో అధిక వడ్డీ భారం ఉండే స్పెక్ట్రం బాకీలకు సంబంధించి ఎయిర్‌టెల్ 2025 ఆర్థిక సంవత్సరంలో రూ. 25,981 కోట్లు, ఇప్పటివరకు మొత్తం రూ. 66,665 కోట్లు చెల్లించినట్లయింది. ముందస్తుగా చెల్లించిన మొత్తం లయబిలిటీలపై సగటు వడ్డీ రేటు 9.74 శాతంగా ఉంది. అటు మరో అనుబంధ సంస్థ నెట్‌వర్క్ ఐ2ఐ కూడా 1 బిలియన్ డాలర్ల పర్పెచ్యువల్ డెట్ సెక్యూరిటీలను చెల్లించేసింది. కంపెనీ వీటిని 2020లో జారీ చేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
27-3-2025	
విశాఖ	410-00
చిత్తూరు	470-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	407-00
విజయవాడ	415-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	658.3	3.34
TRENT	5,308.00	2.37
HEROMOTOCO	3,653.00	0.69
GRASIM	2,585.00	0.61
POWERGRID	292.3	0.45

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
NTPC	354.05	-3.52
TECHM	1,410.50	-3.09
CIPLA	1,473.50	-2.49
AXISBANK	1,094.00	-2.19
BAJFINANCE	8,870.00	-2.18

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,486
ఎన్ఎస్ఈ	93,604
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,77,992
ఎఫ్ఐఐ	+ 2,241
డీఐఐ	- 696

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.58	$ 69.00
బ్రెంట్	72.98	$ 72.39

టెలీ కాలింగ్ ఉద్యోగాల బూమింగ్

- 2024లో 34 శాతం పెరిగిన అవకాశాలు
- బిజినెస్ డెవలప్‌మెంట్ ఉద్యోగాలకూ డిమాండ్
- జాబ్‌సైట్ వర్క్ఇండియా నివేదిక



ముంబై: టెలీ కాలింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్ తదితర ఆధునిక విక్రయ విభాగాల్లో గతేడాది 34 శాతం అధిక ఉపాధి అవకాశాలు లభించినట్లు జాబ్‌పోర్టల్ 'వర్క్ ఇండియా' నివేదిక వెల్లడించింది. సేల్స్ ఉద్యోగ మార్కెట్ భారత్‌లో మార్పును చూస్తున్నట్లు తెలిపింది. ఈ నివేదిక ప్రకారం.. 2023తో పోల్చితే ఈ విభాగంలో 2024లో జాబ్ పోస్టింగ్‌లు 17 శాతం పెరిగాయి. సంప్రదాయ మార్గాల కంటే కొత్త తరహా డిజిటల్ ఛానళ్లపైనే కంపెనీలు ఎక్కువగా దృష్టి సారిస్తున్నాయి. ఇలా ఆధునిక విక్రయ ఛానళ్లలో టెలీకాలింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్‌లో గతేడాది ఉపాధి అవకాశాలు అంతకు ముందు ఏడాదితో పోల్చితే గణనీయంగా (34 శాతం) పెరిగాయి. సంప్రదాయ సేల్స్ ఉద్యోగాలైన రిటైల్, ఫీల్డ్ సేల్స్ ఉద్యోగాలు మాత్రం అంతకు ముందు ఏడాదితో పోల్చితే 2 శాతం తగ్గాయి. 2023, 2024 సంవత్సరాల్లో తన ప్లాట్‌ఫామ్‌పై నమోదైన 12.8 లక్షల జాబ్ పోస్టింగ్‌ల డేటా ఆధారంగా ఈ వివరాలను వర్క్ఇండియా విడుదల చేసింది. అన్నింటిలోకి టెలీకాలర్ ఉద్యోగాలకు బూమింగ్ వాతావరణం ఉన్నట్టు ఈ నివేదిక ఆధారంగా తెలుస్తోంది. ఎందుకంటే 2023లో టెలీకాలర్ ఉద్యోగాలకు ఎక్కువ పోస్టింగ్‌లు నమోదు కాగా, 2024లోనూ అదే వాతావరణం కొనసాగింది. 22 శాతం అధికంగా టెలీకాలర్ జాబ్ పోస్టింగ్‌లు వర్క్ఇండియాపై లిస్ట్ అయ్యాయి. బిజినెస్ డెవలప్‌మెంట్ జాబ్‌లకు ఏకంగా 80 శాతం అధిక పోస్టింగ్‌లు వచ్చాయి.

మహిళలకు ప్రాధాన్యం..

టెలీకాలర్ ఉద్యోగాల్లో మహిళల నియామకాలు గణనీయంగా పెరిగాయి. 2024లో టెలీకాలింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్‌లో మహిళల నియామకం 2023తో పోల్చితే 80 శాతం పెరిగినట్టు ఈ నివేదిక వెల్లడించింది. సేల్స్‌లో మహిళలకు పెరుగుతున్న ప్రాతినిధ్యాన్ని సూచిస్తున్నట్టు తెలిపింది.

సేల్స్‌లో మార్పులు..

అమ్మకాల విషయంలో కంపెనీల్లో వస్తున్న మార్పును ఈ గణాంకాలు ప్రతిఫలిస్తున్నట్టు వర్క్ఇండియా నివేదిక తెలిపింది. అదే సమయంలో సంప్రదాయ సేల్స్ ఉద్యోగాలకు తగ్గడాన్ని ప్రస్తావించింది. టైర్ 3, 4 పట్టణాల మినహా మిగిలిన చోట సంప్రదాయ సేల్స్ ఉద్యోగాల పోస్టింగ్‌లు తగ్గినట్టు తెలిపింది. కొత్త తరహా సేల్స్ ఉద్యోగాల నియామకాల్లో బెంగళూరు, ముంబై ముందున్నాయి. 2023తో పోల్చితే 2024లో బెంగళూరులో 33 శాతం, ముంబైలో 26 శాతం చొప్పున జాబ్ పోస్టింగ్‌లు ఎక్కువగా వచ్చాయి. పట్టణాల్లో విక్రయ నైపుణ్యాలున్న వారికి పెరుగుతున్న డిమాండ్‌కు ఇది అద్దం పడుతున్నట్టు ఈ నివేదిక పేర్కొంది.

టీపీజీ చేతికి సీమెన్స్ విండ్ బిజినెస్

90% వాటా కొనుగోలుకి డీల్

న్యూఢిల్లీ: గ్లోబల్ ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ టీపీజీ కన్సార్షియం తాజాగా సీమెన్స్ గమేశాకు చెందిన ఆన్‌షోర్ విండ్ టర్బయిన్ జనరేటర్ తయారీ బిజినెస్‌లో 90 శాతం వాటా కొనుగోలుకి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తద్వారా భారత్, శ్రీలంకలలోని బిజినెస్‌లను సొంతం చేసుకోనుంది. మిగిలిన 10 శాతం వాటాను సీమెన్స్ ఎనర్జీకు చెందిన పవన విద్యుత్ అనుబంధ సంస్థ సీమెన్స్ గమేశా కొనసాగించనుంది.



అయితే డీల్ విలువను వెల్లడించలేదు. సీమెన్స్ గమేశాలో టీపీజీతోపాటు మురుగప్ప కుటుంబ సభ్యుల ప్రయివేట్ కంపెనీ మాహ్‌కో ఇన్వెస్ట్‌మెంట్స్ వాటాను పొందనుంది. అంతేకాకుండా జేఎస్ డబ్ల్యూ ఎనర్జీ మాజీ సీఈవో ప్రశాంత్ జైన్ సైతం వెంచర్‌లో క్లయిమేట్ చేంజ్ భాగస్వామిగా మైనారిటీ వాటాను సొంతం చేసుకోనున్నట్లు సీమెన్స్ గమేశా పేర్కొంది. లావాదేవీ పూర్తయ్యాక ఆన్‌షోర్ విండ్ టర్బయిన్ల తయారీ, ఇన్‌స్టలేషన్, సర్వీసులకు కొత్త స్వతంత్ర కంపెనీ ఏర్పాటు కానుంది.

9 కోట్లకు ఎంఎస్ఎంఈలు



2029 నాటికి అంచనాలు

న్యూఢిల్లీ: దేశీయంగా రిజిస్టర్డ్ చిన్న, మధ్య తరహా సంస్థల సంఖ్య 2029 నాటికి 9 కోట్లకు చేరుతుందనే అంచనాలు నెలకొన్నట్లు ఎంఎస్ఎంఈ శాఖ సంయుక్త కార్యదర్శి మెర్సీ ఇపావో తెలిపారు. ప్రస్తుతం ఉద్యమ్, ఉద్యమ్ అసిస్ట్ పోర్టల్స్‌లో నమోదు చేసుకున్న ఎంఎస్ఎంఈల సంఖ్య 6 కోట్ల పైగా ఉన్నట్లు పేర్కొన్నారు. దేశీయంగా చిన్న సంస్థలను సంఘటితం చేసేందుకు కృషి చేస్తున్నట్లు పరిశ్రమల సమాఖ్య అసోచాం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మెర్సీ వివరించారు. పెద్ద సంస్థలతో పోలిస్తే వీటికి బ్యాంకు రుణాల వితరణ వేగంగా పెరుగుతోందని ఆమె వివరించారు. స్థూల దేశీయోత్పత్తిలో ఎంఎస్ఎంఈల వాటా 30 శాతంపైగా, తయారీలో 36 శాతం, ఎగుమతుల్లో 45% పైగా ఉంటోంది.

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ..

అంతర్జాతీయంగా ఉత్పత్తుల తయారీ వ్యవస్థలో దేశీ ఎంఎస్ఎంఈలు మరింతగా భాగం అయ్యేలా చూడటంపై కసరత్తు చేస్తున్నట్లు నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం మరో కార్యక్రమంలో తెలిపారు. సాధారణంగా పెద్ద కంపెనీలతో పోలిస్తే చిన్న సంస్థలపైనే నియంత్రణల ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నియంత్రణలను సరళతరం చేయడంపై క్యాబినెట్ కార్యదర్శి సారథ్యంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైనట్లు వివరించారు. ఎంఎస్ఎంఈల కోసం డీఎక్స్ఎడ్జ్ (డిజిటల్ ఎక్సలెన్స్ ఫర్ గ్రోత్ అండ్ ఎంటర్‌ప్రైజ్) ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించిన సందర్భంగా సుబ్రహ్మణ్యం ఈ విషయాలు చెప్పారు. చిన్న సంస్థలు పోటీతత్వాన్ని పెంచుకునేందుకు, భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేలా పటిష్టమయ్యేందుకు ఉపయోగపడే వనరులు ఇందులో ఉంటాయని వివరించారు.

నకిలీల కట్టడిపై అమెజాన్ నజర్..

- నియంత్రణకు బిలియన్ డాలర్లు వెచ్చింపు
- 2024లో 1.5 కోట్ల ఉత్పత్తుల స్వాధీనం



న్యూఢిల్లీ: కృత్రిమ మేధను ఉపయోగించుకుని నకిలీ ఉత్పత్తులను కట్టడి చేయడంపై ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మరింతగా దృష్టి పెడుతోంది. 2024లో ప్రపంచవ్యాప్తంగా 1.5 కోట్ల పైగా ఇలాంటి ఉత్పత్తులను గుర్తించింది. కస్టమర్ల ప్రయోజనాలకు భంగం కలిగేలా, మరో విధంగా ఇంకెవరూ విక్రయించకుండా, వాటిని స్వాధీనం చేసుకుని, ధ్వంసం చేసింది. నకిలీలు, మోసాల నుంచి కస్టమర్లు, బ్రాండ్లు, విక్రేతలకు రక్షణ కల్పించేందుకు బిలియన్ డాలర్ల పైగా ఇన్వెస్ట్ చేసినట్లు, వేల కొద్దీ సంఖ్యలో ఇన్వెస్టిగేటర్లు, మెషిన్ లెర్నింగ్ సైంటిస్టులు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లలాంటి ఉద్యోగులను నియమించుకున్నట్లు బ్రాండ్ ప్రొటెక్షన్ రిపోర్ట్ 2024లో అమెజాన్ వెల్లడించింది. బ్రాండ్లు గుర్తించి, రిపోర్ట్ చేయడానికి ముందే తమ నియంత్రణ వ్యవస్థలు 99 శాతం సందేహాస్పద లిస్టింగ్స్‌ను బ్లాక్ చేసినట్లు వివరించింది. అమెజాన్ పారదర్శకత ప్రోగ్రాం ద్వారా 250 కోట్ల ఉత్పత్తుల యూనిట్లను సిసలైనవిగా ధృవీకరించినట్లు పేర్కొంది. ఫార్చూన్ 500 కంపెనీలు, గ్లోబల్ బ్రాండ్స్, అంకుర సంస్థలు, చిన్న వ్యాపార సంస్థలు సహా ప్రపంచవ్యాప్తంగా 88,000 బ్రాండ్ల ఉత్పత్తులు తమ దగ్గర లిస్టయినట్లు వివరించింది. భారత్ తమకు కీలక మార్కెట్ అని, కస్టమర్లు.. విక్రేతల ప్రయోజనాలను పరిరక్షించేందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని అమెజాన్ డైరెక్టర్ కెబారు స్మిత్ తెలిపారు.

170 పైగా నగరాల్లో ఫ్రెష్..

దేశీయంగా నిత్యావసరాల సేవల సెగ్మెంట్ ఫ్రెష్‌ను విజయవాడ, చిత్తూరు తదితర 170 పైగా నగరాలు, పట్టణాలకు విస్తరించినట్లు అమెజాన్ తెలిపింది. 11,000 మంది పైచిలుకు రైతుల నుంచి తాజా పండ్లు, కూరగాయలను కొనుగోలు చేస్తున్నట్లు వివరించింది. 2023 ద్వితీయార్థంతో పోలిస్తే 2024 ద్వితీయర్ధంలో 50 శాతం వ్యాపార వృద్ధి నమోదు చేసినట్లు అమెజాన్ ఫ్రెష్ ఇండియా డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీరామ్ తెలిపారు.

ఆర్థిక సేవల చేరువకు నియంత్రణలు అడ్డు కారాదు

- కస్టమర్ల హక్కులను దృష్టిలో పెట్టుకోవాలి
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



ముంబై: అందరికీ ఆర్థిక సేవలను మరింత చేరువ చేసే విషయమై నియంత్రణలు అనవసర అడ్డంకులు కల్పించరాదని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వ్యాఖ్యానించారు. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) కార్యక్రమంలో భాగంగా మల్హోత్రా మాట్లాడారు. విధాన నిర్ణేతలు సైతం తమ చర్యల్లో అత్యుత్సాహం లేకుండా జాగ్రత్త వహించాలని.. చట్టబద్ధమైన కార్యక్రమాలను అణచివేసేలా ఉండకూడదన్నారు. కస్టమర్ల హక్కులు, సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాలని సూచించారు. ఆర్థిక సేవల చేరువలో భారత్ ఎంతో ప్రగతి సాధించిందంటూ.. వయోజనుల్లో 94 శాతం మందికి నేడు బ్యాంక్ ఖాతా ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. చట్టాలు, నిబంధనలు కేవలం చట్టవిరుద్ధమైన వాటినే లక్ష్యంగా చేసుకోవాలన్నారు. అంతేకానీ, నిజాయితీ పరులను ఇబ్బంది పెట్టకూడదన్నారు. మనీలాండరింగ్ (నల్లధన చలామణి), ఉగ్రవాదులకు నిధులు అందకుండా ఆర్థిక వ్యవస్థను భద్రంగా కొనసాగించేందుకు వీలుగా.. విధాన నిర్ణేతలు అత్యుత్సాహ చర్యలకు దూరంగా ఉండాలన్నారు. రిస్క్ తీసుకునే ధోరణి ఆర్థిక వ్యవస్థకు ఫలితాన్నిస్తుందంటూ.. అదే సమయంలో ప్రజలు, వ్యాపారాలపై పడే ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. కస్టమర్లను అదే పనిగా మళ్లీ మళ్లీ కేవైసీ అప్‌డేషన్ కోసం ఒత్తిడి చేయొద్దని సూచించారు. టెక్నాలజీతో వ్యాపార సులభతర నిర్వహణ మెరుగుపడడమే కాకుండా.. మనీలాండరింగ్, అక్రమ రుణ వ్యాపార మార్గాలకు దారితీసినట్టు చెప్పారు. అక్రమ ఆర్థిక కార్యకలాపాలను అడ్డుకునేందుకు వీలుగా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉన్నట్టు ప్రకటించారు.

సుంకాల తగ్గింపుపై భారత్, అమెరికా దృష్టి



న్యూఢిల్లీ: దిగుమతి సుంకాలు, టారిఫ్ యేతర అవరోధాలను తగ్గించడంపై భారత్, అమెరికా మరింతగా దృష్టి పెడుతున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. ప్రస్తుతానికి భారత్‌పై అమెరికా ప్రతీకార టారిఫ్‌లను వర్తింపచేయడం లేదని పేర్కొన్నారు. ఇరు దేశాలకు ప్రయోజనకరంగా ఉండేలా ద్వైపాక్షిక బంధాలను మరింతగా మెరుగుపర్చుకోవడంపై అమెరికాతో కలిసి పని చేస్తున్నట్లు మంత్రి వివరించారు. డబ్ల్యూటీవో 2023 ప్రకారం భారత్ సగటు టారిఫ్ రేటు 17 శాతంగాను, వ్యవసాయోత్పత్తులపై 39 శాతం, పారిశ్రామికోత్పత్తులపై 13.5 శాతంగా నమోదైందని పేర్కొన్నారు. 2025-26 బడ్జెట్ తర్వాత సగటు పారిశ్రామిక టారిఫ్ 10.66 శాతంగా ఉన్నట్లు వివరించారు.

యూకే అండ్ కో తో రీపోస్ మ్యాట్రెస్ ఒప్పందం




హైదరాబాద్: మిడ్-టు-ప్రీమియం పరుపుల తయారీ సంస్థ రీపోస్ మ్యాట్రెస్.. కుటుంబ వ్యాపార సలహా సంస్థ 'యూకే అండ్ కో'తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. వ్యాపార అభివృద్ధి, విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఒప్పందాన్ని చేసుకున్నట్లు కంపెనీ తెలిపింది. యూకే అండ్ కో సంస్థ విలువైన సలహాలు వ్యాపారాన్ని మరింత ముందుకు తీసుకెళ్తాయని రీపోస్ మ్యాట్రెస్ మేనేజింగ్ డైరెక్టర్ బాలచందర్ ఎస్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పంద కార్యక్రమంలో యూకే అండ్ కో వ్యవస్థాపకుడు ఉల్లాస్ కామత్, రీపోస్ మ్యాట్రెస్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామనాథ్ భట్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులకు అంతరాయం

న్యూఢిల్లీ: యూపీఐ వ్యవస్థలో సమస్యలు తలెత్తడంతో బుధవారం కొద్ది సేపు డిజిటల్ లావాదేవీలకు అంతరాయం ఏర్పడింది. సుమారు గంట సేపు నిల్చిపోవడంతో, సర్వీసు లోపాలను ట్రాక్ చేసే డౌన్‌డిటెక్టర్ ప్లాట్‌ఫామ్‌లో యూజర్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సాంకేతికత సమస్యల వల్ల ఏకీకృత చెల్లింపుల వ్యవస్థ (యూపీఐ)పై పాక్షికంగా ప్రభావం పడిందని, ఆ తర్వాత సిస్టంను సరిచేశామని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తెలిపింది. డిజిటల్ చెల్లింపులకు సంబంధించి బ్యాంకు అకౌంట్లకు నగదును తక్షణం బదలాయించేందుకు ఉపయోగపడే యూపీఐ వ్యవస్థను ఎన్‌పీసీఐ నిర్వహిస్తోంది.

జేపీపై అదానీ గ్రూప్ కన్ను

దివాల చట్టం ద్వారా కొనుగోలుకి రెడీ



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ గ్రూప్ అదానీ తాజాగా మౌలిక రంగ సంస్థ జేపీ అసోసియేట్స్(జేఏఎల్)పై దృష్టి పెట్టింది. దివాల పరిష్కార ప్రక్రియలో భాగంగా జేపీ గ్రూప్ సంస్థ జేఏఎల్‌ను కొనుగోలు చేయాలని చూస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. 2024 జూన్3న జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) అలహాబాద్ బెంచ్ ఆదేశాల ప్రకారం జేఏఎల్ దివాల చట్ట పరిధిలోకి చేరింది. దీంతో దివాలా పరిష్కరా చర్యలకు తెరలేచింది. ఈ నేపథ్యంలో అదానీ గ్రూప్ ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) బిడ్ దాఖలు చేసినట్లు తెలుస్తోంది. బిజినెస్‌లను విడదీయకుండా ఏకమొత్తంగా కంపెనీ(జేఏఎల్)పై దివాల పరిష్కార ప్రక్రియను చేపట్టేందుకు ఎన్‌సీఎల్‌టీ ఈ నెల మొదట్లో ఆదేశించింది. 2025 ఫిబ్రవరి 20కల్లా జేఏఎల్ చెల్లించవలసిన రుణాల విలువ రూ. 55,493 కోట్లను దాటింది. చెల్లించవలసిన రుణాలను జాతీయ ఆస్తుల పునర్‌నిర్మాణ కంపెనీ(ఎన్ఏఆర్‌సీఎల్)కు రుణదాతల కన్సార్షియం బదిలీ చేసినట్లు ఇటీవల జేఏఎల్ వెల్లడించింది. రుణదాతల కన్సార్షియంలో బ్యాంకింగ్ దిగ్గజాలు ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, ఐడీబీఐ, యాక్సిస్, కెనరా, పీఎస్‌బీ, యుకో, బీవోఎం, కరూర్ వైశ్యా, బీవోఐ, ఇండస్ఇండ్, బీవోబీ, ఎగ్జిమ్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ తదితరాలున్నాయి. అయితే ఎన్ఏఆర్‌సీఎల్‌కు బదిలీ చేసిన రుణాల విలువ వెల్లడికాలేదు. జేఏఎల్ దివాల పరిష్కార ప్రక్రియను నిర్వహించేందుకు భువన్ మదన్ ఎంపికయ్యారు. కాగా.. జేపీ గ్రూప్ సంస్థ జేపీ ఇన్‌ఫ్రాటెక్‌ను దివాల ప్రక్రియ ద్వారా ఇంతక్రితం ముంబైకి చెందిన సురక్షా గ్రూప్ సొంతం చేసుకున్న విషయం విదితమే.

నిస్సాన్ నుంచి త్వరలో రెండు కొత్త వాహనాలు



చెన్నై: వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి నాళ్లలో రెండు కొత్త వాహనాలను ప్రవేశపెట్టనున్నట్లు దిగ్గజం నిస్సాన్ మోటర్స్ వెల్లడించింది. ఇందులో 5 సీటర్ కాంపాక్ట్-స్పోర్ట్స్ యుటిలిటీ వాహనం, 7 సీటర్ బీ-మల్టీ-పర్పస్ వాహనం ఉంటాయని తెలిపింది. భారత్‌లో కస్టమర్ల ఆకాంక్షలకు అనుగుణంగా, అత్యధిక వృద్ధి నమోదవుతున్న సెగ్మెంట్లలో మరిన్ని ఉత్పత్తులను ఆవిష్కరించే వ్యూహంలో భాగంగా వీటిని ప్రవేశపెడుతున్నట్లు కంపెనీ వివరించింది. రూ. 5,300 కోట్ల పెట్టుబడితో రెండు చిన్న ఎలక్ట్రిక్ కార్లు సహా మొత్తం ఆరు కొత్త వాహనాలను ప్రవేశపెట్టడంతో పాటు చెన్నైలోని తయారీ ప్లాంటును ఆధునీకరిస్తున్నట్లు 2023 ఫిబ్రవరిలో రెనో-నిస్సాన్ కూటమి వెల్లడించింది. కొత్త వాహనాల్లో నిస్సాన్, రెనోకు చెరి మూడు చొప్పున ఉంటాయి.

ప్రైవేటు పెట్టుబడులు పుంజుకోవాలి

- అంతర్జాతీయ రిస్కులను అధిగమించొచ్చు
- ఆర్థిక శాఖ ఫిబ్రవరి నివేదిక విడుదల
- వినియోగం, వృద్ధి బలపడతాయని అంచనా



న్యూఢిల్లీ: అంతర్జాతీయ సమాజం నుంచి ఎదురయ్యే రిస్కులను తట్టుకుని, బలమైన వృద్ధితో ముందుకెళ్లేందుకు దేశంలో ప్రైవేటు పెట్టుబడులు పెరగాల్సిన అవసరాన్ని ఆర్థిక శాఖ ప్రస్తావించింది. బలమైన, స్థిరమైన ఆర్థిక వ్యవస్థ నుంచి ప్రైవేటు రంగం ప్రయోజనం పొందాలని సూచించింది. తమ పెట్టుబడుల వ్యయాలు-వినియోగ డిమాండ్ మధ్య ఉండే సంబంధాన్ని పరిశ్రమ గుర్తించడం అవసరమని పేర్కొంది. ఈ మేరకు ఫిబ్రవరి నెల ఆర్థిక సమీక్షా నివేదికను కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసింది. బడ్జెట్‌లో ఆదాయపన్ను పరంగా కల్పించిన ఉపశమనం, ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపుతో వినియోగం పుంజుకుంటుందని అంచనా వేసింది. ఈ సంకేతాలను ప్రైవేటు రంగం గుర్తించి సామర్థ్య విస్తరణపై పెట్టుబడులతో ముందుకు రావాలని పిలుపునిచ్చింది. అప్పుడు 2025-26లో బలమైన ఆర్థిక వృద్ధి సాధ్యపడుతుందని అంచనా వేసింది. ''వ్యక్తిగత ఆదాయపన్ను నిర్మాణంలో చేసిన మార్పులతో మధ్యతరగతి ప్రజల చేతుల్లో ఖర్చు చేసే ఆదాయం మిగులు పెరుగుతుంది. ఇది వినియోగాన్ని పెంచుతుంది. ఫిబ్రవరిలో ఆర్‌బీఐ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించడం, మెరుగైన లిక్విడిటీ పరిస్థితులు వృద్ధిని ఊతమిస్తాయి''అని ఆర్థిక శాఖ తన అభిప్రాయాలను పేర్కొంది.

దీర్ఘకాల చర్యలు ఫలితమిస్తాయి..

దీర్ఘకాల అభివృద్ధికి సంబంధించి చేపట్టిన చర్యలు, సంస్కరణలు, వికసిత్ భారత్ ఆకాంక్ష.. అంతర్జాతీయ అనిశ్చితుల్లోనూ దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండడం విశ్వాసాన్ని పెంపొందిస్తాయని ఆర్థిక శాఖ నివేదిక పేర్కొంది. ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో ఏడు నెలల కనిష్టానికి తగ్గడాన్ని ప్రస్తావించింది. 2024-25లో రికార్డు స్థాయి పంటల దిగుబడి రానున్న నెలల్లో ద్రవ్యోల్బణం మోస్తరు స్థాయికి దిగొచ్చేందుకు సాయపడుతుందని అంచనా వేసింది. ప్రధాన వస్తు ఎగుమతులు 2024-25లో 8.2 శాతం పెరగడాన్ని గుర్తు చేసింది. అదే ఏడాది విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) 12.4 శాతం వృద్ధి చెందినట్టు పేర్కొంది. ప్రస్తుతమున్న విదేశీ మారకం నిల్వలు 11 నెలల దిగుమతి అవసరాలకు సరిపోతాయని తెలిపింది. అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య విధానాల్లో మార్పులను (టారిఫ్‌లు) ప్రస్తావిస్తూ.. అలాంటి తరుణంలోనూ 2024-25లో డిసెంబర్ (క్యూ3) త్రైమాసికంలో జీడీపీ వృద్ధి కోలుకోవడాన్ని ఈ నివేదిక గుర్తు చేసింది. ప్రైవేటు వినియోగం పుంజుకోవడం, కీలక వస్తు ఎగుమతులు పెరగడం మేలు చేసినట్టు తెలిపింది. ''బలమైన వ్యవసాయ కార్యకలాపాలు గ్రామీణ డిమాండ్‌కు మద్దతునిస్తాయి. 2024-25 చివరి త్రైమాసికంలోనూ ఆర్థిక కార్యకలాపాలు పుంజుకున్నట్టు ముఖ్యమైన సంకేతాలు సూచిస్తున్నాయి''అని వివరించింది. అలాగే, ఎగుమతులు మెరుగుపడడం, ప్రభుత్వ మూలధన వ్యయాలను పెంచడం ఇందుకు మద్దతునిస్తాయని అభిప్రాయపడింది. సేవల రంగం పనితీరు సైతం బలంగా ఉన్నట్టు తెలిపింది. అంతర్జాతీయంగా అనిశ్చితులు ఉన్నప్పటికీ 2024-25లో 6.5 శాతం వృద్ధి నమోదవుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. వృద్ధి రేటు సెప్టెంబర్ త్రైమాసికంలో నమోదైన 5.6 శాతం నుంచి డిసెంబర్ క్వార్టర్‌లో 6.2 శాతానికి పెరగడాన్ని గుర్తు చేసింది. ద్రవ్య స్థిరీకరణ, సంక్షేమం, వృద్ధి పరంగా ఆర్థిక వ్యవస్థలో చక్కని సమతుల్యత కొనసాగుతున్నట్టు ఈ నివేదిక తెలిపింది.


సీఫెర్ట్

సీఫెర్ట్ సునామీ

- ఐదో టి20లో పాకిస్తాన్‌పై న్యూజిలాండ్ ఘనవిజయం
- 4–1తో సిరీస్ కైవసం

38 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్స్‌లతో 97 నాటౌట్



వెల్లింగ్టన్: ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ (38 బంతుల్లో 97 నాటౌట్; 6 ఫోర్లు, 10 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగడంతో పాకిస్తాన్‌తో బుధవారం జరిగిన చివరి టి20లో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4–1తో హస్తగతం చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. కెప్టెన్ సల్మాన్ ఆఘా (39 బంతుల్లో 51; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీ సాధించగా... షాదాబ్ ఖాన్ (28; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. హారిస్ (11), నవాజ్ (0), యూసుఫ్ (7), ఉస్మాన్ ఖాన్ (7), అబ్దుల్ సమద్ (4) విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో నీషమ్ 5 వికెట్లతో విజృంభించగా... జాకబ్ డఫీ 2 వికెట్లు తీశాడు. అనంతరం లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ 10 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 131 పరుగులు చేసి గెలిచింది. తొలి బంతి నుంచే సీఫెర్ట్ వీరవిహారం చేయగా... ఫిన్ అలెన్ (12 బంతుల్లో 27; 5 ఫోర్లు, 1 సిక్స్) ఉన్నంతసేపు ధాటిగా ఆడాడు. పాక్ బౌలర్లలో ముఖీమ్ 2 వికెట్లు తీశాడు. నీషమ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', సీఫెర్ట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య శనివారం తొలి వన్డే జరుగుతుంది.

బాదుడే బాదుడు...

స్వల్ప లక్ష్యఛేదనకు దిగిన న్యూజిలాండ్ తొలి ఓవర్ నుంచే పాక్ బౌలర్లపై ప్రతాపం చూపింది. తొలి ఓవర్‌లో సీఫెర్ట్ 4, 6, 6 కొడితే... రెండో ఓవర్‌లో అలెన్ 4, 4, 6 బాదాడు. మూడో ఓవర్‌లో సీఫెర్ట్ 4, 6... నాలుగో ఓవర్లో ఇద్దరు కలిసి 3 ఫోర్లు కొట్టడంతో స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. జహాందాద్ ఖాన్ వేసిన ఆరో ఓవర్‌లో సీఫెర్ట్ 6, 4, 6, 2, 6, 1 కొట్టడంతో 23 బంతుల్లోనే అతడి హాఫ్‌సెంచరీ పూర్తయింది. పాక్ యువ బౌలర్ ముఖీమ్ రెండు ఓవర్లలో 6 పరుగులే ఇచ్చి 2 వికెట్లు తీసినప్పటికీ... సీఫెర్ట్ జోరును మాత్రం అడ్డుకోలేకపోయాడు. షాదాబ్ వేసిన పదో ఓవర్‌లో 6, 6, 6, 6 కొట్టిన సీఫెర్ట్ మ్యాచ్‌ను ముగించాడు.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: హారిస్ (బి) హే (బి) సియర్స్ 11; నవాజ్ (సి) నషీమ్ (బి) డఫీ 0; యూసుఫ్ (సి) హే (బి) డఫీ 7; సల్మాన్ ఆఘా (సి) చాప్‌మన్ (బి) నీషమ్ 51; ఉస్మాన్ ఖాన్ (సి) మిచెల్ (బి) సోధి 7; అబ్దుల్ సమద్ (సి) హే (బి) నీషమ్ 4; షాదాబ్ ఖాన్ (సి) హే (బి) నీషమ్ 28; జహాందాద్ ఖాన్ (సి) రూర్కె (బి) నీషమ్ 1; రవుఫ్ (నాటౌట్) 6; ముఖీమ్ (సి) బ్రేస్‌వెల్ (బి) నీషమ్ 0; అలీ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 128. వికెట్ల పతనం:** 1–5, 2–23, 3–25, 4–43, 5–52, 6–106, 7–108, 8–121, 9–123. **బౌలింగ్:** రూర్కె 4–0–29–0; డఫీ 4–0–18–2; సియర్స్ 4–0–25–1; సోధి 4–0–32–1; నీషమ్ 4–0–22–5.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సీఫెర్ట్ (నాటౌట్) 97; అలెన్ (బి) ముఖీమ్ 27; చాప్‌మన్ (స్టంప్డ్) హారిస్ (బి) ముఖీమ్ 3; మిచెల్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (10 ఓవర్లలో 2 వికెట్లకు) 131. వికెట్ల పతనం:** 1–93, 2–103. **బౌలింగ్:** జహాందాద్ ఖాన్ 2–0–43–0; మొహమ్మద్ అలీ 2–0–27–0; రవూఫ్ 2–0–22–0; ముఖీమ్ 2–0–6–2; షాదాబ్ ఖాన్ 2–0–33–0.

కోలుకున్న అయూబ్

కరాచీ: పాకిస్తాన్ యువ ఓపెనర్ సయీమ్ అయూబ్ గాయం నుంచి కోలుకున్నాడు. దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డ అయూబ్... మూడు నెలలుగా ఆటకు దూరమయ్యాడు. సొంతగడ్డపై జరిగిన చాంపియన్స్ ట్రోఫీకి దూరమైన అయూబ్... త్వరలో జరగనున్న పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)తో తిరిగి మైదానంలో అడుగుపెట్టనున్నాడు. మడమ గాయం నుంచి కోలుకున్న అయూబ్ ముందు ఫిట్‌నెస్ పరీక్ష నెగ్గాల్సి ఉంటుందని పీసీబీ వర్గాలు వెల్లడించాయి. 'అయూబ్ పీఎస్ఎల్‌లో పాల్గొనాలంటే లాహోర్‌లో కొన్ని ఫిట్‌నెస్ టెస్టుల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ప్రస్తుతానికి అతడి కాలి గాయం నయమైంది' అని పీసీబీ వర్గాలు తెలిపాయి.

త్రిష ఆల్‌రౌండ్ షో

బంతితో 3 వికెట్లు... బ్యాట్‌తో 93 పరుగులు ● సీనియర్ మహిళల చాలెంజర్ ట్రోఫీ



డెహ్రాడూన్: జాతీయ సీనియర్ చాలెంజర్ ట్రోఫీలో తెలంగాణ ఆల్‌రౌండర్ గొంగడి త్రిష (137 బంతుల్లో 93; 15 ఫోర్లు, 1 సిక్స్) సత్తా చాటింది. టీమ్ 'డి'కి ప్రాతినిధ్యం వహిస్తున్న త్రిష... టీమ్ 'సి'తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఎర్రబంతితో మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ మ్యాచ్‌లో బుధవారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి టీమ్ 'డి' 99 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసింది. త్రిష త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా... ధారా గుజ్జర్ (212 బంతుల్లో 103 బ్యాటింగ్; 15 ఫోర్లు) అజేయ శతకంతో చెలరేగింది. కెప్టెన్ స్నేహ్ రాణా (28; 3 ఫోర్లు), నందిని (32; 5 ఫోర్లు), అమన్‌జ్యోత్ కౌర్ (34 బంతుల్లో 39 బ్యాటింగ్; 6 ఫోర్లు) రాణించారు. అంతకుముందు టీమ్ 'సి' 405/9 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. హసబ్నిస్ (185 బంతుల్లో 169; 20 ఫోర్లు, 6 సిక్స్‌లు), షఫాలీ వర్మ (104 బంతుల్లో 108; 19 ఫోర్లు) సెంచరీలతో కదంతొక్కారు. టీమ్ 'డి' బౌలర్లలో త్రిష, కాశ్వీ గౌతమ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. నేడు ఆటకు ఆఖరి రోజు కాగా... ప్రస్తుతం చేతిలో 5 వికెట్లు ఉన్న టీమ్ 'డి'... ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 83 పరుగులు వెనుకబడి ఉంది. ధారా గుజ్జర్‌తో పాటు అమన్‌జ్యోత్ కౌర్ క్రీజులో ఉంది.

ఫాతిమా సారథ్యంలో...

లాహోర్: వచ్చే నెలలో సొంతగడ్డపై జరిగే మహిళల వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో పాల్గొనే పాకిస్తాన్ జట్టును బుధవారం ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన పాక్ జట్టుకు ఆల్‌రౌండర్ ఫాతిమా సనా నాయకత్వం వహిస్తుంది. వెటరన్ ఆల్‌రౌండర్ నిదా దర్‌కు ఈ జట్టులో స్థానం లభించలేదు. ఏప్రిల్ 9 నుంచి 19 వరకు జరిగే ఈ క్వాలిఫయింగ్ టోర్నీలో పాకిస్తాన్‌తోపాటు వెస్టిండీస్, బంగ్లాదేశ్, ఐర్లాండ్, థాయ్‌లాండ్, స్కాట్లాండ్ జట్లు పోటీపడతాయి. ఈ టోర్నీ నుంచి రెండు జట్లు ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తాయి.

పాకిస్తాన్ జట్టు: ఫాతిమా సనా (కెప్టెన్), మునీబా అలీ (వైస్ కెప్టెన్), అలియా రియాజ్, డయానా బేగ్, గుల్ ఫిరోజా, నాజియా అల్వీ, నష్రా సంధు, నటాలియా పర్వేజ్, ఒమైమా సొహైల్, రమీన్ షమీమ్, సాదియా ఇక్బాల్, షవాల్ జుల్ఫికర్, సిద్రా అమీన్, సిద్రా నవాజ్, సయ్యదా అరూబ్ షా.



పావోలిని ఘనత



ఫ్లోరిడా: మయామి ఓపెన్ డబ్ల్యూటీఏ–1000 టెన్నిస్ టోర్నీ చరిత్రలో సెమీఫైనల్‌కు చేరిన తొలి ఇటలీ మహిళా క్రీడాకారిణిగా జాస్మిన్ పావోలిని ఘనత సాధించింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ పావోలిని 6–3, 6–2తో మగ్దా లినెట్టి (పోలాండ్)పై గెలిచింది. గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో రన్నరప్‌గా నిలిచిన పావోలిని దుబాయ్ ఓపెన్‌లో టైటిల్ సాధించింది. నాలుగు దశాబ్దాల చరిత్ర కలిగిన మయామి ఓపెన్‌లో గతంలో ఆరుసార్లు ఇటలీ క్రీడాకారిణులు క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని అధిగమించలేకపోయారు. ఫైనల్లో స్థానం కోసం ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్)తో పావోలిని తలపడుతుంది. మరో క్వార్టర్ ఫైనల్లో సబలెంకా 6–2, 7–5తో కిన్‌వెన్ జెంగ్ (చైనా)పై గెలిచింది.

'మూడడుగులు వెనక్కి వెళ్లాం'

భారత ఫుట్‌బాల్ కోచ్ మార్క్వెజ్ తీవ్ర ఆగ్రహం



షిల్లాంగ్: ఆసియా కప్–2027 క్వాలిఫయింగ్ టోర్నీలో భాగంగా బంగ్లాదేశ్‌తో భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు ప్రదర్శన పట్ల టీమిండియా హెడ్ కోచ్ మనోలో మార్క్వెజ్ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశాడు. తన శిక్షణ మొదలైన రోజుల నుంచి పోలిస్తే మరో మూడడుగులు వెనక్కి వెళ్లినట్లుగా ఉందని అతను వ్యాఖ్యానించాడు. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్ 0–0తో 'డ్రా'గా ముగిసింది. బలహీన బంగ్లాదేశ్‌పై భారత్ ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. 'మా జట్టు చాలా చెత్తగా ఆడింది. తీవ్ర కోపం, నిరాశ కలుగుతున్నాయి. నా మనసులో ఉన్న అన్ని మాటలు ఇప్పుడే చెప్పలేకపోతున్నాను. నేను కోచ్‌గా వచ్చాక హైదరాబాద్‌లో మారిషస్‌తో ఇంటర్ కాంటినెంటల్ కప్ మ్యాచ్‌కు ముందు సాగిన ట్రెయినింగ్ సెషన్ నుంచి చూస్తే ఈ మ్యాచ్ ముందు వరకు ఏదో ఒక రూపంలో జట్టు ఆట మెరుగవుతూ వచ్చింది. కానీ ఈ మ్యాచ్‌తో మూడడుగులు వెనక్కి వెళ్లిపోయాం' అని మార్క్వెజ్ అన్నాడు. తొలి అర్ధభాగంలో జట్టు ప్రదర్శన మరీ ఘోరంగా ఉందని, రెండో అర్ధ భాగంలో కొంత మెరుగ్గా ఆడినా... విజయానికి అది సరిపోలేదని అతను విశ్లేషించాడు. కొంత మంది ప్రధాన ఆటగాళ్లు గాయాలతో దూరమైనా, దానిని సాకుగా చెప్పదల్చుకోలేదని మార్క్వెజ్ స్పష్టీకరించాడు. ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో స్ట్రయికర్ స్థానంలో భారత ఆటగాళ్లెవరూ ఆడటం లేదనే విషయాన్ని కూడా కోచ్ గుర్తు చేశాడు.

తొలిసారి పసిడి మెరుపులు

- సెపక్‌తక్రా ప్రపంచకప్ టోర్నీలో భారత్‌కు స్వర్ణ పతకం
- పురుషుల రెగూ ఈవెంట్‌లో విజేతగా నిలిచిన టీమిండియా

పట్నా: సెపక్‌తక్రా ప్రపంచకప్‌లో భారత జట్టు చాంపియన్‌గా నిలిచింది. బీహార్ రాజధాని పట్నా వేదికగా జరిగిన వరల్డ్‌కప్‌లో పురుషుల రెగూ ఈవెంట్‌లో భారత జట్టు స్వర్ణ పతకం సాధించింది. సెపక్‌తక్రా ప్రపంచకప్‌లో భారత్‌కు ఇదే తొలి పసిడి పతకంకాగా... స్వదేశంలో జరిగిన ఈ టోర్నీలో మన ప్లేయర్లు మొత్తం 7 పతకాలు సాధించారు. పురుషుల 'రెగూ' ఫైనల్లో భారత్ 11–15, 15–11, 17–14 తేడాతో జపాన్‌పై విజయం సాధించి బంగారు పతకం కైవసం చేసుకుంది. తొలి సెట్‌లో ఓడి వెనుకబడిన భారత జట్టు ఆ తర్వాత పుంజుకొని వరుసగా రెండు సెట్‌లు నెగ్గి విజేతగా నిలిచింది. దేశంలో పెద్దగా ఆదరణ లేని ఈ క్రీడలో భారత జట్టు చక్కటి ప్రదర్శన కనబర్చింది. కేవలం స్వర్ణంతో సరిపెట్టుకోకుండా... ఈ వరల్డ్‌కప్‌లో మరో 6 పతకాలు కూడా గెలుచుకుంది. మహిళల డబుల్స్ విభాగంలో రజతం... పురుషుల డబుల్స్, మహిళల రెగూ, మిక్స్‌డ్ క్వాడ్, మహిళల క్వాడ్, పురుషుల క్వాడ్ విభాగాల్లో కాంస్య పతకాలు నెగ్గింది. 'స్వదేశంలో జరిగిన సెపక్‌తక్రా ప్రపంచకప్‌లో చక్కటి ప్రదర్శన కనబర్చిన బృందానికి అభినందనలు. రెగూ జట్టు స్వర్ణంతో పాటు మొత్తం 7 పతకాలు సాధించి భవిష్యత్తుపై భరోసా పెంచింది' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.



మళ్లీ వాయిదాపడ్డ భారత బాక్సింగ్ సమాఖ్య ఎన్నికలు

న్యూఢిల్లీ: భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి. ఈ నెల 28న బీఎఫ్ఐ ఎన్నికలు జరగాల్సి ఉండగా... సమయాభావం వల్ల వాయిదా వేసినట్లు సమాఖ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టులు ఆదేశించిన నేపథ్యంలో ఈనెల 28న వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) నిర్వహించాలని బీఎఫ్ఐ నిర్ణయించింది. అయితే తక్కువ సమయం ఉండటంతో అది సాధ్యపడలేదు. 'బీఎఫ్ఐ ఏజీఎం వాయిదా పడింది. ఎప్పుడు నిర్వహిస్తామో త్వరలోనే వెల్లడిస్తాం' అని బీఎఫ్ఐ పేర్కొంది. ఈ నెల 21న న్యాయస్థానాల ఆదేశాలతో 28న ఆఫీస్ బేరర్ల ఎన్నికలు నిర్వహించేందుకు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆర్కే గౌబాను రిటర్నింగ్ అధికారిగా నియమించారు. వాస్తవానికి ఫిబ్రవరి 2కు ముందే ఈ ప్రక్రియ పూర్తి కావాల్సింది. కానీ సమాఖ్యలో గందరగోళంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ప్రస్తుతం అజయ్ సింగ్ బీఎఫ్ఐ అధ్యక్షుడిగా కొనసాగుతుండగా... కేంద్ర మాజీ క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ ఈ పదవిపై ఆసక్తితో ఉన్నారు.

ఫైనల్లో పూజా రాణి

గ్రేటర్ నోయిడా: జాతీయ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ 80 కేజీల విభాగంలో హరియాణా బాక్సర్ పూజా రాణి ఫైనల్లోకి దూసుకెళ్లింది. రైల్వేస్‌కు చెందిన అనుపమాతో జరిగిన సెమీఫైనల్లో పూజా రాణి 4–2తో గెలిచింది. ఫైనల్లో ఆలిండియా పోలీస్‌కు చెందిన లాల్‌ఫాక్మావి రాల్టెతో పూజా రాణి తలపడుతుంది. 60 కేజీల విభాగంలో సోనియా లాథెర్... 57 కేజీల విభాగంలో జైస్మీన్... 48 కేజీల విభాగంలో మీనాక్షి... 51 కేజీల విభాగంలో అనామిక హుడా కూడా ఫైనల్లోకి ప్రవేశించారు.





అటు అర్జెంటీనా ఇటు ఇరాన్

- ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు క్వాలిఫై
- బ్రెజిల్‌పై 4–1తో గెలుపొందిన అర్జెంటీనా



బ్యూనస్ ఎయిర్స్: తమ కెప్టెన్... దిగ్గజ ప్లేయర్ లయోనల్ మెస్సీ లేకపోయినా... అర్జెంటీనా జోరు తగ్గించలేదు. ఐదుసార్లు విశ్వవిజేత బ్రెజిల్ జట్టును అలవోకగా ఓడించిన అర్జెంటీనా దర్జాగా ప్రపంచకప్ టోర్నమెంట్‌కు 19వసారి అర్హత సాధించింది. దక్షిణ అమెరికా జోన్ నుంచి ప్రపంచకప్ టోర్నీకి ఆరు జట్లకు నేరుగా అర్హత పొందే అవకాశం ఉంది. తొలి బెర్త్‌ను డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా జట్టు సొంతం చేసుకుంది. వాస్తవానికి బ్రెజిల్ జట్టుతో మ్యాచ్‌కు ముందే అర్జెంటీనాకు వరల్డ్‌కప్ బెర్త్ ఖరారైంది. ఉరుగ్వే జట్టుతో మ్యాచ్‌ను బొలీవియా జట్టు 0–0తో 'డ్రా' చేసుకోవడంతో అర్జెంటీనాకు ప్రపంచకప్ బెర్త్ లభించింది. ఫలితంతో సంబంధం లేకుండా వరల్డ్‌కప్ బెర్త్ దక్కడంతో... బ్రెజిల్‌తో జరిగిన పోరులో అర్జెంటీనా అదరగొట్టింది. మెస్సీ గైర్హాజరీలో నికోలస్ ఒటామెండీ సారథ్యంలో బరిలోకి దిగిన అర్జెంటీనా 4–1 గోల్స్ తేడాతో బ్రెజిల్‌ను చిత్తుగా ఓడించింది. అర్జెంటీనా తరఫున జూలియన్ అల్వారెజ్ (4వ నిమిషంలో), ఎంజో ఫెర్నాండెజ్ (12వ నిమిషంలో), అలెక్సిస్ మాక్ అలిస్టర్ (37వ నిమిషంలో), గిలియానో సిమోన్ (71వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. బ్రెజిల్ జట్టుకు మాథ్యూస్ కున్హా (26వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. దక్షిణ అమెరికా జోన్ నుంచి మొత్తం 10 జట్లు (అర్జెంటీనా, ఈక్వెడార్, ఉరుగ్వే, బ్రెజిల్, పరాగ్వే, కొలంబియా, వెనిజులా, బొలీవియా, పెరూ, చిలీ) డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో పోటీపడుతున్నాయి. ఒక్కో జట్టు మిగతా జట్లతో రెండేసి మ్యాచ్‌లు ఆడుతుంది. ఇప్పటి వరకు 14 రౌండ్‌లు పూర్తయ్యాయి. ప్రస్తుతం అర్జెంటీనా 31 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మరో ఐదు బెర్త్‌లు ఖరారు కావాల్సి ఉన్నాయి. ఏడో స్థానంలో నిలిచిన జట్టుకు 'ప్లే ఆఫ్' మ్యాచ్ ద్వారా ప్రపంచకప్‌కు అర్హత పొందే అవకాశం లభిస్తుంది.

19 ప్రపంచకప్ టోర్నీకి ఇప్పటి వరకు అర్జెంటీనా 19 సార్లు అర్హత సాధించింది. మూడుసార్లు (1978, 1986, 2022) విజేతగా నిలిచింది. మరో మూడుసార్లు (1930, 1990, 2014) ఫైనల్లో ఓడి రన్నరప్‌తో సంతృప్తి పడింది. ఐదుసార్లు క్వార్టర్ ఫైనల్లో... నాలుగుసార్లు గ్రూప్ దశలో... మూడుసార్లు ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిపోయింది.

ఇరాన్ వరుసగా నాలుగోసారి...

మరోవైపు ఆసియా జోన్ నుంచి ఇరాన్ జట్టు వరుసగా నాలుగోసారి ప్రపంచకప్ టోర్నమెంట్‌కు అర్హత సాధించింది. ఉజ్బెకిస్తాన్ జట్టుతో జరిగిన మూడో రౌండ్ గ్రూప్ 'ఎ' మ్యాచ్‌ను ఇరాన్ జట్టు 2–2తో 'డ్రా' చేసుకుంది. 1978లో తొలిసారి ప్రపంచకప్‌లో ఆడిన ఇరాన్ ఆ తర్వాత 1998లో రెండోసారి ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడింది. 2006లో మూడోసారి ప్రపంచకప్‌లో ఆడిన ఇరాన్ 2010లో జరిగిన ప్రపంచకప్‌కు అర్హత సాధించలేదు. 2014లో నాలుగోసారి వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగిన ఇరాన్ ఆ తర్వాత 2018లో, 2022లోనూ పోటీపడింది. ఈసారి మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే ఓవరాల్‌గా ఏడోసారి ప్రపంచకప్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. 2026 ప్రపంచకప్ టోర్నీకి అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. తొలిసారి 48 జట్లు ప్రపంచకప్‌లో ఆడనున్నాయి. ఆసియా నుంచి 8 జట్లు నేరుగా అర్హత సాధిస్తాయి. ప్లే ఆఫ్ టోర్నీ ద్వారా మరో జట్టుకు అర్హత పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే మూడు (అమెరికా, కెనడా, మెక్సికో) ఆతిథ్య దేశాలతోపాటు జపాన్, ఇరాన్, న్యూజిలాండ్, అర్జెంటీనా జట్లు వరల్డ్‌కప్‌కు అర్హత పొందాయి. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీతో క్వాలిఫయింగ్ ప్రక్రియ పూర్తవుతుంది.

మాతృ వందన యోజనకు నిధులేవీ?

- గర్భిణులకు ఆర్థిక సాయం అందించాలి
- రాజ్యసభలో సోనియా గాంధీ డిమాండ్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ప్రధానమంత్రి మాతృ వందన యోజన(పీఎంఎంవీవై)కు నిధులు ఇవ్వడం లేదని రాజ్యసభలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ విమర్శించారు. గర్భిణుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని ప్రభుత్వానికి సూచించారు. ఆమె బుధవారం రాజ్యసభలో జీరో అవర్‌లో ఈ అంశంపై మాట్లాడారు. గర్భిణులకు ప్రయోజనకరమైన పథకానికి నిధులు ఇవ్వకుండా మొండిచెయ్యి చూపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. లబ్ధిదారుల సంఖ్య నానాటికీ పడిపోతోందని గుర్తుచేశారు. 2022–23లో 68 శాతం మంది గర్భిణులు కనీసం ఒక దఫా ప్రయోజనాలు అందుకున్నారని, 2023–24లో ఇది 12 శాతానికి పడిపోయిందన్నారు. ఇలా ఎందుకు జరిగిందో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో పీఎంఎంవీవైని ప్రత్యేకంగా ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలంటే ప్రతిఏటా కనీసం రూ.12,000 కోట్లు అవసరమని సోనియా గాంధీ వివరించారు. 2025–26 బడ్జెట్‌లో మాత్రం అరకొర నిధులే కేటాయించారని విమర్శించారు.

అమిత్ షాపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు: రాజ్యసభలో సోనియా గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ ఎంపీ జైరామ్ రమేశ్ బుధవారం సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బిల్లు–2024పై చర్చ సందర్భంగా అమిత్ షా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోకేవలం ఒక్క కుటుంబమే అధికారం చెలాయించిందని, అప్పటి కాంగ్రెస్ అధ్యక్షురాలు(సోనియా గాంధీ) కూడా ఆ కుటుంబంలో ఉన్నారని చెప్పారు. దీనిపై జైరామ్ రమేశ్ అభ్యంతరం వ్యక్తంచేశారు. అమిత్ షాపై సభా హక్కుల ఉల్లంఘన కింద చర్యలు చేపట్టాలని కోరుతూ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌కు నోటీసు అందజేశారు.



● కనువిందు చేస్తున్న పూలసోయగం

శ్రీనగర్‌లోని ప్రఖ్యాత తులిప్ గార్డెన్‌లో కనువిందు చేస్తున్న పుష్పాలు. ఆసియాలోనే అతి పెద్దదైన ఈ తోట బుధవారం నుంచి సందర్శకుల కోసం తెరుచుకుంది.

ఎన్ఐహెచ్ డైరెక్టర్‌గా జయ్ భట్టాచార్య

అమెరికా సెనేట్ ఆమోదం



న్యూయార్క్: భారతీయ–అమెరికన్ జయ్ భట్టాచార్యను కీలక పదవి వరించింది. ఆయనను అమెరికా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్(ఎన్ఐహెచ్) డైరెక్టర్‌గా డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ నియమించింది. ఈ నియామకాన్ని అమెరికా సెనేట్ మంగళవారం ఆమోదించింది. ఆయనకు అనుకూలంగా 53 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 47 ఓట్లు వచ్చాయి. అమెరికాలో ఆరోగ్య రంగంలో పరిశోధనలకు నిధులు అందజేసే అత్యున్నత సంస్థ ఎన్ఐహెచ్. భారత సంతతికి చెందిన జయ్ భట్టాచార్య ప్రస్తుతం స్టాన్‌ఫోర్డ్ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. అలాగే నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనామిక్స్ రీసెర్చ్‌లో రిసెర్చ్ అసోసియేట్‌గా సేవలందిస్తున్నారు. ఎన్ఐహెచ్ డైరెక్టర్ హోదాలో ఇకపై అమెరికా ఆరోగ్య శాఖ మంత్రి రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్‌తో ఆయన కలిసి పనిచేయబోతున్నారు. వైద్య రంగంలో జయ్ భట్టాచార్యకు అపార అనుభవం ఉంది. 2020 అక్టోబర్‌లో లాక్‌డౌన్ ప్రతిపాదనకు ప్రత్యామ్నాయంగా తెరపైకి తీసుకొచ్చిన గ్రేట్ బారింగ్టన్ డిక్లరేషన్‌లో ఆయన కీలక పాత్ర పోషించారు. ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్, లీగల్, మెడికల్, పబ్లిక్ హెల్త్ పాలసీ వంటి రంగాలపై ఎన్నో రచనలు చేశారు. ఎన్ఐహెచ్ డైరెక్టర్‌గా నియమితులైన జయ్ భట్టాచార్యకు స్టాన్‌ఫోర్డ్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ అభినందనలు తెలియజేసింది.

గాల్లో ఢీకొన్న యుద్ధ విమానాలు

ఫ్రెంచి వైమానిక విన్యాసాల్లో అపశ్రుతి

ఫ్రాన్సు: ఫ్రాన్సులో వైమానిక దళ విన్యాసాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. రెండు ఆల్ఫా జెట్ యుద్ధ విమానాలు గాల్లోనే ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒక పైలట్‌కు తీవ్ర గాయాలు కాగా, మరో పైలట్, ప్రయాణికుడు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. పౌరులకు ఎలాంటి ప్రాణహాని కలగలేదు. ఈశాన్య ఫ్రాన్స్‌లో వైమానిక స్థావరం సమీపంలో వైమానిక విన్యాసాల సందర్భంగా ఈ ప్రమాదం జరిగింది. వివిధ రంగులతో కూడిన ఆరు విమానాలు ఒకే మార్గంలో ప్రయాణిస్తున్నాయి. వెనక వరుసలో ఉన్న అకస్మాత్తుగా విమానం అదుపుతప్పి పక్క విమానాన్ని ఢీకొంది. దీంతో రెండూ కూలిపోయాయి. గాయపడిన ముగ్గురిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు రక్షణ మంత్రి సెబాస్టియన్ లెకోర్ను తెలిపారు. ఉక్రెయిన్ పైలట్లకు శిక్షణ ఇచ్చేందుకు ఫ్రాన్స్ తేలికపాటి ఆల్ఫా ట్విన్ ఇంజన్ విమానాలను ఉపయోగిస్తోందని ఆయన వెల్లడించారు. తూర్పు ఫ్రాన్స్‌లో గతేడాది కూడా రెండు రాఫెల్ జెట్లు గాల్లోనే ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు మరణించారు.

'అవిశ్వాసం' గట్టెక్కిన షినవత్రా

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ప్రధాని పెటోంగ్‌టార్న్ షినవత్రా అవిశ్వాస తీర్మానం నుంచి గట్టెక్కారు. తన తండ్రి, మాజీ ప్రధాని తక్సిన్ షినవత్రా చేతిలో ఆమె కీలుబొమ్మగా మారారన్న ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టారు. పార్లమెంటులో రెండు రోజుల చర్చ అనంతరం బుధవారం అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఓటింగ్‌లో గెలుపొందాక తన మద్దతుదారులకు షినవత్రా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కోసం కష్టపడి పనిచేయడానికి తనను, మంత్రివర్గాన్ని నడిపించే శక్తిగా అనుకూలురు, వ్యతిరేకులు ఉంటారని ఆమె పేర్కొన్నారు. ఫ్యూథాయ్ పార్టీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి అధిపతిగా ఆమె గతేడాది ప్రధాని అయ్యారు. 2014లో తిరుగుబాటుతో ఉద్వాసనకు గురైన తన అత్త తరువాత థాయ్‌లాండ్ రెండో మహిళా ప్రధానిగా గుర్తింపు పొందారు. పెటోంగ్‌టార్న్ తండ్రి తక్సిన్ షినవత్రా థాయ్ చరిత్రలో అత్యంత ప్రభావవంతమైన, వివాదాస్పదమైన రాజకీయ నాయకుడు.

హౌతీ దాడుల 'సిగ్నల్' ముచ్చట్లు బహిర్గతం

గ్రూప్‌చాట్ స్క్రీన్‌షాట్లను బయటపెట్టిన అట్లాంటిక్ మేగజైన్

వాషింగ్టన్: యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులపై దాడి వ్యూహాలను రహస్యంగా 'సిగ్నల్' యాప్ గ్రూప్‌చాట్‌లో చర్చిస్తూ పొరపాటున ఒక సీనియర్ పాత్రికేయుడిని ఆ గ్రూప్‌లో చేర్చుకున్న ఉదంతంలో అసలు ఆ గ్రూప్‌లో ఏం చర్చించారన్న వివరాలు బహిర్గతమయ్యాయి. సీనియర్ పాత్రికేయుడు జెఫ్రీ గోల్డ్‌బర్గ్ ఎడిటర్–ఇన్–చీఫ్‌గా ఉన్న 'ది అట్లాంటిక్' మేగజైన్ ఈ వివరాలను బుధవారం స్క్రీన్‌షాట్ల రూపంలో బయటపెట్టింది. ఈ గ్రూప్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, జాతీయ భద్రతా సలహాదారు మైకేల్ వాల్జ్, విదేశాంగ మంత్రి రూబియో, ఆర్థిక మంత్రి స్కాట్, రక్షణమంత్రి పీట్ హెగ్సెత్, హోంల్యాండ్ సెక్యూరిటీ సలహాదారు స్టీఫెన్ మిల్లర్‌సహా 19 మంది సభ్యులుగా ఉన్నారు. మార్చి 15వ తేదీ మధ్యాహ్నం 12.15 గంటల నుంచి ఏ సమయంలో ఎక్కడెక్కడ ఏ రకం బాంబులు, యుద్ధవిమానాలు, డ్రోన్లతో దాడిచేసేది రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ చాటింగ్‌లో పేర్కొన్నారు. దాడులను ప్రశంసిస్తూ మిగతావాళ్లు అమెరికా జెండాలు, పిడికిలి గుర్తు, ఎమోజీలను పోస్ట్‌చేశారు.

సభ ముందుకు నిఘా అధికారులు

లీకేజీ ఉదంతంపై ఉన్నతస్థాయి విచారణలో భాగంగా సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్, ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్ తదితరులు బుధవారం పార్లమెంట్ దిగువ సభలో ఇంటెలిజెన్స్ కమిటీ ఎదుట హాజరై వివరణ ఇవ్వనున్నారు. దేశం ఎదుర్కొంటున్న ముప్పులపై వార్షిక సమీక్షలో భాగంగా వీళ్లంతా వివరణ ఇచ్చుకోనున్నారు. ఇప్పటికే వీళ్లంతా మంగళవారం ఎగువసభ సెనేట్ ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. లీకేజీపై కొందరు డెమొక్రటిక్ పార్టీ సెనేటర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. లీకేజీని అధ్యక్షుడు ట్రంప్ అతిచిన్న పొరపాటుగా అభివర్ణించారు. గతంలో డెమొక్రటిక్ నాయకురాలు హిల్లరీ క్లింటన్ విదేశాంగ మంత్రిగా ఉన్న కాలంలో సొంత ఈ–మెయిల్ వాడినందుకే అత్యంత సున్నిత సమాచారం తస్కరణకు గురయ్యే ప్రమాదముందని తీవ్ర వివాదం రేపిన రిపబ్లికన్లు ఇప్పుడు లీకేజీ ఘటన అత్యంత అప్రాధాన్యమైన అంశమని కొట్టిపారేయడం గమనార్హం.

భారరహిత స్థితిలో బంతాట

- అత్యంత కీలక స్పేస్ ఆపరేషన్ల మధ్య వ్యోమగామి ఆటవిడుపు
- సోలోగా స్పేస్‌లో బేస్‌బాల్ ఆడిన కొయిచి వకాటా

వాషింగ్టన్: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో వ్యోమగామి అనగానే మనకు ఠక్కున గుర్తొచ్చేది ఒక్కటే. వందల కోట్ల వ్యయంతో అక్కడికెళ్లిన వ్యోమగామి ఎక్కువగా ప్రయోగాల్లో మునిగితేలుతారని భావిస్తాం. అందుకు భిన్నంగా బేస్‌బాల్ ఆడుతూ కనిపించి అవాక్కయ్యేలా చేశారు జపాన్ వ్యోమగామి కొయిచి వకాటా. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సంబంధిత 'స్పేస్ బేస్‌బాల్' వీడియోను తాజాగా 'ఎక్స్' ఖాతాలో పోస్ట్‌చేశారు. అంతరిక్షంలో భారరహిత స్థితిలో ఒంటరిగా ఉండకుండా సరదాగా బంతితో ఒక్కరమే ఎలా ఆడుకోవచ్చో వకాటా ఆడి చూపించారు. బేస్‌బాల్‌ను మంచి పిచ్ చూసుకుని విసిరి వెంటనే మళ్లీ ఆయనే బాల్ దూసుకెళ్తున్న దిశలో అంతకంటే వేగంగా కదిలి మళ్లీ బాల్‌ను బ్యాట్‌తో బాదారు. బ్యాట్‌తో కొట్టడంతో వ్యతిరేక దిశలో వెళ్తున్న బంతిని మళ్లీ ఆయనే ఇటు చివరకు దూసుకొచ్చి ఒడుపుగా పట్టుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది. '' జపాన్‌లో బేస్‌బాల్ ఎంఎల్‌బీ సీజన్ మొదలైంది. మైక్రోగ్రావిటీ స్థితిలో మనకు బేస్‌బాల్ టీమ్ మొత్తంతో పనిలేదు. ఒక్కరమే ఆట ఆడకోవచ్చు. బాల్ వేసేది మనమే. దానిని కొట్టేది మనమే. చివరకు పట్టేదీ మనమే'' అని వకాటా రాసుకొచ్చారు. భారరహిత స్థితిని ఎలా ఆస్వాదించాలో, కేవలం ఒక్కరున్నా బేస్‌బాల్‌ను ఎలా ఆడాలో ఆయన చూపించిన విధం చూసి నెటిజన్లు ఆశ్చర్యపోయారు. చాలా మంది మెచ్చుకున్నారు. అంతరిక్ష వాతావరణాన్ని క్రీడాస్థలిగానూ వినియోగించుచవచ్చని ఆయన నిరూపించారని కొందరు నెటిజన్లు వ్యాఖ్యానించారు. ''అంతరిక్ష క్రీడాకారుడు'' అంటూ మస్క్ పొగిడారు. దాదాపు 20 సంవత్సరాలపాటు వ్యోమగామిగా కొనసాగిన వకాటా 2024లో రిటైర్ అయ్యారు. ఐదుసార్లు ఐఎస్ఎస్‌కు వెళ్లి మొత్తంగా 500 రోజులపాటు అక్కడ గడిపారు. ఎక్స్‌పిడీషన్39లో భాగంగా అక్కడికెళ్లినప్పుడు ఐఎస్ఎస్‌కు కమాండర్‌గా చేసిన తొలి జపాన్ వ్యోమగామిగా రికార్డ్ నెలకొల్పారు. జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీ(జాక్సా)లో వ్యోమగామిగా సేవలందించారు.

లాయర్లతో జస్టిస్ వర్మ సంప్రదింపులు

న్యూఢిల్లీ: ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన వ్యవహారంపై విచారణను ఎదుర్కోవాల్సిన తీరుతెన్నులపై ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ న్యాయ సలహాలు తీసుకుంటున్నారు. ఇందుకోసం పలువురు సీనియర్ లాయర్లతో బుధవారం ఆయన తన నివాసంలో చర్చలు జరిపారు. లాయర్ల బృందంలో సిద్ధార్థ్ అగర్వాల్, మేనకా గురుస్వామి, అనుంధతీ కట్జూ, తారా నరూలా తదితరులున్నట్టు సమాచారం. ఈ ఉదంతంపై విచారణకు ఇద్దరు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, ఒక న్యాయమూర్తితో కూడిన కమిటీని సీజేఐ నియమించడం తెలిసిందే. జస్టిస్ వర్మ ఈ వారమే విచారణకు హాజరవాల్సి ఉంది.

ప్లాస్టర్ వేసి, కాళ్లూచేతులూ కట్టి... బతికుండగానే పూడ్చేశారు

- యోగ టీచర్ దారుణ హత్య
- మూడు నెలలకు వెలుగులోకి

రోహ్‌తక్: భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో యోగ శిక్షకున్ని సజీవంగా పూడ్చిపెట్టాడో వ్యక్తి. హరియాణాలో మూడు నెలల క్రితం జరిగిన ఈ దారుణం తాజాగా వెలుగులోకి వచ్చింది. జగ్‌దీప్ (45) ఓ యోగా శిక్షకుడు. రోహ్‌తక్‌కు చెందిన రాజ్‌కరణ్ అనే వ్యక్తి భార్యకు యోగా నేర్పుతున్నాడు. మూడు నెలలుగా జగ్‌దీప్ కన్పించకుండా పోయాడు. దాంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాజ్‌కిరణ్‌తో కలిసి జగ్‌దీప్‌ను కిడ్నాప్ చేసి చంపేసినట్టు వాళ్లు అంగీకరించారు. నోటికి ప్లాస్టిక్ వేసి, కాళ్లూచేతులూ కట్టేసి చర్ఖీ దాద్రీ గ్రామ సమీపంలో ఏడడుగుల గుంతలో సజీవంగా పాతిపెట్టినట్టు వెల్లడించారు! మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం పంపారు. రాజ్‌కిరణ్ కోసం గాలిస్తున్నారు.

యుద్ధం తక్షణం ఆపండి!

- హమాస్‌పై పాలస్తీనియన్ల ఆగ్రహం
- గాజా వీధుల్లో భారీ నిరసన ప్రదర్శనలు
- బలప్రయోగంతో చెదరగొట్టిన మిలిటెంట్లు



హమాస్‌కు వ్యతిరేకంగా బుధవారం నిరసన ప్రదర్శనకు దిగిన పాలస్తీనావాసులు

కైరో: ఏడాదిన్నరకు పైగా సాగుతున్న యుద్ధంతో విసిగిపోయిన పాలస్తీనియన్లు హమాస్ ఉగ్ర సంస్థపై కన్నెర్రజేశారు. ఇజ్రాయెల్‌తో యుద్ధానికి తక్షణమే ముగింపు పలకాలని డిమాండ్ చేశారు. హమాస్‌కు వ్యతిరేకంగా అతి పెద్ద నిరసన ప్రదర్శనకు దిగారు. 'హమాస్ గెటౌట్' అంటూ వీధుల్లోకి వచ్చి మరీ నినాదాలతో హోరెత్తించారు. 'యుద్ధాన్ని ఆపండి', 'పాలస్తీనా పిల్లలు బతకాలనుకుంటున్నారు', 'మేమెందుకు చావాలి? మాకు చావాలని లేదు', 'మా పిల్లల రక్తం అంత చౌకైనది కాదు' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ''ప్రజలు అలసిపోయారు. గాజాపై హమాస్ అధికారాన్ని వదులుకోవడమే యుద్ధానికి పరిష్కారమైతే అలాగే కానివ్వండి. ప్రజలను కాపాడేందుకు హమాస్ ఎందుకు అధికారాన్ని వదులుకోదు?'' అంటూ నిలదీశారు. 'ప్రజలు హమాస్‌ను గద్దె దించాలనుకుంటున్నారు' అంటూ నినాదాలు చేశారు. మంగళవారం మొదలైన నిరసనలు బుధవారం గాజాలో మరిన్ని ప్రాంతాలకు పాకాయి! టెలిగ్రాం ద్వారా ఆందోళనకు పిలుపులు అందుకున్న ప్రజలు భారీగా నిరసనల్లో పాల్గొన్నారు. వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. హమాస్, ఇజ్రాయెల్‌తో పాటు యుద్ధానికి తెర దించడంలో విఫలమవుతున్న అరబ్ దేశాలపైనా నిరసనకారులు మండిపడ్డారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి అనంతరం గాజాలో ఇదే అతి పెద్ద ఆందోళన.

జాబాలియా, బెయిట్ లహియా తదితర చోట్ల జరిగిన నిరసనలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ''ఇవేమీ రాజకీయ నిరసనలు కావు. మా జీవితాలకు సంబంధించిన విషయమిది'' అని బెయిట్ హనూన్‌కు చెందిన మొహమ్మద్ అబూ సకర్ అన్నాడు. ఆయన ముగ్గురు పిల్లల తండ్రి. తామంతా నిత్యం ప్రాణభయంతో వణికిపోతున్నామంటూ ఆవేదన వెలిబుచ్చాడు. అందుకే మరో దారిలేక నిరసనలకు దిగాల్సి వచ్చిందని చెప్పుకొచ్చాడు. ''ఈ హత్యాకాండకు, సొంత గడ్డపైనే శరణార్థులుగా బతకాల్సిన దుస్థితికి అడ్డుకట్ట వేసి తీరతాం. అందుకు ఎంతటి మూల్యమైనా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాం'' అని ప్రకటించాడు.

రెండు నెలల కాల్పుల విరమణ అనంతరం గాజాపై ఇజ్రాయెల్ తిరిగి భారీ బాంబు దాడులు ప్రారంభించడం తెలిసిందే. నిరసన ప్రదర్శనలపై హమాస్ ఉక్కుపాదం మోపింది. ముసుగులు ధరించిన సాయుధ హమాస్ మిలిటెంట్లు తుపాకులు, లాఠీలతో నిరసనకారులపై విరుచుకుపడ్డారు. అనేక మందిని కొట్టారని సమాచారం. 17 నెలల పై చిలుకు ఇజ్రాయెల్, హమాస్ యుద్ధం గాజాను శిథిలావస్థకు చేర్చింది. మార్చి 2న గాజాకు సహాయ సామగ్రి పంపిణీని ఇజ్రాయెల్ మళ్లీ అడ్డుకోవడంతో పరిస్థితులు మరింత దిగజారాయి.

బ్యాంకింగ్ చట్టాల(సవరణ) బిల్లుకు పార్లమెంట్ ఆమోద ముద్ర

న్యూఢిల్లీ: బ్యాంకింగ్ చట్టాలు(సవరణ) బిల్లు–2024కు పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. ఈ బిల్లు లోక్‌సభలో గత ఏడాది డిసెంబర్‌లో ఆమోదం పొందింది. రాజ్యసభలో మూజువాణి ఓటుతో బుధవారం ఆమోదించారు. ఈ బిల్లు ప్రకారం.. బ్యాంకు ఖాతా ఉన్నవారు నలుగురు నామినీలను రిజిస్టర్ చేసుకోవచ్చు. అలాగే బ్యాంకులో వ్యక్తుల సబ్‌స్టాన్షియల్ ఇంటరెస్ట్ అనే పదాన్ని మరోసారి నిర్వచించారు. దీనికి సంబంధించిన పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.2 కోట్లకు పెంచారు. అలాగే సహకార బ్యాంకుల డైరెక్టర్ల పదవీ కాలాన్ని 8 ఏళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. బ్యాంకింగ్ చట్టాలు(సవరణ) బిల్లు–2024పై రాజ్యసభలో జరిగిన చర్చ సందర్భంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడారు. దేశంలో నిరర్థక ఆస్తులు(ఎన్‌పీఏ) క్రమంగా తగ్గుతున్నాయని చెప్పారు. అయినప్పటికీ ఉద్దేశపూర్వక ఎగవేతదారులపై కఠిన చర్యలు తీసుకొనేందుకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. రుణాల రద్దు విషయంలో విపక్షాలు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. రైటాఫ్ అంటే రుణాలను పూర్తిగా రద్దు చేసినట్లు కాదని తేల్చిచెప్పారు. రుణాలను తిరిగి వసూలు చేయడానికి బ్యాంకులు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు రికార్డు స్థాయిలో రూ.1.41 లక్షల కోట్ల లాభాలు ఆర్జించాయని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ లాభాలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

తప్పుదోవ పట్టించే ప్రకటనలను అడ్డుకోవాల్సిందే

రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: తప్పుదోవ పట్టించే ప్రకటనలు సమాజానికి ఎంతో హాని కలిగిస్తున్నాయని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. ఇలాంటి ప్రకటనలకు అడ్డుకట్ట వేయాల్సిందేనని తేల్చిచెప్పింది. ప్రజలను మభ్యపెట్టి మోసం చేసే ప్రకటనలపై వచ్చే ఫిర్యాదుల పరిష్కరించడానికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఇందుకు రెండు నెలలపాటు గడువు విధించింది. గడువులోగా యంత్రాంగాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టంచేసింది. తప్పుడు ప్రకటనలను అరికట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. తప్పుదోవ పట్టించే ప్రకటనలను అరికట్టి, అమాయక ప్రజలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేసింది. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ యాక్ట్–1954 కింద నిషేధించిన అభ్యంతర ప్రకటనలపై ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఈ చట్టం వచ్చి 70 ఏళ్లవుతున్నా ఇప్పటికీ సక్రమంగా అమలు కాకపోవడం ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది.

నేనూ గ్రీన్‌ల్యాండ్ వెళ్తా: వాన్స్

విమర్శలను పట్టించుకోని ఉపాధ్యక్షుడు

వాషింగ్టన్: డెన్మార్క్‌లో స్వయంప్రతిపత్తి గల 'గ్రీన్‌ల్యాండ్'ను కొనేందుకు సిద్ధమంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న వేళ డెన్మార్క్ ప్రభుత్వానికి మరింత కోపం తెప్పించేలా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రవర్తించారు. అనధికార పర్యటనలో భాగంగా గ్రీన్‌ల్యాండ్‌కు వాన్స్ భార్య ఉషా గురువారం వెళ్లి శనివారం తిరిగిరానున్నారు. అయితే భార్యతో వెళ్లాలని తాను నిర్ణయించుకున్నానని వాన్స్ మంగళవారం వెల్లడించారు. ఈ సందర్భంగా గ్రీన్‌ల్యాండ్ అంశాన్ని ప్రస్తావించారు. ''భార్య ఒక్కతే ఆనందంగా ఉంటే సరిపోతుందా. నేను కూడా ఆమెతోపాటు గ్రీన్‌ల్యాండ్‌కు వెళ్తా. గ్రీన్‌ల్యాండ్ పర్యటనలో భాగంగా అక్కడి వాయవ్య పిటిఫిక్ భూభాగంలోని అమెరికా వైమానిక స్థావరాన్ని సందర్శిస్తా. అధ్యక్షుడు ట్రంప్ తరఫున మాట్లాడుతున్నా. గ్రీన్‌ల్యాండ్ ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయాలనుకుంటున్నాం. ఎందుకంటే గ్రీన్‌ల్యాండ్ భద్రత అనేది పరోక్షంగా యావత్ ప్రపంచభద్రతకు సంబంధించింది ''అని వాన్స్ అన్నారు. దీంతో డెన్మార్క్ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ''ప్రైవేట్‌గా లేదంటే ప్రభుత్వం తరఫున ఎవరినీ మా దేశంలోకి అనుమతిస్తూ ఆహ్వానాలు పంపలేదు'' అని గ్రీన్‌ల్యాండ్ సర్కార్ ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్‌పెట్టింది. ''పిలవకుండా వచ్చి మమ్మల్ని అనవసర ఒత్తిడికి గురిచేయాలనుకుంటున్నారు''అని డెన్మార్క్ ప్రధాన మంత్రి మెట్టే ఫ్రెడెరిక్సన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సిసిమియట్ పట్టణంలోని అవన్నాటా క్విమిసెర్సూ శునకాల స్లెడ్జ్ బండ్ల పరుగుపోటీని, గ్రీన్‌ల్యాండ్ సంస్కృతి, సంప్రదాయాలను స్వయంగా వీక్షించేందుకు అక్కడ పర్యటిస్తానని ఉషా గతంలో చెప్పడం తెల్సిందే. గ్రీన్‌ల్యాండ్‌లో లిథియం వంటి ఖనిజ నిల్వలు అపారం. వీటిని దక్కించుకునేందుకు ట్రంప్ కుయుక్తులు పన్నారని డెన్మార్క్ ప్రభుత్వం గతంలోనే తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ విషయంలో డెన్మార్క్‌కు నాటో సభ్య దేశాలు సైతం మద్దతు పలికాయి.

ఎమ్మెల్యే యాత్నల్‌ను బహిష్కరించిన బీజేపీ

బెంగళూరు: పార్టీలో రాజకీయ వారసత్వం, అవినీతి పేరుకుపోయాయంటూ విమర్శిస్తున్న ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యాత్నల్‌ను బీజేపీ ఆరేళ్లపాటు పార్టీ నుంచి బహిష్కరించింది. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత బీవై యడియూరప్ప, ఆయన కుమారుడు విజయేంద్రపై తరచూ విమర్శలు ఎక్కుపెట్టే విజయపుర ఎమ్మెల్యే యాత్నల్ ఇప్పటికే పార్టీలో తిరుగుబాటు నేతగా పేరొందారు. దీంతో ఇప్పటికే ఆయనకు రెండుసార్లు షోకాజ్ నోటీసులు ఇచ్చిన పార్టీ అగ్రనాయకత్వం ఎట్టకేలకు ఆయనను మంగళవారం పార్టీ నుంచి బయటకు పంపేసింది. '' సత్ప్రవర్తనతో మెలుగుతానని హామీ ఇచ్చి మాట తప్పారు. మళ్లీ పార్టీ వ్యతిరేక విధానాలను అవలంబించారు. ఫిబ్రవరి పదో తేదీన ఇచ్చిన షోకాజ్ నోటీస్‌కు మీ స్పందన సరిగా లేదు. అందుకే ఇప్పటి నుంచి ఆరేళ్లపాటు పార్టీలో సభ్యత్వం మొదలు పార్టీకి సంబంధించిన అన్ని పదవుల నుంచి మిమ్మల్ని తప్పిస్తున్నాం. ఈ మేరకు పార్టీలో కేంద్ర క్రమశిక్షణా కమిటీ(సీడీసీ) నిర్ణయం తీసుకుంది'' అని సీడీసీ సభ్యుడు ఓం ప్రకాశ్ ఒక ప్రకటన విడుదలచేశారు.

జైలు నుంచి పార్లమెంట్‌కు వెళ్లొచ్చు

ఎంపీ రషీద్‌కు ఎట్టకేలకు ఢిల్లీ హైకోర్టు అనుమతి

న్యూఢిల్లీ: ఉగ్రవాదానికి ఆర్థికసాయం చేశాడన్న ఆరోపణలపై అరెస్టయి జైల్లో ఉన్న బారాముల్లా ఎంపీ అబ్దుల్ రషీద్ షేక్ అలియాస్ ఇంజనీర్ రషీద్ పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అభ్యంతరాలను జస్టిస్ చంద్రధారీ సింగ్, జస్టిస్ అనూప్ జైరాం భంభానీ ధర్మాసనం తోసిపుచ్చింది. ''రషీద్‌ను ఢిల్లీలోని తిహార్ జైలు నుంచి ఖైదీ యూనిఫాంలో కాకుండా సాధారణ దుస్తుల్లో తీసుకొచ్చి పార్లమెంట్ సెక్యూరిటీ గార్డులు/మార్షల్స్‌కు అప్పగించండి. ఆయన లోక్‌సభ సమావేశాల్లో పాల్గొంటారు. జైలు నుంచి బయటికొచ్చాక రషీద్‌కు ఎలాంటి సెల్‌ఫోన్, ల్యాండ్ లైన్, ఇంటర్నెట్, ఎలాంటి ఎల్రక్టానిక్ ఉపకరణాలు అందుబాటులో ఉండటానికి వీల్లేదు'' అని జైలు డైరెక్టర్ జనరల్‌ను ధర్మాసనం ఆదేశించింది. కోర్టు అనుమతి నేపథ్యంలో మార్చి 26వ తేదీ నుంచి ఏప్రిల్ నాలుగో తేదీ వరకు రషీద్ లోక్‌సభ సమావేశాల్లో పాల్గొనే వీలుంది.

హవా హవాయీ!

ఈసారి కేంద్ర మంత్రి నిర్మలపై కమ్రా వాగ్బాణాలు

న్యూఢిల్లీ: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై వ్యంగ్య కామెడీతో వివాదానికి కేంద్ర బిందువుగా మారిన స్టాండప్ కమేడియన్ కునాల్ కమ్రా తాజాగా మరో వివాదానికి తెర తీశారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను, ఆమె ఆర్థిక విధానాలను విమర్శిస్తూ సూపర్ హిట్ హిందీ సినిమా 'మిస్టర్ ఇండియా'లోని ఐకానిక్ పాట 'హవా హవాయీ'ని పేరడీ చేశారు. 'ఆప్ కా ట్యాక్స్ కా పైసా హో రహా హవా హవాయీ (జనాలు కట్టే పన్నుల డబ్బులు గోల్‌మాల్ అవుతున్నాయి)'అంటూ బుధవారం విడుదల చేసిన వీడియోలో చెణుకులు విసిరారు. 'ట్రాఫిక్ బఢానే ఏ హై ఆయీ, బ్రిడ్జెస్ గిరానే ఏ హై ఆయీ, కెహతే ఇస్ కో తానాషాహీ (అది ఉన్నదే ట్రాఫిక్ కష్టాలు పెంచేందుకు, బ్రిడ్జిలను కూలగొట్టేందుకు. నియంతృత్వం అంటారు దాన్ని)' అంటూ అధికార బీజేపీ తీరుపైనా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అయితే తమ పాటను అనుమతి లేకుండా వాడుకోవడం ద్వారా కామ్రా కాపీరైట్‌ను ఉల్లంఘించారని టీ సిరీస్ ఆరోపించింది. తాజా పేరడీని యూట్యూబ్‌లో బ్లాక్ చేయించింది. దీన్ని కామ్రా తీవ్రంగా తప్పుబట్టారు. మరోవైపు షిండే ఉదంతంలో విచారణకు హాజరయ్యేందుకు వారం గడువు కావాలన్న కామ్రా విజ్ఞప్తిని ముంబై పోలీసులు తిరస్కరించారు. తక్షణం విచారణకు రావాలంటూ రెండోసారి సమన్లు జారీ చేశారు. బుధవారం ఆయనపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారు.

వేద కాలం నాటి 'పాణిలు' అంటే?



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

వైదిక నాగరికత - 2

తొలి వేద కాలంలో ఆర్యులు ప్రధానంగా సప్త సింధూ ప్రాంతానికే పరిమితమయ్యారు. తూర్పున యమునా నదిని దాటి విస్తరించలేదు. అందుకే తొలివేద కాలానికి చెందిన రుగ్వేదంలో సింధూ, దాని ఐదు ఉపనదులతోపాటు సరస్వతిని అధికంగా ప్రస్తావించారు. కానీ మలివేద కాలానికి ఆర్యులు యమునా నదిని దాటి గంగామైదాన ప్రాంతానికి విస్తరించారు. ఈ భౌగోళిక విస్తరణతో పాటే మలివేద కాలం నాటికి ఆర్యుల ఆర్థిక, సామాజిక, రాజకీయ, మత వ్యవస్థల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

వైదిక నాగరికత లక్షణాలు

సామాజిక వ్యవస్థ: ఆర్యులు భారతదేశంలో వర్ణ వ్యవస్థను ప్రవేశపెట్టారు. సమాజాన్ని నాలుగు వర్ణాలుగా విభజించారు. ఇందులో మొదటి మూడు వర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను ద్విజులుగా పరిగణించారు. నాలుగో వర్ణమైన శూద్రులు రుగ్వేద కాలం చివరలో కనిపిస్తారు. అయితే ఈ వర్ణ వ్యవస్థ అంత కఠినంగా లేదు. ఏ వర్ణం వారైనా ఏ వృత్తినైనా చేపట్టవచ్చు. వర్ణాంతర వివాహాలు అధికంగానే జరిగేవి. అయితే అనులోమ వివాహాల సంఖ్య అధికంగా ఉంది. ఆనాటి సమాజంలో పైన పేర్కొన్న నాలుగు వర్ణాలతోపాటు దస్యులు అనే మరొక వర్గం కూడా ఉంది. వీరు ఆర్యుల చేతిలో ఓడిపోయిన స్థానిక ప్రజలు. వాస్తవంగా 'వర్ణం' అనే పదానికి రంగు అని అర్థం. నలుపు వర్ణంలో ఉన్న స్థానిక ప్రజలను సూచించేందుకు దీన్ని వాడారు. నాటి సమాజంలో స్త్రీలకు గౌరవప్రదమైన స్థానం ఉండేది. పాలనా సభల్లో కూడా మహిళలకు ప్రాతినిధ్యం ఉంది. స్త్రీలు భర్తతోపాటు యజ్ఞయాగాది క్రతువుల్లో పాల్గొనేవారు. తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడంలోనూ స్వేచ్ఛ ఉండేది. వీరికి విద్యా హక్కు కూడా ఉండేది. ఉన్నత విద్యను అభ్యసించిన 20 మంది మహిళా మేధావుల ప్రస్తావన రుగ్వేదంలో కనిపిస్తోంది. బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలకు తావు లేదు. వితంతు పునర్వివాహాలకు, నియోగ వివాహాలకు అవకాశముండేది. అపాల, విశ్వవర, ఘోష మొదలైన బ్రహ్మవాదినులు.. జీవితాంతం వివాహం లేకుండా విద్యార్జనకే తమ జీవితాలను అంకితం చేసినట్లు తెలుస్తోంది. రుగ్వేదంలోని చాలా శ్లోకాలను మహిళలే రచించారని చరిత్రకారుల అభిప్రాయం. బృహదారణ్యక ఉపనిషత్‌లో గార్గి అనే బ్రహ్మవాదినికి యజ్ఞవల్క్య మహర్షికి మధ్య జరిగిన చర్చల ప్రస్తావన ఉంది.

మలివేద కాలం నాటికి చాతుర్వర్ణ వ్యవస్థ బాగా స్థిరపడింది. వర్ణ వ్యవస్థ కఠినంగా మారింది. దీనికి తోడు వర్ణాశ్రమ ధర్మ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం జీవితాన్ని బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం అనే నాలుగు దశలుగా విభజించారు. ఒకే వర్ణానికి చెందిన వారి మధ్య మాత్రమే వివాహాలను అనుమతించేవారు. గోత్ర సంప్రదాయం అమల్లోకి వచ్చింది. ఒకే గోత్రానికి చెందిన వారి మధ్య వివాహాలను అనుమతించేవారు కాదు. వర్ణాంతర వివాహాలు నిషేధించినా అవి ఆగలేదు. అందుకే వర్ణ సంకర సిద్ధాంతాన్ని రూపొందించారు. ఈ కాలంలోనే అష్ట వివాహ పద్ధతి ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇందులో బ్రహ్మ, దైవ, అర్ష, ప్రజాపత్య, గాంధర్వ, అసుర, రాక్షస, పైశాచ అనే 8 రకాల పద్ధతులున్నాయి. వీటిలో గాంధర్వ, రాక్షస వివాహాలకు క్షత్రియులను అనుమతించారు. వర్ణాంతర వివాహాల వల్ల సమాజంలో అనేక మిశ్రమ కులాలు వచ్చి చేరాయి. రుగ్వేద కాలంతో పోలిస్తే స్త్రీల గౌరవ మర్యాదలు క్షీణించాయి. వారిపై అనేక రకాలైన ఆంక్షలను విధించారు. స్త్రీలకు సంబంధించి అనేక సామాజిక దురాచారాలు ప్రారంభమయ్యాయి. బాల్య వివాహాలు,సతీ సహగమనం, వితంతు వివాహాలను నిషేధించారు. వేదాధ్యయనం చేసే అవకాశం స్త్రీలకు లేదు. పున్నామ నరకాన్ని తప్పించేవాడు అని పుత్ర సంతానానికి ప్రాధాన్యం పెరిగింది. సభ, సమితి వంటి వాటిలోనూ స్త్రీలకు సభ్యత్వం లేకుండా పోయింది.

ఆర్థిక వ్యవస్థ: రుగ్వేద ఆర్యుల ప్రధాన వృత్తి పశుపోషణ. కాబట్టి గోవులకు అమిత ప్రాధాన్యతనిచ్చారు. రుగ్వేదంలో 'గోవ్' అనే పదాన్ని 176 సార్లు ప్రస్తావించారు. వీరి సంపదకు మూలం పశువులే. కాబట్టి పశువుల దొంగతనాలను ఘోరాపరాధంగా పరిగణించేవారు. ఈ నేరానికి కఠినమైన శిక్షలుండేవి. ఆ కాలంలో 'పాణిలు' అనేవారు పశువుల దొంగతనాలకు పాల్పడేవారు. పశు సంపదను రక్షించడం రాజన్ ముఖ్య విధి. కాబట్టి రాజన్‌ను 'గోప, గోపతి' అనే పేర్లతో పిలిచేవారు. సంపన్నమైన వ్యక్తిని 'గోమత్' అనేవారు. 'గవిష్టి' అంటే గోవుల కోసం చేసే యుద్ధం లేదా గోవుల కోసం వెదకడం అని అర్థం. ఈ విధంగా వీరి ఆర్థిక వ్యవస్థలో సమస్త పదాలు గోవులతో ముడిపడి ఉండడాన్ని బట్టి చూస్తే పశువులు రుగ్వేదార్యుల ఆర్థిక వ్యవస్థలో ముఖ్య స్థానం ఆక్రమించినట్లు తెలుస్తోంది. పశుపోషణ తర్వాత ఆర్యుల ప్రధాన వృత్తి వ్యవసాయం. ఇంకా స్థిర జీవనం ఏర్పడనందున వ్యవసాయాన్ని పరిమితంగానే చేపట్టారు. వీరి ముఖ్య పంటలు గోధుమ, బార్లీ. తొలివేద కాలంలో అనేక రకాల చేతివృత్తుల వారు ఉన్నారు. చేతివృత్తుల్లో రథాలను తయారు చేసే రథకారులకు (వడ్రంగులు) ప్రముఖ స్థానముండేది.

ఇంకా ఇతర వృత్తుల్లో వస్త్రాలు, కుండలు, చర్మ వస్తువుల తయారీ మొదలైనవి పేర్కొనదగినవి. లోహాన్ని 'ఆయాస్' అని పిలిచారు. లోహ వస్తువులను తయారు చేసేవారిని 'కర్మార' అనేవారు. ఆ కాలంలో రాగి లేదా కంచును అధికంగా ఉపయోగించారు. తొలివేద కాలంలో పరిమిత స్థాయిలో వ్యాపార, వాణిజ్యాలు జరిగాయి. రుగ్వేదంలో 'నిష్క' అనే నిర్దిష్ట విలువ కలిగిన బంగారు ఆభరణం గురించి ప్రస్తావన ఉంది. దీన్ని నాణెంగా ఉపయోగించారని కొందరి అభిప్రాయం. అయినప్పటికీ వాణిజ్యం ప్రధానం వస్తు మార్పిడి పద్ధతిలోనే జరిగేది. వేదాల్లో 'ఫణి' అనే అనార్య జాతికి చెందిన వ్యాపారస్థుల ప్రస్తావన ఉంది.

మలివేద కాలానికి ఆర్యుల ఆర్థిక జీవనంలో పెనుమార్పులు సంభవించాయి. దీనికి ప్రధాన కారణం వీరు సప్త సింధూ నుంచి ప్రపంచంలోనే అత్యంత సారవంతమైన గంగా మైదానానికి విస్తరించడమే. ఈ విస్తరణకు ఇనుప పరిజ్ఞానం తోడై ఆర్యుల ఆర్థిక వ్యవస్థ వ్యవసాయాధార ఆర్థిక వ్యవస్థగా మారడానికి కారణమైంది. ఇనుమును వీరు 'కృష్ణ ఆయా' లేదా 'శ్యామ ఆయా' అని పిలిచారు. ఇనుప నాగళ్ల ఉపయోగం ప్రారంభమైంది. శతపథ బ్రాహ్మణంలో వివిధ రకాలైన వ్యవసాయ కార్యకలాపాల గురించిన ప్రస్తావన ఉంది. గోధుమ, బార్లీతోపాటు వరి ప్రధాన పంటగా రూపొందింది. ఈ వ్యవసాయాభివృద్ధి వల్ల ఆర్యుల సంచార జీవితం అంతమై స్థిర జీవనం ప్రారంభమైంది. తొలివేద కాలంతో పోలిస్తే వృత్తుల సంఖ్య కూడా పెరిగింది. లోహకారులకు ప్రాధాన్యం పెరిగింది. ఈ అభివృద్ధి అంతా కలిసి చిన్న చిన్న పట్టణాలు ఏర్పడటానికి దారి తీసింది. మలివేద గ్రంథాల్లో కనిపించే 'నగరం' అనే పదాన్ని ఈ పట్టణాలకు సంకేతంగా భావించవచ్చు. అయితే వాస్తవంగా పట్టణాలు ఏర్పడింది మాత్రం మలివేద యుగం చివరలో మాత్రమే. మలివేద గ్రంథాల్లో పేర్కొన్న కొన్ని ముఖ్య పట్టణాలు.. కాశీ, కౌశాంబి, వైదేహ, అయోధ్య, హస్తినాపూర్, ఇంద్రప్రస్థ మొదలైనవి. విస్తృత వ్యవసాయం, స్థిరమైన జీవన విధానం,పట్టణ జీవితం, చేతి వృత్తులు ఇవన్నీ కలిసి వ్యాపార వాణిజ్యాల అభివృద్ధికి దోహదపడ్డాయి. దీంతో వ్యాపార నిర్వహణకు వ్యాపారస్తులు 'శ్రేణులు' లేదా 'గణ'లుగా ఏర్పడ్డారు. రుగ్వేద కాలపు నిష్కతోపాటు అనేక రకాలైన నాణేలు వచ్చాయి. అవి.. శతమాన, క్రిష్ణాల, సువర్ణ, హిరణ్య పిండ మొదలైనవి. బృహదారణ్యక ఉపనిషత్‌లో 'పడ' అనే నాణెం ప్రస్తావన ఉంది. అయితే వాస్తవంగా ఇవన్నీ నిర్ణీత విలువ కలిగిన ఆభరణాలు మాత్రమే. అసలైన నాణేలు వాస్తవంగా క్రీ.పూ. 6వ శతాబ్దంలో ప్రారంభమయ్యాయి. అవే విద్ధాంక నాణేలు. అథర్వణ వేదం సంతల గురించి, అక్కడి సందడిని గురించి ప్రస్తావిస్తోంది. ఈ కాలంలో వడ్డీ వ్యాపారం కూడా ఒక వృత్తిగా గుర్తింపు పొందింది. వడ్డీ వ్యాపారిని 'కుసిదిన్' అని పిలిచేవారు.

రాజకీయ వ్యవస్థ: రుగ్వేద కాలంలో పూర్తిస్థాయి రాచరిక వ్యవస్థ ఏర్పడలేదు. పాలక వర్గాలను రాజన్య అని పిలిచేవారు. ఈ వర్గాల నుంచే రాజన్‌ను ఎన్నుకునేవారు. రాజన్‌ను రాజుగా కంటే తెగ నాయకుడిగా పరిగణించడమే సబబుగా ఉంటుంది. రాజన్ ముఖ్య విధి ప్రజలను కాపాడడంతోపాటు వారి ప్రధాన సంపద అయిన గోవులను దొంగిలింపకుండా కాపాడటం. దీని కోసం గూఢచారులను నియమించేవారు. ఇంకా పురోహితుడు, సేనాపతి, ప్రజాపతి మొదలైన వారు రాజుకు సహాయకులుగా ఉండేవారు. 'ప్రజాపతి' ముఖ్య విధి గడ్డి మైదానాల పర్యవేక్షణ. రుగ్వేద కాలంలో వశిష్ఠుడు, విశ్వామిత్రుడు ప్రసిద్ధి చెందిన పురోహితులు. దశరాజ యుద్ధానికి వీరు పరోక్ష కారకులు. రుగ్వేద కాలంలో కుటుంబాన్ని 'కుల' అన్నారు. కుటుంబ పెద్దను 'కులప' అని పిలిచేవారు. కొన్ని కులాల కలయికతో ఏర్పడేదే గ్రామం. దీనికి 'గ్రామణి' అధిపతిగా ఉండేవాడు. కొన్ని గ్రామాల సమూహాన్ని 'విస్' అనేవారు. దీనికి విస్పతి అధిపతిగా ఉండేవాడు. ఇలాంటి విస్‌ల సముదాయంతో 'జన' లేదా 'తెగ' ఏర్పడుతుంది. దీని నాయకుడే'రాజన్'. అయితే రుగ్వేద కాలంలో రాజన్ అధికారం అపరిమితమైంది కాదు. సభ, సమితి, విధాత, గణ అనే ప్రజా సభలు రాజన్ అధికారాన్ని నియంత్రించేవి. రుగ్వేదంలో బలి, భాగ అనే పన్నుల ప్రస్తావన ఉంది. ఇవి వాస్తవంగా పన్నులు కావు. 'బలి' అనేది ప్రజలు రాజుకు ఇచ్చే కానుకలు. 'భాగ' అనేది యుద్ధంలో కొల్లగొట్టిన సంపదలో రాజు వాటా.

మలివేద కాలానికి ఆర్యులు స్థిర జీవనానికి అలవాటు పడ్డారు. కాబట్టి రుగ్వేద కాలం నాటి తెగల ఆధారిత పాలనా వ్యవస్థ స్థానంలో ప్రదేశం ఆధారిత పాలనా వ్యవస్థ ఏర్పడింది. వీటినే 'జనపదాలు' అంటారు. ఈ కాలంలో రాజన్ కేవలం గోవులను రక్షించే గోపతి మాత్రమే కాదు.. సుశిక్షిత సైన్యాన్ని కలిగి ఉండి పక్క రాజ్యాలను ఆక్రమించే స్థాయికి ఎదిగాడు. దీనికోసం రాజసూయ, అశ్వమేధ, వాజపేయ వంటి యజ్ఞ, యాగాలూ ప్రారంభమయ్యాయి. రాజుపై నియంత్రణాధికారమున్న సభలు క్షీణించి సభ, సమితులు మాత్రమే మిగిలాయి. అవి కూడా నామమాత్రపు సలహా మండళ్లుగా మారిపోయాయి. దీనివల్ల సభలతో ఎంపికయ్యే రాజన్ పదవి వంశపారంపర్య పదవిగా మారిపోయింది. ఈ కాలంలో రాజుకు సహాయ సహకారాలు అందించేందుకు 'ద్వాదశ రత్నిన్' అనే మంత్రి మండలి ఏర్పడింది. వీరిలో ప్రధాన పురోహితుడు, పట్టమహిషి, సేనాని, సూత, సంగ్రహిత్రి, భాగదుఘ, అక్షావాప, గోవికర్తన, గ్రామణి మొదలైనవారు సభ్యులుగా ఉండేవారు. బలి, భాగ అనేవి పూర్తిస్థాయి పన్నులుగా మారాయి. వాటి వసూలుకు బాగదుఘ అనే అధికారి ఉండేవాడు. అయినప్పటికీ ఈ కాలానికి పూర్తిస్థాయి అధికార యంత్రాంగం మాత్రం ఏర్పడలేదు.

మత వ్యవస్థ: రుగ్వేద కాలపు ఆర్యులు ప్రకృతి శక్తులను అర్థం చేసుకోలేకపోవడంతో వాటికి దైవత్వాన్ని ఆపాదించారు. మానవ రూపమిచ్చి పూజించారు. రుగ్వేదంలో మొత్తం 33 మంది దేవతల ప్రస్తావన ఉంది. వీరందరిలో అతిముఖ్య దైవం ఇంద్రుడు లేదా పురంధరుడు. ఇతడు యుద్ధ దేవత. రెండో ముఖ్య దైవం అగ్ని. ఇతడిని మానవులకు, దేవతలకు మధ్య వారధిగా భావించారు. వరుణుడు ప్రకృతిని క్రమబద్ధీకరించే దేవత. ఇంకా సోమ, ఉషస్, అదితి, పృథ్వీ, అరణ్యాని మొదలైన దేవతల ప్రస్తావన ఉంది. వీరి పూజా విధానంలో భక్తికి ప్రాధాన్యముండేది. భక్తి శ్లోకాలను ఆలపించడం, కానుకలను సమర్పించడం ద్వారా దేవతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. తమకు ప్రీతిపాత్రమైన సోమ, సుర అనే పానీయాల్ని నైవేద్యంగా సమర్పించేవారు. వీరు ప్రధానంగా సంతానం, పశు సంపద కోసం దేవతలను ప్రార్థించారు.

మలివేద కాలానికి రుగ్వేదపు ప్రధాన దేవతల ప్రాధాన్యత తగ్గిపోయింది. ఇంద్రుడు, అగ్ని వంటి దేవతల స్థానాన్ని త్రిమూర్తులు ఆక్రమించారు. రుగ్వేదపు ప్రధాన దేవతలు అష్టదిక్పాలకులుగా మారిపోయారు. సృష్టికర్త అయిన ప్రజాపతి ప్రధాన దేవతగా, రుద్రుడు, విష్ణువు మొదలైనవారు ఇతర ముఖ్య దేవతలుగా అవతరించారు. ఈ కాలంలో వచ్చిన మరొక ముఖ్యమైన మార్పు వర్ణాల వారీగా దేవతలు ఏర్పడటం. ఈ విధంగా ఏర్పడిన దేవతే 'పుషాన్' అనే శూద్రుల దేవత. ఆర్యుల పూజా విధానంలోనూ మార్పులు సంభవించాయి. భక్తి ప్రాధాన్యత తగ్గి యజ్ఞ యాగాలు, బలిదానాలకు ప్రాధాన్యత పెరిగింది. విపరీతమైన జంతు బలుల వల్ల పశు సంపదకు పెద్ద నష్టం వాటిల్లింది. మోక్ష మార్గం సంక్లిష్టం, వ్యయభరితం అవడమే కాకుండా శూద్రులు, స్త్రీలు వంటి కొన్ని వర్గాలకు మోక్ష మార్గాన్ని నిరాకరించారు. మలివేద కాలంలోని మత వ్యవస్థలో చోటు చేసుకున్న ఈ పరిణామాలన్నీ కలిసి వైదిక యుగం చివరినాటికి అంటే క్రీ.పూ. 6వ శతాబ్దం నాటికి వైదిక మతంపై తిరుగుబాటుగా అనేక మత ఉద్యమాలు రావడానికి కారణమయ్యాయి.

మాదిరి ప్రశ్నలు

1. వేద కాలం నాటి 'పాణిలు' అంటే?
   1) నాణేలు 2) సైనిక వర్గం
   3) వ్యాపారులు 4) పశువుల దొంగలు
2. రుగ్వేదంలో వ్యవసాయదారుడిని ఏ పేరుతో సూచించారు?
   1) కినాస 2) శూద్ర
   3) క్షేత్రక 4) కర్షక
3. తప్పుగా జతపర్చిన దాన్ని గుర్తించండి?
   1) గోఘన - అతిథి
   2) దౌహిత్రి - కూతురు
   3) గోప - పశుకాపరి
   4) గవిష్టి - యుద్ధం
4. వీరిలో పురోహితుల దైవం?
   1) ఇంద్రుడు 2) అగ్ని
   3) వరుణుడు 4) సూర్యుడు
5. వైదిక యుగంలోని ఏ సభలను ప్రజాపతి (బ్రహ్మ) పుత్రికలుగా భావిస్తారు?
   1) సభ, సమితి 2) సమితి, విధాత
   3) విధాత, గణ 4) గణ, పరిషత్
6. వేద కాలంలో ఏ వృత్తి వారికి ఉపనయనం ధరించే అర్హతను కల్పించారు?
   1) స్వర్ణకారులు 2) రథకారులు
   3) చర్మకారులు 4) లోహకారులు
7. వీటిలో సరైన జతను గుర్తించండి?
   1) కులాల-కుండలు తయారు చేసేవారు
   2) నిషాద - చేపలు పట్టేవారు
   3) కైవర్త - బుట్టలు అల్లేవారు
   4) వేణ - వేటాడేవారు
8. కింద ఇచ్చిన జాబితాల నుంచి సరైన సమాధానాన్ని గుర్తించండి?

జాబితా -1	జాబితా-2
ఎ) సూత	1) మంగలి
బి) దౌహిత్రి	2) వధించరానిది (ఆవు)
సి) గోఘన	3) రథకారుడు
డి) అఘన్య	4) కూతురు
ఇ) వాప్త	5) అతిథి

9. దశరాజ యుద్ధానికి కారకుడైన పురోహితుడు?
   1) వశిష్టుడు 2) విశ్వామిత్రుడు
   3) యజ్ఞవల్క్య 4) సుదాసు
10. వైదిక యుగ పాలనా విభాగాలను సరైన ఆరోహణ క్రమంలో అమర్చండి?
    1) రాష్ట్ర, జన, విశ్, గ్రామ, కుల
    2) జన, రాష్ట్ర, గ్రామ, కుల, విశ్
    3) కుల, గ్రామ, విశ్, జన, రాష్ట్ర
    4) కుల, గ్రామ, విశ్, రాష్ట్ర, జన

సమాధానాలు

1) 4; 2) 1; 3) 3; 4) 2; 5) 1; 6) 2; 7) 1; 8) 2 9) 2; 10) 3.

క్లోనింగ్‌లో ఉపయోగించే కణాలు?



బయోటెక్నాలజీ

» క్లోనింగ్ ద్వారా మానవ అవయవాలను కూడా అభివృద్ధి చేయవచ్చు. అయితే శరీర భాగాలను తయారు చేయడం ద్వారా సాంఘిక, సామాజిక పరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

» జంతువుల్లో జీవ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సూపర్ ఒవ్యులేషన్ విధానం ద్వారా ఆవుల్లో, గేదెల్లో కృత్రిమ గర్భధారణ చేస్తున్నారు.

» జన్యు చికిత్స (Gene Therapy) ని అనువంశిక వ్యాధులను నయం చేయడంలో ఉపయోగిస్తారు.

» నేర నిర్ధారణ, రక్త సంబంధీకుల నిర్ధారణలో పాలిమరేజ్ చైన్ రియాక్షన్ (PCR) అనే ఆధునిక పరీక్ష ఎక్కువగా తోడ్పడుతోంది.

బయోటెక్నాలజీలో సస్య ప్రజననంతోపాటు కణజాల వర్ధనం, జెనెటిక్ ఇంజినీరింగ్, క్లోనింగ్, ఏకకణ ప్రోటీన్స్ లాంటివి అనేక అంశాల్లో వివిధ రీతుల్లో ఉపయోగపడుతున్నాయి.

జెనెటిక్ ఇంజినీరింగ్: దీంట్లో భాగంగా జన్యు పదార్థమైన డీఎన్ఏను ఉపయోగించి ఆధునిక విధానాల ద్వారా మొక్కల్లో, జంతువుల్లో శ్రేష్ఠమైన లక్షణాలను నిక్షిప్తం చేయడం, నూతన వంగడాలు, జంతు క్లోన్స్, వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేయడం, కలుషిత నీటిని, పరిసరాలను శుభ్రపరచడం మొదలైన అంశాలుంటాయి.

జెనెటిక్ ఇంజినీరింగ్ విధానంలో నాలుగు దశలుంటాయి.

1. వాంఛనీయ జన్యువును వేరు చేయడం.
2. జన్యువును వాహక డీఎన్ఏలోకి ప్రవేశపెట్టడం.
3. పునఃసంయోజక డీఎన్ఏ వాహకాన్ని అతిథేయి కణంలోకి బదిలీ చేయడం.
4. వాంఛనీయ జన్యువును కలిగిన అతిథేయి కణాలను వరణం ద్వారా ఎన్నుకోవడం.

వాంఛనీయమైన జన్యువును వేరు చేయడంలో డీఎన్ఏను ఖండితాలుగా చేయడానికి ఉపయోగించే ఎంజైమ్‌లను 'రిస్ట్రిక్టెడ్ ఎంజైమ్స్' అంటారు. వీటినే 'అణు కత్తెరలు' అని కూడా అంటారు. వీటిలో ఎండో న్యూక్లియేజ్ ఎంజైమ్‌లు ఉంటాయి. ఖండితాలైన డీఎన్ఏ ముక్కలను ఎలక్ట్రో ఫోరెసిస్, సదరన్ బ్లాటింగ్ పరీక్ష ద్వారా గుర్తించి ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియను ఇ.ఎం. సదరన్ కనుగొన్నాడు.

ఈ ప్రక్రియ అనంతరం వాహకంలో క్లోనింగ్ చేస్తారు. అంటే వేరు చేసిన డీఎన్ఏ ఖండితాల నకళ్లను తయారు చేస్తారు. వాహకంగా ఇ-కోలీ అనే బ్యాక్టీరియాను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ప్లాస్మిడ్, కాస్మిడ్, బ్యాక్టీరియో ఫేజెస్ లాంటివాటిని కూడా వాహకాలుగా వినియోగిస్తున్నారు. వాహకంలో ఏర్పడిన డీఎన్ఏను r-డీఎన్ఏ లేదా కైమరిక్ డీఎన్ఏ అంటారు. P^{BR}–322 అనేది కృత్రిమ వాహకం.

r-డీఎన్ఏను బదిలీ చేసిన కణాలను మార్కర్ జన్యువుల ద్వారా గుర్తిస్తారు. ఎంపిక విధానంలో ముఖ్యంగా కాలనీ హైబ్రిడైజేషన్ పద్ధతిని ఉపయోగిస్తారు. కొన్నిసార్లు C-డీఎన్ఏను ఉపయోగించి కూడా అతిథి కణాలను ఎంపిక చేస్తారు. C-డీఎన్ఏను ఉపయోగించి డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ ద్వారా నేర నిర్ధారణ జరుపుతారు. ఇది వివిధ వ్యాధులను,ఆహార కాలుష్యకాలను గుర్తించడానికి కూడా ఉపయోగపడుతుంది. మొక్కల్లో T_i ప్లాస్మిడ్‌ను కలిగిన ఆగ్రో బ్యాక్టీరియం టామిఫేసియన్లను జన్యువుల బదిలీలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

క్లోనింగ్ విధానంలో కనుగొన్న కొన్ని క్లోన్స్	
డాలి	- గొర్రె పిల్ల (మొదటి క్లోన్)
ప్రామేటి	- గుర్రం పిల్ల
టెట్రా	- రీసస్ కోతి
హంబావో	- లేగ దూడ
పంపా	- ఆవు దూడ
ప్రిన్స్	- పంది పిల్ల
మటిల్డా	- గొర్రె
డ్యూయా	- మగజింక
విటి-20	- కుందేలు
స్పాటి	- మచ్చల జింక
జియోజియో	- ఎలుక

వ్యవసాయం - బయోటెక్నాలజీ

నార్మన్ ఇ. బోర్లాగ్ 1960 ప్రాంతంలో అధిక దిగుబడినిచ్చే రకాలను కనుగొని హరిత విప్లవానికి కారకులయ్యారు. ఈయనను 'హరిత విప్లవ పితామహుడు' అంటారు. ఇండియాలో ఎం.ఎస్. స్వామినాథన్‌ను హరిత విప్లవ పితామహుడిగా పేర్కొంటారు. మెరుగైన వంగడాలను వాడటం, రసాయన ఎరువులు, పెస్టిసైడ్స్, సేద్యపు నీటి పరిజ్ఞానం, భూ సంస్కరణలు, శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించడం తదితరాలు హరిత విప్లవంలో భాగంగా ఉంటాయి.

జన్యు మార్పిడి విధానం ద్వారా జన్యు పరివర్తిత మొక్కలను (GM–Plants) రూపొందిస్తున్నారు.

ఉదా: బీటీ కాటన్, గోల్డెన్ రైస్.

బీటి-పత్తిలో చీడల నిరోధకతను అభివృద్ధి పరిచారు. దీన్ని మొదట మోనిశాంటో అనే అమెరికా విత్తన సంస్థ రూపొందించింది. ప్రస్తుతం దీన్ని ఇండియాలో మహికో విత్తన సంస్థ రూపొందిస్తోంది.

బాసిల్లస్ థురెంజియన్సిస్ అనే బ్యాక్టీరియా లెపిడాప్టిరాన్స్, కోలియోప్టిరాన్స్, డిప్టిరాన్స్ లాంటి వాటి నుంచి రక్షించడానికి తోడ్పడుతుంది.

గోల్డెన్‌రైస్‌లో విటమిన్-ఎ ఉత్పత్తి జరిగే విధంగా రూపొందించారు.

గతంలో జంతువులను చంపి వాటి క్లోమం నుంచి ఇన్సులిన్‌ను నిష్కర్షణ చేసేవారు. 1983లో అమెరికాకు చెందిన ELiLilly అనే కంపెనీ ఇ-కోలీ బ్యాక్టీరియాను ఉపయోగించి హ్యూమ్యులిన్ అనే ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసి మార్కెట్‌లోకి విడుదల చేసింది.

జన్యుపరివర్తిత మొక్కల ఉపయోగాలు

- బొప్పాయిలో రింగ్ స్పాట్ వైరస్ నిరోధకతను సాధించగలిగాం.
- టమాటో పంటలో సూడోమోనాస్ అనే వ్యాధికారక బ్యాక్టీరియాకు నిరోధకతను రూపొందించారు.
- ఫలాలు ఆలస్యంగా పక్వతకు వచ్చే విధానాన్ని సృష్టించి రవాణాకు అనుకూలపరిచారు.
- బంగాళాదుంపలో ఫైటాప్తోరా అనే శిలీంధ్ర నిరోధకతను అభివృద్ధి పరిచారు.
- బాస్మతి వరి రకంలో జీవ, నిర్జీవ ప్రతి బలాలను తట్టుకునే నిరోధకతను రూపొందించారు.
- మొక్కలను జీవ పరిశ్రమలు (బయోరియాక్టర్)గా ఉపయోగించి వాణిజ్య ఉత్పత్తులు, ఔషధాలు, రసాయనాలను భారీ ఎత్తున తయారు చేస్తున్నారు. దీన్నే 'అణు సేద్యం' అంటారు.

జీవభద్రత, నైతిక సమస్యలు

జెనెటిక్ ఇంజినీరింగ్ విధానంలో అనేక లాభాలున్నప్పటికీ ప్రజల్లో కొంత అభద్రతా భావం ఉంది. దీనికి ప్రధాన కారణాలు..

1) మానవులు, జంతువుల్లో విష పదార్థాలు బదిలీ చెంది ఇతర కొత్త సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంది.
2) కూరగాయల సహజత్వంలో మార్పు వచ్చే ఆస్కారం ఉంది.
3) జీవ వైవిధ్యానికి హాని ఏర్పడే ప్రమాదం ఉంది.
4) అసహజ కలుపు మొక్కలు వృద్ధి చెందే పరిస్థితులు కూడా ఎదురవుతున్నాయి.

పైన పేర్కొన్నవాటితో పాటు బయోపైరసీ జరిగే ప్రమాదం కూడా ఉంది. రూపొందించిన వారి అనుమతికి సంబంధించిన అధికారిక పత్రం, నష్ట పరిహారం లేకుండా జీవ వనరులను ఉపయోగించడాన్ని బయోపైరసీ అంటారు.

క్లోనింగ్

ఈ విధానంలో స్టెమ్ (మూల) కణాలను ఉపయోగించి కృత్రిమంగా జంతువులను రూపొందిస్తారు. స్టెమ్‌సెల్స్‌కు ఉండే సామర్థ్యాన్ని 'ప్లూరో పొటెన్సీ' అంటారు. మొట్టమొదటగా ఈ ప్రక్రియలో 'డాలి' అనే గొర్రె పిల్లను సృష్టించారు. స్కాట్లాండ్ శాస్త్రవేత్త ఇయాన్ విల్మట్ దీన్ని రోసాలిన్ అనే పరిశోధనా సంస్థలో రూపొందించారు.

క్లోనింగ్ ఉపయోగాలు: జంతువుల్లో అవసరమైన లక్షణాలను అభివృద్ధి చేయవచ్చు.

ఉదా: తల్లిపాలలో ఉండే ప్రోటీన్లను ఆవుపాలలో ప్రవేశ పెట్టవచ్చు. అంతరించిపోయే ప్రమాదమున్న జంతుజాలాన్ని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. జన్యు పదార్థంగా దేన్ని పరిగణిస్తారు?
   1) C–DNA 2) r–DNA
   3) B–DNA 4) Z–DNA
2. జెనెటిక్ ఇంజినీరింగ్ విధానం ద్వారా ఉత్పత్తి చేసే మొక్కలను ఏమంటారు?
   1) జెనెటికల్ మొక్కలు
   2) అనువంశిక మొక్కలు
   3) జన్యు పరివర్తిత మొక్కలు
   4) ఉత్పరివర్తిత మొక్కలు
3. డీఎన్ఏను ఖండితాలుగా చేసేది?
   1) ఎండో న్యూక్లియేజ్ 2) లిగేజ్
   3) ఐసోమరేజ్ 4) ఏదీకాదు
4. బీటీ - కాటన్‌ను మొదట ఉత్పత్తి చేసిన విత్తన సంస్థ?
   1) పోయినీర్ 2) మోన్‌శాంటో
   3) ప్రీమియర్ 4) పైవన్నీ
5. గోల్డెన్‌రైస్‌లో ఏ అంశాన్ని ప్రవేశ పెట్టారు?
   1) హార్మోన్ 2) బయోపెస్టిసైడ్స్
   3) విటమిన్స్ 4) పిండి పదార్థం
6. డీఎన్ఏ టెక్నాలజీలో విరివిగా ఉపయోగిస్తున్న బ్యాక్టీరియా?
   1) స్ట్రెప్టోకోకస్ 2) బాసిల్లస్
   3) ఇ-కోలీ 4) స్పైరిల్లం
7. మొదటగా రూపొందించిన క్లోన్?
   1) స్పాటి 2) డాలి
   3) ప్రామేటి 4) స్వప్ని
8. మొదటగా రూపొందించిన టెస్ట్ ట్యూబ్ బేబీ?
   1) బేబీ హర్ష
   2) లూయిస్ జాయ్ బ్రౌన్
   3) డాలి 4) ఏదీకాదు
9. పెన్సిలిన్‌ను ఏ సంవత్సరంలో కను గొన్నారు?
   1) 1920 2) 1928
   3) 1935 4) 1919
10. భారతదేశంలో సాగు చేస్తున్న పుట్టగొడుగు రకం?
    1) అగారికస్ వైరోసా
    2) అమానిటా జాతులు
    3) అగారికస్ బైస్పోరస్
    4) పైవన్నీ
11. మష్రూమ్ అంటే అర్థం ఏమిటి?
    1) పుష్పం 2) స్పాంజీ
    3) గొడుగు 4) బూడిద
12. స్పైరులినా అనేది?
    1) ఏక కణ ప్రోటీన్‌గా ఉపయోగపడే శైవలం
    2) ఏకకణ ప్రోటీన్‌గా ఉపయోగపడే శిలీంధ్రం
    3) ఏకకణ ప్రోటీన్‌గా ఉపయోగపడే బ్యాక్టీరియా
    4) ఏదీకాదు
13. క్లోనింగ్‌లో ఉపయోగించే కణాలు?
    1) టాటి పోటెంట్ కణాలు
    2) ప్రోకేరియోటిక్ కణాలు
    3) మూలకణాలు (స్టెమ్ సెల్స్)
    4) పైవన్నీ
14. జెనెటిక్ ఇంజినీరింగ్ విధానం ద్వారా ఉత్పత్తి చేసిన ఇన్సులిన్?
    1) హ్యూమ్యులిన్ 2) హైరుడిన్
    3) రెన్నెట్ 4) ఏదీకాదు
15. టానరింగ్ (తోళ్ల శుద్ధి) విధానంలో ఉపయోగపడే బ్యాక్టీరియా?
    1) క్లాస్ట్రీడియం 2) అజటో బాక్టర్
    3) రైజోబియం 4) పైవన్నీ
16. ఫింగర్ ప్రింటింగ్ విధానంలో నేరస్థులను నిర్ధారణ చేసేందుకు ఉపయోగపడేది?
    1) r–DNA 2) C–DNA
    3) B–DNA 4) Z–DNA
17. లైంగిక నిర్ధారణలో ఉపయోగపడే క్రోమోజోములు?
    1) xx 2) xy 3) yy 4) 1, 2
18. ఆగ్రో బ్యాక్టీరియం టామిఫేసియన్స్ అనేది?
    1) వైరస్ 2) బ్యాక్టీరియా
    3) విత్తన సంస్థ 4) ఏదీకాదు
19. టెస్ట్ ట్యూబ్ బేబీ అంటే?
    1) శిశువు పరీక్ష నాళికలో వృద్ధి చెందుతుంది
    2) ఫలదీకరణ పరీక్ష నాళికలో జరిగి శిశువు గర్భాశయంలో ఎదుగుతుంది
    3) ఫలధీకరణ ఫాలోపియన్ నాళంలో జరిగి శిశువు పరీక్ష నాళికలో ఎదుగుతుంది
    4) ఫలదీకరణ, శిశువు ఎదుగుదల పరీక్ష నాళికలో జరుగుతుంది
20. గోబర్ గ్యాస్ దేని నుంచి లభిస్తుంది?
    1) ఆగ్రో బ్యాక్టీరియం టామిఫేసియన్స్
    2) బాసిల్లస్ థురెంజియన్సిస్
    3) మిథనో కోకస్
    4) పైవన్నీ

సమాధానాలు

1) 3; 2) 3; 3) 1; 4) 2; 5) 3; 6) 3; 7) 2; 8) 2; 9) 2; 10) 3; 11) 2; 12) 1; 13) 3; 14) 1; 15) 1; 16) 2; 17) 4; 18) 2; 19) 2; 20) 3.

ఆధునికీకరణతోనే అదనపు నిల్వ సామర్థ్యం

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ

భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తులను కొంత కాలం నిల్వ చేసేందుకు వీలు కల్పించే గిడ్డంగి సౌకర్యాల కొరత తీవ్రంగా ఉంది. లభ్యమవుతున్న వసతులు అశాస్త్రీయంగా ఉండటంతో రైతులు పంట చేతికి వచ్చిన వెంటనే తమ ఉత్పత్తులను విక్రయించడానికి మొగ్గు చూపుతున్నారు. అందువల్ల వారికి గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో గ్రామీణ రుణగ్రస్తత పెరుగుతోంది. ఉత్పత్తిలో పెరుగుదల నేపథ్యంలో ఆహార ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం పెంపునకు ప్రాధాన్యం ఏర్పడింది.

నిల్వ సామర్థ్యం (Storage Capacity)

వ్యవసాయమే ప్రధాన జీవనోపాధిగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో 'సమ్మిళిత వృద్ధి' సాధ్యపడాలంటే వ్యవసాయ రంగంలో సమూల ప్రగతి అవసరం. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం భారత్‌లో ఆహార ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం సరిపోయినంతగా లేదు. ఈ కారణంగా ఏటా మొత్తం ఉత్పత్తిలో 12 నుంచి 16 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు వృథా అవుతున్నాయి. వీటి విలువ రూ. 50,000 కోట్ల వరకు ఉన్నట్లు అంచనా. 1994–95 తర్వాతి కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి సగటు వార్షిక వృద్ధి 1.20 శాతంగా నమోదైంది. 1990–91లో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 176.4 మిలియన్ టన్నులు కాగా, 2013–14 నాటికి 264.4 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇటీవల రబీలో గోధుమ, బియ్యం, Cereals, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల కారణంగా ఖరీఫ్, రబీ కాలంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి సమానంగా ఉండటాన్ని గమనించవచ్చు. ఉత్పత్తిలో పెరుగుదలకు అనుగుణంగా నిల్వ సామర్థ్యాలను పటిష్టపరిస్తేనే సత్ఫలితాలుంటాయి.

నిల్వ సౌకర్యాలు - గిడ్డంగులు

వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు సంబంధించి భారత్‌లో గిడ్డంగులు (గోడౌన్లు) ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. గిడ్డంగుల నిర్మాణం శాస్త్రీయంగా ఉన్నప్పుడే వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత, పరిమాణాలను పరిరక్షించవచ్చు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ), సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్లు గిడ్డంగులను నిర్వహిస్తున్నాయి. భారత్‌లో సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌ను అతిపెద్ద ప్రభుత్వ రంగ గిడ్డంగి నిర్వాహణదారుగా పేర్కొనవచ్చు. ఇది సుమారుగా 120 వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులకు భద్రతతో కూడిన నిల్వ సౌకర్యాలను కల్పిస్తోంది. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, శ్రేణీకరణ, పంపిణీ లాంటి సేవలను కూడా నిర్వహిస్తోంది. దేశంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రత్యేక గిడ్డంగి కార్పొరేషన్లను ఏర్పాటు చేశాయి. రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లు ఆయా రాష్ట్రాలకు సంబంధించి జిల్లా స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్ ఏర్పాటుకు అవసరమైన వాటా మూలధనాన్ని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర గిడ్డంగి కార్పొరేషన్ సమానంగా సమకూరుస్తాయి. కేంద్ర, రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లతో పాటు భారత ఆహార సంస్థ కూడా వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సౌకర్యాలను కల్పిస్తోంది. 2010 చివరి నాటికి కేంద్ర గిడ్డంగి కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ), రాష్ట్ర గిడ్డంగి కార్పొరేషన్లు, భారత ఆహార సంస్థల మొత్తం నిల్వ సామర్థ్యం 75 మిలియన్ టన్నులకు చేరింది. రైతులు వారి ఉత్పత్తులను తక్కువ ధరకే విక్రయించకుండా నిరోధించే క్రమంలో గ్రామీణ గోడౌన్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ స్పాన్సర్డ్ పథకాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 2001 మార్చి నుంచి అమలు పరుస్తోంది. ఇప్పటివరకు 67 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న గ్రామీణ గోడౌన్లను ఏర్పాటు చేసినట్లు అంచనా. ఉత్పత్తి ధోరణి, విక్రయమైన మిగులు పరిశీలించినప్పుడు భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం తక్కువగా ఉన్నట్లు భావించవచ్చు. 2012 ఫిబ్రవరి 1 నాటికి భారత ఆహార సంస్థ 300.83 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం (సొంత, అద్దె గోడౌన్లు కలిపి) కలిగి ఉండగా రాష్ట్ర ఏజెన్సీలు 153.54 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. మొత్తంగా భారత్‌లో వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యం 91 మిలియన్ టన్నులకు పైగా పెరిగింది. ప్రభుత్వ ఏజెన్సీలకు సంబంధించి నిల్వ సామర్థ్యాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థ, ఇతర ప్రభుత్వ పథకాల అమల్లో భాగంగా ఆహార ధాన్యాల నిల్వకే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఆహార భద్రత కల్పించే క్రమంలో ప్రభుత్వ ఏజెన్సీల ఆహార ధాన్యాల సేకరణ పెరుగుతున్న క్రమంలో లభ్యమయ్యే నిల్వ సామర్థ్యంపై అధిక ఒత్తిడి ఉంది. అధిక మద్దతు ధరల కారణంగా ఆహార ధాన్యాల సేకరణలో నిమగ్నమవుతున్న రాష్ట్ర ఏజెన్సీల నిల్వ సామర్థ్యంపై కూడా ఒత్తిడి పెరుగుతోంది. నాబార్డ్ మంజూరు చేసిన గోడౌన్ల సగటు నిల్వ సామర్థ్యం 1261 మెట్రిక్ టన్నులు కాగా, మొత్తం గోడౌన్లలో 75 శాతం నిల్వ సామర్థ్యం వెయ్యి మెట్రిక్ టన్నుల కంటే తక్కువగా ఉంది. నాబార్డ్ సహకారంతో రైతులు ఏర్పాటు చేసుకున్న చిన్న, మధ్య తరహా గోడౌన్ల వల్ల వారి ఉత్పత్తులను తక్కువ ధర వద్ద విక్రయించే పరిస్థితి తగ్గి, గిట్టుబాటు ధర పొందగలుగుతున్నారని అనేక అనుభవ పూర్వక ఆధారాలు తెలియజేస్తున్నాయి.

నిల్వ సామర్థ్యం - ప్రాంతీయ అసమానతలు

ఉత్పత్తి కేంద్రాలుగా భారత్‌లో నిల్వ సామర్థ్యం కొన్ని ప్రాంతాల్లో అధికంగా కేంద్రీకృతమై ఉంది. వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం అధికంగా ఉన్న ముఖ్య రాష్ట్రాల్లో 22 శాతం నిల్వ సామర్థ్యం లభ్యమవుతోంది. అవసరాలకు అనుగుణంగా కొన్ని రాష్ట్రాలు నెల లోపు నిల్వ సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నాయి. రాష్ట్రాల మధ్య ఆహార, పప్పు ధాన్యాల ఉత్పత్తిలో తేడా; వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ నిమిత్తం మండీల ఏర్పాటులో వ్యత్యాసాలు నిల్వ సామర్థ్యానికి సంబంధించి ప్రాంతీయ అసమానతలు పెరగడానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. స్థానిక ఉత్పత్తిదారులకు గ్రామీణ గిడ్డంగుల ఏర్పాటులో ప్రభుత్వ ప్రోత్సాహకాలకు సంబంధించి వారిలో అవగాహన, బ్యాంక్ అధికారుల వైఖరి లాంటివి కూడా వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో ప్రాంతాల మధ్య అసమానతలకు కారణంగా ఉన్నాయి. మొత్తం గోడౌన్లు, నిల్వ సామర్థ్యంలో ఆహార ధాన్యాలు, సంబంధిత వ్యవసాయ ఉత్పత్తులను అధికంగా పండించే కొద్దిమంది రైతులే ఎక్కువగా కలిగి ఉన్నారు. అందువల్ల ధనిక రైతులే గిట్టుబాటు ధరలు పొందుతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ అసమానతలతో పాటు ప్రాంతీయ అసమానతలు పెరిగాయి. భారత్‌లో మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యాన్ని ప్రాంతాల వారీగా పరిశీలిస్తే.. ఉత్తర భారతదేశం వాటా 48 శాతం ఉండగా, దక్షిణ భారతదేశం 22%, పశ్చిమ ప్రాంతం 13%, మధ్య భారత దేశం 9%, తూర్పు ప్రాంతం 7% వాటా కలిగి ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల వాటా దేశంలోని మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ సామర్థ్యంలో 1% మాత్రమే. నిల్వ సామర్థ్యంలో ప్రాంతాల మధ్య అసమానతల కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల సేకరణకు సంబంధించి ప్రభుత్వ సామర్థ్యం పరిమితంగా ఉంది. గోడౌన్లలో నిల్వ చేస్తున్న వ్యవసాయ ఉత్పత్తుల్లో ఆహార ధాన్యాలపై గోధుమ, బియ్యం వాటా అధికంగా ఉంది. తర్వాతి స్థానాల్లో నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, పత్తి నిలిచాయి. నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రభుత్వం అనేక పథకాల ద్వారా ప్రోత్సాహకం అందిస్తున్నప్పటికీ గోధుమ, బియ్యం నిల్వల్లోనే పెరుగుదల కనిపిస్తోంది.

గిడ్డంగుల నియంత్రణ విధానం: గిడ్డంగుల ఏర్పాటులో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంపొందించడం, వేర్‌హౌసింగ్ పరిశ్రమ అభివృద్ధి, నియంత్రణకు సంబంధించి భారత ప్రభుత్వం సెప్టెంబర్ 2007లో 'ది వేర్‌హౌసింగ్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్)' చట్టాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం 2010 అక్టోబర్‌లో వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీని ఏర్పాటు చేశారు. వేర్‌హౌసింగ్ అభివృద్ధి, నియంత్రణ చట్టం ముఖ్య ఉద్దేశం నెగోషియబుల్ వేర్‌హౌస్ రిసిప్ట్ (NWR) మంజూరులో నియంత్రణ వాతావరణాన్ని కల్పించడం. NWR మంజూరు చేసే గిడ్డంగులకు వేర్‌హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ (WDRA) గుర్తింపునిస్తుంది. ఇది 2011 మార్చి 31 నాటికి పరిశీలనకు వచ్చిన 300 దరఖాస్తుల్లో 51 అప్లికేషన్లకు అనుమతినిచ్చింది.



కోల్డ్ స్టోరేజీలు

భారత్‌లో పండ్లు, కూరగాయల సాంవత్సరిక ఉత్పత్తి 130 మిలియన్ టన్నులుగా అంచనా. వైవిధ్య వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వీటి ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల ఏర్పడింది. వీటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడానికి అనేక అవకాశాలున్నప్పటికీ ఆయా ఉత్పత్తులను నిల్వ చేయడానికి అవసరమైన శీతల గిడ్డంగులు (Cold Storages) తగినంతగా లేవు. శీతల గిడ్డంగుల సౌకర్యం అధికంగా సింగిల్ కమోడిటీస్ అయిన బంగాళాదుంప, ఆరెంజ్, ఆపిల్, ద్రాక్ష, దానిమ్మ, పూలు లాంటి వాటికి మాత్రమే అందుబాటులో ఉంది. అంటే శీతల గిడ్డంగుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడం లేదు. బహుళ ఉత్పత్తులను నిల్వ చేసే విధంగా శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలి. ఇది ఉత్పత్తిదారుల ఆర్థిక స్థోమతపై ఆధారపడి ఉంటుంది. రిఫ్రిజిరేషన్ వ్యవస్థను శీతల గిడ్డంగులు నిర్వహిస్తాయి. వస్తువులు నిల్వ చేయడానికి వీలుగా గది వాతావరణాన్ని రిఫ్రిజిరేషన్ వ్యవస్థ నియంత్రిస్తుంది. దేశంలోని 5274 శీతల గిడ్డంగుల నిల్వ సామర్థ్యం 24.31 మిలియన్ టన్నులుగా అంచనా. శీతల గిడ్డంగులు ఎక్కువగా ప్రైవేటు రంగంలో ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ, సహకార రంగంలో ఏర్పాటైన శీతల గిడ్డంగుల వాటా చాలా తక్కువ. ప్రస్తుతం దేశంలోని శీతల గిడ్డంగుల్లో పండ్లు, కూరగాయలు, పత్తి, మిరపకాయల నిల్వలు కొనసాగుతున్నాయి. అసోం, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, కేరళ, సిక్కిం, తమిళనాడు రాష్ట్రాల్లోని పండ్లు, కూరగాయల ఉత్పత్తిలో 1% మాత్రమే శీతల గిడ్డంగుల్లో నిల్వ చేస్తున్నారు. పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాల్లో భారత్‌లోని మొత్తం శీతల గిడ్డంగుల సగటు నిల్వ సామర్థ్యం కంటే అధిక నిల్వ సామర్థ్యం ఉంది. మొత్తం మీద వీటి డిమాండ్ వ్యవసాయ ఉత్పత్తులకే అధికంగా ఉంది.

నిల్వ సామర్థ్యం పెంపునకు చర్యలు

- గత దశాబ్ద కాలంలో నిల్వ సామర్థ్యం సగటు సాంవత్సరిక వృద్ధి 6.7%గా నమోదైంది. నిల్వ సామర్థ్యం సరిపోయినంతగా లేనందువల్ల ఏటా మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 20 నుంచి 30 శాతం వృథా అవుతున్నాయి. ఈ నేపథ్యంలో అదనపు నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న రాష్ట్ర గిడ్డంగులను ఆధునికీకరించడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. రాష్ట్ర ఏజెన్సీలు నిర్వహిస్తున్న గిడ్డంగులు 20 ఏళ్ల పైబడి ఉన్నాయి. అందువల్ల ఆయా గిడ్డంగుల ఆధునికీకరణ ప్రాధాన్యం సంతరించుకుంది. వీటి ఆధునికీకరణకు 37 నుంచి 40 బిలియన్ రూపాయల వ్యయం అవుతుందని అంచనా.
- ఖరీఫ్, రబీ కాలాల్లో వినియోగాన్ని దృష్టిలో పెట్టుకొని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సమతౌల్యం సాధించాలి. వినియోగ అవసరాల దృష్ట్యా సాంవత్సరిక ఉత్పత్తిలో 70% నిల్వ చేసే విధంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. దీని కోసం గ్రామీణ గోడౌన్ల ఏర్పాటు పథకాన్ని ప్రభుత్వం తిరిగి ప్రారంభించాలి. ప్రస్తుతం సగటు ఆహార ధాన్యాల ఉత్పత్తిలో సుమారుగా 30% ఉత్పత్తి అవుతున్నట్లుగా భావించి, మొత్తం 70 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాల నిల్వ నిమిత్తం నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వృథా అవుతున్న ఆహార ధాన్యాల ఉత్పత్తిని 70 మిలియన్ టన్నులుగా భావిస్తే వాటి మొత్తం విలువ 70 నుంచి 100 బిలియన్ రూపాయల వరకు ఉంటుంది.
- ప్రభుత్వ ఏజెన్సీల నిల్వ సామర్థ్యానికి సంబంధించి గోధుమ, బియ్యం అధిక మొత్తంలో ఆక్రమించినందువల్ల ఇతర ఆహార ధాన్యాలు, వ్యవసాయ వస్తువుల నిల్వకు అవరోధం ఏర్పడుతోంది. జొన్నలు, సజ్జలు, కార్న్, పప్పుధాన్యాలు, నూనె గింజలు, పత్తి, సుగర్ కేన్ లాంటి వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కోసం ప్రభుత్వ ఏజెన్సీల నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. నిర్వహణలో ఉన్న గిడ్డంగుల సామర్థ్యాన్ని పరీక్షించడానికి వేర్‌హౌస్ పర్‌ఫార్మెన్స్ ఇండికేటర్లను ప్రవేశపెట్టాలి.
- ప్రైవేటు రంగంలో నిల్వ సామర్థ్యం పెంపునకు ప్రోత్సాహకాలు అవసరం. నాబార్డ్, నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ల ద్వారా గిడ్డంగి పరిశ్రమ అభివృద్ధిలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించాలి. 2010 మార్చి నాటికి మొత్తం నిల్వ సామర్థ్యం 91 మిలియన్ మెట్రిక్ టన్నుల్లో నాబార్డ్ పథకం కింద లబ్ధి పొందిన గిడ్డంగుల సామర్థ్యం 24 శాతం కాగా, నేషనల్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కింద లబ్ధి పొందిన గిడ్డంగుల నిల్వ సామర్థ్యం 17 శాతం. గిడ్డంగుల ఏర్పాటులో ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి.
- పంట చేతికి వచ్చే సమయంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉంటున్నాయి. రుణగ్రస్తత కారణంగా చిన్న, సన్నకారు రైతులు గిట్టుబాటు ధర లభించే వరకు వేచి చూడకుండా ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. అందువల్ల వ్యవసాయ ఆదాయాలు తగ్గి వ్యవసాయ రంగంపై పెట్టుబడులు తగ్గుతున్నాయి. ఈ పరిస్థితిని నివారించడానికి రైతులు తమ ఉత్పత్తులను గిడ్డంగుల్లో నిల్వ చేసుకునేవిధంగా ప్రోత్సహించాలి. గుర్తింపు ఉన్న గిడ్డంగుల్లో నిల్వ చేసిన వ్యవసాయ ఉత్పత్తులకు నెగోషియబుల్ వేర్‌హౌస్ రిసిప్ట్‌ను అందిస్తే బ్యాంకుల నుంచి రైతులు స్వల్పకాల రుణాన్ని పొందగలుగుతారు. తద్వారా గిట్టుబాటు ధర లభించే వరకు వారి ఉత్పత్తులను విక్రయించకుండా వేచి చూస్తారు. ఈ స్థితి వ్యవసాయ ఆదాయాలు, వ్యవసాయ రంగంలో పెట్టుబడుల పెంపునకు దారితీస్తుంది. NWR మంజూరు గ్రామీణ ప్రాంతాల్లో పరపతి ప్రవాహం పెంపునకు, కాస్ట్ ఆఫ్ క్రెడిట్ (పరపతి వ్యయం) తగ్గింపునకు తోడ్పడుతుంది. ప్రామాణీకరణ, శ్రేణీకరణ, ప్యాకేజింగ్, బీమా సేవలు లాంటి ఇతర కార్యకలాపాలు గ్రామీణ ప్రాంతాల్లో మెరుగవుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో అగ్రి - బిజినెస్‌లోని లాజిస్టిక్ చైన్‌లో ఉన్న తారతమ్యాన్ని ఇది పూరిస్తుంది.
- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల పెంపుతో పాటు మూలధన సబ్సిడీ లాంటివి కల్పించడం ద్వారా రైతులను సహకార సంఘాల ఏర్పాటు దిశగా ప్రోత్సహించాలి. సహకార సంఘాల ద్వారా అదనపు నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు.

The greatest capacity for data transmission..



BANK EXAMS
Computer awareness

1. UNIVAC stands for:
a) Universal Automatic Computer
b) Universal Array Computer
c) Unique Automatic Computer
d) Unvalued Automatic Computer
e) None of the above

2. The basic operations performed by a computer are ___
a) Arithmetic operation
b) Logical operation
c) Storage and relative
d) All of the above
e) None of the above

3. The two major types of computer chips are ___
a) External memory chip
b) Primary memory chip
c) Microprocessor chip
d) Both b and c
e) None of the above

4. Microprocessors as switching devices are for which generation computers?
a) First b) Second
c) Third d) Fourth
e) None of the above

5. What is the main difference between a mainframe and a super computer?
a) Super computer is much larger than mainframe computers
b) Super computers are much smaller than mainframe computers
c) Supercomputers are focused to execute few programs as fast as possible while mainframe uses its power to execute as many programs concurrently
d) Supercomputers are focused to execute as many programs as possible while mainframe uses its power to execute few programs as fast as possible
e) None of the above

6. ASCII and EBCDIC are the popular character coding systems. What does EBCDIC stand for?
a) Extended Binary Coded Decimal Interchange Code
b) Extended Bit Code Decimal Interchange Code
c) Extended Bit Case Decimal Interchange Code
d) Extended Binary Case Decimal Interchange Code
e) None of the above

7. The brain of any computer system is ___
a) ALU b) Memory c) CPU
d) Control unit
e) None of the above

8. Storage capacity of magnetic disk depends on:
a) Tracks per inch of surface
b) Bits per inch of tracks
c) Disk pack in disk surface
d) All of the above
e) None of the above

9. The two kinds of main memory are:
a) Primary and secondary
b) Random and sequential
c) ROM and RAM
d) All of the above
e) None of the above

10. A storage area used to store data to a compensate for the difference in speed at which the different units can handle data is ___
a) Memory b) Buffer
c) Accumulator d) Address
e) None of the above

11. Bluetooth is a type of radio wave information transmission system that is good for about:
a) 30 feet b) 30 yards
c) 30 miles d) 300 miles
e) None of the above

12. The telephone is an example of a(n) _____ signal.
a) Analog b) Digital
c) Modulated d) Demodulated
e) None of the above

13. A credit card-sized expansion board that is inserted into portable computers that connects the modem to the telephone wall jack is the _____.
a) Internal modem
b) External modem
c) PC Card modem
d) Wireless modem
e) None of the above

14. A modem that is contained within the system unit is called a(n) ______ modem.
a) External b) Internal
c) Wireless d) Wi-Fi
e) None of the above

15. A modem that doesn't need to be connected to a telephone line is the ______ modem.
a) External b) Internal
c) Wireless d) DSL
e) None of the above

16. A special high-speed line used by large corporations to support digital communications is known as ____
a) satellite/air connection service lines
b) cable modems
c) digital subscriber lines
d) T1, T2, T3 and T4 lines
e) None of the above

17. An affordable technology that uses existing telephone lines to provide high-speed connections is called ________.
a) ISDN b) Microwave
c) Cable modem d) DSL
e) None of the above

18. The capacity of a communication channel is measured in ___
a) Bandwidth b) Bit capacity
c) Baud rate d) Data flow
e) None of the above

19. Voice band _______
a) allows the user to download messages
b) is used for standard telephone communication
c) is used in special leased lines to connect minicomputers and mainframes
d) provides a high-speed communication channel
e) None of the above

20. The greatest capacity for data transmission happens in ____ devices.
a) Voice band b) medium band
c) broadband d) mega-band
e) None of the above

21. A page fault:
a) Is an error in a specific page
b) Occurs when a program accesses a page of memory
c) Is an access to a page not currently in memory
d) None of the above
e) All of the above

22. The process of transferring data intended for a peripheral device into a disk (or intermediate store) so that it can be transferred to peripheral at a more convenient time or in bulk, is known as ____
a) Multiprogramming
b) Spooling c) Caching
d) Virtual programming
e) All of the above

23. An instruction in a programming language that is replaced by a sequence of instructions prior to assembly or compiling is known as ____
a) Procedure name
b) Macro c) Label
d) Literal e) None

KEY

1) a	2) d	3) d	4) d
5) c	6) a	7) c	8) d
9) c	10) b	11) a	12) a
13) c	14) b	15) c	16) d
17) d	18) a	19) b	20) c
21) c	22) b	23) b	

Software

Software, simply are the computer programs. The instructions given to the computer in the form of a program is called Software. It is the set of programs, which are used for different purposes. All the programs used in computer to perform specific task is called Software.

Types of software

1. System software

a) Operating System Software
DOS, Windows XP, Windows Vista, Unix/Linux, MAC/OS X etc.

b) Utility Software
Windows Explorer (File/Folder Management), Windows Media Player, Anti-Virus Utilities, Disk Defragmentation, Disk Clean, Back Up, WinZip, Win RAR etc.

2. Application software

a) Package Software
Ms. Office 2003, Ms. Office 2007, Macromedia (Dreamweaver, lash, Free hand), Adobe (Page Maker, Photo Shop)

b) Tailored or Custom Software
SAGE (Accounting), Galileo/ World span (Travel) etc.

Computer Languages & Scripting:

a) Low Level Language
i) Machine Level Language
ii) Assembly Language

Machine language: These language instructions are directly executed by CPU.

Assembly language: The endeavor of giving machine language instructions a name structure that means bit strings of instructions of machine language are given name here.

b) High Level Language
It is the user friendly language, more natural language than assembly language. Assembler is needed to convert assembly language into machine language. Complier is needed to convert high level to machine language.
COBOL (Common Business Oriented Language), FORTRAN (Formula Translation), BASIC (Beginner's All-purpose Symbolic Instruction Code), C, C++ etc. are the examples of High Level Language.

Booting

The process of loading the system files of the operating system from the disk into the computer memory to complete the circuitry requirement of the computer system is called booting.
There are two types of booting:

1. Cold Booting:
If the computer is in off state and we boot the computer by pressing the power switch 'ON' from the CPU box then it is called as cold booting.

2. Warm Booting:
If the computer is already 'ON' and we restart it by pressing the 'RESET' button from the CPU box or CTRL, ALT and DEL key simultaneously from the keyboard then it is called warm booting.